వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 10 సంచిక : 10 హైదరాబాద్ 135 అక్టోబర్ 2012 పేజీలు : 68 రు. 15

- జీవ వైవిధ్య సదస్సు ఎవరి కోసం?
- చిల్లర వ్యాపారంలో విదేశీ పెట్టుబడి
- అందరి చేతులకూ బొగ్గు మసి
- నిర్ణయాత్మక దశలో తెలంగాణ
- ఇనుము ఫ్యాక్టరీ ప్రమాదంపై నివేదిక
- మన్యంలో ఆదివాసుల పరిస్థితి
- 50 ఏళ్లు కనుమరుగైన మావో రచన

KAKATIYA UNIVERSITY

SCHOOL OF DISTANCE LEARNING AND CONTINUING EDUCATION

Vidyaranyapuri, Hanamkonda, Warangal-506009 (AP) Ph:0870-2438877, 2438899

ADMISSION NOTIFICATION

Applications are invited for the admission into the following courses for the academic year 2012-2013.

COURSE	MEDIUM	DURATION	ELIGIBILITY
1. **Certificate Course in Communication Skills in English**	English	6 Months	Intermediate or its equivalent recognised by K.U.
2. **C.L.I.Sc.**	Telugu	6 Months	Intermediate or its equivalent recognised by K.U.
3. **Diploma in Mimicry**	Telugu	1 Year	SSC or its equivalent course
4. **B.A./B.Com.** (General)	Telugu	3 Years	Intermediate or its equivalent recognised by K.U.
5. **B.Com.** (Computers)	English	3 Years	Intermediate or its equivalent recognised by K.U.
6. **B.B.M.**	English	3 Years	Intermediate or its equivalent recognised by K.U.
7. **B.Sc.**Maths,Statistics,Comp.Sci.	English	3 Years	Intermediate with concerned subject (Limited Seats in Selected Centres)
8. **B.L.I.Sc.**	English	1 Year	Any Graduate (Limited Seats)
9. **B.C.J.**	Telugu	1 Year	Any Graduate (Limited Seats)
10. **M.C.J.**	English	1 Year	BCJ or its equivalent recognised by KU as per merit in the qualifying examination (Limited Seats)
11. **LL.M.**	English	2 Years	LL.B. with 45% of marks from a recognized university
12. **M.A :** English / Telugu / Hindi / Urdu / Sanskrit	-	2 Years	Bachelor's Degree with concerned subject as optional/ main or subsidiary as the case may be from any recognized university
13. **M.A :** Economics/History/Pol.Sci./ Public Administration/Sociology	Telugu	2 Years	-do-
14. **M.A :** RD & HRM	English	2 Years	Any Graduate from a recognised University
15. **M.Com.**	English	2 Years	Bachelor Degree with concerned subject
16. **M.Sc. Psychology**	English	2 Years	Any Graduate (Limited Seats)
17. **M.Sc : Environmental Sciences**	English	2 Years	**Any Science/Engg. Graduate from a recognised University**
18. **M.A. / M.Sc. Maths**	English	2 Years	Bachelors Degree with concerned subject
19. **M.Sc. Statistics**	English	2 Years	Bachelors Degree with concerned subject
20. **Master of Social Works (MSW)**	English	2 Years	Any Graduate
21. **PG Dip.**in Computer Applications	English	1 Year	Any Graduate from a recognised University
22. **PG Dip.**in **Business Management**	English	1 Year	Any Graduate from a recognized University
23. PG Dip. in Guidance&Counselling	English	1 Year	Any Graduate with Psychology or MA/M.Sc. Psychology

Application forms can be had from the SDLCE Head Office OR from the following Study Centres

WARANGAL
1. SDLCE Campus, Kakatiya University

KHAMMAM
2. Uni. Post Graduate College, Khammam
3. Govt. Degree College, Bhadrachalam
4. Sheelam Pullareddy Memorial Degree College, Madhira

KARIMNAGAR
5. Uni. Satavahana P.G. College, Karimnagar
6. Govt. Degree College, Godavarikhani
7. Gayathri Degree & PG College, Peddapalli
8. Pragathi Degree College, Gopalraopet, Ramadugu (Mdl)
9. Vikas Degree College, Siddalawada, Siricilla

ADILABAD
10. Nalanda Degree & PG College, Adilabad
11. MAM MVN Vidyaniketan Degree College, Mancherial
12. SKE Degree College (Aided), Sirpurkhaghaz Nagar
13. Shivani Arts & Science Degree College, Mandamarri
14. Deeksha Degree College, Nirmal
15. Vikas Degree College, Jannaram

NIZAMABAD
16. Narendra Women's Degree College, Perket, Nizamabad
17. Karshak College of Education, Kamareddy

NALGONDA
18. AVM Degree College, Nakrekal
19. Geethanjali Junior College, Bhongir
20. Goutham Degree & PG College, Suryapet
21. JBM Degree College, Samsthanarayanapur
22. Pragathi Arts & Science Degree College, Thirumalagiri
23. Sri Satya Sai Degree College, Devarakonda
24. Vasundhara Junior College, Miryalaguda
25. Vikas Junior College, Nereducherla

HYDERABAD & SECUNDERABAD
26. RK Degree College, Golkonda 'X' Road, Hyderabad

RANGA REDDY
27. Sri sai Degree College, Tandur.
28. Jagruthi Degree College, Chevella.
29. Sri Saraswathi Vidyalaya Degree College, Vikarabad.
30. Sree Sai Degree & PG College, Parigi

PRAKASHAM
31. SGP Junior College, Darsi
32. Sri Datha Sai Degree College, Chimakurthy

OTHER DISTRICTS
33. Acharya Degree College, Zaheerabad, Medak
34. Gayathri Degree College, Vanaparthy, Mahabubnagar
35. Sri Venkateshwara Arts & Comp. Science College, Proddutur, YSR Kadapha
36. M.S.Reddy Junior College, Modukuru, Guntur

Sale & Receipt Of Applications:15-9-2012 To 31-10-2012

The courses mentioned at Sl.No.1, 2, 3, 8, 9, 10, 16, 17, 18, 19, 21, 22 & 23 will be offered at SDLCE Campus Only.

Application forms and prospectus for the above mentioned courses can be obtained from SDLCE Head Office, KU or from the above Study Centres on payment of Rs.200/- for B.A/B.Com./BBM/B.Sc. (by Regd. post Rs.250/-); Rs.250/- for PG and PG Diploma courses (by Regd. Post Rs.300/-). Outstation candidates may obtain the application forms by sending a Demand Draft drawn from SBH/SBI or Andhra Bank in favour of **"The Registrar, SDLCE Account, Kakatiya University, Warangal Payable at Warangal. Course Material will be provided on submission of Admission Forms at Head Office Only.**

No : 366/DP/SDLCE/KU/2012,
Dt. : 13-09-2012

website:www.sdlceku.co.in

Prof.D.RAJENDRA PRASAD
DIRECTOR

Advt.

135

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

అక్టోబర్ 2012
సంపుటి : 10
సంచిక : 10

లోపలి పేజీల్లో...

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

రచయితలకు సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ నేపథ్యం గురించిన స్పృహ కూడ ఉన్నట్లు లేదు, ఐటి ఎదుగుదల, ఫైనాన్స్ కాపిటల్ సంక్షోభం, ఐటి మాంద్యం, స్థానిక రాజకీయ, పెట్టుబడిదారీ శక్తుల ఔత్సాహిక సామ్రాజ్యవాద సాయంతో సంపద పోగు చేసుకోవచ్చనే ప్రోత్సాహం : విజ్ఞానాంధ్రప్రదేశ్ ఐడియోలాజికల్ కవర్. రాష్ట్ర స్థాయిలో సాధారణ డిగ్రీలు కలిపి ఇబ్బడిముబ్బడిగా కాలేజీల పెరుగుదల – ఫీజు రీయింబర్స్‌మెంట్ పూత – విజ్ఞానాంధ్రప్రదేశ్ విష ఫలితాలు – ఓ చిన్న ఊర్లో పదిహేడు మంది ఇంజినీరింగ్ విద్యార్థులు – నలుగురి చదువు అయిపోయింది. అంతా బి.సి., ఎస్.సి.లే. చిన్నా చితకా ఉద్యోగాలు లేదా వ్యవసాయ కూలీ. గ్లాస్ కర్టెయిన్ ఎకానమీ సృష్టిస్తున్న సంక్షోభాన్ని విప్లవ సంక్షోభంగా మార్చవలసిన ఆవశ్యకత ఉంది. ఇక్కడి ప్రభుత్వాలు, ఇప్పుడిప్పుడే మొలచుకొస్తున్న పెట్టుబడిదారీ శక్తులూ, రాష్ట్ర స్థాయిలో సామ్రాజ్యవాద విష వలయంలో చిక్కుకొన్న తీరు – సృష్టిస్తున్న సంక్షోభాలు వీటి నేపథ్యంలో రచనలు ఉండే బదులు అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అనే రీతిలో ఇంకోలా చేయాల్సింది అని రాస్తే, పసలేని కథనాలవుతాయి. అవగాహనా రాహిత్యం బయట పడుతుంది. అన్ని శాఖలకు కలిపి సాధారణ డిగ్రీలూ కలిపి ఇరవై లక్షల మందికి ఫీజులు కడుతాన్నరంటే అంత భారీ నిరుద్యోగ సైన్యాన్ని తయారు చేస్తున్నట్టు కాదా? అస్తిత్వవాదం మరింత భారీ నిరుద్యోగ సైన్యాన్ని తయారు చేయమంటుంది. రచయితలపై అస్తిత్వవాద ప్రభావం లేదా? వీక్షణం అస్తిత్వ వాదానికి వేదిక కానుందా? అస్తిత్వవాదం తెలిసో తెలియకో సామ్రాజ్యవాదానికి గొప్పదన్నుగా పనిచేస్తోంది.

ఇక లోకసంచారి పేరుగల సిరియా వ్యాసం – బిన్ లాడెన్ సురక్షితంగా అమెరికా సయోధ్యలో ఉన్నాడట! ఇదేమి వాదం! అరబ్ స్ప్రింగ్ తమను పూడ్చి పారెయ్యక ముందే షియా – సున్నీ వివాదాన్ని పెంచి పెద్దది చేయడానికి 'సిరియా' ఓ ప్రతీక. అమెరికా, దాని మిత్రులు సౌదీ లాంటి శక్తుల కుట్రలకు సిరియా ఓ ఉదాహరణ. అగ్గిని రాజెయ్యకపోతే ఈజిప్టు పునరావృతమవుతేనో – సౌదీలో?

రష్యా, చైనా కమ్యూనిస్టుల సామ్రాజ్యవాదం బారిన పడి కమ్యూనిస్టు రాజ్యాల అంతం? ఇదంతా ఓ చెత్త. డెవలప్‌మెంట్ ప్లాంక్‌గానే చైనా విప్లవం అభివృద్ధి అయ్యింది. డెవలప్‌మెంట్ ప్లాంక్ కాబట్టి పార్టీ గర్భంలో లక్షలాదిగా పెట్టుబడిదారీ శక్తులు పుట్టుకొచ్చాయి. ఎఎస్ఇఎఎన్ ద్వారా అమెరికా ఈ పెట్టుబడిదారీ శక్తులకు (చైనా) ఊతం ఇచ్చింది. ఆల్ దిస్ లీడ్ టు ది డిఫీట్ ఆఫ్ మావోయిస్ట్ ఫోర్సెస్. ఈ మాత్రం స్పృహ కూడా లేకపోతే ఎలా? ఓవైపు బాలగోపాల్ లాంటి వాదనలు – మరోవైపు కుట్ర సిద్ధాంతాలు (లోకసంచారి) ముందుకు వస్తాయి. కాపిటల్ రీడర్స్ ప్రవృత్తి ఏంటి? కాపిటల్ రీడర్స్, సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయితే ఆశ్చర్యం ఏంటి? ఆ క్రమంలో సోషలిస్ట్ ఎలిమెంట్స్‌ను నాశనం చేస్తే – ఇదంతా కుట్రలూ, కుహకాలా?

హనుమంతరావుగారి వ్యాసం సామ్రాజ్యవాదంపై మనకు గల అరకొర అవగాహనకు మచ్చుతునక. వ్యాసం చివర 'తాజా' చూడండి. కొసమెరుపు. నిజానికదే హార్ట్ ఆఫ్ ది మేటర్. మన ఆర్థిక వ్యవస్థ సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో విడదీయరాని భాగం. ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా ఫైనాన్స్ కాపిటల్ సంక్షోభం కారణంగా ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో ఉన్నాయి. ఇక్కడ గ్రోత్ రేట్ 5.5 ఉందంటే (9 నుంచి జారి కిందపడి) ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం – అందులో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి అది ఒక సూచిక మాత్రమే. బ్యాంకులు దివాళా ఎత్తుతున్నాయంటే సంక్షోభం కారణంగానే. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో భాగంగా బ్యాంకుల దివాళాను చూడాలి. ఫైనాన్స్ కాపిటల్ ఫ్లోస్ డౌన్ కావడం వల్ల మన బ్యాంకింగ్ రంగం – ఆర్థిక వ్యవస్థ డౌన్ అయ్యాయని అర్థం చేసుకోవాలి. సామ్రాజ్యవాద సంక్షోభం – దాన్లో భాగంగా భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభంపై విడివిడిగా వరుస వ్యాసాలుండాలి. రావుగారి వ్యాసం పాత సిపిఐ, సిపిఎంల అవగాహన పరిమితుల్లో ఉంది. పబ్లిక్ సెక్టర్ – ప్రైవేట్ సెక్టర్ పారాడైమ్ – ఈనాటి సంక్షోభం పూర్తిగా భిన్నమైంది. పారాడైమ్ షిఫ్ట్ జరగాలి. లక్ష కోట్ల మొండి బకాయి లేదా?

మారుతి ఘర్షణపై, అసోం (బోడో) గొడవలపై, కోల్‌గేట్‌పై ఎందుకు ఏమీ రాయలేదు? రాతగాళ్లు పత్రికను నడిపిస్తున్నారా? పత్రిక రాతగాళ్లను సృష్టించుకోవాలా? పైన చెప్పబడిన దాన్నుంచి వెలువడే సింగిల్ మోస్ట్ ఇంపార్టెంట్ లెసన్ ఏమిటంటే, సామ్రాజ్యవాదంపై మన అవగాహన పెంచుకోకుండా పత్రిక నైపుణ్యాన్ని పెంచలేం. రచనలు నిరర్థకం.

వేణుగోపాల్ తన వ్యాసంలో చెప్పినట్లు ప్రతి వ్యాసానికి విప్లవోద్యమ నిర్మాణమే స్ఫూర్తిగా ఉండాలి. గ్రామ విశ్లేషణ ఎందుకు? విప్లవ సానుకూల శక్తులను గుర్తించడానికి. నడిపించడానికి. విషయం ఏదైనా కాని లక్ష్యం గురి తప్పకూడదు.

– ఒక పాఠకుడు

వీక్షణం సెప్టెంబర్ 2012 సంచికలో జి. సూరి రాసిన 'ఆహార (అ)భద్రతా బిల్లు' వ్యాసం సందేశాకాత్మకంగా ఉంది. పాలకవర్గాలు ఎన్నికల రాజకీయాల్లో భాగంగా ఆహార భద్రత బిల్లును తెస్తున్నారనీ, గతంలో తెచ్చిన పలు పథకాల్లాగే ఇది కూడా దళారులకు జేబులు నింపడానికే తప్ప ప్రజల మేలు కోసం కాదనీ, ఈ వైఖరిని నిరసిస్తూ ప్రజలు పోరాటాలు చేస్తున్నారనీ, ఈ పోరాటాలకు బాసటగా నిలబడవలసిన చారిత్రక ఆవశ్యకత మనందరి మీద ఉంది. ఈ రచయిత కలం నుండి ఇటువంటి మరికొన్ని రచనలు జాలువారాలని ఆశిద్దాం.

– ఆర్.ఎస్. చౌహాన్, కర్నూల్

ఆర్.టి.సి. సమస్యకు కారకులెవరు? ఎం.ఎస్. సాయి వ్యాసంలో సమస్యలను పూర్తిగా వివరించలేదు. పరిష్కార మార్గాలను పూర్తిగా చెప్పలేదు. ఆర్.టి.సి. సేవల్లో వివిధ రాయితీలు కల్పిస్తున్న ప్రభుత్వం, వాటికి సంబంధించిన బకాయిలు చెల్లించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రు.584 కోట్లు ఆర్.టి.సి.కి బాకాయి ఉంది. రు.180 కోట్లేమో ప్రభుత్వం బ్యాంకులకు గ్యారంటీ పడి రుణం ఇప్పించింది. దీనికి వడ్డి ఆర్.టి.సి చెల్లించవల్సిందే. ఆర్.టి.సి ఏమో కార్మికులకు సంబంధించిన రిటైర్మెంట్ డిపాజిట్ ఫండ్‌ను స్వంతానికి వాడు కుంటుంది. గుజరాత్ ప్రభుత్వం గ్రామాలకు నడిచే ఆర్.టి.సి. బస్సుల నష్టంను తానే భరిస్తుంది. కర్ణాటక ప్రభుత్వం ఆర్.టి.సి. వాడుకునే డిజిల్‌పై సుంకాన్ని తొలిగించింది. మన రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా భిన్నం. గతంలో వై.ఎస్.ఆర్. ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టుట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌తో అధ్యయనం చేయించింది. డిజిల్‌పై పన్ను, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాను చూసి చూడనట్లు పోవడం, రాయితీలు చెల్లించక పోవడం వంటి విధనాలు అవలంబిస్తూ, ప్రభుత్వమే ఆర్.టి.సి. నష్టాలకు కారణమని తెల్చిచెప్పారు. మూడేళ్లపాటు ఏటా రు.1000 కోట్లు ఆర్.టి.సి.కి ఆర్థిక సహాయం అందజేయాల్సింది. దాన్ని ఆర్.టి.సి.కి ప్రభుత్వ పెట్టుబడిగా పరిగణించాలని తెలిపింది. రాష్ట్రంలో తిరుగుతున్న 108 అంబులెన్స్‌లకు, నేలకు ఒక్కరికి 95 వేలు చెల్లించి ప్రైవేట్ సంస్థ జి.వి.కె.కు ఇవ్వడం ఎందుకు? ప్రతి రోజు ఎలాంటి సేవల్లో ఉండక పోయిన వాహనాలకు సైతం ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది ఎందుకు? ఇట్టి నిర్వహణను ఆర్.టి.సి.కి ఇస్తే సంస్థ మెరుగుపడదా? ఇప్పుడు 802 వాహనాలకు 400 వాహనాల్ని తిప్పుతున్న జి.వి.కె. సంస్థ కన్నా ఆర్.టి.సి. పూర్తి వాహనాలు తిప్పి మెరుగైన సేవలను అందించలేదా? పాలకులకు ఎందుకు ఆలోచన రావడం లేదు? ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఆర్.టి.సి. మాత్రమే. ఒక మనిషి కోసం ఒక్కరు కాకుండా, 40 మంది నుండి 80 మంది కోసం ఒక ఆర్.టి.సి. బస్సు. రోడ్డు ప్రమాదాలు నివారణకు సైతం ఆర్.టి.సి. మాత్రమే ఒక పరిష్కారం. అందుకే ఆర్.టి.సి.ని మెరుగు పర్చుకోవడం కోసం అందరూ ఆలోచించాలి.

– బీరం రాము, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ కార్యకర్త

(మిగతా 61వ పేజీలో...)

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; కడప, క్రిష్ణా, తూర్పు గోదావరి, గుంటూరు – ఏకుల మల్లేశ్ (ఇంటర్నెట్ ద్వారా)

డీజిల్ ధర, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి...

డీజిల్ ధర పెంపు, వంటగ్యాస్ సబ్సిడీ తగ్గింపు (సెప్టెంబర్ 13), చిల్లర వర్తకం, విమానయానం, ప్రసారమాధ్యమాల రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పెంపుకు అనుమతి (సెప్టెంబర్ 14), పాలక కూటమి యుపిఎ నుంచి తృణమూల్ కాంగ్రెస్ నిష్క్రమణ, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నిరసనలు, ఒకవైపు చర్చ జరుగుతుండగానే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నోటిఫికేషన్ జారీ (సెప్టెంబర్ 20), కొత్త సంస్కరణ చర్యలను సమర్థించుకుంటూ, దేశ ఆర్థిక స్థితిని 1991 స్థితితో పోలుస్తూ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశప్రజలను ఉద్దేశించి చేసిన ఉపన్యాసం (సెప్టెంబర్ 21), అప్పటికే సిద్ధంగా ఉన్న భారతి వాల్ మార్ట్ వంటి స్వదేశీ – విదేశీ రాబందులు రెక్కలు విదిలిస్తున్న చప్పుడు ... నిండా రెండు వారాలు గడవకుండానే దేశంలో ఎంతెంత లోతైన పరిణామాలు జరిగిపోతున్నాయి! ఈ పరిణామాల తక్షణ, మధ్యంతర, దీర్ఘకాలిక పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయో, ఈ దేశ జనజీవనం ఎంతలా ధ్వంసం కానున్నదో బుద్ధిజీవులకైనా అర్థమవుతున్నదా? ఆ పర్యవసానాలతో ఈ దేశంలోని కోటానుకోట్ల ప్రజల సుఖసంతోషాలూ జీవనోపాధీ జీవితమూ రద్దయిపోతాయనీ, అసలీ దేశపు భవిష్యత్తే అంధకారమయమైపోతుందని తెలుస్తున్నదా? ఇప్పటికైనా ఈ పరిణామాలకు చెయ్యి అడ్డం పెట్టాలని, నిలువరించాలని, సమస్త ప్రజారాశులను ఏకం చేసి ప్రతిఘటించాలని కనీస స్పృహ కలుగుతున్నదా?

దేశంలో కీలకమైన రవాణా వాహనాలన్నీ డీజిల్ మీదనే ఆధారపడతాయి గనుక డీజిల్ ధర పెంపు తప్పనిసరిగా మనుషుల ప్రయాణ వ్యయాన్నీ, సరుకుల రవాణా వ్యయాన్నీ విపరీతంగా పెంచుతుంది. పెరిగిన ధర లీటర్ కు ఐదు రూపాయలేననీ, అది చాల తక్కువనీ, అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులకు అనుగుణంగానే ఆ పెంపుదల జరిగిందనీ ప్రభుత్వం వాదించవచ్చు. బహుళజాతి సంస్థల దళారీలుగా పాలన నెరపుతున్న మన్మోహన్ సింగ్, మాంటెక్ సింగ్ అహ్లువాలియాలు మాత్రమే కాదు, ఆ తానులోని ముక్కలమేనని రుజువు చేసుకోదలచుకున్న అరుణ్ శౌరీలూ జయప్రకాశ్ నారాయణలూ కూడ ఈ ధరల పెరుగుదలను సమర్థించవచ్చు. ఈ చర్య అనివార్యమైనదని ప్రజలను, ముఖ్యంగా మధ్యతరగతిని నమ్మించడానికి ప్రయత్నించవచ్చు. కాని ఈ చర్య అవసరమైనదీ కాదు, అనివార్యమైనదీ కాదు. ప్రజావ్యతిరేకమైనది. దేశదేశాల సంపన్నులకు, అంతర్జాతీయ చమురు వ్యాపార సంస్థల పేరుతో చలామణీ అవుతున్న బందిపోటు దొంగలకు ఈ దేశ సంపదలను అప్పనంగా దోచిపెట్టే చర్య. పనిలోపనిగా తమ రక్షణ కోసమూ, విలాసాల కోసమూ, ముడుపుల కోసమూ పోగుచేసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల ఖజానాను పెంచుకునే చర్య. వ్యవస్థ మార్పు దాకా కూడ అక్కరలేకుండానే, ఈ వ్యవస్థ లోపలనే ఈ ధరల పెంపుదల లేకుండా సాధించగలిగిన ప్రత్యామ్నాయాలు ఎన్నో ఉన్నాయి. కాని అవి ప్రజానుకూల ప్రత్యామ్నాయాలు గనుక ఈ ప్రజావ్యతిరేక పాలకవర్గాల కంటికి ఆనడం లేదు.

ఇక చిల్లరవర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించాలనే కోరిక అటు బహుళజాతి సంస్థల నుంచీ, ఇటు దేశంలోని బడా దళారీ పెట్టుబడిదారీ కంపెనీల నుంచీ ఎన్నో రోజులుగా ఉన్నది. గత సంవత్సరం ఆ కోరికను నెరవేర్చబోయిన ప్రభుత్వం రాజకీయ ఏకాభిప్రాయం లేదనే పేరుతో వాయిదా వేసింది. అప్పటినుంచీ సామ్రాజ్యవాద ప్రభుత్వాలూ, బహుళజాతి సంస్థలూ, వాటి తరఫున అంతర్జాతీయ రేటింగ్ సంస్థలూ, టైమ, వాషింగ్టన్ పోస్ట్ వంటి పత్రికలూ ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తూ వచ్చాయి. అంతర్జాతీయ మదుపుదారుల దృష్టిలో భారత ఆర్థిక వ్యవస్థ పరపతి పెరగాలంటే ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించక తప్పదని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆ పరిణామాలలో భాగంగా వెలువడిన ఈ నిర్ణయంతో ఉత్పత్తిదారులకూ వినియోగదారులకూ మధ్య మధ్యవర్తుల గొలుసు తొలగి, ధరలు తగ్గుతాయనీ, విదేశీ పెట్టుబడి రావడంతో వ్యాపార పరిమాణం పెరిగి, ఉత్పాదకత, నాణ్యత, సామర్థ్యం పెరుగుతాయనీ పాలకవర్గ మేధావులు టివిలనిండా, పత్రికల నిండా ఊదరగొడుతున్నారు. ఈ సమర్థనా వాదనలన్నీ పచ్చి అబద్ధాలనీ, మోసపూరితమైనవనీ బహుళజాతి సంస్థల చరిత్ర అనుభవం చెపుతున్నది. మధ్యవర్తుల గొలుసు తొలగడం కాదు, మనకు పరిచితులైన పాత మధ్యవర్తుల స్థానంలో మనకు తెలియని మహా బలవంతులైన కొత్త మధ్యవర్తులు వస్తారు. చిన్న చిల్లర వ్యాపారులందరినీ అంతం చేసి, మార్కెట్ ను ఖాళీ చేసి, అప్పుడు ఇష్టారాజ్యపు ధరలు అమలుచేస్తారు. ఇంతచేసీ వాటి ఉత్పాదకత, నాణ్యత, సామర్థ్యం కూడ గొప్పలు చెప్పుకుంటున్నంత స్థాయిలో లేవని ఎన్నో దేశాల అనుభవాలు నిరూపిస్తున్నాయి. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు ఇటు స్వదేశీ దళారీలు అటు బహుళజాతి సంస్థలు కలిసి భారతదేశం వంటి విశాలమైన మార్కెట్ ను ఆక్రమించుకుని, ఇబ్బడి ముబ్బడిగా లాభాలు పెంచుకోవడానికి తప్ప ఈ నిర్ణయం ప్రజల కోసమూ కాదు, దేశం కోసమూ కాదు, ధరలు తగ్గించడానికీ కాదు, సరుకుల నాణ్యత కోసమూ కాదు.

ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి ప్రభుత్వం నుంచి బైటికి వచ్చానని చెప్పుకుంటున్న తృణమూల్ కాంగ్రెస్ గాని, రేపు అధికారంలోకి వస్తే ఈ నిర్ణయాన్ని తిరగదోడుతానని వాగ్దానం చేస్తున్న ఎన్ డి ఎ పక్షాలు గాని, తమ వ్యతిరేకతను గంభీరంగా ప్రకటిస్తున్న వామపక్షాలు గాని అన్నీ ఒకే తానులో ముక్కలే. ఈ నిర్ణయం గత ఇరవై సంవత్సరాల ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాల కొనసాగింపే. ఈ ఇరవై సంవత్సరాలలో అన్ని పార్లమెంటరీ రాజకీయపక్షాలూ కేంద్రంలో గాని, రాష్ట్రాలలో గాని ఆ విధానాలనే తు.చ. తప్పకుండా అమలు చేశాయి. ఇవాళ 2014 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిరసన నాటక ప్రదర్శనలు సాగిస్తున్నాయి. ఈ వ్యతిరేకత అంతా మేకపోతు గాంభీర్యమేనని బహుళజాతి సంస్థలకు, వాటి దళారీలకు, ప్రభుత్వానికి తెలుసు గనుకనే తమ ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ముందుకే పోతున్నాయి. అనుమతి నిర్ణయం జరిగిన కొద్ది రోజులకే నోటిఫికేషన్ జారీ కావడం, మరి కొద్ది రోజులకే భారత బడా దళారీ పెట్టుబడిదారు మిత్తల్, అంతర్జాతీయ చిల్లర వర్తక తిమింగిలం వాల్ మార్ట్ మిలాఖత్తు సంస్థ భారతి వాల్ మార్ట్ దేశ వ్యాప్తంగా తన దుకాణాలను ప్రారంభించింది.

ఈ దేశ వనరులను, మార్కెట్లను, ప్రజాజీవితాన్ని కొల్లగొట్టదలచిన బహుళజాతి సంస్థలు ఎంత దూకుడుగా వస్తున్నాయో, ప్రస్తుత పాలకపక్షం ఎంత దుర్మార్గమైనదో, ప్రజావ్యతిరేకమైనదో, ప్రస్తుత ప్రతిపక్షం ఎంత అవకాశవాదంతో, వంచనాశిల్పంతో ప్రవర్తిస్తున్నదో అర్థం చేసుకుని నిజమైన ప్రత్యామ్నాయ ప్రజానుకూల వ్యవస్థ కోసం ఆలోచించవలసిన, పోరాడవలసిన, సాధించవలసిన బాధ్యత ప్రజల మీదే ఉంది.


వీ

తెలంగాణ - హింసాహింసలు కాదు, న్యాయాన్యాయాలు

ఈ సంపాదకీయ వ్యాఖ్య రాస్తున్న సమయానికీ చదివే సమయానికీ మధ్య హైదరాబాద్ లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షల ప్రదర్శన సాగరహారం విజయవంతంగా జరిగి ఉంటుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే కోరిక ఎంత బలమైన ప్రజాభీష్టమో వెయ్యిన్నొకటోసారి ప్రపంచానికి రుజువు చేసి ఉంటుంది. లేదా, ఆ ఆకాంక్ష ప్రదర్శనను అడ్డుకుంటే, మూసిపెడితే ఆకాంక్ష లేకుండా పోతుందని పగటికలలు కనే పాలకవర్గం అమలుచేసిన హింసాకాండ వల్ల సాగరహారం, హుస్సేన్ సాగర తీరంలో అడ్డగించబడి, తెలంగాణ వ్యాప్తంగా జరిగి ఉంటుంది. అలా సాగరహారం జరిగినా, జరగకపోయినా తెలంగాణ ప్రజలు తమ ప్రగాఢవాంఛను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రకటించి ఉంటారు. ఇది సెప్టెంబర్ 30 తర్వాతి దృశ్యం. కాని ఇది రాస్తున్న సెప్టెంబర్ 27 నాటి దృశ్యాన్ని గురించి మాట్లాడుకోవాలి. తెలంగాణ ప్రజలు నలభై సంవత్సరాలుగా ప్రకటిస్తున్న ఆకాంక్షను, అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల వాగ్దానంగా ఆమోదించిన ఆకాంక్షను, కేంద్ర ప్రభుత్వం కూడ నెరవేర్చడానికి సమ్మతించి, ప్రకటించి, మాటమార్చిన ఆకాంక్షను మరొకసారి తెలియజెప్పడానికి ప్రజలకు అనుమతి ఇవ్వడం లేదు. ఈ పాలన ప్రజాస్వామిక పాలనే అని నమ్మే అమాయకులు ఇంకా ఉన్నారా? ఆ అనుమతి ఇవ్వకపోవడానికి పాలకులు చెప్పిన అబద్ధం చెప్పకుండా సాకుల మీద సాకులు వెతుకుతున్నారు. హైదరాబాద్ ముద్ర చెరిగిపోతుందట. అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సును భంగం చేయవద్దట. హింస జరుగుతుందట. ఆస్తుల విధ్వంసం జరుగుతుందట. మతకల్లోలాలు జరుగుతాయట. మరొకసారి అనుమతి ఇస్తారట. ఎవరిదీ హైదరాబాద్ ముద్ర? ఎవరికోసమీ హైదరాబాద్ ముద్ర? దేశదేశాల సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు అప్పనంగా భూములు అప్పగించి, సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి, కారు చౌక శ్రమ అందించి తయారుచేసిన హైదరాబాద్ ముద్ర తెలంగాణ భూమిపుత్రులకు ఏమి ఒరగబెట్టింది గనుక ఆ ముద్రను గౌరవించాలి? ఇక్కడ సమైక్య రాష్ట్రంలో ఉద్యోగాలను, వనరులను, నిధులను, నీటిని కొల్లగొట్టి, జీవవైవిధ్యాన్ని, రెండు తరాల మానవ జీవితాన్ని ధ్వంసం చేసిన పాలకుల పట్ల నిరసన తెలపడానికి జీవవైవిధ్య సదస్సు కన్న సరైన సమయం మరేమిటి? సాగరహారం నిర్వాహకులు ఒకటికి రెండు సార్లు హింసకు పాల్పడము అని హామీలు ఇస్తున్నారు గాని, అసలు ఇది న్యాయాన్యాయాల సమస్య. హింసాహింసల సమస్య కాదు. న్యాయం సాధించడానికి, అన్యాయాన్ని అడ్డుకోవడానికి ఏ మార్గం చేపట్టవలసి వచ్చినా సరే. ఐనా ఒక ఉద్యమంలో ఒక పక్షం ఏమి చేస్తుందనేది, ఆ పక్షపు ఉద్దేశాల మీద ఆధారపడదు, అవతలిపక్షపు చర్యల మీద ఆధారపడుతుంది. హైదరాబాద్ మతకల్లోలాల చరిత్రంతా పాలకవర్గ ముఠాల ఉద్దేశపూర్వక హింసాకాండ చరిత్రే గనుక ఇప్పుడు అధికారవర్గాల హెచ్చరికలు వాళ్ల ఉద్దేశాలను బయటపెడుతున్నాయా? సాగరహారం జరగనిస్తారా లేదా అనేదానికన్న ముఖ్యంగా ఆలోచించవలసిన అంశాలివి. వీ

బహుళజాతి ఔషధ సంస్థ దుర్మార్గం


పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం, బహుళజాతి సంస్థలు ఎంత దుర్మార్గమైనవో, అమానవీయమైనవో, లాభం కోసం ఎంతటి నీచానికి ఒడిగట్టగలవో మార్క్స్ నాటి నుంచి ఇవాళ్టి దాకా వందలాది మంది విశ్లేషకులు లక్షలాది ఉదాహరణలు చూపినా ఇంకా నమ్మని వాళ్లు ఉన్నారు. 'అదంతా ఐడియలాజికల్. సిద్ధాంతాల కళ్లజోడు నుంచి చూసిన ఫలితం' అని కొట్టి పారేసే వాళ్లున్నారు. అటువంటి వాళ్ల కళ్లు తెరిపించడం కోసం ఒక్కోసారి స్వయంగా అవతలి పక్షం నుంచే తమ దుర్మార్గాల వివరాలు బైట పడుతూ ఉంటాయి. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ జర్మనీకి చెందిన గ్రునెంథాల్ అనే బహుళ జాతి ఔషధ తయారీ సంస్థ చేసిన పశ్చాత్తాప ప్రకటన. కాకపోతే ఈ పశ్చాత్తాపం చాల ఆలస్యంగా, అమానుష చర్యలు జరిగిపోయిన యాభై సంవత్సరాల తర్వాత వెలువడింది. ఈ సంస్థ 1950లలో, 60లలో థాలిడొమైడ్ అనే మందు తయారు చేసేది. గర్భిణి స్త్రీలకు వికారంగా అనిపించినప్పుడు, వాంతులు అవుతున్నప్పుడు ఈ మందు వేసుకుంటే ఉపశమనం ఉంటుందని చెప్పి అమ్మేవారు. అలా ఆ మందు అమ్మకాలు 50 దేశాలలో జరిగాయి. కాని త్వరలోనే ఆ మందుకు దుష్ఫలితాలు ఉంటాయని, ఆ మందు వాడితే పిల్లలు అంగవైకల్యంతో పుట్టవచ్చునని తేలింది. తల్లులు ఆ మందు వాడినందువల్ల కనీసం పది వేల మంది శిశువులు చేతులు, కాళ్లు, ఇతర అవయవాలు లేకుండా పుట్టారని అప్పుడే అంచనా వేశారు. చాల చర్చ జరిగిన తర్వాత గ్రునెంథాల్ కంపెనీ ఆ మందు ఉత్పత్తిని 1961లో ఆపి వేసింది. కాని ఆ మందు వల్ల నష్టపోయిన కుటుంబాలు, ముఖ్యంగా వికలాంగులుగా పుట్టినవారు ఆ కంపెనీ దుర్మార్గం మీద న్యాయపరంగానూ, నైతికంగానూ, సామాజికంగానూ పోరాడుతూ వచ్చారు. యునైటెడ్ కింగ్ డమ్ లో ఆ మందు బాధితులతో ఏర్పాటయిన థాలిడొమైడ్ ఏజెన్సీ యుకె అనే స్వచ్ఛంద సంస్థకు ప్రధాన సలహాదారుగా పనిచేస్తున్న ఫ్రెడ్డీ ఆస్ట్ బరీ స్వయంగా బాధితుడు, తల్లి థాలిడొమైడ్ వాడినందువల్ల ఆయన 1959లో కాళ్లు, చేతులు లేకుండా పుట్టాడు. యుకె తో పాటు, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ లలో వేలాది మంది థాలిడొమైడ్ బాధితులు తమ తమ పద్ధతిలో ఆందోళన జరుపుతూనే ఉన్నారు. ఇంత జరుగుతుంటే ఏ మాత్రం స్పందన లేకుండా ఉండిపోయిన గ్రునెంథాల్ కంపెనీ యాజమాన్యం హఠాత్తుగా ఇప్పుడు తన క్షమాపణలు ప్రకటించింది. ఆ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హెరాల్డ్ స్టాక్ ఆగస్ట్ 31న జరిగిన నష్టాలకు తమ కంపెనీ 'తీవ్ర విచారం' ప్రకటిస్తున్నదని అన్నాడు. బాధితులకు తాము నిజమైన విచారాన్ని, లోతయిన సానుభూతిని ప్రకటిస్తున్నామని అన్నాడు. వారి దురదృష్టానికి దిగ్భ్రాంతి చెందామని, ఆ దిగ్భ్రాంతి లోనే క్షమాపణలు కోరడానికి సుదీర్ఘ ఆలస్యం జరిగిందని అన్నాడు. మనిషి మీద పెట్టుబడి చేసే అత్యాచారం తెలియక చేసే పొరపాటు కాదు. అది ఉద్దేశపూర్వకమైన హింసాకాండ. మనిషిని మనిషిగా కాక కొనుగోలుదారుగా, అమ్మకందారుగా మాత్రమే చూడడం తెలిసిన పెట్టుబడి ఆ అమ్మకాల, కొనుగోళ్ల సరుకీకరణలో ఇటువంటి అత్యాచారాలు చేయకుండా ఒక్క క్షణం కూడ మనజాలదు. మనిషి మళ్లీ మనిషిగా లేచి నిలబడాలంటే ఈ క్షమాపణలను, సానుభూతులను, విచారాలను, దిగ్భ్రాంతులను తోసి వేసి, పెట్టుబడిని కూలదోయడం తప్ప గత్యంతరం లేదని గ్రునెంథాల్ మరొకసారి స్పష్టం చేస్తున్నది. వీ




❖ **రాతిపూలు** – నవల – సి. సుజాత – శివసాయి శరత్ పబ్లికేషన్స్ – 143 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: ఇ.నెం. 12-7-134/341/ఎఫ్4, ద్వారకామయి రెసిడెన్సీ, ఆంజనేయనగర్, మూసాపేట, హైదరాబాద్–500018. సెల్: 9948960009; ఇమెయిల్–sujata.c@hmtv.in




❖ **అమిత్వం** (విస్కీ రుషితో 4 గంటలు) – కవిత్వం – బిఎస్ఎం కుమార్ – పాలపిట్ట బుక్స్ – 167 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. ఫోన్: 040–27678430



❖ **గంధం చెట్టు** – గన్నవరపు నరసింహమూర్తి – పాలపిట్ట బుక్స్ – 108 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: గన్నవరపు నరసింహమూర్తి, ఇ.నెం. 9–59, రవినగర్, నాయుడుతోట, వేపగుంట పోస్ట్, విశాఖపట్నం – 530 047



❖ **గెరిల్లా యుద్ధం – మార్క్సిజం** – దిక్సూచి ప్రచురణలు – 178 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును




❖ **లక్షింపేట** – విరసం కవిత్వం, పాట – విరసం ప్రచురణ – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **నిర్ణయం** – కథలు – రాచపూటి రమేష్ – క్వాలిటీ పబ్లికేషన్స్ – 104 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: రాచపూటి రమేష్, ఇ.నెం. 10–73, రాయల్‌నగర్, ఆర్.సి.రోడ్, తిరుపతి – 517501




❖ **ఎగరేసిన ఎర్రని జెండా – భద్రాచలం డివిజన్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర** – టి.వి.ఆర్. చంద్రం – సాహితీమిత్రులు – 58 పేజీలు, 1/8 డెమీ, రు:30, ప్రతులకు: సాహితీమిత్రులు, 28-10-26/1, మస్జిద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ–520002. ఫోన్: 0866–2433359




❖ **శ్రీశ్రీ విశ్వం** – శ్రీశ్రీ విశ్వేశ్వరరావు మిత్రుల అనుభవాలూ, జ్ఞాపకాల సంపుటి – సాహితీమిత్రులు – 180 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు: సాహితీమిత్రులు, 28-10-26/1, మస్జిద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ–520002. సెల్: 9490634849



❖ **స్పాట్ సిగ్నేచర్స్** – తెలుగు ఉపన్యాసకుల కవిత్వం – ప్రధాన సంపాదకులు: డా. నాళేశ్వరం శంకరం–52 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు: డా. నాళేశ్వరం శంకరం, 16–11–774/1, శారదా అపార్ట్‌మెంట్, ముసారాంబాగ్, హైదరాబాద్ – 500036. ఫోన్: 040–24542019




❖ **బలహీనుడి బలం** – కామ్రేడ్ పటేల్ సుధాకర్ రచనలు – విరసం ప్రచురణ – 89 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును




❖ **అగ్రతలుపులు** – కవిత్వం – కొండపల్లి నీహారిణి – కొండపల్లి వేణుగోపాల్‌రావు – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: కొండపల్లి వేణుగోపాల్ రావు, 3-4-526/33, ఎన్.ఎల్.జి. రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 102, బర్కత్‌పురా, హైదరాబాద్ – 500 027



❖ **ఇప్పుడు** – కవిత – ఆశారాజు – ఝరీ పొయిట్రీ సర్కిల్ – 203 పేజీలు, 1/8 డెమీ, రు. 90, ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్; నవోదయ బుక్ హౌస్;




❖ **ఒకమాట** – సామాజిక జీవన దృక్పథం – సి.సి.రెడ్డి – పాలపిట్ట బుక్స్ – 216 పేజీలు, 1/8 డెమీ, రు: 150, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. సెల్: 9848787284



❖ **లక్షింపేటా..!** – విరసం ఆధ్వర్యంలో రచయితల నిజ నిర్ధారణ బృందం నివేదిక – విరసం ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **అగాధం** – ఆస్కార్ వైల్డ్ (డే ప్రొఫొండిస్) తెలుగు: అశ్విని కె. – మిసిమి పబ్లికేషన్స్ – 80 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: మిసిమి పబ్లికేషన్స్, కళాజ్యోతి ప్రాసెస్ ప్రై.లి. 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ – 500 020; ఫోన్: 040 – 27645536



❖ **మెతుకు సీమ** – తెలంగాణ ఉద్యమ కవిత – ప్రధాన సంపాదకులు: దప్పోళ్ల రమేష్ – మార్పు కళామండలి– 105 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: 6-69, బ్యాంక్ కాలనీ, పి.ఆర్.పల్లి, సంగారెడ్డి, మెదక్; సెల్: 9550923323, 9440927559

వికలాంగులకు 3 శాతం సీట్లు ఇవ్వాలి

అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు వికలాంగులకు మూడు శాతం సీట్లు కేటాయించాలనీ, నామినేటెడ్ పదవుల్లోనూ రిజర్వేషన్ కల్పించాలనీ వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు ఆగస్ట్ 26న డిమాండ్ చేశారు. ఐకాస అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు నర్సింహా, వికలాంగుల మహాసంఘటన్ అధ్యక్షుడు నందూరి రమేశ్, ఎన్‌పిడిఆ ఆంధ్రప్రదేశ్ వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు శ్రీశైలం, సిపిఐ అనుబంధ సంస్థ ప్రతినిధి అన్వర్ పాషాలు హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో తమ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియజేశారు.

రైతులకు ఏడు గంటల విద్యుత్తు ఇవ్వాలి

వ్యవసాయానికి ఏడు గంటల పాటు విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు ఆగస్ట్ 28న అసెంబ్లీ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి నన్నపనేని రాజకుమారి అసెంబ్లీ భవనం పైకి ఎక్కి నిరసన తెలిపారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె

ఫిబ్రవరిలో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయక పోవడంతో జూనియర్ డాక్టర్లు ఆగస్ట్ 28 నుంచి ఆందోళనకు దిగారు. ఉస్మానియా, విజయవాడ సిద్ధార్థ విద్యార్థులు సమ్మె ప్రారంభించగా, తర్వాత గాంధీ, కాకతీయ, రంగరాయ ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని విద్యార్థులు సమ్మె బాటపట్టారు. గత ఏడాది జనవరిలో పదకొండు డిమాండ్లతో జూనియర్ వైద్యులు రాష్ట్రవ్యాప్త సమ్మె చేశారు. ఏడాది పాటు గ్రామీణ సేవలు అందించాలన్న నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6న వైద్యశాఖ కార్యదర్శితో చర్చలు సఫలం అయ్యాక పదిరోజుల సమ్మెను విరమించారు. స్టైఫండ్ పెంపుతో సహా పలు డిమాండ్లను సాధించుకున్నారు.

ఈటివి సుమన్ మృతి

బుల్లితెర నటుడు, రచయిత, దర్శకుడు, ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు రెండో కుమారుడు ఈటివి సుమన్ (45) సెప్టెంబర్ 6 అర్ధరాత్రి మరణించారు. నాలుగేళ్లుగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. చెరుకూరి సుమన్ 1966 డిసెంబర్ 23న పుట్టారు. ఈటివి నిర్వహణ బాధ్యతలు చూడడంతో పాటు పలు సీరియళ్లకు కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లేలను కూర్చాడు. 'అమెరికా అదురుష్టం', 'సభ్య సమాజం' ఆయన రాసిన పుస్తకాలు.

జీవ వైవిధ్య సదస్సు

మన దేశంలో మొదటిసారిగా జీవ వైవిధ్య సదస్సు హైదరాబాద్ వేదికగా జరగనుంది. ఈ సదస్సు అక్టోబర్ 1 నుంచి 19 వరకు జరగనున్నదనీ, ఈ సదస్సులో 193 దేశాలకు చెందిన ఎనిమిది వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నారనీ, ఎనిమిది దేశాల అధ్యక్షులు పాల్గొంటున్నారనీ మంత్రులు గీతా రెడ్డి, దానం నాగేందర్‌లు సెప్టెంబర్ 13న సచివాలయంలో మీడియాకు తెలియజేశారు. ఈ సదస్సును ఐక్యరాజ్య సమితి, భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు కోసం పదిహేను ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చినట్లు చెప్పారు. సదస్సు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రు.455 కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు.

జతిన్‌దాస్ స్మృతిలో బిఎస్ఏ సంస్మరణ

షహీద్ జతిన్‌దాస్ స్మృతిలో సెప్టెంబర్ 13న రాజకీయ ఖైదీల హక్కుల దినోత్సవంలో భాగంగా న్యాయవాది బిఎస్ఏ సత్యనారాయణ సంస్మరణ సభ కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి) ఏపి ఛాప్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సభకు బల్లా రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా, ఆకుల భూమయ్య (తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు), లతీఫ్ మొహమ్మద్ ఖాన్ (సిఆర్‌పిపి జాతీయ కార్యదర్శి), బొజ్జా తారకం (సీనియర్ న్యాయవాది), వరవరరావు (ఆర్‌డిఎఫ్ జాతీయ అధ్యక్షుడు) పాల్గొని ప్రసంగించారు. అక్రమ ఆస్తుల కేసులో నిందితుడు జగన్‌ను రాజకీయ ఖైదీగా గుర్తిస్తున్న ప్రభుత్వం, నిజమైన రాజకీయ ఉద్యమకారులను రాజకీయ ఖైదీలుగా గుర్తించడం లేదని వక్తలు అన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న వారిపై నిర్బంధ చట్టాలు ప్రయోగిస్తున్నారని అన్నారు. శిక్ష పూర్తిచేసుకున్న జీవిత ఖైదీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'సుత్తివేలు' మృతి

ప్రముఖ హాస్య నటుడు సుత్తివేలు (65) సెప్టెంబర్ 13న చెన్నైలో గుండెపోటుతో చనిపోయారు. ఆయన అసలు పేరు కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు. ఆయన కృష్ణాజిల్లా చల్లపల్లె సమీపంలోని భోగిరెడ్డి పల్లెలో 1947 ఆగస్ట్ 7న పుట్టారు. చదువుకునే రోజుల్లోనే నాటకాలలో పలు పాత్రలు వేశారు. సినీ దర్శకులు జంధ్యాల సినిమాలలో ఆయనకు అవకాశం ఇచ్చారు. ఆయన ఎన్నో వైవిధ్య పాత్రలలో నటించారు.

అసమానతలు ఉన్నంత కాలం..

'తెలంగాణ ఉద్యమం - ప్రస్తుత పరిస్థితి - ఉపాధ్యాయుల కర్తవ్యం' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లో సదస్సు జరిగింది. ఈ సదస్సులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'తెలంగాణ అంశంపై పూర్తి అవగాహన లేదంటూనే ఓ మంత్రి (కేంద్ర హోంమంత్రి షిండే) నక్సలైట్ సమస్య ఉందంటారు. అణచివేత, దౌర్జన్యం, అసమానతలు ఉన్నంత కాలం, సమానత్వ ప్రాతిపదికన సమాజ నిర్మాణం జరగాలని కోరుకునే వాళ్లు ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుంది అనీ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఏకాభిప్రాయం కావాలనే మాట రాజ్యాంగంలో ఎక్కడా లేదనీ' అన్నారు. ఈ సదస్సులో వక్తలుగా వివిధ సంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఇక లేరు

ఉద్యమ జీవి, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ (95) హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో సెప్టెంబర్ 21 ఉదయం కన్ను మూశారు. తెలంగాణ ఉద్యమం పెద్దదిక్కుగానూ, బలహీనవర్గాల ఆత్మబంధువుగానూ ఆయన ఎంతో స్ఫూర్తిని నింపారు. ఆయన 1917 సెప్టెంబర్ 27న పద్మశాలి కుటుంబంలో పుట్టారు. ఆయన తల్లిదండ్రులు అమ్మక్క, బాపూజీ. చిన్నతనం నుంచి ప్రశ్నించే తత్వంతో ఆయన ఎదిగారు. 1938లో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. 1940లో మూడవ గ్రేడ్ ప్లీడర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించి క్రిమినల్ లాయర్‌గా ప్రసిద్ధులయ్యారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులపై మోపిన కేసులు వాదించేందుకు హైదరాబాద్ నుంచి జనగాంకు సైకిల్‌పై వచ్చి వెళ్లేవారని సన్నిహితులు గుర్తు చేశారు. 1938లో హైదరాబాద్ గౌలిగుడలో చేపట్టిన సత్యాగ్రహంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలలు జైలులో గడిపారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం, వందేమాతరం ఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యాక ఆయన అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వేర్వేరు కాలాల్లో అయిదు సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 1969 తెలంగాణ ఉద్యమ సందర్భంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. వీ

పోరాటం - తెలంగాణ వచ్చే దాకా.. హక్కులన్నీ దక్కేదాకా

తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో భాగంగా ఐక్య కార్యాచరణ సమితి నాయకత్వంలో సెప్టెంబర్ 16న కరీంనగర్‌లో కవాతు జరిగింది. 'తెలంగాణ మార్చ్-కరీంనగర్ టార్చ్' పేరిట మానేరు వంతెన నుంచి సర్కస్ గ్రౌండ్ వరకు ఈ కవాతు జరిగింది. కవాతు సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, కలిసిరాని ప్రజా ప్రతినిధులను హెచ్చరించారు. తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొ. కోదండరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్ జరుగుతుందని చెప్పారు. సెప్టెంబర్ 29న గణేష్ నిమజ్జనం జరుగుతుందనీ, సెప్టెంబర్ 30న ఆంధ్ర పెత్తనానికి నిమజ్జనం జరుగుతుందనీ అన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం తాను ఇచ్చిన వాగ్దానం మరిచిందనీ, ప్రజలకు పోరాటం తప్ప మరో మార్గం లేదనీ అన్నారు. తెలంగాణ ఇవ్వకుంటే గుంజుకుంటామని అన్నారు. న్యాయం, సమానత్వం, హక్కుల కోసం సెప్టెంబర్ 30న హైదరాబాద్ పోతున్నాం అని కరీంనగర్ కవాతులో చెప్పారు. కరీంనగర్ కవాతు అన్ని జిల్లాల మీదుగా సాగి సెప్టెంబర్ 30న హైదరాబాద్ చేరుతుందని అన్నారు. కరీంనగర్ కవాతులో వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, మహిళలు, పిల్లలు మొత్తంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ప్రతి ఇంటికో జెండా, ఒక మనిషి చొప్పున హైదరాబాద్‌లో తెలంగాణ కవాతులో పాల్గొనాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే పాలకులు ప్రజల అడుగుతున్నవి పరిష్కరించాలనుకోవడం లేదు. 'పోరాడితే సాధించవచ్చు, గెలవవచ్చు, మార్చవచ్చు' అనే భావన, ఆశ్వాసన ప్రజలలో ఎక్కడ బలపడుతుందోనని పాలకుల భయం. తాము ఇచ్చే వాళ్లుగా, భిక్ష వేసేవాళ్లుగా, ప్రజలు ఎప్పుడూ తీసుకునేవాళ్లుగా, అడుక్కునేవాళ్లుగా ఉండాలని పాలకుల కోరిక. అందుకే 'లబ్ధిదారుల' భాష మన మధ్యకు వచ్చింది. ప్రభుత్వానికి, మార్కెట్‌కు ప్రజలంటే లబ్ధిదారులు, లేక వినియోగదారులు. ఎన్నో అస్తిత్వాలు తమ న్యాయమైన కోరికల కోసం ఉద్యమిస్తూనే, ఒక ప్రాంతీయ ఆకాంక్ష కోసం అన్ని సమూహాల ప్రజలు కలిసి కొట్లాడుతున్న దృశ్యం కనబడుతుంది. ఈ దేశ సార్వభౌమత్వాన్ని ఎటువంటి ఏకాభిప్రాయమూ లేకుండానే విదేశీయులకు తాకట్టు పెడుతున్న దళారీ పాలకులు, తెలంగాణ ఆకాంక్షకు ఏకాభిప్రాయం కావాలని అంటున్నారు. పార్టీలు, జెండాలు, ఎజెండాలు ఏవయినా సమస్త ప్రకృతి వనరులను బహుళజాతి సంస్థలకు దఖలు పరుస్తూ ఆదివాసులను, దళితులను మొత్తంగా సామాన్యులందరినీ జీవితం నుంచి గెంటేస్తూ, వివిధ అస్తిత్వ సమూహాల మధ్య మెలికలు పెడితూ పాలకులు పబ్బం గడుపుకుంటున్నారు. తెలంగాణతో సహా తమ అన్ని న్యాయమైన ఆకాంక్షలను పోరాటంతో, పోరాటం ద్వారా మాత్రమే సాధించుకోగలమని నిన్నటి కన్నా నేడు ఎక్కువగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఆ క్రమంలోనే హైదరాబాద్‌లో తెలంగాణ కవాతుకు నడుములు బిగిస్తున్నారు.

విద్యా వ్యాపారం... ఏ వెలుగులకీ ప్రస్థానం

మన రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి సమీప గతంలోకి పోయి చూస్తే 2000-01 నాటికి 106 ఇంజినీరింగ్ కళాశాలలు, వాటిలో 30,176 సీట్లు ఉండేవి. ఇవి 2012-13 విద్యా సంవత్సరానికి 46 కోర్సులతో ప్రైవేటు కాలేజీల్లో 3,36,430 సీట్లు, ప్రభుత్వ కాలేజీల్లో 5,946 సీట్లకు చేరాయి. మొత్తం కాలేజీల సంఖ్య 717కు చేరింది. వీటిలో 687 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కాలేజీలు కాగా, 30 ప్రభుత్వ కాలేజీలు. వీటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా (కేటగిరి - ఎ) కింద, 30 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ (కేటగిరి - బి) కింద భర్తీ చేస్తారు. 2001 నాటికి రాష్ట్ర జనాభా 7.6 కోట్లు దాటింది. 2011 నాటికి ఆ జనాభా 8.3 కోట్లకు చేరుకుంది. ఈ జనాభా తేడాలతో చూసినప్పుడు ప్రజలకు విద్యనందించాలని పాలకులకు ఎందుకింత ప్రేమ అనే ప్రశ్న ముందుకు వస్తుంది. ఎందుకూ అంటే చదువు అమ్ముకోవడం ఇప్పుడు చాలా లాభసాటి వ్యాపారం అయిపోయింది కాబట్టి. ఈ ఏడాది నిర్వహించిన ఎంసెట్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 2,07,400. ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులు ఇందులోనే ఉంటారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ సీట్లు 3,42,376 కాగా, ఫార్మసీ సీట్లు 31,140. అంటే, అర్హత పొందిన విద్యార్థులకు రెట్టింపు సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల పెరుగుదల ఎంత అవాస్తవికంగా ఉందో ఈ గణాంకాలతో అర్థమవుతుంది. నాజకీయ నాయకులు, వారి బంధువులు, సారా కాంట్రాక్టర్లు, ప్రైవేట్ మాఫియాలు గల్లి, గల్లికో ఇంజినీరింగ్ కొట్టు పెట్టి విద్యను అమ్ముకుంటున్నారు. వీటిలో 50 శాతం కాలేజీలకు ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు లేవనేది బహిరంగ రహస్యం. ఇక రిజర్వేషన్‌లు, సామాజిక న్యాయం అవన్నీ మాట్లాడుకోవల్సిన విషయాలే కావు. అయినా ఈ వ్యాపారం ఎందుకు సాగుతోంది? అని ప్రశ్నించుకుంటే మన వేలం వెర్రి పైననే అనేది అర్థమవుతుంది. భాషా, సాహిత్యం, చరిత్ర, తత్వశాస్త్రం, సమాజ శాస్త్రాలు, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, గణితం, సైన్స్ వంటి చదువులకు ప్రాధాన్యత లేకుండా చేసేశారు. గతంలో ఉన్న కొద్దిపాటి మౌలిక పరిశోధనల నుంచి, శాస్త్రీయ అభివృద్ధి నుంచి ప్రభుత్వాలు తొలిగిపోయి, విదేశీ మార్కెట్ అవసరాలు తీర్చడంలో భాగంగానే మన చదువులకు ఈ గతి దాపురించింది. ఇవన్నీ ఇలా ఉండగా ఫీజుల వివాదం కొనసాగుతూనే ఉంది. ఇంజినీరింగ్ విద్య వేల రూపాయల్లో ఉంటే, వైద్య విద్య ఖరీదు లక్షల రూపాయలు దాటి కోట్ల ఖరీదు వైపుకు పరిగెడుతోంది. ఇప్పటికే వైద్య విద్యను అభ్యసించిన వారు మేము గ్రామాలకు వెళ్లం, ప్రజల వద్దకు వెళ్లం అని చెపుతూనే ఉన్నారు. అవును, ఇన్ని వేలూ, లక్షలూ పోసి చదివింది ప్రజలకు సేవ చేయడానికా? మన వెర్రి కాకపోతే..

గురజాడ అప్పారావు 150వ జయంతి!

గురజాడ అప్పారావు (21 సెప్టెంబర్ 1862 - 30 నవంబర్1915) కవిగా, నాటక రచయితగా, కథకునిగా, వ్యాసకర్తగా, చరిత్రకారునిగా, అనువాదకునిగా, శాసన పరిశోధకునిగా అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. విజయనగరం మహారాజా కాలేజీలో లెక్చరర్‌గానూ (1887-1896), ఇంకా వివిధ హోదాలలోనూ పనిచేసారు. 'కన్యాశుల్కం', 'కథానికులు', 'ముత్యాల సరాలు - ఇతర కవితలు', 'కొండు భట్టీయం - బిలణీయం', 'వ్యాసచంద్రిక', 'మాటామంతీ', 'డైరీలు', 'డిసెంటు పత్రం', 'అసంపూర్ణ నవల సౌదామని' వగైరా ఎనిమిది సంపుటాల రచనలు అనేక సార్లు అచ్చయ్యాయి. ఇదంతా ఇటీవల జరిగిన గురజాడ స్వర్ణోత్తర శతజయంతి ఉత్సవాల సందర్భంను మరోసారి తలచుకోవడానికే. ముఖ్యంగా 'కన్యాశుల్కం' నాటకం, 'దేశభక్తి' గీతం ఇవాల్టి సందర్భానికి అన్వయించుకొని, విశ్లేషించుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది. స్థల, కాల పరిమితులు ఏ రచయితకైనా, రచనకైనా ఉంటాయి. ఏ సమాజమైనా ఒక వ్యక్తి గురించి పదే పదే గుర్తు చేసుకుంటోంది అంటే, వాళ్ల విశ్లేషణలు కొత్త చూపునిచ్చేవిగా ఉండడమే కారణం. ఈ సందర్భంగా అటు ప్రభుత్వం నుంచి, ఇటు సాహిత్య సంస్థలు, వ్యక్తులు దాకా గురజాడను స్మరించుకున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మహానుభావుల విగ్రహాల మాటున దాక్కునే అవకాశవాదం మనకు తెలిసినదే. కానీ సామ్రాజ్యవాద ప్రభావంలోకి నిస్సహాయంగా కూరుకుపోతున్న మధ్యతరగతి మనిషిని చూసినప్పుడు గురజాడ ప్రాసంగికత మరింత ఎక్కువ అవుతోంది. అప్పటి గిరీశాన్ని అర్థం చేసుకోవడం గురజాడకు పెద్ద కష్టం కాలేదేమో. కాని ఇవ్వాళ అనేక ప్రలోభాలకు బందీలవుతున్న, కనిపించని లోతులకు దిగజారిపోతున్న గిరీశాలను, గిరీశాల సంస్కృతిని అర్థం చేసుకోవడానికి గట్టిగా కృషి చేయాల్సిందే. దేశమంటే అమ్ముకోవడానికి ఖనిజాలు, మట్టే కాదని, దేశమంటే మనుషులని, ఆదివాసులని, దళితులని, ముస్లింలని, మహిళలని, మొత్తంగా పీడిత ప్రజానీకం అని చాటాల్సిన, పాలకులతో పోరాడాల్సిన అవసరం మరింత పెరిగిన సందర్భం ఇది. 'మంచి గతమున కొంచెమేనోయి, మందగించక ముందు అడుగు వేయి' అని మరింత బలంగా చాటాల్సిన సందర్భం ఇది. అందుకే గురజాడను తలచుకోవడం.

వార్త - వ్యాఖ్య : డి.వి. రామకృష్ణారావు

వీ

ఈ విప్లవ సంప్రదాయం వల్ల రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీ చాలా మంది చేత రాడికల్ ఇంజినీరింగ్ కాలేజీ అని కూడా పిలవబడింది. 1970ల నాటి నుంచీ 1990ల దాకా ఆర్ఇసి క్యాంపస్ మీదా, విద్యార్థుల మీదా పోలీసుల దాడులు నిరంతరం సాగాయి. ఆర్ఇసి విద్యార్థుల మీద అక్రమ నిర్బంధాలూ, చిత్రహింసలూ, కేసులూ లెక్కలేనన్ని సాగాయి. ఒకవైపు పోలీసు దాడులతోపాటు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ఎబివిపి సంస్థలు, ముఖ్యంగా బీహార్ భూస్వామ్య వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు విప్లవ విద్యార్థుల మీద దాడులు చేయడానికి ప్రయత్నించారు. ఆ దాడులను విప్లవ విద్యార్థులు ఎన్నోసార్లు వీరోచితంగా తిప్పికొట్టారు. ఈ ప్రతి దాడులలో ఒక బీహార్ విద్యార్థి చనిపోవడం కూడా జరిగింది. ఈ చరిత్రలో కా. జనార్దన్ పాత్ర ఎంత కీలకమైనదంటే, నలభై సంవత్సరాల తరువాత కూడా ఆయన గురించి అప్పటి ప్రిన్సిపల్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులు, మెస్ వర్కర్లు, చుట్టు పక్కల గ్రామాల ఉద్యమ సహచరులు తమను నిన్ననో మొన్ననో కలిసిన ఆత్మీయ మిత్రుడిని తలుచుకున్నట్టు తలచుకున్నారు. ఆయన జ్ఞాపకాలు ఇంకా ఎంత బలంగా ఉన్నాయంటే, నాలుగు దశాబ్దాల కాలం వాటిని మసకబార్చలేదు.

జనహృదయం జనార్దన్, సూరపనేని జనార్దన్‌రావు మెమోరియల్ ట్రస్ట్,
జనార్దన్ మిత్రులు ప్రచురణ, జూలై, 2012

మూడేళ్లపాటు (సల్వాజుడుం ద్వారా) సాగిన 'మంద్రస్థాయి యుద్ధం' అడవుల నుంచి తిరుగుబాటు దారులను బయటకు వెళ్లగొట్టడంలో విఫలం కావడంతో భారత సైన్యాన్ని, వాయు సేనను రంగంలోకి దించుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాని దీన్ని యుద్ధం అనడం లేదు. 'పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించడం' అంటున్నారు. వేల సంఖ్యలో సైనికులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఒక బ్రిగేడ్ (సుమారుగా ఐదువేల సైనికులు ఉంటారు) కేంద్ర కార్యాలయం, విమానాశ్రయాలు సిద్ధమవుతున్నాయి. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సైన్యాలలో ఒకటి ప్రస్తుతం ప్రపంచంలోకెల్లా అత్యంత పేదల నుంచి, ఆకలిగొన్న, పోషకాహార లోపం ఉన్న ప్రజల నుంచి తనను తాను రక్షించుకోవడానికి యుద్ధ సన్నాహాలు చేస్తోంది. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) అమలు చెయ్యడం ఒక్కటే మిగిలి ఉంది. దీని ద్వారా సైన్యానికి చట్టం నుంచి రక్షణ లభిస్తుంది, 'అనుమానం' వస్తే ఎవరినైనా చంపేసే హక్కు లభిస్తుంది. కాశ్మీరు, మణిపూర్, నాగాలాండ్‌లలో పేరు లేని వేలాది సమాధులు, అనామక శవాల దహనకాండలు చూస్తూ ఉంటే ఈ సైన్యం అత్యంత అనుమానాస్పద సైన్యం అని చూపుకుంటోంది.

పెట్టుబడిదారీ విధానం - ఒక ప్రేతాత్మ కథ, అరుంధతీ రాయ్,
మలుపు బుక్స్, జూన్ 2012

మన దేశంలో క్రీ.పూ. రెండో శతాబ్దం నాటి వైశేషిక తత్వచింతనలో అణువుల ప్రస్తావన కనిపిస్తుంది. దీన్ని ప్రతిపాదించినవాడు కణాదుడు. తక్కిన మరొక నాలుగు దర్శనాలలాగే ఈ తత్వం కూడా దేవుడు లేడని చెప్పడమే కాక అసలు అటువంటి భావనకు ఆస్కారమేలేదని వాదిస్తుంది. ఒక్క వేదాంతం తప్ప మరే భారతీయ తత్వ ధోరణీ ఈశ్వరుణ్ని ఆమోదించలేదు. వైశేషికతత్వధోరణి మనకు కనబడే వస్తువులన్నీ అణువుల సమాదాయాలేనని స్పష్టంగా చెప్పింది. ఆత్మవంటిదేదీ ఉందనడానికి మావద్ద అనుభూవ పూర్వకమైన జ్ఞానమేదీ లేదని ఆ తాత్వికులు చెప్పారు. అణువుల నుంచి వస్తువులు రూపొందడానికి భౌతిక కారణాలే కనిపిస్తాయని వారు చెప్పారు. దురదృష్టవశాత్తూ, మన దేశంలోగానీ, తక్కిన దేశాల్లోగానీ ఈ భౌతికవాద దృక్పథం బలపడే పరిస్థితులు మెరుగవలేదు. ఉత్తర యూరప్‌లో పదహారో శతాబ్దం దాకా సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలవలేదు. అందువల్లనే ఇంగ్లండ్ వంటి దేశాల్లో న్యూటన్ వంటి శాస్త్రవేత్తలకు దక్కిన గౌరవ ప్రపత్తులు ఇటలీలోని గెలీలియోకు లభించలేదు.

అణువుల శక్తి, కొడవటిగంటి రోహిణీ ప్రసాద్,
హైదరాబాద్ బుక్ ట్రస్ట్, జూన్ 2012

లక్షింపేట సంఘటన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అనుకున్న స్థాయిలో ప్రతిస్పందన రాలేదన్నది బహిరంగ రహస్యమే. దళిత సంఘాలు తగ్గిపోయాయనో, వర్గీకరణ అనో నాయకత్వ కొరతనో, ప్రపంచీకరణ సంస్కృతనో, ఇంకా మరేవో కారణాలు చెప్పడానికి అవకాశం లేదు. కొన్ని నెలల కింద నాలుగైదు చోట్ల అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమైతే, రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేశారే. వాడవాడనా నిరసనలు చేశారే. గల్లీ నుండి ఢిల్లీ దాకా వివిధ రకాల కార్యక్రమాలతో తమ నిరసన తెలిపారు కదా. భారత రాజ్యాంగ నిర్మాతకు, దళితజాతి వైతాళికుడికి జరిగిన ఈ అవమానానికి ప్రతిస్పందించారని అభ్యుదయవాదులు ఆనందపడ్డారు. మరి లక్షింపేట సంఘటనపై అంతకంటే పెద్ద ఎత్తున నిరసన రావాలి కదా. ఎందుకు రాలేదు? ఆ మహానుబావుని విగ్రహాలు తప్ప ఆశయాలు వారికి పట్టవా? ఏం దేశంలో విగ్రహాలకే కాని ప్రాణాలకు విలువలేదా?

ఈ దేశంలో విగ్రహాలకున్న విలువ ప్రాణాలకుండదా?, ఎచ్.ఆర్.డి.
స్వేచ్ఛాలోచన మాసపత్రిక, సెప్టెంబర్ 2012

నేడు ప్రపంచీకరణ దుష్ఫలితాలు ఒక్కొక్క రంగాన్నే కబళిస్తూ వస్తున్నాయి. వినియోగ వస్తువులు, విద్య, వైద్యం, రిటైల్ రంగం, ఈ క్రమంలో వ్యవసాయం కూడా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఒకవైపున వేల ఎకరాల సేద్యపు భూమిని అక్రమంగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. మరోవైపున లక్షలాది ఎకరాలకు నీటి సదుపాయం కల్పించడంలో, విద్యుత్ సౌకర్యం అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇటు అధికార పక్షం, అటు విపక్షం కూడా ప్రజలకు అంతగా అవసరం లేని, తక్షణ ప్రాధాన్యం లేని అంశాలపై రాజకీయం చేయడంతోనే సరిపుచ్చుకుంటున్నాయి. దీంతో ప్రజాసమస్యలు మరుగున పడుతున్నాయి. దేశాన్ని, దేశ ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసే కీలక విధాన నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం లేకుండా పోతున్నది. అణు విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపు అంశాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలాంటి అంశాలను చర్చించేందుకు ఒక వేదిక లేకుండా చేస్తున్నారు. మీడియా కూడా అదే బాట పట్టింది. ఇక చివరి దిక్కుగా మిగిలింది 'ప్రత్యామ్నాయ మీడియా' మాత్రమే.

సంపాదకీయం, ***దక్కన్ ల్యాండ్*** మాసపత్రిక, సెప్టెంబర్ 2012

మాటల గారడీ తెల్సిన 'మాకియ విల్లీలు', స్మగ్లింగ్ కార్యకలాపాలలో ఆరితేరిన దావూద్ ఇబ్రహీం లాంటి దొంగల ముఠాలు, కబ్జాదారులు.. రాజకీయ ముసుగులో ఉన్న జనాలు, నేతలుగా చెలామణి అయ్యే రౌడీలు.. ఇలా ఎందరెందరో లక్షల కోట్లు ఆర్జించి, ఉద్యోగులను సైతం తమకనుసన్నలలో ఉండేలా శాసించి, తిరుగులేని నేతలుగా ఘరానాగా బతుకుతున్న నిజం గదా! అలాంటి గ్యాంగ్‌స్టర్‌లకు సలాం కొట్టే నీచ సంస్కృతి నలవరుచుకున్న జనాల్ని ఏమనాలి? ఎవరిని నిందించాలి? నిరక్షరాస్యుడైన యాదగిరి లాంటి దగుల్బాజీలు న్యాయమూర్తులను సైతం శాసించే స్థాయి రావడం ఎంత అవమానకరం! ఎంగిలి బీడీలకు కక్కుర్తి పడిన వెధవలు నేడు లక్షల కోట్లకు అధిపతులైతే స్వాతంత్ర్యం వచ్చింది ఇలాంటి నికృష్ట గ్యాంగు కోసమా అని ఆవేదన కల్గడం సహజం!

సంపాదకీయం, ***సీనియర్ సిటిజన్ వాణి***, ఆగస్ట్ 2012

నక్సలిజం పెరగడానికి కారణం దేశంలోని 20 కోట్ల మంది ఆదివాసి రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం, కార్పొరేట్ సంస్థల జులుం అని చెప్పాలి. స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆదివాసులు, స్వాతంత్ర్యానంతరం కూడా కోట్లాది మంది ఆదివాసి రైతాంగం తీవ్రమైన ఆర్థిక దోపిడీ, అణచివేతకు దూరం కాలేదు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అధికారాలు కల్పించడంతో ఖనిజ సంపదను దోచుకునేందుకు ఆదివాసులను ఆయా ప్రాంతాల నుంచి వెళ్లగొడుతున్నారు. భారత ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు లక్షలాది మందిని ఆత్మహత్యలు చేసుకొనేలా ప్రేరేపిస్తే, మరోవైపు నక్సలైట్లకు మద్దుత్తుదారులయ్యే విధంగా ప్రేరేపిస్తున్నాయి. అవినీతిపరులయిన మన పాలకులు, కార్పొరేట్ సంస్థలు కలిసి దేశంలోని కోట్లాది మంది రైతాంగాన్ని నాశనం చేయకపోయుంటే నక్సలైట్ల సంఖ్య ఇంతగా పెరిగుండేది కాదేమో! ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా దళాల కార్యకలాపాలు ఎంత తీవ్రం చేశారో, అంతగా నక్సలైట్లు కూడా సంఘటితమయ్యారు.

సంపాదకీయం, ***భిలాయి వాణి***, మే-జూన్ 2012

జీవ వైవిధ్య సదస్సు ఎవరికోసం?

జీవ వైవిధ్య సదస్సులకు సామాన్య ప్రజల ఎజెండా ఎప్పుడూ పట్టలేదని, ప్రజలను ప్రకృతి హక్కుదార్లుగా, పరిరక్షకులుగా చూడకుండా వారికి సంబంధంలేని ఒక తంతుగా ఇవి జరుగుతున్నాయని అంటున్నారు ఆశాలత

హైదరాబాద్‌లో అక్టోబర్ 1 నుండి 19 వరకు జరుగుతున్న 11వ జీవవైవిధ్య సదస్సును కొంతమంది మన దేశానికి, మన రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తూ పొంగిపోతూ ఉండవచ్చు కాని ఇందులో జరిగే చర్చలు అభివృద్ధి చెందుతున్న దేశాల పేద ప్రజల బతుకులపై ఏ విధంగా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయో లోతుగా తెలుసుకుంటే సంబరపడాల్సిన విషయమెంత మాత్రం కాదని అర్థమవుతుంది.

ఎందుకంటే గత 20 సంవత్సరాలుగా ప్రపంచంలోని వివిధ దేశాలలో పది తడవలు జరిగిన జీవవైవిధ్య సదస్సులు ఇంతవరకు నిజానికి ప్రజల ఎజెండాను ఎన్నడూ చర్చించలేదు. 1992లో జరిగిన మొదటి సదస్సులో పాల్గొన్న 193 దేశాలు కన్వెన్షన్ ఆన్ బయోడైవర్సిటీ (సిబిడి) పై సంతకాలు చేశాయి, వాటిలో భారతదేశం కూడా ఒకటి. సిబిడి పై సంతకం చేసిన దేశాలన్నీ జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, సుస్థిరంగా వినియోగించడంలో స్థానిక సమూహాల జ్ఞానాన్ని, సృజనాత్మకతను గౌరవించి, కాపాడి నిలబెట్టడానికి కట్టుబడి ఉండాలని అధికరణం 8జె ప్రకటించింది. కాని వాస్తవంలో గత 20 సంవత్సరాలలో జీవవైవిధ్య సంపదను, దానికి సంబంధించిన స్థానిక ప్రజల, ఆదివాసుల జ్ఞానాన్ని ప్రవేటీకరించి ఆ ప్రకటన స్ఫూర్తికి తూట్లు పొడవడమే జరిగింది తప్ప మరొకటి కాదు. సిబిడిపై సంతకం చెయ్యని అమెరికా అగ్ర రాజ్యం అభివృద్ధి చెందిన దేశాల సంపదను కొల్లగొడుతున్నదే తప్ప జీవవైవిధ్యాన్ని కాపాడడంలో ఇతర ప్రపంచ దేశాలతో పాటు ఎటువంటి జవాబుదారీతనం వహించడంలేదు.

జీవవైవిధ్యాన్ని నాశనం చేసి, పర్యావరణ వినాశనం, వాతావరణ మార్పుకు పెద్ద ఎత్తున కారణమవుతున్న అమెరికా మెడలు వంచడానికి ప్రస్తుత జీవవైవిధ్య సదస్సులో ఎటువంటి ప్రయత్నం లేదు.

జీవవైవిధ్య సంపద (పంటలు, వృక్షజాతులు, జంతుజాతులు, అడవులు) ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే ఉంది. ఆది నుండి స్థానిక ప్రజలే వీటిని కాపాడుతూ తమ తర్వాతి తరాలవారికి అందిస్తూ వచ్చారు. పెట్టుబడిదారీ విధానం వేళ్లూనుకున్నప్పటి నుండి పారిశ్రామికీకరణ, వాణిజ్యీకరణ మితిమీరిపోయి జీవవైవిధ్యం నాశనం కావడం మొదలయింది. దీనికి తోడు సామ్రాజ్యవాద దేశాల కనుసన్నలలో నడిచే ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఒత్తిడి తెచ్చి పేటెంట్లు, మేధోసంపత్తి హక్కులను హరించే ఒప్పందాలను ముందుకు తెచ్చాయి. ఈ అంతర్జాతీయ ఒప్పందాలను అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక నియంత్రణకు సాధనంగా ఉపయోగించి తద్వారా వాటి జీవవైవిధ్య వనరులపైన, వాటికి సంబంధించిన జ్ఞానంపైన హక్కులను కాజేయడం జరుగుతోంది. అందుకే 1992లో సిబిడి పై సంతకాలు జరిగిన తర్వాత జీవవైవిధ్య సంపదకు సంబంధించిన ప్రయోజనాలను పంచుకునే (బెనిఫిట్ షేరింగ్) ఒప్పందాల వల్ల అభివృద్ధి చెందిన దేశాలే ఎక్కువగా లాభపడ్డాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాలు ట్రిప్స్, గాట్స్ వంటి ఒప్పందాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ మేధో సంపత్తి సంస్థ మొదలయిన వాటి ఒత్తిడులకు లొంగి వాటి షరతులకు అనుగుణంగా తమ జాతీయ చట్టాలను మార్చుకుంటున్నాయి. జాతీయ విధానాలు, చట్టాలను రూపొందించడంలో ప్రజలకు, పౌరులకు ఎటువంటి పాత్ర లేదు, శక్తివంతమైన కార్పొరేషన్లు, ప్రైవేటురంగ సంస్థలు, అంతర్జాతీయ ఒత్తిడులు నిర్ణాయక పాత్ర వహిస్తున్నాయి. ఇందుకు మన దేశమే పెద్ద ఉదాహరణ. గత 10 సంవత్సరాలలో భారత ప్రభుత్వం విత్తన చట్టం, పేటెంట్ చట్టం, వృక్ష జాతుల రైతుల హక్కుల పరిరక్షణ చట్టం, జాతీయ వ్యవసాయ విధానం, జీవవైవిధ్య చట్టం వంటి అనేక చట్టాలను తెచ్చింది. ఇవన్నీ కూడా జీవరూపాలపై పేటెంట్ హక్కులను, మేధోసంపత్తి హక్కులను బయటివారికి కట్టబెట్టే వ్యవస్థలను సమర్థించి వారికి తలుపులను బార్లా తెరవడాన్ని అనుమతించేవే. ముఖ్యంగా 2002లో వచ్చిన జీవవైవిధ్య చట్టం, పేటెంట్ వ్యవస్థను ఆమోదించడంతో ఇంకెంత మాత్రం మన దేశ స్థానిక సమూహాల, ఆదివాసుల, రైతుల హక్కులకు ఎటువంటి రక్షణ లేకుండా చేసింది. ఎందుకంటే పేటెంట్లు ప్రజల జ్ఞానాన్ని ప్రవేటీకరించి అందరికీ అందుబాటులో లేకుండా చేస్తాయి.

జీవవైవిధ్య సదస్సులలో జరిగిన చర్చలు, ఒప్పందాలు ప్రజలను జీవవైవిధ్య సంపదకు యజమానులుగా, సంరక్షకులుగా కాక ఆ సంపదపై ప్రయోజనాన్ని పొందడానికి దరఖాస్తు చేసుకునేవారి (బెనిఫిట్ క్లెయిమర్స్)గా, తమ సంపదను ఇతరులకు వాడకానికి అనుమతినిచ్చేవారి (కన్సెంట్ గివర్స్)గా మార్చివేశాయి. 193 దేశాలు సంతకం చేసిన సిబిడి జన్యు వనరులు, వాటికి సంబంధించిన జ్ఞానం దేశాల సరిహద్దులు దాటిపోకుండా నియంత్రించడానికి, వాటి ప్రయోజనాలను సమానంగా పంచుకోవడానికి ఉద్దేశించబడింది. కాని నిజానికి అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. మన దేశంలో పంటలు, ఔషధ మొక్కలు, జంతు జాతుల జన్యు చౌర్యం అనేక ముసుగులలో యథేచ్ఛగా సాగిపోతున్నది.

ఇక మన దేశంలో పెద్ద ఆనకట్టలు, గనుల తవ్వకం, అణువిద్యుత్తు కర్మాగారాలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, పారిశ్రామిక కారిడార్లు నెలకొల్పుతూ మన ప్రభుత్వం వందల లక్షల ఎకరాల భూమిని సేకరిస్తున్నది. ఆ ప్రాంతాలలో జీవసంపద అంతా నాశనమవుతున్నది.

ఇండియాను అమ్మేసిన మన్మోహన్ సింగ్

తమను అధికారంలో కూర్చోబెట్టిన ప్రజలకు కాక, తమ సంపదలను పెంచి, తమకు దన్నుగా నిలిచిన కార్పొరేట్ల రుణం తీర్చుకోవడంలో భాగంగానే ప్రభుత్వ విధానాలు రూపొందుతున్నాయని అంటున్నారు **వి. హనుమంతరావు**

కాంగ్రెస్ పార్టీ భారత దేశాన్ని బహుళజాతి సంస్థలకు, దేశంలోని కార్పొరేట్లకు అమ్మేసింది. ఈ నెల 14న మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాల సారాంశమిది. కొంతకాలం క్రితం 'అమ్మకానికి ఆంధ్రప్రదేశ్' పేరుతో 'వీక్షణం' మాసపత్రిక సంపాదకులు ఒక పుస్తకం ప్రచురిస్తే ఎవరైనా రాష్ట్రాన్ని అమ్మేస్తారా, ఈ రచయిత హద్దు మీరి రాస్తున్నాడేమో అని అనిపించింది. ఆ రచయిత ఆ పుస్తకాన్ని రచించే నాటికే కీ ఇస్తే బొమ్మ తిరిగినట్లు అమెరికా ఏజెంటుగా పనిచేస్తున్న ప్రపంచ బ్యాంక్ దేశాన్ని కమ్మేసుకుంటూ వస్తోంది. మన్మోహన్‌సింగ్ ఎప్పుడో కొంప ముంచుతాడనే హెచ్చరికలు వినపడుతూ వచ్చాయి. ఇప్పుడు గాలిలోనూ, భూమ్మీద ద్వారాలు తెరిచిన తర్వాత మన్మోహన్ ప్రధాని కాదు, సిఇఒ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) మాత్రమే. చంద్రబాబు గుర్తుకొస్తున్నాడు. ఇపుడు తీసుకున్న నిర్ణయాలు ఈనాటివి కావు. గత సంవత్సరంగా ప్రభుత్వ స్థాయిలో, ఆర్థిక శాస్త్రవేత్తల స్థాయిలో చర్చలో ఉన్న విషయమే. సంస్కరణలు రెండో విడత ప్రవేశపెట్టాలని కార్పొరేట్ సంస్థలు చెవినోర్లు కట్టుకొని పోరుతున్న విషయమే. బహుళజాతి సంస్థలు, ముఖ్యంగా రిటైల్ అమ్మకాలకు అవకాశాలివ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్న విషయమే. ఇటు ప్రజలు, అటు వ్యాపారస్తులు ఆందోళన చేస్తున్న విషయమే. కాని చిదంబరం ఆర్థికమంత్రి బాధ్యత చేపట్టిన రెండు వారాల్లోనే తుది నిర్ణయం ప్రకటించడం గమనార్హం. రిటైల్ రంగంలో ప్రవేశానికి అనుమతించాలని గత రెండు సంవత్సరాలుగా బహుళజాతి సంస్థలు ఒత్తిడి తీవ్రతరం చేయడం, ఆ ఒత్తిడి వెనుక అమెరికా హస్తం ఉండడం కూడా గమనించాలి. రాజకీయంగా భ్రష్టుపట్టిన కాంగ్రెస్ మొఖం మీద ప్రజలంతా ఉమ్మేస్తున్నారు. నిండా మునిగినవానికి చలేమిటన్నట్లు, కాంగ్రెస్‌కు ప్రజలు శాపనార్థాలు కొత్తగా బరువేమీకాదు, ఈ ఆలోచన తోటే సందట్లో సడేమియా అన్నట్లు డీజిల్ ధరలు కూడా పెంచేశారు. ఇంకో విషయం, 2014లో కాంగ్రెస్ ఎలాగూ గెలిచేది లేదు. ఇప్పుడు తీసుకొన్న నిర్ణయాల వల్ల ప్రజలు ఎలాగూ ఓటు వెయ్యరు. కనీసం ఇన్ని సంవత్సరాలూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ధన, కనక, వస్తు, వాహనాలతో దన్నుగా నిల్చున్న కార్పొరేట్ రంగానికి తన కృతజ్ఞతలు చెప్పుకోవడానికి ఇదే ఆఖరు అవకాశం అనుకొని ఈ నిర్ణయాలు తీసుకున్నారని అనుకోవడం సత్య దూరం కాదు.

ఒకవేళ కాంగ్రెస్ జక్కయ్యను, బక్కయ్యను ప్రలోభపెట్టో, లేదా చిల్లరగానో, టోకుగానో గెలిచినా పార్లమెంట్ సభ్యులను లేదా చిన్నా, చితకా పార్టీలను ఇప్పటిలాగే వలలో వేసుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిందే అనుకొందాం. కొయలేషన్ ధర్మం పేరుతో వారి కోర్కెలను నెరవేరుస్తూ పోతే, వాళ్లు (మమతలా) బెదిరిస్తుంటే పరిపాలన కొనసాగించడం కన్నా ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవడం మేలు.

ఇప్పుడు తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రధానంగా ఆర్థికపరమైనవి.

లక్షల ఎకరాల పంట భూములు బీళ్లుగా మారుతున్నాయి, అడవులు మునిగి పోతున్నాయి, లక్షలాది కుటుంబాలు నిర్వాసితమవుతున్నాయి. పేదరైతులు, దళితులు, ఆదివాసులు, పశుపెంపకదార్లు భూములు కోల్పోయి, ఉన్న ఊరి నుండి వెళ్లగొట్టబడి దిక్కుతోచక బతుకుతున్నారు. మరొకవైపు ప్రభుత్వం తెచ్చే చట్టాలు, విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో పడిపోయి రైతుల ఆత్మహత్యలు పెచ్చుపెరుగుతున్నాయి. ఆహార పంటల స్థానంలో పెద్ద ఎత్తున వాణిజ్య పంటలు, ప్రధానంగా పత్తి, అదీ జన్యుమార్పిడి పత్తి విస్తరించి ఆహార సార్వభౌమత్వాన్ని దెబ్బ తీయడానికి దారితీస్తున్నది. కాంట్రాక్టు వ్యవసాయాన్ని సాగించే కంపెనీలు, విత్తన కంపెనీలు రైతులను బానిసలుగా చేసి నియంత్రించ గలుగుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి.

ఇంత పెద్ద ఎత్తున జీవవైవిధ్య సంపదను, జ్ఞానాన్ని, సంస్కృతిని, జీవనోపాధులను నాశనం చేసే, మానవ హక్కుల ఉల్లంఘన చేసే విధానాలను అమలు చేస్తున్న మన దేశం జీవవైవిధ్య సదస్సును నిర్వహించడమే హాస్యాస్పదం.

పెద్ద ఎత్తున కమ్ముకొస్తున్న ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రజలు దేశంలోని అనేక ప్రాంతాలలో పోరాడుతున్నారు. సోంపేట, కూడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, నర్మద నదిపై ఇందిరాసాగర్, అంకలేశ్వర్ ఆనకట్టలకు వ్యతిరేకంగా, సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న జీవన్మరణ పోరాటాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ విధ్వంసాన్ని అంత సులువుగా సాగనివ్వమని ప్రజలు గళమెత్తి చాటి చెబుతున్నారు. ఈ ప్రజాపోరాటాలే భవిష్యత్తు ఆశాకిరణాలు. జీవవైవిధ్యాన్ని కాపాడడమంటే అంతరించిపోతున్న రాబందులు, పులుల జాతులను, వన్య ప్రాణులను కాపాడడం ఎంతమాత్రం కాదు. జీవ సంపద అంతటిపై ప్రజల హక్కులను, వారి జ్ఞానాన్ని, కళలు సంస్కృతిని, మానవ హక్కులను కాపాడడమే, వాటికి హామీ కల్పించడమే.

(రచయిత యక్షి, పశు ఆరోగ్య స్వచ్ఛంద సంస్థలో కార్యకర్త) వీ

కార్పొరేట్లు మెచ్చుకున్నవి. ఇందువల్ల తయారీ రంగం పుంజుకోవచ్చు. బాగా రొక్కం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల అధిపతులతో చిదంబరం కలిసి మీ వద్దనున్న డబ్బు పెట్టుబడులు పెట్టండి, లేకపోతే ఆ డబ్బు మీ చేతుల్లో ఉండదు అని హెచ్చరించినా, మరికొన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో వాటాలు ప్రైవేట్ రంగానికి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. చిదంబరం తిరిగి ఆర్థికమంత్రి అయిన రోజు నుంచి బడ్జెట్ లోటు, ద్రవ్యలోటు, కరెంట్ ఎకౌంటు లోటు అంటూ వాటన్నిటినీ చక్కదిద్దడానికి కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఈ చర్యలన్నిటి వల్ల, ప్రస్తుత నిర్ణయాల ఫలితంగా మన్మోహన్ కలలు కనే జిడిపి పెరగవచ్చు. అలా ఆర్థిక విధాన దృక్పథం నుంచి చూస్తే ప్రస్తుత నిర్ణయాలు కొంత తెరుపు ఇవ్వవచ్చు.

మాన్యుఫాక్చరింగ్ రంగం పుంజుకొని ఉత్పత్తిని వేగిరపరచవచ్చు. అయితే విద్యుచ్ఛక్తి ఉంటేనే అది సాధ్యం. విద్యుదుత్పత్తి పెరగాలంటే బొగ్గు సరఫరా ఏది? వినియోగ విలాస వస్తువుల ఉత్పత్తి పెరిగితే దానికి స్థానికంగా డిమాండ్ పరిమితం. యూరప్ సంక్షోభంతో ఎగుమతులు సన్నగిల్లాయి. దైనందిన అవసరాలకు ఉత్పత్తి పెంచితే స్థానికంగా మార్కెట్ ధరలు పెరగడంతో, ఆ మార్కెట్టూ కుంచించుకు పోతుంది. అయినా పారిశ్రామికవేత్తలు చాలా మంది విదేశాల్లో పెట్టుబడులు పెట్టడం, పరిశ్రమలను కొనేయడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. చిన్న, చిట్టి పరిశ్రమల ఉత్పత్తులు ఎగుమతుల్లో గణనీయమైన వాటా కలిగి ఉన్నాయి. కాని వారు ఉత్పత్తి చేయడానికి కరెంటు లేదు. హైదరాబాద్ నగరంలో పెద్ద, మధ్యమ, చిన్న పరిశ్రమల యజమానులు వీధుల్లో ప్రదర్శన చేయడం, నినాదాలివ్వడం అపూర్వం. కార్మికుల ఆందోళనలను నిరసించే పారిశ్రామికవేత్తలే ఆందోళనకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. పర్మినెంట్‌గా పనిచేసే కార్మికులు ఇలా అల్లల్లాడిపోతుంటే, అసంఘటిత రంగ కార్మికుల సంగతి వేరే చెప్పాల్సిన పనిలేదు.

సామాన్యునికి సంబంధించినంత వరకు బహుళజాతి సంస్థలు వచ్చి పెట్టుబడులు పెడితే, మంచిదే కదా. ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి అని అనుకోవచ్చు. మరి నిరుపేదలైతే వారికి ఆ రోజు, ఆ పూట తిండిగింజలు లభిస్తే చాలు, ప్రపంచం తలకిందులైనా వాళ్లకు పట్టదు. చిల్లర వ్యాపారంలో విదేశీ సంస్థలు వచ్చి దుకాణాలు తెరిస్తే, చిల్లర దుకాణదారులు నష్టపోతారనే విమర్శ, ఒక పార్శ్వం నుంచి చూసినట్లయితే తెలిసే విషయం కాని తెలుసుకోవాల్సిన మరో ముఖ్య విషయమేమంటే వారు వచ్చి దుకాణాలు తెరిచి, దేశంలో ఉన్న ధరల కన్నా తక్కువ ధరలకు అమ్మడం ప్రారంభించి, దేశంలో అమ్మకాలను దెబ్బతీసి, వాళ్ల తలుపులు మూసేసిన తర్వాత ధరలు పెంచేస్తారు. ఉదాహరణకు చైనా నుంచి వస్తున్న వస్తువులు చాలా తక్కువ ధరకు లభిస్తున్నాయి. కాలక్రమంలో మన మార్కెట్ బహుళజాతి పరం అవుతుంది. రాజకీయంగా చూస్తే సామ్రాజ్యవాదులు నేరుగా పరిపాలించే విధానాన్ని మానుకొని, ఆర్థికంగా దేశాలపై దురాక్రమణ కొనసాగిస్తున్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ వారిని రెండు చేతుల్తో ఆహ్వానిస్తున్నారు. కటువుగా చెప్పాలంటే మన దేశాన్ని అమ్మేస్తున్నారు. దేశంలో ఏ మంత్రిత్వ శాఖనైనా చూడండి. ప్రపంచ బ్యాంకు ప్రవేశించని రంగం లేదు. బీహార్‌లో అనుకొంటే పంచాయితీ భవనాల నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ రుణం తీసుకొంటున్నారు. మన రాష్ట్రంలో చెరువులు తవ్వడానికి, కాలువలు బాగుచెయ్యడానికి, బస్సులు కొనడానికి, హాస్పిటల్ భవనాలు నిర్మించడానికి ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తెచ్చుకుంటున్నారు. ఎంత సిగ్గు చేటు! పంచాయితీ భవన నిర్మాణంతో ప్రారంభించడం అంటే గ్రామాల్లో వారి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, గ్రామీణ వ్యవస్థ మీద పట్టు సంపాదించడమే.

నిన్న బొగ్గు మంటలు, ఇవాళ డీజిల్ మంటలు, ధరల మంటలు మూడు సంవత్సరాల నుంచి మండుతూనే ఉన్నాయి. ఈ మంటల్లో దేశం మండిపోతోంది. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి దేశమంటే మంటలోయ్ అంటోంది. రైతు కడుపులో మంటలు రేపుతోంది. ఎరువుల ధరలు రేపిన మంటలు మండుతుండగా, అగ్నికి ఆజ్యం పోసినట్లు డీజిల్ ధరల అగ్గిపుల్ల గీసి మంత్రి మండలి సభ్యులు చలి మంటలు కాచుకుంటున్నారు. ఇదేమంటే ఆయిల్ కంపెనీలకు నష్టాలొస్తున్నాయంటున్నారు. నిజమా? సంవత్సరానికి ఆరు గ్యాస్ సిలిండర్లు మాత్రమే ఇస్తారట. ఇదేమంటే రిలయన్స్ ఒప్పందం ప్రకారం గ్యాస్ సరఫరా చేయడం లేదంటున్నారు. ప్రైవేట్ రంగం సమర్థవంతంగా పనిచేస్తుందంటున్నారు. ఇదేనా సమర్థతా? ఇదీ సమర్థత కాదు, చట్టు బండలూ కాదు. రిలయన్స్‌కు ఆంధ్ర అంటే కడుపు మంట. వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు మా రాష్ట్ర తీరంలో సహజ సంపద ముందు మా అవసరాలు తీర్చాలని కేంద్రంతో లడాయి వేసుకొన్నారు. ఇక్కడ నుంచి కొన్ని రాష్ట్రాలకు (గుజరాత్?) పైపులైన్లు వేసి మరీ చమురును తరలిస్తోంది కాని మనకు ససేమిరా అనడం, కేంద్రం గప్‌చుప్‌గా ఉండిపోవడం క్షంతవ్యం కాదు. ఇకపోతే ఆయిల్ కంపెనీలకు నష్టాలొస్తున్నాయన్న విషయానికి వస్తే, అది వాస్తవం కాదని ఆ కంపెనీల బాలన్స్ షీట్స్ చెబుతున్నాయి. ప్రభుత్వ చమురు సంస్థ ఒఎన్‌జిసి 2011-12లో రు.25,123 కోట్లు. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో 45.48 శాతం మేరకు, అలాగే ఇండియన్ ఆయిల్ కంపెనీ నికర లాభం రు.4265.37 కోట్లు, హిందూస్థాన్ పెట్రోలియం రు. 911 కోట్ల లాభాలు ప్రకటిస్తే, నష్టాలొస్తాయంటారేమిటి? ఎక్కడైనా మంటలు వేస్తే ఫైర్ స్టేషన్ వాళ్లు వచ్చి నీళ్లతో ఆర్పేస్తారు. కాని మన ప్రభుత్వం ధరలు మండుతున్నాయని జనం గగ్గోలు పెడుతుంటే మంటలార్పే బదులు పెట్రోలు, డీజిల్ ధరలను పెంచి అగ్నికి ఆజ్యం పోస్తోంది. ఈ మంటలు ఆర్పాలంటే ఈ ప్రభుత్వాన్నే బంగాళాఖాతంలో ముంచాల్సిందే.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి.

- సం.

వాల్‌మార్ట్ - చిరు వ్యాపారస్తుల ఉనికికే ప్రమాదం

***ఎఫ్.డి.ఐ. ఒప్పందాలతో కోట్లాది మంది సామాన్యుల, చిరు వ్యాపారస్తుల బతుకు రోడ్డున పడడమే కాక, దేశ సార్వభౌమత్వానికే ప్రమాదమని అంటున్నారు* డా. శ్రీనివాసరావు చొప్పర**

ఆకాశంలో మేఘాన్ని చూపి కుండలో నీరు పారబోయమన్నాడట వెనుకటికి ఒకడు. నేడు మన కేంద్ర ప్రభుత్వ విధానాన్ని గమనిస్తే ఆ సామెత గుర్తుకు రాకుండా ఉండదు. కొన్ని దశాబ్దాలనుండి వ్యవస్థీకృతమైన దేశ ఆర్థిక వ్యవస్థలోనూ, ఉపాధి కల్పనలోనూ ప్రముఖమైనది మన చిల్లర వర్తకం. ఎలాంటి మౌలిక సదుపాయాలు అవసరంలేని, పెట్టుబడి పెద్దగా అవసరం లేని, సాంకేతిక పరిజ్ఞానం అస్సలే అవసరంలేని రంగం చిల్లర వర్తకం. పెద్దగా చదువు అవసరంలేని, కొన్ని సందర్భాలలో పామరులు సైతం గొప్పగా రాణిస్తూ ఉపాధి పొందడమే కాక ఇతరులకు సైతం జీవనోపాధి కల్పిస్తున్నది చిల్లర వర్తకం. దేశంలో ఈ రిటైల్ రంగం సంవత్సరానికి 20-25 శాతం చొప్పున పెరుగుతున్నట్లు ప్రభుత్వ అధ్యయనాలే తెలియజేస్తున్నాయి. చిల్లర వర్తకంలో 65 నుండి 70 శాతం వరకు ఆహార పదార్థాల అమ్మకమే ఉంది. పాడి ఆవు లాంటి ఈ రంగాన్ని నేడు వధశాలలో నిలబెట్టడానికి సర్వం సిద్ధం చేశారు. రిటైల్ వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పచ్చజెండా ఊపుతూ కేంద్ర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకొన్నది. తద్వారా అమెరికా ఒత్తిడికి, వాల్‌మార్ట్ ప్రలోభాలకు లొంగి నిండుకుండలాంటి రిటైల్ రంగాన్ని పారబోయించ డానికి మన ప్రభుత్వం సిద్ధపడ్డ వైనాన్ని గమనించాలి.

చిల్లర వ్యాపారమంటే ఏదో చిల్లర వ్యవహారమనుకోకండి. పేరుకు రిటైల్ అయినప్పటికీ ఇందులో భారీగానే వ్యాపారం జరుగుతోంది. భారీగానే ఆదాయ అవకాశాలు ఉన్నాయి. భారతదేశ జాతీయ ఆదాయంలో (జి.డి.పి) 11 శాతం మేరకు రిటైల్ వ్యాపారం నుంచే వస్తుంది. ప్రపంచ జనాభాలోగాని, చిల్లర మార్కెట్ విస్తరణలోగాని అతిపెద్ద 2వ దేశంగా భారతదేశం ఉన్నది. వివిధ సర్వేలు, సంస్థల అంచనాల ప్రకారం భారతదేశంలో 600 బిలియన్ డాలర్లు అంటే 30 లక్షల కోట్ల వాణిజ్య కార్యకలాపాలకు చిల్లర వర్తకంలో అవకాశాలు ఉన్నాయి. ఐదు కోట్ల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. అఖిల భారత వర్తకుల సమాఖ్య (సి.ఏ.ఐ.టి) లో ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5 కోట్లమంది వర్తకులు సమాఖ్యలో సభ్యులుగా ఉన్నారు. అంటే ఐదు కోట్ల కుటుంబాలు లేదా దాదాపు 20 కోట్ల మంది ప్రజలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నట్లు. దేశంలోని మొత్తం రిటైల్ వ్యాపారంలో 97 శాతం అసంఘటిత రంగం. చిన్న చిన్న దుకాణాదారులు, పేవ్‌మెంట్‌పై వ్యాపారం చేసేవారు ఈ కోవకు చెందుతారు. ఆర్థికంగా చితికిపోయిన వారు, శారీరక శ్రమ చేయలేనివారు, కుటుంబ పోషకుడ్ని కోల్పోయిన స్త్రీలకు వెంటనే వచ్చే ఆలోచన చిల్లర దుకాణం పెట్టుకొని జీవించడం. మరోవైపు ఒక సామాజిక వర్గమంతా ఒక వృత్తిగా చేపట్టి గౌరవంగా జీవిస్తున్న పరిస్థితి ప్రత్యక్షంగా మన రాష్ట్రంలో ఉన్నది. అంతేకాక ఈ రంగంపై ఆధారపడ్డ అత్యధికులు సామాజికంగా వెనుకబడిన ఎస్.సి. ఎస్.టి. బి.సి లేనని ఒక సర్వే తెలియచేస్తుంది. అందుకే ఇది చిల్లర వ్యవహారం కాదు, చాలా సిస్తలైన వ్యవహారం.

అతిపెద్దదైన ఈ మార్కెట్‌పై బహుళ జాతి కంపెనీల (ఎంఎన్‌సిల) డేగకన్ను పడింది. పెట్టుబడిదారుల జీవనం వ్యాపార సంస్థలు. ఆ వ్యాపార సంస్థలే ఎంఎన్‌సిల రూపం ధరించాయి. ఆ సంస్థలు విశ్వ రూపం ప్రదర్శిస్తున్నాయి. భారత్ మార్కెట్‌ను ఇప్పటికే ఆక్రమించాయి. వెనుకబడిన దేశాలను ఇవి శాసిస్తున్నాయి. 15 ఎం.ఎన్.సి ల ఆదాయం 120 వర్ధమాన దేశాల జాతీయ ఆదాయం కంటే ఎక్కువగా ఉంది. ఇలాంటి వ్యాపార దిగ్గజాలకు నేడు గేట్లు బార్లా తెరచిన కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తుంది.

దేశంలో ఆహార ద్రవ్యోల్బణం అరికట్టలన్నా, మౌలిక సదుపాయాలు మెరుగు పడాలన్నా, ఉపాధి అవకాశాలు పెరగాలన్నా సంస్కరణలను వేగిరపరచాలనీ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ) అన్ని రంగాలతోపాటు చిల్లర వర్తకంలో బహుళ చిహ్న (మల్టీ బ్రాండ్) రంగంలో అనుమతించాలనీ అంటోంది. 2006లో సింగిల్ బ్రాండ్ రిటైలింగ్ మార్కెట్‌లో అనుమతించిన ప్రభుత్వం నేడు మల్టీ బ్రాండ్‌లో 51 శాతం ఎఫ్‌డిఐలను అనుమతించింది. విదేశీ సంస్థలు కనీసం 10 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టాలి. అందులో 50 శాతం గ్రామీణ ప్రాంతాలలో పెట్టాలి. అలాగే తాము విక్రయించే ఉత్పత్తులలో కనీసం 30 శాతం స్థానిక, చిన్న, మధ్య తరహా కంపెనీల నుంచి సేకరించాలి. కనీసం 50 శాతం పెట్టుబడిని ఎఫ్‌డిఐల అనుమతి పొందిన నాటి నుంచి మూడేళ్లలోగా మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేయాలి. అంతేకాకుండా ఎఫ్‌డిఐల అనుమతి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టమని తెలిపింది. ఈ నిర్ణయం వల్ల జరిగేది దేశీయ చిల్లర వర్తకం మొత్తం వాల్‌మార్ట్, టెస్కో, శానిస్‌బర్ లాంటి బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడమే. 30 శాతం స్థానికంగా సేకరిస్తే మిగిలిన 70 శాతం ప్రపంచ దేశాలలో ఎక్కడ చౌకగా దొరుకుతాయో అక్కడ సేకరించి దేశీయ ఉత్పత్తులకు పోటీపెడతాయి. ఫలితంగా ఆ సంస్థలన్నీ మూత పడవలసిందే. ఆ 30 శాతం కూడా ఏ ఉత్పత్తులు సేకరించాలనేది వారి ఇష్టానికి వదలివేయడం ఇక్కడ గమనించదగ్గ విషయం. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా శీతలీకరణ గిడ్డంగుల నిర్మాణానికి 100 శాతం ఎఫ్‌డిఐలకి అనుమతించి అరపుష్కర కాలం అయినా ఏ

మేరకు గిడ్డంగుల నిర్మాణం జరిగిందో, మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయో ఆ ప్రభుత్వమే చెప్పాలి. ఏ రాష్ట్రమైనా అడ్డుకున్నా ఈ విదేశీ కంపెనీలు విలీనాలు, టేక్ ఓవర్ల ద్వారా ఆ రాష్ట్రంలోని చిల్లర వ్యాపారంపై పట్టు సాధిస్తాయి. ఫ్రాంచైజ్ పద్ధతి ద్వారా చిన్న పట్టణాలకు, పెద్ద గ్రామాలకు కూడా అవి విస్తరిస్తాయి. అంతర్జాతీయ వ్యాపారులు నిజమైన మార్కెట్ పోటీని తట్టుకోలేరు. వారు తమ ప్రత్యర్థులను నాశనం చేసి మార్కెట్‌పై ఆధిపత్యం సాధిస్తారు. గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తారు.

రిటైల్ వర్తకంలోకి ఎఫ్‌డిఐలను అనుమతించడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, మధ్యవర్తుల బెడద ఉండదని ప్రభుత్వం అంటుంది. ఇది వాస్తవాలపై ఆధారపడింది ఎంత మాత్రం కాదు. రైతులకు మేలు జరిగితే మరి ప్రపంచ చిల్లర వర్తకాన్ని శాసిస్తున్న వాల్‌మార్ట్ (అమెరికా ఎం.ఎన్.సి) వల్ల ఆమెరికా రైతాంగానికి ఒరిగిందేమిటి. నిజంగా వాల్‌మార్ట్ రైతులకు మేలు చేస్తే 1995–2009 మధ్య అమెరికా సర్కార్ అక్కడ రైతులకు 12.5 లక్షల కోట్లు డాలర్లు సబ్సిడీ ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? ప్రస్తుత పంచవర్ష ప్రణాళికలో అమెరికా రైతు బిల్లు (యు.ఎస్.ఎ. ఫార్మ్ బిల్లు) 2008 లో 307 బిలియన్ డాలర్లతో రైతుల కొరకు ఒక నిధిని ఎందుకు ఆమోదించాల్సి వచ్చింది? అయినా అక్కడ రైతుకు గిట్టుబాటు ధర అందడంలేదు. యూరప్‌లో రైతు సబ్సిడీలపై జరిగిన ఒక అధ్యయనం ప్రకారం ప్రతి నిమిషానికి ఒక రైతు వ్యవసాయం నుండి వైదొలుగుతున్నాడు. మరోవైపు రైతులను మధ్యవర్తుల నుండి కాపాడి మంచి ధర చెల్లించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంటుంది. కానీ మధ్యవర్తులు నేడున్న రూపంలో ఉండక పోవచ్చు. క్వాలిటీ కంట్రోలర్, స్టాండరైజర్, ధృవీకరణ ఏజన్సీ, ప్రాసెసర్, ప్యాకింగ్ కన్సల్‌టేషన్ ఏజన్సీ మొదలైన పేర్లతో మధ్యవర్తులు తిరిగి ప్రవేశిస్తారు తప్ప మరొకటి కాదు. అమెరికాలో జరిగిందిదే. 20వ శతాబ్దంలో అమెరికా రైతు మొత్తం నిజ ఆదాయంలో 70 శాతం పొందగా, అది 2005 నాటికి 4 శాతంకు పడిపోయింది. అందుకు ప్రధాన కారణం మధ్యవర్తులు ఉండడమే.

మనదేశంలో లక్ష రూపాయల పెట్టుబడితో 90 మందికి ఉపాధి లభిస్తే వాల్‌మార్ట్ లాంటి బహుళ జాతి కంపెనీల పెట్టుబడులతో కూడిన మాల్స్‌లో కేవలం ఒక్కరికే ఉపాధి దొరుకుతుందని అంచనా. వాల్‌మార్ట్‌తో పోలిస్తే మన దేశంలో రిటైల్ రంగంలో సగటు టర్నోవర్‌కు గాను లభించే ఉపాధి అవకాశాలు 95 రెట్లు ఎక్కువ. ఎంఎన్‌సిల వల్ల అమ్మకాలు గణనీయంగా పెరగవచ్చు. కానీ ఉపాధి అవకాశాలు పెరగకపోగా గణనీయంగా తగ్గుతాయి. వాల్‌మార్ట్ లాంటివి రిటైల్ వ్యాపారంలో 20 శాతం మార్కెట్‌ను కైవసం చేసుకున్నా ఆ రంగంపై ఆధారపడిన 80 లక్షల మంది ఉపాధి కోల్పోతారు. ప్రస్తుతం దేశంలో కోటి 20 లక్షల దుకాణాలు ఉన్నాయి. వీటిలో 96 శాతం 500 చదరపు అడుగులలోపు విస్తీర్ణంలో ఉన్నవే. కానీ వాల్‌మార్ట్ సగటు సైజు 85 వేల చదరపు అడుగులు. వాల్‌మార్ట్ సంవత్సర ఆదాయం 37,900 కోట్ల డాలర్లు, క్యారీఫోర్ (ఫ్రాన్స్ దేశ రిటైల్ కంపెనీ) సంవత్సర ఆదాయం 12,300 కోట్ల డాలర్లు. మరి ఇలాంటి పెద్దవాటితో మన చిల్లర వ్యాపారులే కాదు టోకు వ్యాపారులు కూడా పోటీ పడలేరు. 2004లో చైనా తన రిటైల్ మార్కెట్ రంగంలో ఎఫ్‌డిఐలకు అనుమతిచ్చింది. ఐతే ఈ రంగంలో పెరుగుతున్న పోటీ చైనాలో చిన్న, చిన్న వ్యాపార సంస్థల ఉనికికే ప్రమాదంగా మారుతుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) హెచ్చరించింది.

అమెరికా వ్యవసాయ శాఖకు చెందిన ఎకనమిక్ రిసెర్చ్ సర్వీస్ అధ్యయనం ప్రకారం 1997లో అమెరికాలో జరిగిన మొత్తం కిరాణా అమ్మకాలలో 46.5 శాతం కేవలం 20 గుత్త కంపెనీలు చేసినవే. కానీ 2010 నాటికి మొత్తం కిరాణా వ్యాపారంలో ఆ 20 గుత్త కెంపెనీల వాటా 78.6 శాతంకు పెరిగింది. మొత్తం అమెరికా కిరాణా వ్యాపారంలో వాల్‌మార్ట్ వాటా 22 శాతం.

'వాల్‌మార్ట్ – దరిద్రం ' అని అమెరికన్ ప్రజలు లాస్ ఏంజిలిస్ నగరంలో నిరసన ప్రదర్శనలో దర్శనమిచ్చిన బ్యానర్‌పై లిఖించబడింది. వారు తక్కువ వేతనాలు చెల్లిస్తూ, కార్మికులకు యూనియన్ హక్కులు నిరాకరించే కంపెనీ మాకొద్దని తిరస్కరించారు. 'హృదయం గాని, నైతిక విలువలు గాని ఏ మాత్రం లేని వాల్‌మార్ట్‌ని మనం సమర్థించలేం. చైనా టౌన్‌కు మీరు అవసరం లేదు. లాస్ ఏంజిలిస్ లో మీరు ఉండాలని మేం కోరుకోవడం లేదు ' అని వాల్‌మార్ట్ కొత్త దుకాణం తెరవదలచిన చైనా టౌన్‌లో ఆ టౌన్ అభివృద్ధి కమిటీ సభ్యుడొకరు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ అన్నాడు. ఇంత 'ఘన' చరిత్ర వాల్‌మార్ట్ సొంతం.

బ్రిటన్‌లో గత 2 సంవత్సరాలలో టెసో రిటైల్ కంపెనీ 11 వేల ఉద్యోగాలను, శానిస్‌బరీ 13 వేల ఉద్యోగాలను అదనంగా కల్పిస్తామని ప్రభుత్వం నుంచి రాయితీలు పొందాయి. ఆచరణలో టెసో 726 అదనపు ఉద్యోగాలు మాత్రమే కల్పించగా, శానిస్‌బరీ 874 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. స్వదేశంలోనే ఆ పని చేసిన కంపెనీలు మన దేశంలో అదనంగా ఉద్యోగాలను ఎలా ఇస్తాయి ? వాల్‌మార్ట్ ఇప్పటికే మన దేశ రిటైల్ రంగంలో సింగిల్ బ్రాండ్ మార్కెట్‌లో 2007 లో సునీల్‌మిట్టల్‌కు చెందిన 'భారతి' సంతతితో కలసి క్యాష్ & క్యారీ సంస్థలను దేశ వ్యాప్తంగా 175 స్థాపించింది. 'బెస్ట్ ప్రైజ్' పేరుతో విజయవాడలో ఒక దుకాణాన్ని తెరచింది. 'స్పెన్సర్స్' అనే ఒక దేశీయ కంపెనీ ప్రస్తుతం విజయవాడలో అతి పెద్ద సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తోంది. అది ప్రతి నెలా కోటి డెబ్బై లక్షల రూపాయల వ్యాపారం చేసేది. వాల్‌మార్ట్ రాకతో ఈ సంస్థ వ్యాపారం ఏకంగా కోటీ పది లక్షల రూపాయలకు పడిపోయిందని స్పెన్సర్స్ తెలిపింది. దీనితోపాటు రిలయన్స్ మార్ట్, బిగ్ బజారులు కూడా ఒక్క విజయవాడ నగరంలోనే 25 లక్షల రూపాయల నుండి 40 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నాయి. హోల్‌సేల్ పేరుతో వాల్‌మార్ట్ వ్యాపారం ప్రారంభించినా రిటైల్ వ్యాపారాన్ని కూడా టార్గెట్ చేసుకొని 1000 రూపాయల వరకు సరుకులు కొనుగోలు చేయవచ్చునంటూ ఆఫర్ ప్రకటించింది. దీనితో నెలవారీ సరుకులు తీసుకొనే వారు కూడా రిటైల్ మార్కెట్‌లు, హోల్‌సేల్ మార్కెట్‌లను కాదని వాల్‌మార్ట్ దారి పట్టారు. వాల్‌మార్ట్ నిర్ణయంతో విజయవాడలో ఉన్న 7 వేలకు పైగా చిల్లర దుకాణాలు, 2500కు పైగా ఉన్న స్ట్రీట్ వెండర్స్, వీధి వ్యాపారాలు చేసే 13 వేలకు పైగా చిల్లర వర్తకులు వ్యాపారాలు లేక నడిరోడ్డుపై పడే ప్రమాదం ఏర్పడింది.

చిల్లర వర్తకంలో ఎఫ్‌డిఐల అనుమతి అన్ని నిర్ణయాలలాంటిది

కాదు. ఇదేదో కేవలం చిల్లర వ్యాపారస్తులనో, దీనిలో పనిచేసే ఉద్యోగులనో ప్రభావితం చేసేది కాదు. యావత్ ఆర్థిక రంగంపై దీని ప్రభావం ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలు ప్రధానంగా అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూ దాని నుండి ఎలా బయట పడాలి అని ఆలోచిస్తున్నాయి. తమ దేశాలలో తయారయిన ఉత్పత్తులకు గిరాకి తగ్గింది. ఈ సమస్యకు ఎంఎన్‌సిలు మినహాయింపుకాదు. తమ ఉత్పత్తులు అమ్ముకోడానికి మార్కెట్ కావాలి. ఒకవైపు ఎంఎన్‌సిలు, మరొకవైపు నవంబరులో జరగబోయే అమెరికా సాధారణ ఎన్నికలు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాపై ఒత్తిడిని పెంచాయి. గత ఎన్నికల సమయంలో ఒబామా అమెరికా వ్యాపారవేత్తలతో అంటే ఎంఎన్‌సిలతో కుదిరిన అవగాహన ప్రకారం తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను చూపించాల్సిన బాధ్యత ఒబామాది. ప్రధానంగా ప్రపంచం లోనే అతి పెద్దదైన భారత్ రిటైల్ మార్కెట్‌లో ఎంఎన్‌సిల అనుమతి పొందడంలో ఒబామా విఫలమైనట్లుగా ఒక ముద్రపడింది. ఇది 2012 నవంబరు ఎన్నికలలో ఒబామాపై తీవ్ర ప్రభావం చూపనుంది. మన పాలకులపై ఆ మేరకు ఒత్తిడి పెంచడంలో భాగమే ఒబామా ముంబై పర్యటన. ఈ పూర్వ రంగంలోనే మన ప్రధాని తమ మిత్ర పక్షాలు ఒప్పుకోకున్నా ఈ తీవ్ర నిర్ణయం తీసుకొని అమెరికా ఎన్నికలలో ఒబామా రేటింగ్‌ను పెంచేందుకే మొగ్గుచూపి తన కార్పొరేట్ భక్తిని మరింతగా చాటుకున్నాడు. డీజిల్ ధర పెంపు, సబ్సిడీ సిలిండర్లపై సీలింగ్ విధింపు నిర్ణయాలను ప్రకటించి 24 గంటలైనా గడవకముందే చిల్లర వర్తకం మల్టీ బ్రాండ్‌లో 51 శాతం ఎఫ్‌డిఐలను అనుమతిస్తూ నిర్ణయం తీసుకోవడంలో ఆంతర్యం అమెరికా ఎన్నికలలో ఒబామా రేటింగ్‌ను పెంచడం తప్ప భారత ప్రజల ప్రయోజనాలు ఏమాత్రం లేవు.

వాస్తవానికి మన దేశంలో ఎప్పటినుంచో రిటైల్ వర్తకంలో ఎఫ్‌డిఐలు అనుమతించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2002లో కేంద్రంలో అధికారంలో ఉన్న అప్పటి ఎన్.డి.ఎ. ప్రభుత్వం రిటైల్ వర్తకంలో విదేశీ పెట్టుబడులకు రంగం సిద్ధం చేసింది. అప్పటి వాణిజ్య శాఖామంత్రి మురసోలి మారన్ రూపొందించిన విధాన పత్రాన్ని ప్రభుత్వం చురుకుగా పరిశీలించింది. అప్పటి ప్రతి పక్ష కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ.-1 ప్రభుత్వం 2006లో రిటైల్ రంగంలో సింగిల్ బ్రాండ్‌లలో ఎఫ్‌డిఐ లను అనుమతించింది. నేడు యుపిఎ-2 అదే రిటైల్ రంగంలో మల్టీ బ్రాండ్‌లలో ఎఫ్‌డిఐ లను అనుమతించింది. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వంతు ప్రస్తుత ప్రతిపక్షమైన బిజెపిది అయింది.

ఒకవైపు బహుళజాతి గుత్త సంస్థల ప్రయోజనాలకు తమ దేశాన్ని ప్రభుత్వాలు కుదవపెడుతున్నాయని అమెరికా ప్రజలు ఆగ్రహంతో ఉద్యమిస్తుంటే (వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి), అదే బహుళ జాతి సంస్థలకు మన ప్రభుత్వం వంగి వంగి సలాంలు చేస్తూ ఆహ్వానించడం సిగ్గుచేటు. ఈ అనుమతి వలన మన వనరులను కొల్లగొట్టడానికి విదేశీ ద్రవ్య పెట్టుబడులు ఎలాంటి అడ్డు, అదుపు లేని విశాలమైన రోడ్లను ఏర్పాటు చేసినట్లువుతుంది. ఫలితంగా దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బ్రిటిష్ వలస కాలం నాటి పరిస్థితుల్ని తిరిగి సృష్టిస్తుంది.

(రచయిత లెక్చరర్, జవహర్ భారతి కళాశాల, కావలి) వీ

వీక్షణం రచయితలకు సూచనలు

పది సంవత్సరాలలో, నూట ముప్పై నాలుగు సంచికలలో వీక్షణం రెండు వేలకు పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (ఐదు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పెజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణంకు సరిగ్గా సరిపోతుంది.
- చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్ లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్ మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

ఎఫ్‌డిఐ ఎవరికి లాభదాయకం?

***విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో బహుళజాతి కంపెనీలకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందనీ, మరోవైపు విశాల ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

భారతదేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి అవకాశాలున్న రంగం 'రిటైల్ రంగం'. దేశవ్యాప్తంగా దాదాపు ఐదు కోట్ల మంది ప్రజలు వివిధ రకాలైన చిల్లర దుకాణాలూ, తోపుడు బండ్లూ, బంకులు, కిళ్లీ కొట్లూ, బీడీ–సిగరెట్ బంకులూ పెట్టుకొని జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలోనైతే, మొత్తం కుటుంబ సభ్యులందరూ కలిసి దాదాపు ఐదు లేదా ఆరు మంది షిఫ్ట్ పద్ధతిలో, ఒకరి తర్వాత మరొకరు విధులు మార్చుకుంటూ ఒకే వ్యాపారం పై జీవిస్తూ ఉంటారు. ఇళ్లలోనో లేదా తమ ఇంటికి సమీపంలోనో ఏదో ఒక విధంగా చిన్న చిన్న వస్తువులూ, పదార్థాలూ, ఇంటి సరుకులూ పెట్టుకొని, వాటిని అమ్ముకుంటూ, వచ్చే కొద్దిపాటి లాభంతో జీవిస్తూ ఉంటారు. ఒక ఐదువేల జనాభా కలిగిన గ్రామాలల్లోనయితే దాదాపు 10 – 20 దాకా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే అంగళ్లు పెట్టుకొని జీవించే కుటుంబాలు ఉంటాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రావడం వల్ల అన్ని రకాల వస్తువులూ, పదార్థాలూ, తిను బండారాలూ, సరుకులూ, పప్పు దినుసులూ, కూరగాయలూ అందుబాటులో ఉంటాయి కాబట్టి, చిన్న చిన్న అంగళ్లకు ఎందుకు పోవాలనే ధోరణి ప్రజలలో ప్రబలడానికి ఆస్కారం ఉంది. ఈ విధంగా ప్రజలను మభ్యపెడుతూ, ప్రజల జీవన మనుగడలో ఏదో ఒక విధంగా స్థానం సంపాదించుకొని, విదేశీ పెట్టుబడిదారులు, వారికి మద్దతునిస్తున్న, దేశీయ బడా వ్యాపార వర్గాలు చిన్న వ్యాపారస్తుల నోళ్లు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. దీనిని దేశంలోని అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు. ప్రతిఘటిస్తున్నారు కూడా.

విదేశీ పెట్టుబడులనేవి నేడు దేశవ్యాప్తంగా ప్రతి చిన్న పట్టణంలోనూ, అనగా ఇరవైవేల జనాభా ఉన్న పట్టణాలలో సైతం వ్యాపించబోతున్నాయి. ఏలాగంటే రిటైల్ రంగంలో షాపింగ్ మాల్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి 'అనుమతులు' మంజూరు చేసింది.

దేశంలోని చిల్లర కిరాణా వ్యాపార రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను అనుమతించడంతో లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ రంగం పూర్తిగా చిన్నాభిన్నమవుతున్నది. కనుక ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనను ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రెండవ విడత ఆర్థిక సంస్కరణలను భారత్‌లో అమలు చేయించాలని, అమెరికా అధ్యక్షుడు బరాక్ హుసేన్ ఒబామా కంకణం కట్టుకున్నారు. భారత్‌లో పెట్టుబడులకు అనువైన వాతావరణం క్షీణిస్తున్నదని ఒబామా ఒక ఇంటర్వ్యూలో ఉద్ఘాటించారు. విదేశీ పెట్టుబడులను అనుమతిస్తేనే భారత ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకుంటుందని ఒబామా ఆలోచిస్తున్నారు. గతంలో హిల్లరీ క్లింటన్ కూడా ప్రపంచ బ్యాంక్ ద్వారా ఇదే విషయాన్ని వెల్లడి చేయించారు.

భారత రిటైల్ రంగంలో 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ గత ఏడాది కేంద్రం నిర్ణయం తీసుకున్న మాట అందరికీ తెలిసిందే. దానిపై ప్రజా వ్యతిరేకత రావడంతో కొంతకాలం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకొని, భారత ప్రభుత్వం మళ్లీ చిరు వ్యాపారుల మీద ఎఫ్‌డిఐ రుదింది. మల్టీ బ్రాండ్ చిల్లర వర్తకం లోనికి ఎఫ్‌డిఐల అనుమతి వలన దేశవ్యాప్తంగా అనేకమంది ప్రజలు రోడ్డున పడే ప్రమాదముంది. వారందరూ విప్లవించే అవకాశమూ లేకపోలేదు. ప్రభుత్వంలోని కొన్ని వర్గాలు కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తున్నాయి.

అమెరికా 2010లో భారతదేశంలో 2700 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. దీని వెనుక వాల్‌మార్ట్, టెస్కో, కెర్రిఫోర్ వంటి బహుళజాతి సంస్థలున్నాయి. వీటి ప్రోత్సాహంతోనే భారతదేశంలో ఎక్కువగా పెట్టుబడులు పెట్టాలని ఒబామా చెబుతున్నాడు. నిజానికి విదేశీ పెట్టుబడులు, రిటైల్ రంగంలో రు. 520 కోట్లు మించరాదనే నిబంధన కూడా ఉంది. ఈ నిబంధనను ప్రభుత్వమే సరిగా పాటించడం లేదు. దానిపై నిఘా, విచారణలు కూడా జరపడం లేదు.

ప్రపంచంలో కెల్లా అత్యధిక 'షాపింగ్ వ్యవస్థీకృత సాంద్రత' భారతదేశంలో ఉండడానికి కారణం పేదరికం, మధ్యతరగతి ప్రజలు, ఏ రోజుకారోజు కూలీ కష్టంతో జీవించే ప్రజలూ, కులవ్యవస్థను ఎదుర్కొంటున్న దళితులూ, ఆదివాసులూ కారణం. వీరందరి సమస్యలు విభిన్న కోణాలూ, విభిన్న రూపాలూ, వివిధ రకాల స్వరూప స్వభావాలతో, దొంతరలతో కూడుకున్న వ్యవస్థ భారతదేశంలో ఉన్నది.

నాణ్యతా, ప్రమాణాల పేరుతో మల్టీనేషనల్ కంపెనీలు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించవు. ఆహార భద్రతపై దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ఏకీకృత పంట విధానాన్ని, ఈ విదేశీ పెట్టుబడిదారీ శక్తులు ప్రోత్సహించి, సరఫరాలో పోటీని తప్పించి, నిత్యావసర సరఫరాలపై గుత్తాధిపత్యాన్ని సాధించాలని చూస్తున్నాయి. ఇక విదేశీ తయారీ వస్తువులు, మన దేశంలోని మార్కెట్లలోనికి విపరీతంగా, వరదలా వచ్చి పడతాయి. వీటిపై ప్రభుత్వ పర్యవేక్షణ, ఆంక్షలు ఏ మాత్రమూ ఉండవు. దీనివలన మన దేశంలో తయారయ్యే ఉత్పత్తుల మార్కెట్లు దెబ్బతిని, పెద్ద ఎత్తున ప్రజలు ఉపాధిని కోల్పోతారు. ఇది ఎన్నో సామాజిక సమస్యలకు దారితీస్తుంది. ఏదేని వాల్‌మార్ట్‌లో కొంతమంది ఉపాధి పొందితే, వేలాది మంది చిరుద్యోగులు, చిన్న

వ్యాపారుస్తులు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడే ప్రమాదముంది. అనగా విదేశీ పెట్టుబడుల వలన, దేశంలో ఎక్కువ ఉద్యోగాలు వస్తాయనే విషయం వాస్తవం కాదని అర్థమవుతోంది.

ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా, ఇటీవల రాష్ట్రపతిగా ఎన్నికైన ప్రణబ్ ముఖర్జీ, మాజీ హోంమంత్రి (ప్రస్తుత ఆర్థికమంత్రి) పి. చిదంబరం, వాణిజ్యమంత్రి ఆనంద్ శర్మ, ఉపరితల రవాణా మంత్రి కమల్‌నాథ్ వీరందరూ విదేశీ వాణిజ్య సాంప్రదాయాలనూ, విదేశీ మార్కెట్‌నూ భారత్‌లో ఏ విధంగా విస్తరింపజేయాలనే ఆలోచన ఉన్నవారు తప్ప, దేశాన్ని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించాలనే లక్ష్యం, ధ్యాస ఉన్నవారు కాదు. కేంద్ర మంత్రివర్గం అంతా విదేశీ వ్యాపార శక్తులతో ప్రత్యక్ష సంబంధాలు తమ బంధువర్గం ద్వారా కలిగి ఉన్నవారు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరు 'సామ్రాజ్యవాదుల ఏజెంట్లు'. ఎందుకనగా సామ్రాజ్యవాద కాంక్ష ఉన్న దేశాలైన అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, చైనా తదితర దేశాలతో వ్యాపార లావాదేవీలున్నవారు.

ఇప్పటికే దేశంలో విస్తరిస్తున్న సామ్రాజ్యవాద విష సంస్కృతి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్పరిణామాలతో రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ బలహీనం చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులలో భాగమైన 'జీవించే హక్కు' కాలరాయబడుతున్నా, ఏమాత్రమూ జంకూ, భయం లేకుండా, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు కాబట్టే వీరు సామ్రాజ్యవాదుల తాబేదార్లు.

ఒకవైపు గ్రామీణ ప్రాంతాల్లో బలంగా వేళ్లూనుకొని ఉన్న కుల వ్యవస్థ, భూస్వామ్య దురహంకార పోకడలూ, పేదరికమూ, సామాన్య ప్రజలను చిన్నాభిన్నం చేస్తుంటే, మరోవైపున సామ్రాజ్యవాద విషధోరణి అయిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో కూడిన వ్యాపారం వర్ధిల్లడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారంటే, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, విదేశీ, సామ్రాజ్యవాదుల పాదాల దగ్గర తాకట్టు పెట్టడమే. దీనిని ఈ దేశంలోని సామాన్య ప్రజలు, మధ్యతరగతి వర్గం తీవ్రంగా ప్రతిఘటించాలి. ఎందుకనగా ప్రజల జీవన్మరణ సమస్య ఇది. 65 సంవత్సరాల భారతదేశ స్వాతంత్ర్యం సాధించిన ప్రగతికి ఈ దుష్ట వ్యవస్థనే నిలువెత్తు సాక్ష్యం.

2009–10 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం ఉపాధి పెరుగుదల గణనీయంగా పెరిగిందని చెబుతుండగా, నేడది విదేశీ సూపర్ మార్కెట్ల రంగ ప్రవేశంతో గణనీయంగా దిగజారిపోతున్నట్లు దేశంలోని వివిధ సర్వేలు తెలియజేస్తున్నాయి. గడిచిన దశాబ్ద కాలంలో 8 నుంచి 9.5 శాతం వృద్ధిరేటును ఇండియా సాధిస్తూ వస్తున్నది. అమెరికా తదితర దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న పరిస్థితులు లేకుంటే భారత్ కూడా 10 శాతం వృద్ధిరేటు సునాయాసంగా సాధిస్తుందనేది వాస్తవం. అయినా స్వంత మార్కెట్ల రక్షణకు చర్యలు తీసుకుంటున్న బ్రిటన్, అమెరికా వంటి దేశాలు, భారత్ రిటైల్ రంగం గేట్లు తెరవాలని బలవంతం పెట్టడం అన్యాయం, విచారకరం. అంతే కాకుండా భారత ఐ.టి. రంగాన్ని దెబ్బతీసే విధంగా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్‌పై అనేక ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు ఒబామా మాత్రం భారత్ మార్కెట్ల గేట్లను తెరవాలని కోరుకోవడం దివాళాకోరుతనం తప్ప మరొకటి కాదు. అవుట్ సోర్సింగ్ కంపెనీలకు పన్ను రాయితీలను రద్దుచేసి, దిగుమతులపైనా, విదేశీ ఉద్యోగుల వీసాలపైన ఆంక్షలు విధించిన ఒబామా వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలను బాగా దెబ్బతీశాడు. ఒబామా నిర్దేశిస్తున్న పథకం, భారత్‌కు ముళ్లబాటే అవుతుంది. ఆర్థిక సంక్షోభాలతో తులతూగుతున్న వాల్‌మార్ట్ లాంటి రిటైల్ దిగ్గజాలను భారత్ మార్కెట్లలోకి ఉసిగొల్పడమే ఒబామా లక్ష్యం.

కాబట్టి ఇప్పటికైనా భారత పాలకులు ఎఫ్‌డిఐ లను తీవ్రంగా వ్యతిరేకించాలి. భారతీయులను నిరుద్యోగం పాలుజేసి, దారిద్ర్యాన్ని పెంచి, సామాన్య ప్రజల జీవనోపాధిని బలహీనం చేసే సంస్కరణలను విడిచి పెట్టాలి. 'స్వయం పాలన', రాజ్యాంగ బద్ధమైన చట్టబద్ధపాలన, ఆర్థిక స్వావలంబన దిశగా మనం పయనించేటట్లు భారత పాలకులు ఇప్పటికైనా ప్రయత్నించాలి, కృషి చేయాలి. దేశ ప్రజల సార్వభౌమాధికారాన్నీ, హక్కులనూ కాపాడాలి.

ప్రజల జీవించే హక్కునూ, వాక్ సభా స్వాతంత్ర్యాన్నీ అడుగడుగునా కాలరాస్తున్న నేటి ప్రభుత్వాలు, మొదట ప్రజల మనోభావాలను గౌరవించాలి. ప్రజల హక్కులను కాలరాస్తున్న వారు ఎంతటివారైనా ప్రజలు తిరుగుబాటు చేయక మానరు. మరో స్వాతంత్ర్య పోరాటానికి దారితీసే విధంగా ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్ని కష్టాలు – నష్టాలు వచ్చినా ప్రజలు పోరాడుతారు. అంతిమ విజయం పోరాడే వారిదే.

(రచయిత న్యాయవాది,
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

అంతిమ యుద్ధానికి సిద్ధమైన తెలంగాణ

దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే అనేక దుర్మార్గ విధాన నిర్ణయాలను యుపిఎ ప్రభుత్వం ఎటువంటి ఏకాభిప్రాయం లేకుండానే అమలు చేస్తూనే, తెలంగాణ విషయంలో ఏకాభిప్రాయం అంటున్న కుట్రను వివరిస్తున్నారు **శ్రీధర్ దేశ్‌పాండే**

సకల జనుల సమ్మె ముగిసిన తర్వాత సంవత్సర కాలం తెలంగాణ రాజకీయాలు ఎన్నికల చుట్టూ చక్కర్లు కొట్టిన సంగతి అందరూ ఎరిగినదే. రుతువులు మారినట్లే తెలంగాణ రాజకీయం కూడా తన గతిని మార్చుకుంటున్నది. ఒకవైపు ఢిల్లీలో చర్చలు జరుగుతున్నట్లు, ఈ నెలాఖరులోగా యుపిఎ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తుందన్న వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ సంకేతాలు, చర్చలతో సంబంధం లేకుండా తెలంగాణ జెఎసి సెప్టెంబర్ 30న 'తెలంగాణ మార్చ్'కు జోరుగా సన్నాహాలు చేసుకుంటున్నది. కెసిఆర్‌తో చర్చలు సఫలమై కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను ప్రకటిస్తే సంబరాలు జరుపుకుంటామనీ లేదంటే సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్‌ని జరిపి తీరుతామనీ జెఎసి తన వైఖరిని స్పష్టంచేసింది.

గత కొన్ని రోజులుగా సెప్టెంబర్ నెలాఖరుకు కేంద్రం తెలంగాణ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన ఇస్తుందన్న సంకేతాలు తనకున్నట్లు కెసిఆర్ చెపుతూ వస్తున్నారు. అటువంటి సంకేతాలు కాంగ్రెస్‌లో ఎవరి నుంచి వస్తున్నవో ఆయన ప్రకటించలేదు. ఒక ఎంపిగా, మాజీ కేంద్ర మంత్రిగా ఆయనకు అటువంటి సంకేతాలు ఉంటే ఉండవచ్చు. తమకు మాత్రం తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి సంకేతాలు లేవని, తాము తమ ఉద్యమ కార్యాచరణ ప్రకారం ముందుకు నడుస్తామని జెఎసి చైర్మన్ ప్రొ. కోదండరామ్ స్పష్టం చేశారు. ఈ ఇద్దరు ఉద్యమ నాయకుల ప్రకటనలను పత్రికలు ఉద్యమంలో విభేదాలను సృష్టించేందుకు వాడుకున్నాయి. మొత్తం మీద సెప్టెంబర్ మొదటి వారంలో జెఎసి ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగబోతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రోడ్‌మ్యాప్ ప్రకటించమని వారు హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే, సోనియా కోటరీ సభ్యుడైన వాయలార్ రవిని, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలు చూస్తున్న మరో కేంద్ర మంత్రి గులాం నబీ ఆజాద్‌ని వారు కల్సుకొని కోరినారు.

తెలంగాణలో పరిస్థితిని, ప్రజల మానసిక స్థితిని తమ భవిష్యత్ కార్యాచరణని ముఖ్యంగా సెప్టెంబర్ 30న తాము చేపట్టబోయే 'తెలంగాణ మార్చ్' నిర్వహణ గురించి అన్నీ వివరించి వారికి చెప్పినారు. తాము శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా, గాంధేయ పద్ధతుల్లో మార్చ్ నిర్వహిస్తామనీ, అయితే ప్రజలు ముఖ్యంగా విద్యార్థి, యువజనులు తీవ్ర ఆగ్రహంతో, అసహనంతో ఉన్నందున 'తెలంగాణ మార్చ్'లో ఏమైనా జరుగవచ్చుననీ, అందుకు తాత్సారం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలే తప్ప తాము కాదనీ స్పష్టం చేశారు. సకల జనుల సమ్మె విరమణ తరువాత తెలంగాణ ప్రజలు సంవత్సర కాలం శాంతిని పాటించారనీ, ఉద్యమం జరుగుతుంటే శాంతిని నెలకొల్పాలనీ, శాంతిని నెలకొల్పితే ఏమీ లేదు కదా, తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష చల్లారిపోయిందనీ చెబుతూ తెలంగాణ ప్రజలను మోసం చేయడం ఇక సాధ్యం కాదనీ చెప్పారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులు అక్టోబర్ 1 నుండి హైదరాబాద్‌లోనే జరుగుతున్నందున 'మార్చ్' యోచన మార్చుకోవాలని లేదా వాయిదా వెయ్యాలని షిండే కోరినట్లు తెలిసింది. అయితే జెఎసి నాయకత్వం తెలంగాణ మార్చ్ తేదీని రెండు నెలల క్రితమే ప్రకటించామనీ, ఆ తేదీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిందనీ, తేదీ ప్రకటించేపుడు జీవ వైవిధ్య సదస్సులు తమ దృష్టిలో లేవనీ, ఇక ఇపుడు వాయిదా వేయడం సాధ్యపడదనీ, 'మార్చ్' జరిపి తీరుతామని వారు ప్రకటించారు. సెప్టెంబర్ 30 ప్రభుత్వానికి అంతిమ గడువని వారు ప్రకటించారు. ఢిల్లీలో వారి నుండి సానుకూలమైన ఆశ్వాసం ఏదీ లభించకపోయినా జెఎసి నాయకులు చెప్పింది మాత్రం విన్నారు.

జెఎసి బృందం హైదరాబాద్ తిరిగి రాగానే కెసిఆర్ ఢిల్లీలో అడుగు పెట్టారు. అప్పటికే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు 'బొగ్గార్పణం' అయిపోయి ముగిసిపోయాయి. ఇక తెలంగాణ ప్రకటనతోనే తిరిగి వస్తానని కెసిఆర్ చెప్పినట్లు హైదరాబాద్‌లో టిఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. సంబరాలకు సిద్ధంగా ఉండమని చెప్పినట్లుగా కూడా ఆ వర్గాలు పేర్కొన్నాయి. కెసిఆర్ ఢిల్లీలో అడుగు పెట్టినపూట నుండే ఎఐసిసి నాయకులైన వాయలార్ రవి, గులాం నబీ ఆజాద్, ఆస్కార్ ఫెర్నాండెజ్‌లతో పలుసార్లు మాట్లాడినట్లు, వారు ఆ చర్చల వివరాలని సోనియాకు వివరించినట్లు పత్రికల ద్వారా తెలుస్తున్నది. కాంగ్రెస్ కోర్ కమిటీ కూడా గంటన్నర పాటు తెలంగాణ ఏర్పాటు అంశాన్ని చర్చించినట్లు పత్రికలు ప్రముఖంగా రాసినాయి. ఈ చర్చల్లో ఏయే అంశాలు చోటు చేసుకుంటున్నాయి అన్నది ఎవరికి తోచినట్లు, ఎవరి సంకేతాలను బట్టి, ఎవరి సమాచారాన్ని బట్టి వారు విశ్లేషించుకుంటున్నారు. ఒకటైతే, అందరూ విశ్వసిస్తున్న అంశం టిఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కావడం. రెండోది హైదరాబాద్ భవిష్యత్తు. మూడోది తెలంగాణకు అభివృద్ధి మండలిని ఏర్పాటు చెయ్యడం.

మొదటి అంశంపై టిఆర్ఎస్ ఎటువంటి ఖండన ప్రకటన చెయ్యలేదు. కెసిఆర్ సహా టిఆర్ఎస్ ముఖ్య నాయకులు పలుమార్లు తెలంగాణ ఏర్పాటును గనుక కాంగ్రెస్ ప్రకటిస్తే టిఆర్ఎస్‌ని కాంగ్రెస్‌లో విలీనం చెయ్యడానికి అభ్యంతరం లేదని ప్రకటించి ఉన్నారు. తెలంగాణ కోసం ఆ త్యాగానికి తాము సిద్ధమేనని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర

ఏర్పాటు కోసం ఉద్యమించడమే కాదు తెలంగాణ పునర్నిర్మాణం కూడా తమ లక్ష్యం అని ప్రకటించిన టిఆర్ఎస్ తన రెండో లక్ష్యాన్ని మర్చిపోతున్నదని విమర్శించే వాళ్లు కొందరు ఉన్నప్పటికీ తెలంగాణ ఏర్పాటు లక్ష్యం నెరవేరిన తర్వాత టిఆర్ఎస్ లేకపోవడాన్ని మెజారిటీ తెలంగాణ ప్రజలు పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. అది ఆ పార్టీ అంతర్గత వ్యవహారంగానే ప్రజలు, ఉద్యమ సంస్థలు భావిస్తున్నాయి.

ఇక రెండో అంశం హైదరాబాద్ నగర భవిష్యత్తు. తెలంగాణ ప్రజల దృష్టికోణం నుండి చూసినపుడు హైదరాబాద్ భవిష్యత్తు చర్చనీయాంశం కానే కాదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఐదు వందల సంవత్సరాలుగా హైదరాబాద్ తెలంగాణ లేదా దక్కను ప్రాంతానికి రాజ్యాధికార కేంద్రం. హైదరాబాద్ నగరం తెలంగాణ జిల్లాలతో పరివేష్టితమై ఉంది. హైదరాబాద్ నగర జీవనానికీ, మనుగడకూ తెలంగాణ వనరులే ఆధారం. హైదరాబాద్ నగరాభివృద్ధికి తెలంగాణ ప్రజలు తమ చమటనీ, రక్తాన్నీ ధారపోసినారు. కాబట్టి హైదరాబాద్ నగరం భవిష్యత్తు తెలంగాణతో ముడిపడి ఉంటుందే తప్ప మరోరకంగా కాదు. కానీ గత యాభై ఏళ్లుగా హైదరాబాద్ నగరంపై పట్టుబిగించి తమ భల్లూకపు కౌగిట్లో బంధించి పెట్టుకున్న వలసవాదులు, ఆంధ్రా పెట్టుబడిదారులు, రియల్టర్లు, విద్యా, వైద్య వ్యాపారస్తులు, భూ మాఫియాలు, ఇసుక మాఫియాలు, సినిమా గుత్త పెట్టుబడిదారులు హైదరాబాద్ లాంటి బంగారు గుడ్లు పెట్టే బాతుని ఎట్లా వదులుకుంటారు? అందుకే కేంద్ర పాలిత ప్రాంతంగా చెయ్యాలని వాదిస్తూ ఉంటారు. జెఎసి బృందంతో మాట్లాడినపుడు హైదరాబాద్ చుట్టూ తెలంగాణ జిల్లాలే ఉన్నపుడు అది తెలంగాణలో అంతర్భాగం కాకుండా ఎట్లా ఉంటుంది? అని వాయలార్ రవి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కానీ సీమాంధ్ర గుత్త పెట్టుబడిదారుల ఒత్తిళ్లకు తలఒగ్గకుండా హైదరాబాద్ సహా తెలంగాణను కేంద్రం ప్రకటిస్తుందా? లేదా మెలిక పెడ్తుందా? వేచి చూడాలి. తెలంగాణ ఏర్పాటు ఉద్యమంతో పాటూ 'హైదరాబాద్ బచావ్' ఉద్యమం కూడా జెఎసి నిర్వహించవలసి ఉంటుందని ఉద్యమ ప్రజలు భావిస్తున్నారు. చేతలు కాలాక ఆకులు పట్టుకోలేం కదా?

చర్చల్లో తెలంగాణకు గూర్ఖాల్యాండ్ తరహాలో నిర్ణయాధికారాలు కలిగిన ఒక స్వతంత్ర అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసే అంశం కూడా ఉన్నట్లు ఢిల్లీ నుండి తెలంగాణ వర్గాలు అంటున్నాయి. ఇది కూడా తెలంగాణ ప్రజలకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇదొక విఫల ప్రయోగం. విఫలం చెందిన ప్రయోగాన్ని తిరిగి ప్రజల మీద రుద్దడం అంటే మరో వంచనకు పాల్పడడమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్ప మరొక పరిష్కారానికి తెలంగాణ ప్రజలు అంగీకరించే ప్రసక్తే లేదు. ఇదే విషయాన్ని ఉద్యమం గత పదేండ్లుగా చెబుతూనే ఉన్నది. అయినా దింపుడు కళ్లెం ఆశ వలసవాదులది. అందుకే ఇటువంటి పాచి ప్రతిపాదనలు ముందుకు తెస్తూనే ఉంటారు. గూర్ఖా ఉద్యమ సంస్థ తాత్కాలికంగా గూర్ఖా టెరిటోరియల్ అథారిటీ ఏర్పాటుకు అంగీకరించి ఉండవచ్చు. కానీ గూర్ఖాలు ఇంకా ప్రత్యేక రాష్ట్రాన్నే కోరుకుంటున్నారు. అథారిటీ ఏర్పాటుతో వారు సంతృప్తిపడినట్లు ఎవరైనా భావిస్తే అది భ్రమ మాత్రమే. నేల విముక్తితో ముడిపడిన ఆకాంక్షను తాత్కాలిక ఉపశమనాలతో తీర్చలేరు. తెలంగాణ ఆకాంక్ష కేవలం అభివృద్ధితో ముడివడిన అంశమే కాదు, అది నేల విముక్తితో ముడివడిన అంశం. కాబట్టి అభివృద్ధి మండళ్లు, అథారిటీలు తెలంగాణకు పనికిరావు. 1955లో ఫజల్ అలీ కమిషన్ ఈ బలమైన ఆకాంక్షని గుర్తించింది కనుకనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలని తీర్పునిచ్చింది. సీమాంధ్ర గుత్త పెట్టుబడిదారులకు అమ్ముడుపోయింది గనుకనే శ్రీకృష్ణ కమిటీ విఫల ప్రయోగాన్ని పరిష్కారంగా సూచించింది.

ఈ చర్చలు జరుగుతుండగానే షిండే, ప్రధానమంత్రి మన్మోహన్‌లు వేరు వేరు సందర్భాలలో భిన్నమైన ప్రకటనలు చేశారు. హోం మంత్రిత్వ శాఖ నెలవారీ నివేదికలను విడుదల చేస్తూ చిన్న రాష్ట్రాలు నక్సలైట్లకు బలమైన కేంద్రాలుగా మారుతున్నాయి అంటూ జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఉదహరించింది. తెలంగాణ ఏర్పడితే నక్సలైట్లకు స్థావరంగా మారుతుందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఈ కోణంలో పరిశీలించాలట. షిండే ఈ దేశానికి హోం మంత్రిగా వచ్చి కొద్ది రోజులే అయి ఉండవచ్చు. అయినా కేంద్ర మంత్రిగా దేశ పరిస్థితులు ఆయనకు తెలిసి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో నక్సలిజాన్ని మొత్తం నిర్మూలించామని రాష్ట్ర ప్రభుత్వం కొడుతున్న గప్పాలను కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్నోసార్లు ప్రశంసించింది. ఆంధ్రప్రదేశ్‌నే మార్గదర్శిగా ఎంచుకోవాలని రాష్ట్రాలకు సూచించింది. ఇవ్వాళ నక్సలిజం తెలంగాణలో కాదు ఉత్తరాంధ్రలో స్థిరపడిందని ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలని పరిశీలిస్తున్న ఎవరికైనా అర్థం అవుతుంది. అటువంటపుడు తెలంగాణ నక్సలైట్లకు స్థావరంగా ఎట్లా మారుతుందీ? షిండే ఉదహరించిన జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పేరుకుపోయిన పేదరికం, ఆర్థిక దోపిడీ, అణచివేతల కారణంగా ఆ రాష్ట్రాలు ఏర్పడక ముందు నుండే అక్కడ ఆదివాసులు పోరాడుతున్నారు. రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత కూడా ఆ పోరాటాలు కొనసాగుతున్నాయి. దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడక ఏం చేస్తారు? రేపు తెలంగాణ పాలకవర్గాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు కూడా పోరాడక తప్పదు. పోరాడే ప్రజలను నక్సలైట్లుగా ముద్ర వెయ్యడం పాలకులకు కొత్తకాదు. ఇవ్వాళ షిండే కూడా నక్సలైట్ల సాకుతో సీమాంధ్ర గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకు వంత పాడుతున్నాడు.

ఇకపోతే మన్మోహన్‌సింగ్ సిపిఐ బృందంతో తెలంగాణ ఏర్పాటుకు ఏకాభిప్రాయం లేదని అన్నాడట. విదేశీ పత్రికలు మన్మోహన్ సింగ్‌ను ఏడుపుగొట్టు ప్రధానమంత్రి, అసమర్థ ప్రధాని, నిజమైన రాజకీయాధికారం లేని ప్రధాని అని అభివర్ణించాయి. వాటి తిట్ల దండకానికి దడిసి, నేనేమిటో, నా తడాఖా ఏమిటో చూడండి అని డీజిల్ ధరలు ఏక్‌దమ్ లీటరుకు ఐదు రూపాయలు పెంచాడు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు సంవత్సరానికి ఆరేనట. ఆ తర్వాత మార్కెట్ రేటుకే సిలిండర్ కొనాలట. రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులను 51 శాతం అనుమతించాడు. లేస్తే మనిషిని కాను అన్నట్లు ఉన్న మన్మోహన్ క్యాబినెట్ నిర్ణయాలు దేశాన్ని ఉడికిస్తున్నాయి. మన్మోహన్ సింగ్ గారూ డీజిల్ రేట్ల పెంపుకు, సబ్సిడీ సిలిండర్ల సంఖ్య తగ్గింపుకు, రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడుల అనుమతికి ఏకాభిప్రాయం ఉన్నదా? పార్లమెంట్‌లో ఉన్న అన్ని పక్షాలను విశ్వాసంలోకి తీసుకొనే ఈ నిర్ణయాలు చేశారా? అంతకు ముందు అణు ఒప్పందంపై ఏకాభిప్రాయం ఉండే సంతకం చేశారా? తెలంగాణ దగ్గరికి వచ్చే వరకు ఏకాభిప్రాయం

లేదన్న సాకుతో డిమాండ్‌ని తృణీకరించడం! గత యాభై ఏండ్లుగా కాంగ్రెస్ ఈ రకమైన వంచనకు పాల్పడుతూనే ఉంది. ప్రజల న్యాయమైన, ప్రజాస్వామ్యబద్ధమైన డిమాండ్లను అత్యంత హేతు విరుద్ధమైన కారణాలతో తృణీకరించడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. నిజానికి కేంద్ర పాలకవర్గాలు ఎన్‌డిఎ, అయినా, యుపిఎ అయినా తెలంగాణతో చెలగాటమాడుతున్నాయి. మన్మోహన్ సింగ్ విదేశీ గుత్త పెట్టుబడిదారులకు, స్వదేశీ పెట్టుబడిదారులకు తాబేదారుగా వ్యవహరించేవాడుగా ఇప్పటికే రుజువైంది గనుక తెలంగాణ పట్ల ఆయన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించేవి కావు. అయితే ఈ వ్యాఖ్యలు కెసిఆర్‌తో చర్చలు జరుగుతున్నాయని చెబుతున్న సందర్భంలో రావడం గమనార్హం.

ఈ చర్చల సరళి, సారాంశం ఎట్లున్నా జెఎసి మాత్రం సెప్టెంబర్ 30న 'తెలంగాణ మార్చ్' హైదరాబాద్‌లో విజయవంతం చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నది. తెలంగాణ వ్యాప్తంగా సదస్సులు, సంఘీభావ ర్యాలీలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సెప్టెంబర్ 16న జరిగిన 'కరీంనగర్ కవాతు'ను జెఎసి అద్వితీయంగా నిర్వహించింది. మానేరు బ్రిడ్జి నుండి సర్కస్ గ్రౌండ్ వరకు ఆరు కిలోమీటర్ల ర్యాలీలో జెఎసి భాగస్వామ్య పక్షాలు పాల్గొన్నాయి. ర్యాలీలో పాల్గొంటామని ప్రకటించిన టిఆర్ఎస్, బిజెపిలు క్యాడర్‌ని పంపలేదు. అయితే వేదిక మీద మాత్రం వారి నాయకులు ఆసీనులయినారు. బిజెపి, టిఆర్ఎస్ క్యాడర్ లేకుండానే కవాతు విజయవంతమైంది. ముఖ్యంగా ర్యాలీలో పాల్గొన్న యువతను చూసిన తర్వాత జెఎసికి తెలంగాణ మార్చ్‌పై విశ్వాసం పెరిగింది. కవాతులో అన్ని జిల్లాల జెఎసి నాయకులు పాల్గొన్నారు. ఆ అనుభవాన్ని, స్ఫూర్తిని తీసుకొని తమ తమ జిల్లాలలో అటువంటి కవాతులనే నిర్వహించాలన్న నిర్ణయంతో వెనుదిరిగారు. కవాతులో పాల్గొన్న పదివేల మంది తిరిగి సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్‌లో తమతోపాటు మరో పది మందిని తోలుకొని వచ్చి పాల్గొంటామని ప్రతినబూనారు. సమరమా? సంబురమా? అన్న స్వామిగౌడ్ ప్రశ్నిస్తే పదివేల మంది పిడికిలెత్తి సమరమే అని నినదించారు.

మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు మహ్మద్ హమీద్ ఖాన్ గారైతే ఇంటికొక్కరు రావాలని, ఉట్టి చేతులతో కాదు ఒక చేతిలో తెలంగాణ జెండా, మరో చేతిలో తోషా (సద్ది మూట)తో వచ్చి బైఠాయించాలని పిలుపునిచ్చాడు. మర ఫిరంగులు మోగినా ఎత్తిన జెండా దించవద్దని మరొక నాయకుడన్నాడు. అక్టోబర్ 1న అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులను ప్రస్తావిస్తూ వి. శ్రీనివాస్‌గౌడ్ తెలంగాణ కూడా అంతరిస్తున్న జాతి. మార్జినలైజ్ అవుతున్న జాతి. తెలంగాణ భాషా సంస్కృతులు అంతరించిపోతున్న జాబితాలో ఉన్నాయి. తెలంగాణ చరిత్ర మరుగున పడిపోయింది. అంతరించిపోతున్న జీవ వైవిధ్యంపై జరుగుతున్న సదస్సుకు తెలంగాణ అంటే పట్టింపు లేదా? తెలంగాణ జీవ వైవిధ్యంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. ఈజిప్ట్‌లో జరిగిన తెహ్రీర్ స్క్వేర్ తరహా ఉద్యమాన్ని తెలంగాణ మార్చ్ ద్వారా ప్రారంభిద్దామని పిట్టల రవీందర్ పిలుపునిచ్చారు. తెహ్రీర్ స్క్వేర్ ఉద్యమంలో ఆస్మా మహఫీజ్ అనే మహిళ ఈజిప్ట్ ప్రజలకు రాసిన స్ఫూర్తిదాయకమైన ఉత్తరాన్ని ఆయన ప్రస్తావించి అటువంటి సందేశాన్ని తెలంగాణ ప్రజలకు చేరవెయ్యాలని ఆకాంక్షించారు. ముగింపు ప్రసంగం చేస్తూ జెఎసి చైర్మన్ కోదండరాం సెప్టెంబర్ 29న వినాయక విగ్రహాల నిమజ్జనం జరుపుదాం. సెప్టెంబర్ 30న సీమాంధ్ర ఆధిపత్యానికి నిమజ్జనం చేద్దాం అని పిలుపునిచ్చారు. అదే సమయంలో నిష్క్రియాపరత్వంలో కూరుకుపోయిన తెలంగాణ రాజకీయ నాయకులకు తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీచేశారు. తెలంగాణ ఏర్పాటుపై స్పందించకపోతే ఏమవుతుంది? అధికారం కోల్పోతాం కావచ్చు. అంతకు మించి ఏం జరుగుతుంది? అని ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు భావిస్తూ ఉండవచ్చు. అయినా శాంతియుత పద్ధతులలో ఉద్యమిస్తున్న ప్రజల మానసిక స్థితి ఇంక ఎంత మాత్రం అదే స్థితిలో ఉండకపోవచ్చు. అది ఎటువంటి తీవ్రమైన రూపంలోనైనా ఆగ్రహ ప్రకటనకు దారీయవచ్చునని చెప్తూ, 'మంత్రి శ్రీధర్‌బాబు మీ నాయనకు, ఏమయ్యిందో గుర్తు చేసుకోవాల'ని హెచ్చరించాడు. అయినా తాము గాంధేయ పద్ధతుల్లోనే మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ మార్చ్‌ని శాంతి భద్రతల సమస్యగా చూడవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోదండరామ్ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలని ఉత్సాహపరిస్తే, రాజకీయ నాయకత్వాన్ని ముఖ్యంగా కాంగ్రెస్ వారిని గంగవెర్రు లెక్కించింది. రెండు రోజుల పాటు పత్రికలు, మీడియా ఆ వ్యాఖ్యలను చర్చించి సొమ్ము చేసుకున్నాయి. కరీంనగర్ పోలీసులు సుమోటో కేసులు నమోదు చేశారు. శ్రీధర్‌బాబు తాబేదారులు కోదండరాం ఇంటి మీద దాడికి పాల్పడినారు. లగడపాటి, కావూరిల, షిండే వ్యాఖ్యలు తెలంగాణ ఏర్పడకముందే నిజమవుతున్నాయని విషం గక్కారు.

కరీంనగర్ కవాతు విజయవంతం కావడంతో తెలంగాణ ఉద్యమ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుంటే ప్రభుత్వంలో అభద్రత పెరిగిపోయింది. సెప్టెంబర్ 30 మార్చ్‌ని అడ్డుకోవడం ఎట్లనో వారికి అంతు పట్టడం లేదు. ప్రభుత్వం మరో ఎత్తుగడతో ముందుకు వస్తున్నది. వినాయక నిమజ్జనంలో మతతత్వ శక్తులు, ఇతర సంఘ విద్రోహ శక్తులు చొరబడి హింసకు పాల్పడవచ్చు. అక్టోబర్ 1న ప్రారంభమయ్యే అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సుకు అంతరాయం ఏర్పడవచ్చు. అదే జరిగితే ప్రపంచ దేశాల ముందు దేశం పరువు మంటగలుస్తుందనీ, హైదరాబాద్ నగరానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందనీ, అందువల్ల మార్చ్‌ని వాయిదా వేయించాలనీ ముఖ్యమంత్రి ఎత్తుగడ. సుమోటో కేసులు నమోదు చేసిన ప్రభుత్వం ఇపుడు కోదండరామ్‌తో తెలంగాణ మంత్రులను చర్చలకు పంపుతున్నట్లు పత్రికలు వెల్లడించాయి. మార్చ్‌ని ఎట్టి పరిస్థితుల్లో వాయిదా వెయ్యమని కోదండరామ్ ఇప్పటికే ప్రకటించి ఉన్నారు. అంతర్జాతీయ సమాజానికి తెలంగాణ డిమాండ్‌ని ఎరుక పరచడానికి ఇంతకంటే మంచి అవకాశం మరొకటి దొరకదు. మార్చ్‌ని జరుగవద్దంటే సెప్టెంబర్ 30 లోపున కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు నిర్దిష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించడం ఒక్కటే మార్గం. అదే జరిగితే మార్చ్ విజయోత్సవ ర్యాలీగా మారుతుంది. లేదంటే అంతిమ యుద్ధానికి వేదికవుతుంది. సెప్టెంబర్ 30 ఏం కావాలో తేల్చవలసింది కేంద్ర ప్రభుత్వమే. ఈ వ్యాసం అచ్చయి పాఠకులు చదివేటప్పటికి సెప్టెంబర్ 30 ఏ రూపం తీసుకుందో స్పష్టమైపోతుంది.

(రచయిత తెలంగాణ విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షుడు) వీ

ఇనుము కార్ఖానా మృత్యు కుహరం

స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో షాద్‌నగర్ ఇనుము ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం ఈ దేశ కార్మికులపై జరుగుతున్న దోపిడీ, పీడనలను తెలియజేస్తోందని అంటున్నారు **ఎం.డి. ఇక్బాల్ పాషా**

పాలమూరు జిల్లా 'లేబర్ జిల్లా'గా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. ఎక్కడ ఏ నిర్మాణం జరిగినా, అది రహదారి అయితేనేమి, రాజప్రాసాదం అయితేనేమి, నదులను ఢీకొట్టి ప్రవాహాల్ని నిలువరించే ఆనకట్టలైతేనేమి, నదుల మీదుగా భారీ వాహనాల్ని పరుగులు తీయించే వంతెనలైతేనేమి అన్నీ పాలమూరు జిల్లా కష్టజీవుల నెత్తుటితో తడిసి మెరిసినవే. ఇది ఇప్పటి మాటనే కాదు. దశాబ్దాలుగా ఈ జిల్లా నిరుపేద రైతు కూలీలు కరువు, దుర్భిక్షం బారిన పడి వలసల పాలై పట్నమో, పరదేశమో పిల్లాపాపలతో కలిసి స్వేదమేఘాలపై తరలిపోతూనే ఉన్నారు.

నిండు గర్భిణి నుండి పండు ముసలి దాకా వసివాడని బాల్యం సైతం జానెడు పొట్టకు, బుక్కెడు బువ్వకోసం లక్షలాది మైళ్లు పొట్టచేత పట్టుకొని తరలిపోవాల్సిందే. అయినా నిత్యం ఆకలిదప్పులు, అవమానాలే నజరానాలుగా బతుకుతున్న వాళ్లు. ఇట్లా తమ చెమటా, నెత్తురూ ధారపోసి నిర్మించిన కట్టడాలు ఎవరికి ఊడిగం చేస్తున్నాయో, ఎవరి ఆశల భవంతులై సుందర కాంతులీనుతున్నాయో కానీ వీళ్ల బతుకులు మాత్రం గాఢాంధకారంలో కూరుకుపోయి కుమిలిపోతున్నాయి.

పనిచేసే చోట నిత్యం ఎన్నెన్నో అవమాన భారాల్ని, పెత్తనాల్ని, అణచివేతల్ని మౌనంగా భరిస్తూనే ఎన్ని వేల, లక్షల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయో? ఈ విధంగా కన్నీళ్లనూ, కన్నోళ్లనూ, ప్రాణ ప్రదమైన పల్లెలనూ విడిచి వలసవెళ్లిన ఆత్మీయులు శవాలుగా మారి రాని గ్రామం లేదు పాలమూరులో అంటే ఆశ్చర్యం కాదు.

భూములు లేక, వర్షాలు లేక, ఉన్న భూములకూ, పశు పక్షాదులకూ గొంతు తడుపుకునే నీటి చుక్కలేక, అవసరాలో, అవకాశవాద పాలనలో ఉన్న చోట ఉండకుండా తరుముతుంటే దౌర్భాగ్యమనీ, దురదృష్టమనీ తలపోసుకుంటూ పల్లెల నుండి వందలు, వేలు గుంపులు గుంపులుగా జనాలు తరలిపోయారు. వాళ్లు చితికిపోయి, చివికిపోయి, దుర్గంధభరిత వాసనలు పట్టిన దిక్కులేని శవాలై వస్తే బొందలు తీసే వసతులు లేక ఒకే బొందలో అయిదారుగురి చొప్పున బూంచుకున్న సంఘటనలు కోకొల్లలు. బతికినా, చచ్చినా ఇక్కడ కష్టజీవుల కడగండ్లు వర్ణనాతీతం. వీళ్లకు ఏం జరిగినా అడిగే దిక్కు లేదిక్కడ. పోటెత్తిన సముద్రాల అలలను తలపించే వీళ్ల దుఃఖాన్ని ఎవరు పంచుకునేది?

సరిగ్గా ఇలాంటి ఘోరాలే, కిరాతకాలే ఎక్కడెక్కడి నుండో పొట్ట చేత పట్టుకొని, సరిహద్దులు చెరుపుకొని పాలమూరు బతకడానికొచ్చిన వివిధ రాష్ట్రాల శ్రమజీవుల పరిస్థితి. కూలి బిడ్డల వలసల, కరువు కాటకాల, వలస మృతుల జిల్లా అయిన మన పాలమూరులో కూడా ఎదురవతున్నాయంటే నమ్మగలమా!

సామ్రాజ్యవాదానికి స్వాతంత్ర్యం వచ్చాక, పెట్టుబడికి నడకలు అబ్బి దోపిడీకి రెక్కలు మొలిచి, రాజ్యాంగాల రక్షణలన్నీ సడలీకరింపబడి బందిపోట్లు సరళీకరణపు ముఖౌటాలతో రాజ్యాధినేతలై పోయారు కదా. పాలమూరైనా ప్రపంచంలో మరెక్కడైనా మట్టిబిడ్డల చెమటా, నెత్తురూ, కన్నీళ్లూ కారుచౌక అయిపోక మరేమౌతాయి.

ఆ రోజు 15 ఆగస్ట్ 2012. దేశమంతా 66వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంబరాలు! అంతటా జాతీయ పతాకావిష్కరణ జరుగుతున్న సమయమది. ఇది ఒకవైపైతే సరిగ్గా అదే సమయంలో వొళ్లంతా కాలిన గాయాలతో పెడబొబ్బలు పెడుతూ భాషకాని భాషలో తమది కాని నేలమీద మరణఘోషలు అక్కడ. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా పద్నాలుగు మంది కూలీలు. కాదు కాదు అనాథలు. అనాథలూ కాదు దిక్కులేని అభాగ్యులు మృత్యువుతో తలపడుతున్నారక్కడ. అదెక్కడంటే పాలమూరులోనే, అదెక్కడంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు, అదీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలోనే. ఎందుకు పెట్టారో ఆ నగరానికి ఆ పేరు కానీ అది కూలీల పాలిట విషాదనగరమే అయ్యింది ఆ వేళ!

ఏమిటీ? ఎందుకూ? ఎలా? అని తెలుసుకోవాలనుకుంటే ఏడాదిలో ఎన్నోసార్లు ఇలా మృత్యువు విలయతాండవం చేసే షాద్‌నగర్ వెళ్లవలసిందే.

హైదరాబాద్‌కు అరగంట ప్రయాణ దూరంతో 7వ నెంబర్ జాతీయ రహదారిపై ఉంటుంది ఈ షాద్‌నగర్. దీన్ని నిజాం నవాబు వేసవి తాపం నుండి ఉపశమనం పొందే ఆహ్లాదకర వాతావరణం అందించే ప్రాంతంగా గుర్తించి తన వేసవి విడిదిగా ఏర్పాటు చేసుకున్న సుందర ప్రాంతం. ఇప్పుడది రాజకీయ అవతారమెత్తిన బడా పెట్టుబడిదారుల, భూ కబ్జాదారుల, రియల్ ఎస్టేట్ గూండాల ఆరాచకాలకు అడ్డాగా మారిపోయి విలసిల్లుతున్నది.

ఎప్పుడూ నిలువడానికింత జాగా కూడా లేకుండా ప్రయాణీకులతో కిటకిటలాడే షాద్‌నగర్ బస్టాండు ముందు నుండి పర్గీ రోడ్‌లో గతుకుల రోడ్డుపై మూడు కిలోమీటర్లు ప్రయాణిస్తే గాని అమాయక కష్టజీవుల ఆక్రందనలు పెల్లుబికిన రణక్షేత్రం రాదు.

మసిబారిన ఇరుకిరుకు మట్టిరోడ్డు. దానికిరువైపులా అడవిని తలపించే పెద్ద పెద్ద చెట్లూ, పొదలూ. అక్కడక్కడా పంట పొలాలూ, సేద్యానికి శాశ్వతంగా సెలవిచ్చిన బీడు భూములు. ఎదురెదురుగా రెండు వాహనాలు ఏకకాలంలో దాటి పోలేనంతటి నిడివితో మోకాలు మట్టుకు దిగబడేట్లున్న గుంతలు అడుగడుగుకూ దర్శనమిచ్చే రోడ్డు అది. షాద్‌నగర్ బస్టాండ్ నుండే నిజ నిర్ధారణ బృంద సభ్యులం ఒక సెవన్ సీటర్ ఆటోను మాట్లాడుకుని ఎక్కిపోతున్నాం.

పోగా పోగా మలుపులూ, మెలికలూ, గుంతలూ, కంపలూ, చెట్లూ దాటినంక విసునూరు భూస్వామి గడీని పోలిన పొడవైన గోడలతో

25, 30 ఎకరాల స్థలాన్ని సందెట బిగపట్టినట్లున్న కాంపౌండు. అటు ఇటు మూడు, నాలుగు వేల అడుగుల కాంపౌండుకు మధ్య ఒక పెద్ద లోహపు గేటు తాళం వేసి ఉంటుంది. దాని పక్కనే మరో చిన్న గేటు. అక్కడొక రక్షకుడు. రెడ్ ఆక్సైడ్ పూతకం కూడా నోచుకోని మందమైన ఇరవై ఫీట్లపైగా ఎత్తున్న ప్రధాన ఇనుపగేటు ముందు ద్విచక్ర వాహనాలు సైతం నిలవడానికి ఆరు ఫీట్ల జాగా కూడా ఉండదు. మూసి ఉన్న ఆ ఎత్తైన ఇనుప గేట్ల ముందు నిలబడి చూస్తే అదొక సెంట్రల్ జైలును తలపించే దృశ్యం. కానీ అది ఫ్యాక్టరీయే! బయట ఎంత వెతికినా ఎక్కడా ఒక్క అక్షరం ముక్క కూడా దాని బోర్డుగా కనిపించదు. అతి కష్టం మీద అరగంట అడిగి వాదులాడిన తర్వాత గేటు తెరచుకొని లోపలికి వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బందికి సెల్‌లో ఒక హుకూం జారీ అయ్యింది. అట్లా ఆ ఫ్యాక్టరీ కాని ఫ్యాక్టరీ లోపలికి వెళ్లిన వెంటనే ఉన్న సెక్యూరిటీ రూముకు ఆనుకుని అక్కడక్కడా చిన్నవీ, పెద్దవీ అన్నీ కలుపుకొని అయిదారు కంప్యూటర్ అక్షరాల సైన్ బోర్డులు కనిపించాయి. వాటిలో కాస్త ఆకర్షణీయంగా ఏర్పాటు చేయబడ్డ ఒక బోర్డుపై కంపెనీ లక్ష్య ప్రకటనగా 'కస్టమర్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీయే మా ప్రధాన లక్ష్యం' అన్న నినాదం. ఆ తర్వాత మేనేజింగ్ డైరెక్టర్, అడ్వైజరీ, సెక్యూరిటీ అథారిటీ అంటూ అన్నింట్లో వరుస క్రమాన్ని మార్చి ఏవో కొన్ని అవే పేర్లు అన్ని బోర్డుల్లోనూ కనిపిస్తాయి.

ఓ యాభై అడుగులు లోపలికి వెళ్లి చూస్తే దాదాపు ముప్పై ఎకరాల చదునైన వ్యవసాయ భూమిలో చుట్టూ చక్కటి వ్యవసాయ పొలాల మధ్య రెండు వైపులా వంద ఫీట్లపైగా ఎత్తు, మూడు వందల ఫీట్ల పొడవూ వెడల్పులు గల పక్కా నిర్మాణంతో ఉన్న అయిదారు ఫ్యాక్టరీ ప్రధాన షెడ్లూ, అందులో భారీ యంత్రాలు కనిపించాయి. అది పాత ఇనుమును కరిగించి రీసైకిల్ చేసి ఇనుప దూలాలు, యాంగులర్‌లు తయారు చేసే ఇనుప ఫ్యాక్టరీ. దాని అసలు పేరు 'స్టెమ్‌కోర్ అల్లాయిస్ అండ్ ఇస్పాత్ లిమిటెడ్'. 2008లో స్థాపించబడి పరిగి రోడ్, షాద్‌నగర్ గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలంలో వెలసిందట. ఇదంతా కాంపౌండ్ బయట కాకుండా ఫ్యాక్టరీ లోపల ఎక్కడో చిన్న అక్షరాల్లో సైన్ బోర్డులో రాసి ఉంది. దాదాపు మూడు వందల మంది దాకా కార్మికులు ఉంటారు. అందరూ యువకులే, అందరూ స్థానికేతరులే. స్థానిక భాష బొత్తిగా రానివారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల నుండి కాంట్రాక్టర్‌ల ద్వారా పనికి తరలింపబడ్డ వాళ్లు.

ఆగస్ట్ 15 ఉదయం 7 గంటల సమయంలో కరిగించడం కోసం బలమైన గొలుసులతో ఉన్న ఒక విద్యుత్ అయస్కాంత బకెట్‌తో కప్పీలపై తరలింపబడ్డ పాత ఇనుప సామానులు విద్యుత్ ఫర్నేస్‌లపై ఏర్పాటు చేయబడిన ఇనుము కరిగించే పాత్రలోకి మారి మూడు, నాలుగు గంటలు 1700 డిగ్రీ సెంటిగ్రేడ్ దగ్గర వేడిచేయబడి ఇనుప ద్రవపు లావా అయి ఉన్న సందర్భంలో మరికాసేపట్లో ఆ కరిగిన ఇనుప ద్రవం కూలింగ్ యూనిట్‌కు యంత్రాలపై తరలించనుండగా ద్రవమై కరిగి ఉన్న ఆ ఇనుప లావాలో అనుకోని విస్ఫోటనమేదో జరిగి ఆ లావా అంతా ఒక్కసారిగా నేల నుండి నలభై ఫీట్ల ఎత్తు ఉన్న ఫర్నేస్‌ల మీది నుండి మరో యాభై ఫీట్ల ఎత్తు ఉన్న ఫ్యాక్టరీ పైకప్పు మీది దాకా చిమ్మి చెల్లాచెదురుగా ఎగిసి పడింది. ఆ వేళ షిఫ్టు డ్యూటీలో ఉన్న ఫర్నేస్ దగ్గరి కూలీలందరిపై సలసల కాగే కరిగిన ఇనుప లావా కురిసింది. అంతటి వేడి ఉన్న ఆ లావా దెబ్బకు కూలీల వంటిమీదున్న వస్త్రాలు కాదు, చర్మమంతా కాలి ఊడిపడింది. దట్టంగా కమ్ముకున్న పొగల్లో హాహాకారాలు చేస్తున్న దాదాపు 14-15 మంది కూలీల నగ్నదేహాలు పెడుతున్న పెడబొబ్బలకు ఆ ఫ్యాక్టరీయే కాదు ఆ చుట్టుపక్కల రెండు, మూడు కిలోమీటర్ల దూరం వరకు ఆ ప్రాంగణమంతా దద్దరిల్లిపోయింది. ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఫ్యాక్టరీ పని మొదలైందంటే చాలు పట్టపగలైనా కళ్లు చీల్చుకున్నా కనిపించని, పక్క మనిషి ముఖం కూడా గుర్తించలేనంత చీకటి పొగలు దట్టంగా అలముకు పోయే ఆ ఫ్యాక్టరీలో ఆ రోజు పొగలకు తోడు హాహాకారాలు కూడా తోడయ్యాయి.

ఫర్నేస్ ఎర్రెర్రగా మండుతూనే ఉంది. ఇనుమును లావాగా కరిగించే బోవెల్ బుజ బుజ సెగలు కక్కుతూనే ఉంది. ఏమైందో ఎవరికీ తెలియడం లేదు. తలకూ, ముఖానికీ విధిగా ధరించాల్సిన హెల్మెట్ వసతి సైతం కల్పించనందున కార్మికులే స్వతహాగా ఏర్పాటు చేసుకొని కట్టుకున్న పాత చింపిరి గుడ్డబట్టలు లాగి పాడేసుకొని మిగతా యూనిట్లలో పనిచేసే కార్మికులందరూ ఒక్కొక్కరే దుర్ఘటన జరిగిన ఫర్నేస్ యూనిట్ దగ్గరికి చేరుకొని, ఎదలు బాదుకుంటూ వాళ్ల చేతనైన సాయం చేయడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. బయట లోకమంతా స్వాతంత్ర్య వేడుకలలో ఉన్నారు. నేతలూ, అధికారులూ స్వాతంత్ర్యం ఎన్నవదో, ఏమేం తెచ్చిందో వేదికలపై ఉపన్యాసాలు వివరించి చెబుతుంటే ఆకాశంలో మువ్వన్నెల జెండా కేరింతలతో ఆనందాన్ని దాచుకోలేక చప్పట్లు కొడుతున్నట్లుగా ఎగిరెగిరి పడుతున్నది. ఇక్కడేమో క్షణాల్లో మనుషుల్ని శవాలుగా మార్చేంతటి ఘోర ప్రమాదాలకు నిలయంగా ఉండే ఫ్యాక్టరీలో డాక్టర్లు, నర్సులు, స్ట్రెచ్చర్లు, ఆక్సిజన్ ప్లాంట్‌లూ కాదు కనీసం ఫస్ట్ ఎయిడ్ జాడ కూడా కనిపించని అసహాయ స్థితిలో, చావు బతుకుల్లో పదిహేను మంది దాకా కార్మికులు విలవిల్లాడుతున్నారు. తన పేరూ, చిరునామా లేకుండా అయిదారేళ్లుగా కోరలు పదునెక్కించుకుంటూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ ఫ్యాక్టరీ మృత్యుకుహరంలోంచి ఎవరెవరికో ఫోన్లు వెళ్లాక అంబులెన్స్ ఏర్పాటు జరిగింది. అతి గోప్యంగా గాయపడ్డవాళ్లను హైదరాబాద్‌కు తరలిస్తుంటే ఆ వాహనం నడిరోడ్డుపై మొరాయించడం వల్ల క్షతగాత్రుల్ని మరో ప్రైవేట్ వాహనంలోకి తరలిస్తుండగా జనం కంటపడ్డ ఫలితంగా పొరపాటుగా లోకానికి తెలిసొచ్చిన ఒక దుర్ఘటన ఇదని అక్కడి ఎస్.ఐ. కూడా విచారం వ్యక్తం చేశాడు. అక్కడి పరిస్థితులు గమనిస్తే సెక్యూరిటీ సిబ్బంది, కంపెనీ ఏజెంట్లూ ప్రతిస్పందించిన తీరు చూస్తే ఇది మొదటి ఘటన కాదనీ, ఇలాంటి ప్రమాదాలు అతి సాధారణమనీ, ఒకరో ఇద్దరో బలి అయితే ఫర్నేసు మంటల్లోకి విసిరేయబడ్డ దిక్కులేని శవాల ఘటనలెన్నో అని మనసు మూగగా రోదిస్తుంది ఎవరికైనా!

పారిశ్రామిక నియమాలు, నిబంధనలు లేబర్ రూల్స్ అన్నీ చచ్చుబండలై పోయాయక్కడ. కార్మికులకు భద్రతలేదు, కనీస రక్షణ ఏర్పాట్లు లేవు. మలమూత్ర విసర్జనకు సైతం వసతులు లేవు. పని చేస్తున్నప్పుడు కార్మికులకు గుర్తుగా ఉండాల్సిన డ్రెస్సు గాని, లోహ జలం మీద పడితే శరీరానికి రక్షణగా ఉండే మెటల్ జాకెట్ కాని, కళ్లకు అద్దాలు కాని, కాళ్లకు చెప్పులు, తలకూ ముఖానికీ హెల్మెట్, గ్లాస్ ప్రొటెక్షన్ లాంటి అత్యంత ఆవశ్యకమైన కనీస ఏర్పాట్లు కూడా లేవు. చిమ్మ చీకట్లూ, దుమ్మూ ధూళీ నిండిన దట్టమైన పొగలు కమ్ముకొని ఊపిరి కూడా ఆడని ఆ ఘాటు ఘాటు వేడి పొగ వాయువుల మధ్య చిక్కిన ఆ కార్మికులు ఊపిరితిత్తులూ, కళ్లూ, కాలేయం, కిడ్నీలూ పాడైపోయేక మూడేళ్లకే కదిలే శవాలుగా మూలకు పడిపోయే దుర్భర పరిస్థితులు అక్కడ ఎందుకున్నాయి? కార్మిక చట్టాలు ఎందుకు కళ్లు

పొదుచుకున్నాయి? కళ్లుండి కనికరంతో కార్మికుల యోగక్షేమాలు కనిపెట్టుకుంటూ ఉండాల్సిన లేబర్ ఆఫీస్ పంచేంద్రియాలు ఎక్కడ తాకట్టుపడ్డాయి? అన్నీ సమాధానం లేని ప్రశ్నలే. నివృత్తికి సైతం నోచుకోని అనుమానాలే.

ఇది దేశీయ భూభాగంలో పరదేశీ పాలనకు పబ్లిగ్గా పార్లమెంట్ పర్మిషన్ పొందిన స్పెషల్ ఎకనామిక్ జోన్ ఏరియా కాదు కానీ, ఆ కనుసన్నల్లో దోబూచులాడుతున్న సమకాలీనతలో లభించిన సౌలభ్యాల వల్ల ఇక్కడ ఏ రూలూ, ఏ చట్టమూ వర్తించవు. అన్నీ యాజమాన్యపు ఇష్టారాజ్యాలే. ఎవరీ యాజమాన్యం? ఎక్కడి ధైర్యం? పాలమూరు వలస జిల్లా నడిబొడ్డున జాతీయ రహదారి మీద రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరలో, అంతర్జాతీయ విమానాశ్రయపు చంకలో రాజ్యమేలుతున్న ఘోర, హక్కుల హనన మృత్యుకేళి ఇది.

ఆనాటి ఘోర దుర్ఘటనలో గాయాలపాలై హైదరాబాద్‌కు తరలింపబడ్డ క్షతగాత్రులు – 1) దీప్‌లాల్ రావు; 2) మల్కన్ యాదవ్; 3) పింటు; 4) రన్‌జీవన్; 5) రవిసింగ్; 6) గజ్‌రాజ్; 7) సద్దాం; 8) కౌసర్ ప్రసాద్ యాదవ్; 9) రంజిత్‌సింగ్; 10) లాలుకుమార్ యాదవ్; 11) కె కె సింగ్; 12) బినయ్‌సింగ్; 13) కపిల్‌ఖాన్; 14) కౌసర్. వీళ్లల్లో ఒక్క సద్దాం తప్ప మిగతా అందరూ మృతిచెందారు. సంఘటన బయటకొచ్చిన వెంటనే పత్రికా ప్రకటనలు, వివిధ ప్రజాసంఘాల, నిజ నిర్ధారణ కమిటీల ఆందోళనల ఫలితంగా మేనేజ్‌మెంట్ రెండున్నర లక్షల రూపాయల పరిహారం ప్రకటించింది. జిల్లా కలెక్టర్ ప్రమేయంతో పరిహార పంపిణీ జరిగింది. ఫ్యాక్టరీలో కార్మికుల వివరాలేవీ అందుబాటులో లేనందున మరణించిన వారి కుటుంబాల వివరాలు సరిగ్గా లేవు. కొందరి శవాలు స్వస్థలాలకు పంపారట. మరి కొందరు హైదరాబాద్‌లోనే అంతిమ సంస్కారాలు ముగించారు. గాయపడ్డ వాళ్లకు హైదరాబాద్ అపోలో, ఓవైసీ హాస్పిటల్స్‌లో చికిత్సలు జరుగుతున్నాయి.

ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ లేబర్ యూనియన్ (ఎఐఎఫ్ఎల్‌యు), ఎపిసిఎల్‌సితో పాటు పాలమూరు అధ్యయన వేదిక, విరసం బృందం సభ్యులం సంఘటనా స్థలాన్ని రెండు పర్యాయాలు సందర్శించాం. మొదటిసారి వెళ్లినప్పుడు ఫ్యాక్టరీ బంద్ ఉంది. సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే కనిపించారు. వారిని కన్విన్స్ చేసుకున్న తర్వాత ఫ్యాక్టరీలోకెళ్లి అక్కడి స్థితిగతుల్ని గమనించాం. ఎక్కడ చూసినా ఎక్కడివక్కడ ఉత్పాదక సామాగ్రి గుట్టలే కనిపించాయి. జరిగిన ఘోరానికి దర్పణంగా పనిచేస్తూ, చేస్తూ ఎట్లా ఉన్నవి అట్లా యంత్రాలు, ఫర్నేస్‌లో పేరుకుపోయిన బూడిద, నేలపై ఒలికి బిగుసుకుపోయి గట్టిపడిన కరిగి పొర్లిపారిన ఇనుప లావా. ఇనుప లావాను కూలింగ్ యూనిట్‌కు తీసుకెళ్తూ మధ్యలో నిలిచిన క్రేనూ, బకెటూ, కరిగి మరిగిన లావాలో కరగకుండా మిగిలిపోయిన చెత్త. బకెట్‌లోనే గట్టిపడి ఇరుక్కుపోయిన పాత సామాను భాగాలూ, అందులో సగం కరగకుండా మిగిలి ఉన్న ఒక పెద్ద డొమెస్టిక్ ఎల్‌పిజి సిలిండర్ స్పష్టంగా కనిపించాయి. జరిగిందేదో వివరించడానికి అక్కడున్న ఒకరిద్దరు రక్షణ సిబ్బందీ, దళారీగా రూపాంతరం చెందిన యాజమాన్యం నుండి స్వలాభం చూసుకుంటూ బతుకుతున్న ఆ పరిసర బ్రోకర్ ఒకతను. ఇతనే యాజమాన్యపు వకాల్తా పుచ్చుకొని, 'కార్మికుల నిజమైన శత్రువులు మీరే' అని మమ్మల్ని కసురుకుని తన అక్కసు వెళ్లదీసుకున్న వ్యక్తి. వీళ్లను తప్ప మిగతా కార్మికులెవర్నీ మేం కలిసే అవకాశం లేకుండింది. కొన్ని ఫొటోలు తీసుకొని వచ్చేసి స్థానిక ఎస్.ఐ.ని కలిసి కేసు వివరాలు కనుక్కున్నాం. ప్రమాద సంఘటనకు బాధ్యులుగా ముగ్గురు మేనేజర్‌లపై సెక్షన్ 346, 304/ఎ, 337 కేసులు పెట్టామని, అందులో ఇద్దరిని రిమాండ్ చేశామని, ఒక్కరు పరారీలో ఉన్నారనే వివరణ ఎస్.ఐ. ఇచ్చాడు. 13 మంది దుర్మరణం పాలైన ఈ సంఘటన చాలా సీరియస్‌దని, నాన్ బెయిలబుల్ కేసు పెట్టాల్సిన దీనిపై ఒక మామూలు సెక్షన్ 346 బెయిలబుల్ కేసు పెట్టి చేతులు దులుపుకోవడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?

మేము రెండవసారి ఎచ్ఎంటివి బృందంతో కలిసి ఫ్యాక్టరీని సందర్శించడానికి వెళ్లినప్పుడు అనుకోకుండా కొందరు కార్మికుల్ని కలుసుకోగలిగాం. ఒకటో తేది (సెప్టెంబర్ 1) నుండి తెరుచుకోబోతున్న ఫ్యాక్టరీకి సంబంధించిన శుభ్రత పనులన్నీ చేయడంలో నిమగ్నమై ఉన్న యాభై, అరవై మంది యువకార్మికులు కలిశారు.

వాళ్లంతా దిగులు ముఖాలతో తమ సోదర సహచరుల ప్రాణాలను బలిగొన్న రాకాసి కోరల్ని మళ్లీ శుభ్రం చేస్తూ ముస్తాబు చేస్తున్నారు. క్రేన్ల, బకెట్ల కాలిన విద్యుత్తీగలు, ఒలికిన లావా గుట్టల గుర్తులూ అప్పటికే తొలగించబడి చెరిగిపోయాయి. కరిగిన ఇనుప లావాలో కరగక సగం పైకి తేలి కనిపించిన సిలిండరు, పాత సామానుల ఆనవాళ్లేవీ మిగిలి లేవక్కడ. సంఘటనను పట్టిచ్చే ప్రతి చిన్న ఆధారమూ అదృశ్యం చేయబడింది. మొదటిసారి వచ్చినప్పుడు ఇనుప మట్టిలోంచి ఇసుకను ఇనుప రజనును వేరుచేసే పనిలో నిమగ్నమై లావా ఒలికిన సంఘటనలో చెల్లా చెదురైన కార్మికులు వదిలేసిపోయిన జల్లెడ, వడపోసిన ఇనుపరజను, ఎత్తుకోవడానికి సిద్ధం చేస్తున్న నాలుగు నిండు ఇనుప తట్టలు, అవి తలపై మోయడానికి పురితిప్పి చేసుకున్న ప్లాస్టిక్ కవర్ చుట్టలూ ఇప్పుడు లేవక్కడ.

కార్మికుడు దీపక్ భయం భయంగా చెప్పిన మాటల్లో ఘోరం జరిగి పదిహేను రోజులు కావస్తున్నా ఫ్యాక్టరీలో కమ్ముకుపోయిన ఇంకా వీడని కాలిన మాంసపు ముద్దల కంపు వాసన తప్ప, అక్కడ మరే రుజువూ మిగలలేదు. రెండవసారి వెళ్లినప్పుడు కార్మికులతో కలిశాక ఎన్నో ఆసక్తికర విషయాలు తెలిసాయి.

బీహార్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వెల్డర్లు, మెస్సర్లు, క్రేన్ డ్రైవర్లు, ఫర్నేస్ ఆపరేటర్లు, కూలింగ్ టెక్నీషియన్స్, ఎలక్ట్రీషియన్స్‌గా వివిధ విభాగాల్లో పని చేయడానికి వచ్చిన ఆ కార్మికులెవరికీ వారు పనిచేస్తున్న ఊరు షాద్‌నగర్ అని తప్ప అది ఏ జిల్లా, ఏ రాష్ట్రం అనే కనీస వివరాలు కూడా తెలియదని తెలిసి నిర్ఘాంతపోయాం.

భాష తెలియని వాళ్లను, ప్రాంతం కాని వాళ్లను కార్మికులుగా పెట్టుకోవడంలో యాజమాన్యాలకు దోపిడీ చేయడంలో కలిగే సౌలభ్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. అందుకే స్థానికులెవ్వర్నీ కార్మికులుగా తీసుకోరు. ఈ వచ్చిన కార్మికులు కూడా నేరుగా కంపెనీతో సంబంధం కలిగి ఉండరు. అదెట్లా అంటే అవుట్‌సోర్సింగ్, మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఒయు) అనబడే విధానాలకు ఈ దేశ రాజ్యాంగం, ఉన్నత న్యాయస్థానాలూ, చట్ట సభలూ పచ్చజెండా ఊపాక ప్రజల, కష్టజీవుల చెమటా నెత్తురే కాక దేశ సంపద, సార్వభౌమత్వాల దోపిడీకి సకల ద్వారాలూ సగౌరవంగా స్వాగతం పలుకుతున్నాయి. ఇది అర్థం కాకపోతే పాలమూరు కూలీలు దేశం కాని దేశం వలసవెళ్లి దిక్కులేని చావుల పాలై అనాథ శవాలుగా రావడమూ, లేబరు జిల్లా అయిన ఇక్కడికి బతుకు తెరువు కోసం కాంట్రాక్టర్ల మాయాజాలంలో చిక్కి

వచ్చి ప్రాణాలు బలిపెట్టుకుంటున్న కార్మికుల దయనీయ పరిస్థితులు అర్థం కావు.

చివరగా కంపెనీ నుండి వెనుదిరిగి వచ్చే ముందు కార్మికులతో 'అబ్ ఆప్ క్యామాంగ్ రహే హై' అని వాళ్ల భాషలోనే అడిగితే గంపెడు దుఃఖాన్ని గుండెల్లో దాచుకొని వాళ్లన్న మాటలివి: 'క్యా కహెనా సాబ్. హమారీ భీ ఏక్ జిందగీ క్యా...',

'హర్ దిన్ తీన్, తీన్ ఛే కిలోమీటర్ చల్కే హీ ఆనా ఫ్యాక్టరీకో. ఖూన్ పసీనా బన్‌నే..'

'తీన్ చార్ మహినే కోభీ తన్‌ఖా నహీ మిల్తీ...'

'ఆగ్ కీ బారిష్ గిరీ ఉస్ దిన్.. భట్టీపే జిత్నే థే సబ్ కే సబ్ జల్ గయే..'

"దో అడయ్ లాక్ సే జాన్ ఆసక్తీ క్యా! ఓ పరివార్ పే క్యా గుజ్‌రేగా..'

'దస్ లాక్ తో దేనా చాహియే...!'

'ఘర్‌మే ఏక్ కో నౌఖరీ దిలానా..'

'ఫేక్టరీమే సర్కారీ ఖానూన్‌కో జిందా కరానా..'

'ఠేకేదార్ (లేబర్ కాంట్రాక్టర్) కీ జాల్ సే హమే బచాలేనా..'

'ఛే మహినే కామ్‌కే బాద్ పర్మనెంట్ కర్నా..'

'కామ్‌కే జగా పక్కా డ్రెస్, చష్మా, బూట్, గ్లౌజ్ జరూర్ దేనా..'

'హమే కుచ్ హో గయాతో హమారే బీవీ బచ్చోంకా థోడాసా ఖయాల్..'

'బస్ ఇత్నా హీ సాబ్.. ఔర్ క్యా మాంగ్తే..'

"హమారే జిందగీ పే గమ్ ఛాగయీా..'

'ఇత్నా హోగయా, ఇత్నే దిన్ గుజ్‌రే.. కిత్నే లోగ్ ఆయే.. గయే..'

'హఖీఖత్ బతాకే పచ్చారహేహై హం..'

'పంద్రా దిన్‌సే ఫేక్టరీ బంద్ హై.. ఏ దిన్‌కి మజ్దూరీ నహీ మిలేగీ..'

'క్యా ఖాకే జీనా..'

'రూమ్ వాలా కిరాయా పూఛ్తాహై..'

'రేషన్ వాలా పైసేకేలియే డాంట్‌తా హై..'

'ఫస్ట్ ఏయిడ్‌కే బారేమే ఆప్ పూఛ్తే హై ఉస్కా పతాభీ నహీ యహా..'

'క్యా బతానా పరివార్ సే దూర్.. సబ్‌కా దుఖ్ హై యహా..'

'కుచ్ లోగ్ హమారే లాషోపే నోట్ చున్ లేతేహై..'

'హం ఆప్ కే సామ్నే యహా మూ ఖోలేకీ నహీ.. ఉత్నేమే ఫేక్టరీ వాలోనే ఫోన్‌పే డరా రహేహై... సబ్ బోల్నా మనాహై యహా..'

'బారాతో మర్‌గయే.. దో ఘాయల్‌హై ఓభీ బచ్‌తేకీ.. నహీ కీ..'

అంతమంది సహచరుల్ని కోల్పోయాక ఇవీ వారడిగిన డిమాండ్లు ఇవి చాలా సహజమైనవి. పనిలో సౌలభ్యం కోసం విధిగా అడక్కుండానే కల్పించాల్సిన వసతులు. వాళ్లు కంపెనీలో వాటా అడగడం లేదు. వాళ్లు యాజమాన్యంలో భాగస్వామ్యమూ అడగడం లేదు. పనిచేసే చోట పనిచేసేవాళ్లకు పని గంటలు, కాసిన్ని వసతులతో పాటు పనిచేసే వాళ్ల పట్ల కాస్త కనికరమూ, మనుషులుగా ఒక గుర్తింపూ కోరుతున్నారంతే!

మాట్లాడాల్సిన విషయాలు చాలా వరకు మాట్లాడి ఆ కార్మికుల్లో దాగిన భయాల్ని, అనుమానాల్నీ కొంతవరకైనా తీర్చే ప్రయత్నం చేసి, వారి అభిప్రాయాల్ని కూడా వారి మాటల్లోనే విని ధైర్యం చెప్పి తొందర్లో ఒక ప్రత్యక్ష చర్యలో, సభలో మళ్లీ కలుద్దామని సెలవు తీసుకొని ఫ్యాక్టరీ గేటు దాటి వచ్చి ఆటో ఎక్కాం.

ఒక అరగంట గడిచిందో లేదో ఆ ఫ్యాక్టరీ కార్మికులపై యాజమాన్య గూండాల దాడులు. 'వచ్చిన అడ్డమైన వాళ్లతో ఏది పడితే అది వాగుతారా?' అంటూ మాతో మాట్లాడిన వాళ్లందర్నీ ఏరి ఏరి పట్టి పట్టి విపరీతంగా కొట్టి భయభ్రాంతులకు గురిచేసిన విషయం మాకు తెలిసింది. కార్మికులు నిర్ఘాంతపోయారు. 'అయిందా ఆప్ ఆయేంగేతో కౌన్‌భీ మూనా ఖోలేగా' (ఇక మీదట మీరు మరోసారి ఫ్యాక్టరీకొస్తే ఏ ఒక్కరూ నోరు తెరవరు) అని ఖరాఖండిగా తేల్చి చెప్పి ఫోన్ పెట్టేశాడొక కార్మికుడు. కాసేపటికి మళ్లీ సెల్ మోగింది. అదే గొంతు 'ఆప్‌పే భరోసాహై సాబ్. అయిందా ముఝే మేరే నామ్‌సే నహీం.. ఏ దూస్రే నామ్‌సే పుకార్నా.. ఆప్ లోగోం సేహీ కుచ్ హోగా' అంటూ గద్గద స్వరంతో.. 'ఆప్ లోగ్ ఫిర్ కబ్ ఆయేగే?' అని లోగొంతుతో అడిగి నా కళ్లను చెమర్చాడు వినోద్ సింగ్.

(రచయిత జిల్లా కన్వీనర్,
పాలమూరు అధ్యయన వేదిక, మహబూబ్‌నగర్)

'కోల్‌గేట్' కుంభకోణంలో అందరూ దొంగలే

***కాగ్ నివేదిక వివాదాస్పద నివేదిక అనీ, లోపాలతో కూడుకున్నదనీ స్వయంగా ప్రధాని వ్యాఖ్యానించడం బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చడానికే అంటున్నారు* పి.వి. రమణ**

మన దేశ పాలకుల నూతన ఆర్థిక విధానాల ఫలితంగా రోజుకో కుంభకోణం బయటపడుతోంది. బహుళజాతి సంస్థలు, బడా పెట్టుబడిదార్ల సేవకులుగా దేశ సహజ వనరుల్ని కొల్లగొడుతున్నారు. తద్వారా ప్రజల జీవితాల్ని సర్వనాశనం చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి సంక్షోభంలో కూరుకుపోయింది. కామన్‌వెల్త్ గేమ్స్ కుంభకోణంలో 70 వేల కోట్ల రూపాయలు, 2జీ స్పెక్ట్రం కుంభకోణంలో లక్షా 76 వేల కోట్ల రూపాయలు, ఆదర్శ్ కుంభకోణంలో వెయ్యి కోట్ల రూపాయలు, ఇస్రో యాంత్రిక్స్ దేవాస్ కుంభకోణంలో 2 లక్షల కోట్ల రూపాయలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నల్లబంగారంగా పిలిచే బొగ్గు కుంభకోణంలో 1.86 లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. ఇదంతా భారత ప్రజల ఆస్తే. భావితరాల సంపదను దుర్వినియోగం చేసే హక్కు వీళ్లకెక్కడిదని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

మన దేశంలో 1990ల నుండి ప్రారంభించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల పర్యవసానమే దేశ సంపదైన బొగ్గు గనుల్ని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం. ప్రాజెక్టుల నిర్వహణలో ఎటువంటి అనుభవం, సమగ్రమైన దృష్టిగాని, అవసరమైన ఆర్థిక పరిపుష్టి లేని కంపెనీలకు గనులు కేటాయించారు. 2004 నుండి 2009 వరకు కోట్లాది టన్నుల బొగ్గు నిల్వలున్న 76 గనులను కంపెనీలకు కేటాయిస్తే వాటిలో 80 శాతం ఇప్పటికీ ఎటువంటి ప్రాజెక్టులు ప్రారంభించలేదు. చాలా కంపెనీలు వారికి గనులు కేటాయించిన వెంటనే లాభాలకు ఇతర కంపెనీలకు అమ్మేసారు. విద్యుత్ ప్రాజెక్ట్‌లు కడతామని, హామీ ఇచ్చిన బడా కంపెనీలు మోసం చెయ్యడం వల్లనే, జూలై నెలలో రెండుసార్లు మొత్తం దేశంలో కరెంటు పోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్‌లు 66 శాతం ఉన్నాయి. దేశంలో 2,85,863 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వులున్నట్లు అంచనా.

1973లో బొగ్గు గనులు జాతీయం చేసినపుడు, వాటిని ప్రభుత్వ రంగ పరిశ్రమలకే కేటాయించాలని నిర్ణయించారు. తర్వాత ఆ చట్టాన్ని 1976, 1993, 1996లలో సవరించి కాప్టివ్ మైన్స్ పేరిట, స్టీలు, సిమెంట్, విద్యుత్‌లను ఉత్పత్తి చేసే ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఖనిజ సంపదను, సహజ వనరులను సంవత్సర వారీ లీజుకిస్తారు గానీ మొత్తం సమయ పరిమితి లేకుండా ఇవ్వడం జరగదు.

ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ దేశంలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో 38 శాతం ఉత్పత్తి చేస్తోంది. '2012 నాటికి అందరికీ విద్యుత్తు' అని ప్రకటించిన ప్రభుత్వం, 60 బిలియన్ డాలర్లు పెట్టుబడితో విద్యుత్ పరిశ్రమల్ని ఏర్పాటు చేయమని ప్రైవేట్ పెట్టుబడిదారుల్ని ఆహ్వానించి, ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒకవైపు కాప్టివ్ మైన్స్ పొందిన కంపెనీలు అసలు ఉత్పత్తి చేయకుండా ఉన్న పరిస్థితి ఉంటే, మరోవైపు కొన్ని కంపెనీలకు బొగ్గును విదేశాల నుండి అధిక ధరలతో దిగుమతి చేసుకొని సరఫరా చేయవలసి వస్తోంది. కోల్ ఇండియా బొగ్గు టన్ను ధర రు. 1400 ఉంటే కాప్టివ్ మైన్స్‌గా పొందిన ప్రైవేట్ కంపెనీలకు రు. 700లకే వస్తుంది. బొగ్గు గనుల్ని పొందిన కంపెనీలు వాటిని అమ్మడానికి వీలు లేదు కనుక, కంపెనీ యాజమాన్యాన్ని వేరే కంపెనీకి గనులతో సహా అమ్మేస్తున్నారు. యాజమాన్యం మార్పు గురించి గానీ, నిర్ణీత సమయంలో ప్రాజెక్టులు పూర్తి చెయ్యాలని గానీ నిబంధలేవీ లేవు. చాలా కంపెనీలు గనులు కేటాయించినా ప్రాజెక్టులు ప్రారంభించలేదు గానీ, వాటిని చూపించి తమ కంపెనీ షేర్ల ధరలను స్టాక్ మార్కెట్‌లో పెంచేసి కోట్లాది రూపాయలు సంపాదించాయి.

ఎన్‌డిఎ హయాంలో టెలికాం విషయంలో ముందు వచ్చిన వారికి ముందు కేటాయింపు అనే పద్ధతి ప్రారంభించారు. వారి హయాంలోనే బొగ్గు గనుల కేటాయింపులో స్క్రీనింగ్ పద్ధతి మొదలుపెట్టారు. దానినే యుపిఎ ప్రభుత్వం కొనసాగించింది. అంటే రెండు కూటములకూ తేడా లేదని అర్థమవుతుంది.

అక్టోబర్ 14, 2004న ప్రధాని మన్మోహన్ సింగ్ అధ్యక్షత వహించిన సమావేశంలో భవిష్యత్‌లో బొగ్గు గనుల కేటాయింపులన్నీ వేలం పాట ద్వారా నిర్వహించాలని ప్రతిపాదించారు. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) 1957 చట్టాన్ని సవరించి, బొగ్గుతో సహా, సహజ వనరులన్నీ వేలం పాట ద్వారా కేటాయించాలని ఏప్రిల్ 7, 2006న నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాన్ని అమలు జరగకుండా అప్పటి మంత్రులు సొరేన్ బోస్, దాసరి నారాయణరావులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. చివరకు జూలై 17, 2010న పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. అంటే ప్రతిపాదన ఆమోదం పొందడానికి ఆరు సంవత్సరాలు పట్టింది. కాని ఈలోపునే 2006లో 17,792 మిలియన్ టన్నుల నిల్వలున్న 53 గనులు, 2007లో 11,862 మిలియన్ టన్నుల నిల్వలతో 52 గనులు, 2008లో 3,550 మిలియన్ టన్నుల నిల్వలతో 24 బొగ్గు గనులు, 2009లో, 6,893 మిలియన్ టన్నుల నిల్వలతో 16 గనులు కేటాయింపులు జరిగిపోయాయి.

2జి స్కాం బద్దలయిన వెంటనే జనవరి 2011లో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ నాయకత్వంలో 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్'ను (జిఓఎం) ఏర్పాటు చేసి అవినీతిని ఎదుర్కోవడానికి

మార్గాలు వెతకమని ఆదేశించారు. ఆ కమిటీ తిరిగి మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి అశోక్ చావ్లా అధ్యక్షతన అన్ని మంత్రిత్వ శాఖల నుండి తీసిన పదిహేను మంది కార్యదర్శులతో ఒక కమిటీ వేసి, సహజ వనరుల ఉపయోగంలో పారదర్శకత, స్థిర విధానాల గురించి సూచనలు చెయ్యాల్సిందిగా కోరారు. జూన్ 2, 2011న చావ్లా కమిటీ తన నివేదికను ప్రధానికి సమర్పించింది. దానిలో ఖనిజాలు, పెట్రోలియం, బొగ్గు, సహజ వాయువు, స్పెక్ట్రం, భూమి విషయంలో ప్రస్తుత విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయని తేల్చింది. ఏ మాత్రం పారదర్శకత లేకుండా, విధానాలను తారుమారు చేయడానికి అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. బహిరంగంగా, పారదర్శకతతో వేలం పాటల పద్ధతి ద్వారా కేటాయింపులు జరగాలని సూచించారు. మే 25, 2012న కమిటీ సమర్పించిన ఒక సంవత్సరం తర్వాత, మంత్రులందరినీ సమావేశ పరిచి ప్రధాని రిపోర్టుపై చర్చలు జరిపి చివరకు 81 సిఫార్సులలో 69ని ఆమోదించి, 11ని ఇంకా పరిశీలించాలని ప్రకటించారు.

ఇంత తతంగం జరిగినా నేటి వరకు బొగ్గు గనులు వేలం పాట విధానం ప్రారంభమే కాలేదు. పైగా కాగ్ బయటపెట్టిన అవకతవల్ని పరిశీలించడానికి జోహ్రా ఛటర్జీ నాయకత్వాన ఇంటర్ మినిస్టరీ వార్ గ్రూప్ (ఐఎంజి) ఏర్పాటు చేసారు. గనులు కేటాయింపు జరిగినా వాటిని అభివృద్ధి చేయడంలో చేసిన ఆలస్యానికి గల కారణాలపై వివాదంలో ఉన్న 58 బొగ్గు గనుల వ్యవహారంలో 29 బొగ్గు గనులు పొందిన ప్రైవేట్ కంపెనీలపై పరిశీలన జరిపారు. వీటిలో, టాటా స్టీల్, రిలయన్స్ పవర్, జె.ఎన్. డబ్ల్యు, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, కేశోరాం ఇండస్ట్రీస్, ఐఎస్‌టి స్టీల్ అండ్ పవర్, ఎస్‌కెఎస్ ఇస్పాత్ అండ్ పవర్, బీహార్ స్పాంజ్ ఐరన్ లాంటి బడా కంపెనీలున్నాయి.

ఈరోజు ప్రతిపక్ష పార్టీలన్నీ పాలకపార్టీలపై బొగ్గు కుంభకోణంపై తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నాయి. కాని బొగ్గు గనులు వేలం వేస్తే రాష్ట్రాలకుండే హక్కులు పోతాయని అప్పటి రాజస్థాన్ ముఖ్యమంత్రి వసంధరా రాజే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, పశ్చిమ బెంగాల్ కార్యదర్శులు ప్రభుత్వానికి ఉత్తరాలు రాశారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జిందాల్ స్టీల్ ప్లాంట్ అండ్ పవర్ కంపెనీకి బొగ్గు గనిని కేటాయించమని స్వయంగా బొగ్గు శాఖా మంత్రిని కోరారు.

ప్రభుత్వం నుండి కారు చవగ్గా కాప్టివ్ బొగ్గు గనుల్ని పొందిన బడా కంపెనీలు, రుంగ్టా ప్రాజెక్టు లిమిటెడ్, కోస్టి స్టీల్ లిమిటెడ్, గుజరాత్ అంబుజా సిమెంట్ లిమిటెడ్, సెంచరీ టెక్స్‌టైల్స్, దారివాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, దాల్మియా సిమెంట్ లిమిటెడ్, జె అండ్ కె సిమెంట్ లిమిటెడ్, బిర్లా కార్పొరేషన్, బెనాని సిమెంట్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, భూషణ్ స్టీల్ లిమిటెడ్ లాంటివి చాలా ఉన్నాయి. గనులు పొంది సంవత్సరాలు గడిచినా వీరి ప్రాజెక్టులలో ఎటువంటి ప్రగతీ లేదు.

అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ నిర్వహిస్తున్న 3960 మెగావాట్ల ససాన్ విద్యుత్ ప్రాజెక్టికి మొదట రెండు బొగ్గు గనులు, తరువాత మరొకటి కేటాయించారు. ఈ గనుల నుండి పవర్ ప్రాజెక్ట్‌కు బొగ్గు సరఫరా జరగాలి. కాని మధ్యప్రదేశ్, చిత్రంగిలో అదే కంపెనీ నిర్వహిస్తున్న మరో విద్యుత్ ప్రాజెక్టుకు ఈ గనుల నుండి బొగ్గును వినియోగిస్తున్నారు. కాంట్రాక్టులో ఈ విషయం లేదు. దీనిపై టాటా పవర్ కంపెనీ సుప్రీంకోర్టులో కేసు వేసింది. ససాన్ మైన్స్ 70 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలతో సంవత్సరానికి 2.5 కోట్ల టన్నులు ఉత్పత్తిని ఇవ్వగల సామర్థ్యంతో ఉన్నాయి.

అంబానీకే చెందిన టిలియం ప్రాజెక్ట్‌కు 130 కోట్ల టన్నుల నిల్వలతో సంవత్సరానికి 4 కోట్ల టన్నుల ఉత్పత్తిని చేయగల 2 కాప్టివ్ మైన్స్‌ని కేటాయించారు. రిలయన్స్ పవర్ వెబ్‌సైట్‌లో 'రోజుకు 6.5 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తితో ససాన్ / టిలియం విద్యుత్ ప్రాజెక్టులు, 16,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగలవని' ప్రచారం చేస్తున్నారు. కాని నిజానికి ఆ రెండు విద్యుత్ ప్రాజెక్టుల సామర్థ్యం 7,960 మెగావాట్లు మాత్రమే. దీని వలన కార్పొరేట్ సంస్థలు అబద్ధాలు చెప్పి ప్రపంచాన్ని ఎలా మోసం చేస్తున్నాయో తెలుస్తుంది.

కేంద్ర టూరిజం మంత్రి సుభోద్‌కాంత్ సహాయ్ సహకారంతో ఎస్‌కెఎస్ ఇస్పాత్ అండ్ పవర్ లిమిటెడ్ కంపెనీ బొగ్గు గనుల్ని పొందింది. వెయ్యి మెగావాట్ల సంపూర్ణ విద్యుత్, స్టీల్ ప్లాంట్ కోసం గనులు కేటాయింపు జరిగింది. కాని అక్కడ కంపెనీ కేవలం 650 మెగావాట్ల ప్రాజెక్ట్‌నే నిర్మిస్తుంది.

బిజెపికి అనుకూలంగా ఉన్న జెపి అగర్వాల్ సోదరుడు విపి అగర్వాల్‌కు చెందిన ప్రకాష్ ఇండస్ట్రీస్‌కు 2010లో బొగ్గు గనిని కేటాయించారు. ఈ కంపెనీపై మోసం, ఫోర్జరీ, అధికార్లకు లంచమివ్వడం లాంటి నేరాలపై సిబిఐ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది.

బిజెపి అధ్యక్షుడు నితిన్ గడ్కరీ సహాయకుడు అజయ్ సంబాటి ఎస్‌ఎంఎస్ ఇండస్ట్రీస్ అధినేత. ఈయనకి ఛాత్‌గావ్ బొగ్గు గనుల్ని కేటాయించారు. కాంగ్రెస్ ఎంపి విజయదర్దా సోదరుడు, మహారాష్ట్ర మంత్రి రాజేంద్ర దర్దా సహకారంతో అతని కుమారుడు దేవేంద్ర దర్దాకు చెందిన జెఎల్‌డి యవత్‌మాల్ ఎనర్జీ లిమిటెడ్‌కు బొగ్గు గనుల్ని కేటాయించారు. ఆ కంపెనీ యవత్‌మాల్‌లో విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మించి ఆ ప్రాంత ప్రజలకు ఉచిత విద్యుత్ ఇస్తామనే హామీ ఇచ్చింది. కాని ఇంతవరకు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాలేదు. తండ్రీ కొడుకులిద్దరి పైనా సిబిఐ కేసులు నమోదు చేసింది.

గతంలో బిజెపి టికెట్‌పై పోటీ చేసిన నీనా భర్త వికె సింగ్‌కు చెందిన నవభారత్ పవర్ ప్రాజెక్ట్‌కు ఒడిశాలో గనులు కేటాయింపు జరిగింది. ఈ కంపెనీపైనా సిబిఐ కేసు నడుస్తోంది.

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడాకు సంబంధించిన విని స్టీల్ కంపెనీకు కూడా గనులు కేటాయించిన వెంటనే కంపెనీ యాజమాన్యం మారిపోయింది. దీనిపై కూడా సిబిఐ కేసు నమోదు చేసింది.

ఒడిశాలో రెండు బొగ్గు గనుల్ని పొందిన ఒకే కంపెనీ తన వాటాను ఎస్సార్ పవర్‌కు యాభై కోట్ల రూపాయలకు అమ్మేసింది.

కలకత్తాకు చెందిన జన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాపిటల్ లిమిటెడ్ కంపెనీ, గతంలో తనకు కేటాయించిన ఐదు బొగ్గు గనుల్ని గురించి సమాచారాన్ని దాచేసి తప్పుడు సమాచారాన్ని సమర్పించినట్లు తేలింది.

నాగ్‌పూర్‌లో ఉన్న ఎఎంఆర్ ఐరన్ అండ్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఇప్పటికే తొమ్మిది బొగ్గు గనులు కేటాయింపబడినా వాటిలో ఇంతవరకు తవ్వకాలు ప్రారంభం కాలేదు గాని, మరి కొన్ని గనుల కోసం ప్రయత్నిస్తున్నారు.

మూడు కంపెనీలకు బొగ్గు గనులు కేటాయించిన వెంటనే మేనేజ్‌మెంట్లు మారిపోయాయని, వాటిలో ఇంతవరకూ ఆరు సంవత్సరాలు గడిచినా ప్రాజెక్టులు ప్రారంభమే కాలేదని పార్లమెంటరీ కమిటీ సభ్యుడు హన్స్‌రాజ్ అహిర్ చెప్పారు.

లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు, మాజీ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రి ప్రేమ్‌చంద్ గుప్త 2007లో ఒకటి, 2009లో మరొకటి బొగ్గు గనుల్ని పొందారు. ఇస్పాత్ అల్లాయ్ లిమిటెడ్ బొగ్గు గనుల్ని పొందాక రెండు రూపాయలు ఉన్న తమ కంపెనీ షేర్ ధరను ఏకంగా రు. 628కి పెంచి అమ్మేసింది. అసెరా బంక్ పవర్ లిమిటెడ్ రు. 10 ఉండే షేర్ ధరను రు. 8,885కు అమ్మేసి కోట్ల రూపాయల లాభాలు సంపాదించారు.

అనేక బడా కార్పొరేట్ సంస్థలపై సిబిఐ దాడులు జరిపింది. అత్యధిక కేసుల్లో తప్పుడు సమాచారం, దొంగ లెక్కలు, ప్రాజెక్టుల సామర్థ్యంపై తప్పుడు వివరాలు లాంటివి ఉన్నాయని తేలింది.

కాగ్ తన ప్రాథమిక నివేదికలో 'పోటీ ప్రపంచంలో తక్కువ ధరలకు ప్రభుత్వం నుండి బొగ్గు గనులను పొందిన ప్రైవేట్ పెట్టుబడిదారులు ఒప్పందాల ప్రకారం ప్రజలకు చెందాల్సిన వాటాలను అందచేయడంలో ముందుకురారు' అని చెప్పడం జరుగుతున్న సంఘటనలకు అద్దం పట్టేటట్లుగా ఉంది. 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' ఈ మధ్యనే బడా సిమెంట్ కంపెనీలయిన ఎసిసి, అంబుజా సిమెంట్స్, అల్ట్రాటెక్, జెపి సిమెంట్స్ లాంటి పదకొండు సంస్థల మీద ధరలు పెంచి అమ్మారనే ఆరోపణలతో 6307 కోట్ల రూపాయల జరిమానా విధించడం దీనికి పెద్ద ఉదాహరణ.

బొగ్గు గనులు వేలంగాని వేసి ఉంటే విద్యుత్, సిమెంట్, స్టీల్ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై తీవ్ర భారం పడి ఉండేదని ప్రధానమంత్రి ఆఫీసు మంత్రి నారాయణ స్వామి ప్రకటించడం, ఎవరి తరఫు నుండి మాట్లాడుతున్నాడో వేరే చెప్పనక్కర్లేదు.

అశోక్ చావ్లా కమిటీ దేశం మొత్తం మీద ఉన్న సహజ వనరులన్నింటినీ వివరంగా క్రోడీకరించి 'మాప్' తయారు చేయ్యాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరితే ఆ పని ప్రభుత్వ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకి శక్తికి మించిన పని అని జవాబిచ్చింది. ఎందుకంటే వివరాలు స్పష్టంగా ఉంటే గాలి జనార్దనరావు లాంటి కార్పొరేట్ దొంగలు దొరికిపోతారు కాబట్టి వారిని రక్షించడానికేనని వేరే చెప్పనక్కర్లేదు.

విచ్చలవిడిగా, మోసపూరితంగా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన 'కోల్‌గేట్' కుంభకోణాన్ని బయటపెట్టిన కాగ్ నివేదికను అభినందించాల్సింది పోయి, మన ప్రధాని మన్మోహన్‌సింగ్ 'అది లోపంతో కూడుకున్న, వివాదాస్పద నివేదిక' అనడం బడా కార్పొరేట్ సంస్థలకు అభయహస్తం ఇవ్వడమేనని అర్థమవుతుంది. ఈ సందర్భంగా 1952లో ఇలాగే కాగ్ నివేదికపై పాలక సభ్యులు తీవ్ర విమర్శలు చేసారు. అప్పటి ప్రధాని నెహ్రూ 'కాగ్ ప్రభుత్వానికి జవాబు దారీకాదు. తమ నివేదికల్లో ప్రభుత్వాల్ని విమర్శించే హక్కు వారికి ఉంది. పార్లమెంట్‌లో కాగ్‌ను విమర్శిస్తే ఎటువంటి భయంగాని, ఆపేక్ష గాని చూపించకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వహించడానికి, ఆ పదవికి ఉన్న ప్రత్యేక హోదాకి విఘాతం కల్పించిన వారమవుతాం' అన్నారు. దీన్ని బట్టి నేటి ప్రభుత్వాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థమవుతుంది.

సామ్రాజ్యవాద విధానాలకు అనుకూలంగా నడుస్తున్న మన పాలకులు కార్పొరేట్ హౌస్‌ల ధన కౌగిలిలో పరవశిస్తున్నారు. ఉదాహరణకు అంతర్జాతీయ మైనింగ్ కంపెనీ 'వేదాంత' తన 2011-12 వార్షిక నివేదిక చూద్దాం. గత మూడేళ్లలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు 31 కోట్ల రూపాయలను విరాళాలుగా ఇచ్చినట్లు పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు జరిగిన 2009-10 లోనే 20 కోట్ల రూపాయలు ఇచ్చారు. 'భారత్‌లో రాజకీయ ప్రక్రియకు ఇచ్చే మద్దతు ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చెయ్యడానికి తోడ్పడుతుంది. ప్రోత్సాహకరంగా ఉంటుంది' అని కూడా పేర్కొనడం, ఇంకా నేటి ప్రజాస్వామ్యంపై ఎవరికయినా భ్రమలుంటే తీరిపోక తప్పదు. ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం వివిధ కంపెనీలు రాజకీయ పార్టీలన్నింటికీ 4,400 కోట్ల రూపాయలు విరాళాలుగా ఇచ్చాయి. వాటిలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బిఎస్‌పి, ఎస్‌పి, ఎన్‌సిపి, సిపిఎంలు ఉన్నాయి. అత్యధిక శాతం రు. 1660 కోట్లు కాంగ్రెస్‌కే లభించాయి.

కార్పొరేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు వాటి ఖర్చుగానే పరిగణించే నిబంధనను కంపెనీల బిల్లులో ఇటీవలే ప్రవేశపెట్టారు. విరాళాలు తీసుకున్న పార్టీలు కార్పొరేట్ కంపెనీల కొమ్ము కాస్తాయి గాని ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవని వేరే చెప్పనక్కర్లేదు. మొత్తం మీద 'కోల్‌గేట్' కుంభకోణం ద్వారా పాలక, ప్రతిపక్షాలనే తేడా లేకుండా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎంత భ్రష్టు పట్టిపోయిందో తేటతెల్లమయింది.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

వీక్షణం చందాదారులకు విజ్ఞప్తి : *కొద్ది మంది చందాదారులు మాకు కాపీ అందలేదు, ఫలాన నెల సంచిక మాకు పంపగలరని రెండు, మూడు నెలల తరువాత మమ్మల్ని అడుగుతున్నారు. ఏ నెల పత్రిక ఆ నెల అందకపోతే ఆనెలాఖరులోపు మాత్రమే మమ్మల్ని కాపీ కోసం సంప్రదించవచ్చు. ఉదాహరణకు ఆగస్ట్ నెల సంచిక అందకపోతే ఆగస్ట్ నెలాఖరులోపే అడిగి తెప్పించుకోగలరు. గడిచి పోయిన నెలల కాపీలు మా వద్ద అదనంగా ఉండవు. ఇది దృష్టిలో ఉంచుకుని మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాం. అవకాశం ఉన్నవారు పాత సంచికలకోసం www.veekshanam.wordpress.comలో చూడగలరు.*

దోపిడీకి గొడుగు పడుతున్న ప్రధాని

పిడికెడు మంది పెట్టుబడిదారులూ, పాలకులూ చేస్తున్న లక్షల కోట్ల రూపాయల అవినీతికి కోట్లాది మంది దేశ సామాన్య ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

మన దేశంలో నూతన ఆర్థిక విధానాలు మొదలైన తర్వాత, ఆర్థికాభివృద్ధికై కార్పొరేట్ పెట్టుబడికి అగ్రతాంబూలం ఇవ్వడం జరిగింది. విదేశీ, స్వదేశీ పెట్టుబడిదార్లకు స్వేచ్ఛను ప్రసాదించిన తర్వాత అవినీతి అనే మహమ్మారి అందలమెక్కింది. అవినీతి అనేది పెట్టుబడిదారీ విధాన అంతర్గత లక్షణాల్లో ఒకటి. ఆర్థికాభివృద్ధికి, అవినీతికి మధ్య అనులోమ సంబంధం ఉందని గత రెండు దశాబ్దాలుగా చోటు చేసుకున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. దేశంలో పెరిగిన సంపద కొద్దిమంది బిలియనీర్ల పంచన చేరింది. చట్ట పరిధిలోనూ, చట్టవ్యతిరేకంగానూ అక్రమంగా సంపద కూడబెట్టుకున్నారని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలే తేటతెల్లంజేస్తున్నాయి. అవినీతి, కుంభకోణాల గురించిన చర్చ ఈ మధ్యకాలంలో తరచూ పత్రికల్లో చూస్తున్నాం. అవినీతి వ్యతిరేక ఆందోళనలు చూస్తున్నాం. కొంతమంది కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో న్యాయవ్యవస్థ, మీడియా కూడా అవినీతి ఊబిలో చిక్కుకున్న దాఖలాలు కన్పిస్తున్నాయి. రాజ్యాంగ రీత్యాను లేక చట్టరీత్యాను సంక్రమించిన అధికారాన్ని, పదవిని అడ్డం పెట్టుకుని నియమ నిబంధనలను తుంగలోతొక్కి ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడడమే కాకుండా బంధుమిత్రులకు ప్రజాధనాన్ని, సహజ వనరులను అప్పనంగా కట్టబెడుతున్నారు. ఇదంతా సరళీకరణ విధానాల దుష్ఫలితమైన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు విషవృక్ష ఫలం. దొరికితే దొంగలుగా లేకపోతే దొరలుగా చెలామణీ అవుతున్న తీరును ఈ మధ్య దేశంలో జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి.

కుంభకోణాల్లో వెలుగు చూసిన సొమ్ము తింటుందీ, తిన్నదీ, వేళ్ల మీద లెక్కించదగిన కొన్ని కుటుంబాలు అయితే, వాటి మూలంగా నష్టపోతున్నది మొత్తం సమాజం. ఈ మధ్యకాలంలోనే ఇంత భారీ కుంభకోణాలు ఎందుకు జరుగుతున్నాయి? విజ్ఞుడైన ప్రతి పౌరుడు ప్రశ్నించుకోవాలి. వాటి మూలాలను గురించి ఆలోచించాలి. మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ విధానం 'లాభం' చుట్టూ తిరుగుతుంది. దానికోసం సకల సాధనాలు ప్రయోగిస్తుంది. ఆధునిక ద్రవ్యపెట్టుబడి గతంలో ఉపయోగించిన సాంప్రదాయ పద్ధతులను అవసరమనుకుంటే పక్కన పెడుతుంది. రాజ్య వ్యవస్థను, పాలకవర్గాలను తన కనుసన్నల్లో మెలిగేటట్లు చట్రాలను బిగిస్తుంది. ఒకప్పుడు రాజ్య వ్యవస్థను ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనవద్దని శాసించగలదు, మరొకప్పుడు తన కనుకూలంగా కొన్ని కార్యకలాపాల్లో మాత్రమే పాల్గొనాలనే నియమాలను ఏర్పరచగలదు. తన సంపద పెరగడానికి రాజ్యవ్యవస్థ మెడలు వంచి తన అడుగులకు మడుగులొత్తించగలదు. అదే ఆధునిక ద్రవ్య పెట్టుబడిదారీ విధాన పరమశక్తి, రహస్యం. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వహిస్తున్న ప్రస్తుత సమయంలో దాని ఆశ్రితుల మాయోపాయాలు మేలిముసుగు కార్యకలాపాలు, జరుగుతున్న కుంభకోణాలకు అవినీతిమయ అనార్జిత ఆదాయాలకు ప్రబల తార్కాణాలు.

యుపిఎ ప్రభుత్వంలోని అనేక మంది మంత్రులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత నాలుగేళ్ల కాలంలో 80 పైగా అవినీతి కార్యకలాపాలు జరిగాయి. వీటన్నింటి విలువ ఎన్ని లక్షల కోట్లు ఉంటుందో అంచనా వేయలేం. అంచనా వేయగల్గిందల్లా దేశం తీవ్ర స్థాయిలో దోపిడీకి గురవుతుందని మాత్రమే. 2జి స్పెక్ట్రమ్, కామన్ వెల్త్ గేమ్స్, ఇస్రో ఆంత్రిక్స్, ఢిల్లీ ఎయిర్ పోర్టులో ప్రైవేటు భాగస్వామ్యం, అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాటు ఇట్లా అనేక కుంభకోణాలు బయటపడ్డాయి. ఇప్పుడు బొగ్గు క్షేత్రాల కేటాయింపులో ప్రధానిపైనే అనుమానపు నీలినీడలు ప్రసరించాయి. 2006 నుండి 2009 వరకు బొగ్గు గనుల శాఖ ప్రధాని మన్మోహన్ చేతిలోనే ఉంది. కనుక ఆయన వ్యక్తిగతంగా ఇందుకు బాధ్యత వహించవల్సి ఉంటుంది. దీంతో పాలన వ్యవస్థ మీదనే ప్రజలు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ఈ అవినీతి చెదలు కీడు చేస్తాయనే ఆందోళన మేధావులకు కలుగుతుంది. ప్రపంచీకరణ విధానాల వల్ల ప్రకృతి వనరులు, సామాజిక వనరులపై కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యం నెలకొనే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2జి స్పెక్ట్రం విషయంలో పోటీదారులకు తగినంత సమయం ఇవ్వలేదని టెలికం శాఖ అక్రమంగా కేటాయించిన 122 లైసెన్సులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఈ మేరకు కేంద్రం అధికారిక ప్రకటన జారీ చేయడం గమనార్హం. అరుదైన ప్రకృతి వనరులను ఇష్టారీతిన కాకుండా వేలం ద్వారా పారదర్శకంగా కేటాయించాలని సుప్రీంకోర్టు ఆ రోజు తన తీర్పులో స్పష్టంగా చెప్పింది. కోర్టు తీర్పు కోణంలోనే కాగ్ నివేదిక బొగ్గు క్షేత్రాలను కేటాయించిన విధానాన్ని తప్పు పట్టింది.

ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునికీకరణ, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య ఒప్పందం అమలు తీరును కాగ్ తప్పుపట్టింది. విమానాశ్రయానికి కేటాయించిన 4800 ఎకరాలలో 240 ఎకరాలను షాపులు, మాల్స్ వంటి పూర్తి వాణిజ్య అవసరాలకు వాడుకోవచ్చని కన్సార్షియానికి అనుమతి ఇవ్వడాన్ని కాగ్ తప్పుపట్టింది. ఈ భూమిని వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగిస్తే రు. 1,63,557 కోట్ల మేరకు ఆదాయం వస్తుందని, అందులో డిఐఎల్‌కు రు. 88,337 కోట్ల మేరకు లబ్ధి కలుగుతుందని అంచనా కట్టింది. ఈ భూమికి

జీఎంఆర్ భాగస్వామ్య సంస్థ ఏడాదికి వంద రూపాయల చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన 58 ఏళ్ల పాటు కేటాయించడం జరిగింది. మధ్యప్రదేశ్‌లోని సాసన్‌లో రిలయన్స్ పవర్ లిమిటెడ్‌కు కేటాయించిన గనుల నుంచి వెలికితీసే బొగ్గును తనకు చెందిన మరో లాభదాయకమైన విద్యుత్ ప్లాంటుకు తరలించేందుకు కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా అనుమతించడాన్ని కాగ్ తప్పుపట్టింది. దీంతో అనిల్ అంబానికి 29,033 కోట్ల రూపాయల మేరకు లబ్ధి కలిగిందని కాగ్ అంచనా కట్టింది.

బొగ్గు అవసరాలను, దాని లభ్యతను దృష్టిలో ఉంచుకుని 1973లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ బొగ్గు గనులను జాతీయం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం దీనికి రెండు సవరణలు చేసింది. ఇనుము, ఉక్కు ఉత్పత్తిలో ఉన్న ప్రైవేటు కంపెనీలకు క్యాప్టివ్ మైనింగ్‌కు అనుమతి ఇవ్వడం ఒకటైతే, రైలు రవాణా, ఆర్థిక అభివృద్ధి అవసరం లేని విధంగా ప్రైవేటు పార్టీలకు సబ్ లీజులకు ఇవ్వడం మరొకటి. 1993లో విద్యుత్ రంగానికి బొగ్గు సెక్టార్‌ను తెరువగా... 1996లో సిమెంట్ పరిశ్రమలకు అనుమతిచ్చారు. రానురాను దేశంలో బొగ్గు ప్రాధాన్యం పెరిగిపోయింది. విద్యుత్ ఉత్పత్తికి జల, పవన, సౌర తదితర మార్గాలు ఉన్నా, బొగ్గు ఉపయోగమే కీలకంగా మారింది. ప్రపంచంలో ఇంధన ఉత్పత్తిలో భారత్ 2.3 శాతానికి పరిమితం కాగా వాడకంలో మాత్రం 3.3 శాతం వాటాతో కొనసాగుతోంది. ఇంధనానికి ఉన్న డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం మరింతగా పెరిగే అవకాశం ఉంది. 2030 నాటికి 3వ అతిపెద్ద ఇంధన వినియోగదారుగా ఇండియా నిలుస్తుందని పలు సంస్థలు అంచనా వేశాయి. దేశంలో 2010-11లో బొగ్గు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య వ్యత్యాసం 69 మిలియన్ టన్నులుగా ఉంది.

2005-2008 మధ్య మొత్తం 142 బొగ్గు బ్లాకులకు గాను 57 బ్లాకులను ప్రైవేటు పార్టీలకు కేటాయించారు. మిగిలినవి ప్రభుత్వ సంస్థలకు అప్పగించారు. ఇక్కడే ప్రైవేటు కంపెనీలు అక్రమాల్లో తమ విశ్వరూపం ప్రదర్శించాయి. ప్రభుత్వం కూడా వారికి దాసోహమన్నది. ఫలితంగానే పోటీ బిడ్డింగ్ ప్రక్రియ గంగలో కలిసిపోయింది. మరోవైపు ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన బ్లాకుల్లో 51 శాతం ప్రభుత్వానికి ఉంచుతూ 49 శాతం ఈక్విటీలను కార్పొరేట్ దిగ్గజాలు కైవసం చేసుకున్నాయి. ఈ బొగ్గు తవ్వకాలకు గాను సర్కారుకు సదరు సంస్థలు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలైన తతంగం నడిచింది. సర్కారుకు చెల్లించే రాయల్టీని మించిన స్థాయిలో అదనపు రాయల్టీని ప్రైవేటు కంపెనీలు తమ సబ్ లీజుల ద్వారా సంపాదించుకున్నాయి. విచ్చలవిడిగా బ్లాకుల కేటాయింపు జరిగితే అక్రమాలకు తెర లేస్తుందని ప్రభుత్వం 2004లోనే గుర్తించింది. ప్రధాని నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ ద్వారా నామినేషన్ పద్ధతిలో బొగ్గు గనులను కేటాయించే పద్ధతి కాకుండా వేలం వేయడం ద్వారా కేటాయించడానికి 2004 అక్టోబర్ 14న ప్రధాని పర్యవేక్షణలో జరిగిన సమావేశం నిర్ణయించింది. కాని 2004, జూన్ 28 వరకు అందిన దరఖాస్తులకు ఎటువంటి ఫీజు లేకుండా నామినేషన్ పద్ధతిలో గనులను కేటాయించాలని, ఆ తర్వాత అందిన వాటికి వేలం ద్వారా కేటాయించాలని నిర్ణయం జరిగింది. కాంపిటిటివ్ బిడ్డింగ్ తప్పనిసరి అని భావించింది. కానీ, ప్రభుత్వ ఆలోచనకు అనేకానేక శక్తులు అడ్డుపడ్డాయి. ఫలితంగా కాంపిటిటివ్ బిడ్డింగ్‌కు ఉద్దేశించిన ఫైలు వివిధ మంత్రిత్వ శాఖల్లో ఒక కుర్చీ నుంచి మరో కుర్చీకి దాదాపు ఎనిమిదేళ్లపాటు చక్కర్లు కొట్టింది. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు కొన్ని ప్రైవేటు పార్టీలు ఫైలును తొక్కిపట్టి ఉంచేలా చేశాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆఖరుకు బి.జె.పి. నేతృత్వంలోని పాలిత రాష్ట్రాల సీఎంలు సైతం కాంపిటిటివ్ బిడ్డింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆ మేరకు లేఖలు రాశారు. చివరకు సదరు శక్తులే విజయం సాధించాయి. బిడ్డింగ్ లేకుండానే కీలకమైన బొగ్గు బ్లాకులు కార్పొరేట్ వశమయ్యాయి. కనీసం ఒక కార్యాలయం అంటూ లేని సంస్థలకు సైతం బ్లాకులు కట్టబెట్టారంటే ఏ స్థాయిలో ఆశ్రిత పక్షపాతం జరిగిందో అర్థంచేసుకోవచ్చునని ఇంధన రంగ నిపుణులు అంటున్నారు. అడ్రస్ లేని సంస్థలు తమకు కేటాయించిన బ్లాకులను ఇతర కంపెనీలకు అమ్ముకుని భారీ లాభాలు గడించాయి. అంటే కేవలం కేటాయింపు పొంది, దానిని మరో సంస్థకు బదలాయించు కోవడం ద్వారానే వేల కోట్లను సదరు కంపెనీలు కొట్టేశాయన్నమాట. కేటాయింపుల్లో అక్రమాలు భారీ స్థాయిలోనే జరిగాయి.

కాగ్ నివేదిక, ఒక లక్షా ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, ప్రభుత్వం ఆ మేరకు ఆదాయం కోల్పోయిందని పేర్కొన్నది. అయితే బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం 18 లక్షల కోట్ల రూపాయలకు పైగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని నిపుణుల అంచనా. వాస్తవంగా జరిగిందేమిటి? జరుగుతుందేమిటి? దీనికి పరిష్కారం ఏమిటనేది ఆలోచించే స్థితిలో రాజకీయ పార్టీలు లేవు. యు.పి.ఎ. మొదటి పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు వారాలలోనే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. 2004 జూలై నుంచి 142 బొగ్గు క్షేత్రాల కేటాయింపు జరిగింది. ఇవేవి పోటీని ఆహ్వానించి వేలం పద్ధతిలో కేటాయింపు జరుగలేదు. దరఖాస్తులు పెట్టుకున్నప్పుడే పాతిక బొగ్గు బ్లాకులకు పైగా నకిలీ డాక్యుమెంట్‌లు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. 194 బ్లాకులు 2002-2009 వరకు కాప్టివ్ మైన్స్ కింద కేటాయింపులు జరిగాయి. వాటిలో 60 బొగ్గు క్షేత్రాలు ప్రైవేట్ సంస్థలకు పోటీ వేలం లేకుండా కేటాయించింది. మొత్తం 670 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్న 60 బ్లాకుల విలువ ఒక లక్షా 97 వేల కోట్లని స్వయాన బొగ్గు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాగ్‌ను తప్పు పడుతున్న ప్రధానికి ఇది చెంపపెట్టు కాదా? 194 బ్లాకులలో 24 బ్లాకుల్లో మాత్రమే బొగ్గు తీశారు. ఇందులో నిర్ణీత సమయంలో బొగ్గు తవ్వలేదని కొన్ని రద్దు కాబడ్డాయి. మిగిలింది 155 బ్లాకులు. ఇందులో కూడా 25 బ్లాకులకు పైగా దరఖాస్తులు చేసుకున్న కంపెనీలు బోగస్ డాక్యుమెంట్లు అని రుజువైంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి కేటాయింపులు వై.ఎస్.ఆర్. ప్రభుత్వ హయాంలో జరిగాయి. తాడిచెర్ల బ్లాక్‌కు సంబంధించి ఒక ప్రైవేటు కంపెనీకి అప్పజెప్పడంతో దీనిపై రాజకీయ పార్టీలు, ప్రజలు నిరసన తెలుపడంతో రద్దు చేశారు. ఈ బాగోతం అంతా ముగిసిన తర్వాత 2012 ఫిబ్రవరి 2 నుంచి మాత్రమే వేలం పద్ధతిని ప్రవేశపెట్టారు.

ప్రభుత్వరంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్‌కు బదులు ప్రైవేట్ కంపెనీలకు బొగ్గు బ్లాకులను కేటాయించడంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. బొగ్గు బ్లాకుల కేటాయింపులు పొందిన ప్రైవేట్ కంపెనీలు, వాటిని నిర్ణీత గడువులోగా అభివృద్ధి చేయడంలో

విఫలమవగా, కోల్ ఇండియా లిమిటెడ్ అంతర్జాతీయ మార్కెట్‌లో విదేశీ సంస్థలతో కలిసి బొగ్గు తవ్వకాలు చేపడుతోందని బొగ్గు, ఉక్కులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక సెప్టెంబర్ 3న రాజ్యసభ ముందుకు వచ్చింది. బొగ్గు కేటాయింపుల్లోని అవకతవకల కారణంగా ప్రభుత్వ ఖజానాకు రు. 1.86 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందనే దుమారం కొనసాగుతున్న సమయంలోనే పార్లమెంటరీ కమిటీ నివేదిక వెలుగులోకి రావడం గమనార్హం. గుర్తించిన 138 బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో కోల్ ఇండియా లిమిటెడ్‌కు, దాని అనుబంధ సంస్థలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. అయితే ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించేందుకు ఇప్పటి వరకు 116 బ్లాకులను గుర్తించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కోల్ ఇండియా లిమిటెడ్ సవరించిన ప్రతిపాదనను బొగ్గుశాఖ పరిశీలి స్తోందని, 116 బ్లాకులనూ కోల్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయించడంపై త్వరలోనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పక తప్పలేదు.

రాజ్యాంగ సంస్థ కాగ్ బొగ్గు కుంభకోణాన్ని వెలికితీసి యు.పి.ఎ. ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టగా రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన ప్రధాని, కాగ్ నివేదికను తప్పు పట్టి రాజ్యాంగాన్ని కించపరిచారు. కాగ్ నివేదికపై ఇసుమంత ప్రాయశ్చిత్తం లేకపోగా నివేదిక ప్రజలను తప్పుదారి పట్టించిందని, కాగ్ ఊహాజనితంగా లెక్కవేసిందని కుంభకోణాన్ని నిస్సిగ్గుగా వెనుకేసుకొచ్చారు. కాగ్ నివేదిక వివాదాస్పద మంటూ, పిఏసిలో సవాల్ చేస్తామంటూ, బొగ్గు కేటాయింపులపై గత ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలనే అమలు చేశామంటూ పొసగని వాదనలు విన్పించడం దేశ ప్రధానికి తగనిపని. ఆరోపణలు రాగానే ఎవరూ అడక్కముందే ముందుకొచ్చి సమగ్ర విచారణకు ఆదేశించడం ప్రభుత్వ కనీస ధర్మం. ప్రజాధనాన్ని కొల్లగొట్టే ఒప్పందాలను రద్దు చేసి, దోషులను శిక్షించడం ప్రభుత్వ బాధ్యత. నిండా మునిగిన వాడికి చలేమిటన్నట్లు వరుస కుంభకోణాల్లో మొద్దుబారిన యు.పి.ఎ. ప్రభుత్వానికి, మన ప్రధానికి పార్లమెంటన్నా, కాగ్ నివేదికలన్నా, విపక్షాలన్నా, ప్రజా ఉద్యమాలన్నా లెక్కలేదు. వాస్తవాలను ప్రజల ముందుంచాలన్న చిత్తశుద్ధిలేదు. పైగా వేయి సమాధానాలకంటే మౌనమే మేలన్నది తన సిద్ధాంతమంటూ ప్రధాని సెలవివ్వడం విడ్డూరంగా ఉంది. ఇది తన దివాళాకోరు విధానాల పర్యవసానాలను సమర్థించుకోలేక మౌనం ముసుగులో తప్పించుకోవడం కాదా!

ప్రధాని మన్మోహన్ పార్లమెంటులో ఆగష్టు 27న చేసిన ప్రకటనలో "బొగ్గు గనులను ప్రైవేటు కంపెనీలకు కేవలం కేప్టివ్ ప్రయోజనాలకు, నిర్దిష్ట వినియోగానికి మాత్రమే కేటాయించడం జరిగింది. కోల్ ఇండియా సంస్థ నిర్ధారించిన బొగ్గు ధరతో ఈ గనులను ముడిపెట్టడం తగదని" సమర్థించుకున్నారు. చత్తీస్‌గడ్, జార్ఖండ్, ఒడిషా, మధ్యప్రదేశ్ వంటి ప్రధాన గనులున్న రాష్ట్రాలన్నీ ఆనాడు ప్రతిపక్షాల పాలనలోనే ఉన్నాయని బిడ్డింగ్ విధానాన్ని ఈ ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించాయని సమర్థించుకున్నారు. ప్రైవేట్ కంపెనీలు వాణిజ్య స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేసేందుకు వీలు కల్పించే బొగ్గు గనుల జాతీయాకరణ (సవరణ) బిల్లు – 2000 పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో జరుగుతున్న జాప్యంపై వస్తున్న విమర్శలను ఆయనే బదులిస్తూ ఇందుకు సంబంధించిన సంస్థల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నందువల్లే ఈ బిల్లులో జాప్యం జరుగుతోందని, దీనిపై విస్తృత ఏకాభిప్రాయ సాధనకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు. బిడ్డింగ్ విధానానికి మారితే బొగ్గు ధర పెరుగుతుందని అప్పట్లో నాటి రాష్ట్ర ప్రభుత్వాలు అభిప్రాయపడ్డాయని ప్రధాని తెలిపారు. బొగ్గు బ్లాకుల కేటాయింపుల రద్దు అంశాన్ని వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో కూడిన బృందం (ఐఎంజి) పరిశీలిస్తుందని ప్రధాని తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు ఐఎంజి తన అభిప్రాయాలు తెలియజేస్తుందన్నారు. తాము చేసిన కేటాయింపులన్నీ పారదర్శకంగానే సాగాయని ప్రధాని చెబుతున్న మాటలకు సి.బి.ఐ. నిగ్గు తేలుస్తున్న వాస్తవాలకు పొంతనేలేదు. బొగ్గు కుంభకోణంలో నేడు సాగుతున్న సి.బి.ఐ. దర్యాప్తు కూడా ఇద్దరు ఎం.పి.లు ఫిర్యాదు చేస్తే, కేంద్ర నిఘా సంఘం ఆదేశిస్తే జరుగుతున్నదే కాని – స్వీయ నిజాయితీ నిరూపణకు ప్రధాని చేయిస్తున్నది కాదు.

గతంలో 2జిపై కూడా ప్రధాని, మంత్రులు ఇలాగే సమర్థించు కున్నారు. సుప్రీంకోర్టు సిబిఐ దర్యాప్తును ఆదేశించిన తర్వాతనే కాంట్రాక్టులు రద్దయ్యాయి. ఇప్పుడు బొగ్గు కుంభకోణాన్ని కూడా 2జి తరహాలో కప్పిపెట్టేందుకు ప్రధాని, మంత్రులు కట్టుకథలు అల్లుతున్నారు. కాగ్ నివేదిక తప్పుల తడకని మన్మోహన్ ఆరోపించగా, అసలు తవ్వకాలే జరగకపోతే నష్టం ఎక్కడుందని చిదంబరం ఎదురుదాడికి దిగి నిజాలకు పాతరేయబూనుకున్నారు. కాగ్ లేవనెత్తిన అంశాలపై పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ కాగ్‌పైనా, దాని నివేదికపైన పార్లమెంటులో వ్యాఖ్యానించరాదని దాదాపు 55 ఏళ్ల క్రితం అంటే 1957లోనే ఆనాటి లోక్‌సభ స్పీకర్ స్పష్టమైన రూలింగ్ ఇచ్చారు. రాజ్యాంగపరంగా చూస్తే కాగ్ అన్నది ఒక విధంగా సుప్రీంకోర్టుకన్నా కీలకమైందని అంబేద్కర్ ఒక సందర్భంలో అన్నారు. రాజ్యాంగంలో 147 నుంచి 151 వరకూ ఉన్న అధికరణాలు కాగ్ అధికార పరిధిని స్పష్టంగా నిర్వచించాయి. కాగ్ ప్రతిపత్తి పైనా సమర్థత పైనా ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్న ఈ ప్రభుత్వ ఆర్థిక శాఖనే 2006లో దాని ఆడిటింగ్ అధికారాలకు ఎలాంటి పరిమితులు లేవని స్పష్టీకరిస్తూ ప్రత్యేక ప్రకటనే విడుదల చేసింది. ఈ పార్లమెంటరీ సాంప్రదాయాన్ని ప్రధాని ఉల్లంఘించారు. పోనీ కాగ్ నివేదికలో పేర్కొన్న మౌలిక అంశాలపై ఏమైనా చెప్పారా అంటే అదీ లేదు. కాగ్ నివేదికపై పార్లమెంటులో చర్చకు సిద్ధమన్న సర్కారు అందుకు తనవంతు చేసిన ప్రయత్నం ఏమీ లేదు. సభను నడిపించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న కనీస సోయి ప్రభుత్వానికి లేకపోయింది. ఇదంతా అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించే దగుల్బాజీతనం.

అసలు బొగ్గు గనుల తవ్వకాలే జరగనప్పుడు నష్టం అనే ప్రశ్నే తలెత్తదని వాదించిన ప్రభుత్వం ఇప్పుడు 53 బ్లాకుల కేటాయింపులను రద్దు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తోంది. నష్టమే లేనప్పుడు అంతర్ మంత్రిత్వ కమిటీ తన ముసాయిదా నివేదికలో 53 బ్లాకులను సస్పెండ్ చేయమని ఎందుకు సిఫారసు చేసినట్లు? దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టిన సిబిఐ ఎఫ్ఐఆర్‌లో అక్రమాలు, మోసం జరిగినట్లు ఎందుకు పేర్కొన్నది. సిబిఐ నోటీసులు పంపిన కంపెనీల్లో రిలయన్స్ పవర్, టాటా, హిండాల్కో, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, జిందాల్, అదాని, ఎస్.ఆర్, అర్సెలర్ మిట్టల్, జివికె పవర్, ఎంఎంటిసి కూడా ఉన్నాయి. సంతృప్తికరమైన సమాధానం రాని పక్షంలో ఈ కంపెనీలకు కేటాయించిన గనుల లైసెన్సులు రద్దు చేస్తారేమో చూడాలి. కాబట్టి కొన్ని బ్లాకులను రద్దుచేసి మిగతా వాటిని వదిలేయడం కాకుండా ఆ

వివాదాస్పద బొగ్గు బ్లాకుల కేటాయింపులన్నిటినీ రద్దు చేయాలి. కేటాయింపులకు వేలం పద్ధతి కాకుండా మరే విధానం అనుసరించినా సహజ వనరులు దుర్వినియోగమవుతాయని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఆదేశాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలి.

రాజకీయ లబ్ధి పొందేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయే తప్ప లోపం ఎక్కడ ఉందో, దానిని సరిదిద్దేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో ఆలోచించడం లేదు. వనరుల దోపిడీ విషయంలోకానీ, అందుకు కారణమైన ఆర్థిక సంస్కరణలు, నయా ఉదారవాద విధానాల్లో కానీ కాంగ్రెస్, బిజెపి దొందూ దొందే. అందుకే చర్చ కంటే సభను అడ్డుకోవడంపైనే ఎన్‌డిఏ కూటమి దృష్టి నిలిపింది. ప్రధాని రాజీనామా చేయాలన్న ఏకైక డిమాండ్‌ను పట్టుక్కూర్చుంది తప్ప, ప్రభుత్వ విధానాలపై చర్చించడం బిజెపికి ఇష్టం లేదు. బొగ్గు స్కాంపై పార్లమెంటులో చర్చ జరిగితే అవినీతి చట్టబద్ధమవుతుందని అసంబద్ధ వాదనలు చేస్తోంది. సభలో.. చర్చ, జెపిసి, పిఏసి ఇవేమీ అక్కర్లేదనడమంటే పరోక్షంగా ప్రభుత్వానికి మద్దతివ్వడమే అవుతుంది. అంతకుమించి ప్రకృతి వనరులపై ఎవరి ఆధిపత్యం అనే విషయంలో విధాన నిర్ణయాలను సవాలు చేయకపోవడం శోచనీయం. ఎన్‌డిఏ హయాంలోనూ ఇదే జరిగింది. కర్ణాటకలో ఇనుప గనుల కుంభకోణం, ఒడిశాలో జిందాలుకు బాక్సైట్ గనులు కట్టబెట్టడం. జార్ఖండ్, చత్తీస్‌గడ్‌లోనూ అనేక అక్రమాలు జరిగాయి. దీంతో ఏపార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు ఒరిగేది ఏమిలేదని మన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ డొల్లతనం ద్వారా తేటతెల్లమవుతుంది.

సమాజ్‌వాది పార్టీతో సహా ఎనిమిది పార్టీలు ప్రజా సమస్యలు చర్చించాలని డిమాండ్ చేశాయి. ఎస్‌పి నాయకత్వంలో సిపిఐ, సిపిఎం, ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, టిడిపి, బిజెడి, అన్నాడిఎంకె పార్టీలు పార్లమెంట్ హౌసింగ్ కాంప్లెక్స్ వద్ద నిరసన ప్రదర్శనలు చేశాయి. ప్రజాధనాన్ని, ప్రజా సమస్యలపై పార్లమెంటులో చర్చించే కాలాన్ని, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా పార్లమెంటులో తలపడడం అధికార, ప్రతిపక్షాల కనీస బాధ్యత. మరోవైపు ఆగస్ట్ 26న అన్నా బృందం 'ఇండియా అగెనెస్టు కరప్షన్' (ఐఎసి) సభ్యులు ప్రధాని మన్మోహన్, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ నివాసాల ముట్టడి కార్యక్రమం చేపట్టారు. బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో కాంగ్రెస్, బిజెపి నేతలకు జోక్యం ఉందన్నారు. ఈ రెండు పార్టీల నుండి దేశాన్ని కాపాడుకోవాలని నినదించారు. వారు భువనేశ్వర్‌లో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్, రాయపూర్‌లో చత్తీస్‌గడ్ సిఎం రమణ్‌సింగ్ ఇళ్లను ముట్టడించేందుకు ప్రయత్నించారు.

కాంగ్రెసు, బిజెపిలు రెండూ పార్లమెంటు వేదికగా చేస్తున్న పోరాటం వల్ల ప్రజా సమస్యలు చర్చించకుండా విలువైన సభా సమయం వృథా అవుతుందని యుపిఏ ఇతర, ఎన్‌డిఏ ఇతర పార్టీలు ఆరోపించాయి. 19 రోజుల సమావేశాలకుగాను కేవలం 6 రోజులు మాత్రమే పార్లమెంటు నడిచింది. ఇంత అధ్వాన్నంగా, నిరర్థకంగా సమావేశాలు ముగియడం 2009 తర్వాత ఇది రెండవసారి. బొగ్గు గనుల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని బిజెపి 13 రోజులు పార్లమెంటు వర్షాకాల సమావేశాలను స్తంభింపజేసింది. సమావేశాలు జరుగక పోవడానికి కారణం నువ్వంటే నువ్వని దుమ్మెత్తి పోసుకుంటూ అసలు విషయాన్ని జనానికి తెలియకుండా చేశాయి. ప్రధాని రాజీనామా పేరుతో బిజెపి పార్లమెంటును అడ్డుకోవడం ఓట్ల యావ తప్ప వేరేకాదు. గత శీతాకాల సమావేశాలల్లో కూడా ఇలాంటి పరిస్థితే చోటు చేసుకుంది. రాబోయే శీతాకాల సమావేశాల్లో కూడా ఇదే పునరావృతమైనా ఆశ్చర్యం లేదు. ఇది పార్లమెంటరీ చరిత్రలో కనీవిని ఎరుగని విషయం. రెండు సందర్భాల్లోను ప్రజాధనం వృథా తప్ప సమస్య పరిష్కారం మాత్రం కాలేదు. రోజుకు రు. 6.35 కోట్ల చొప్పున మొత్తం రు. 82.55 కోట్లు ఖర్చయ్యాయి. సమావేశాలు జరుగకున్నా సభ్యుల బత్యాలు మాత్రం చెల్లించాల్సిందే.

కేంద్ర ప్రభుత్వం – అంతర్ మంత్రివర్గ బృందం సూచనల మేరకే స్పందిస్తుందట! తాము చేసిన నేరంపై తామే తీర్పు చెప్పుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి సహజ వనరులపై స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వంపై పార్లమెంటులో ఒత్తిడి చేయాలి. వనరుల లూటీకి, అవినీతికి ఎర్ర తివాచీ పరుస్తున్న అభివృద్ధి నమూనాను, అందుకు తోడ్పడుతున్న నయా ఉదారవాద విధానాలను వెనక్కి కొట్టినప్పుడే బహుళజాతి ప్రైవేట్ సంస్థల దోపిడీకి ముకుతాడు పడుతుంది. అయితే అధికార, విపక్ష పార్టీలు ఏవీ అందుకు సిద్ధంగా లేకపోవడం ఒక విషాదం. అధికార ప్రతిపక్ష పార్టీలు పరస్పర దూషణలు మాని చట్టబద్ధ పాలన, స్వచ్ఛమైన పాలన కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నిలబడుతుందా అనే సందేహం ప్రజాస్వామిక వాదులను ఆందోళనకు గురిచేస్తోంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

రాబోయే సంచికలలో...

- **ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఆవశ్యకత - ఆర్.ఎస్. చౌహాన్**
- **ఆరోగ్యరంగంలో ఏం జరుగుతోంది? - లోకసంచారి**
- **ఎన్‌కౌంటర్లు - కొన్ని ప్రశ్నలు - ప్రహ్లాద్**
- **ఆదివాసి మహిళల పోరాటాలు - రాజ్యహింస - డా. నళిని**
- **తిరుమల భారతీయులదే - ఎం.కె. కుమార్**

మోడీ నరసంహారం - నరోడా పాటియా తీర్పు

అత్యంత ఘోరమైన మారణకాండ జరిపిన నేరస్తులకు శిక్షలు విధించిన నేపథ్యంలో ఆ మారణకాండను వివరిస్తున్నారు **వరవరరావు**

నరోడా పాటియా ఒక స్థలం పేరు. గుజరాత్ పారిశ్రామిక నగరం అహ్మదాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లే జాతీయ రహదారిపై ఉండే జనావాసం. నరేంద్ర మోడీ పరిచయం అక్కరలేని, కుఖ్యాతి వహించిన గుజరాత్ ముఖ్యమంత్రి.

సరిగ్గా పదిన్నర సంవత్సరాల క్రితం 2002 ఫిబ్రవరి 27న గుజరాత్ లోని గోధ్రా రైల్వేస్టేషన్‌లో సబర్మతి ఎక్స్‌ప్రెస్ తగులబడి 56 మంది ప్రయాణికులు చనిపోయారు. ఆ చనిపోయిన వాళ్లు రామజన్మభూమి అయిన అయోధ్య నుంచి గాంధీ శాంతి, అహింసల ఆశ్రమమైన సబర్మతికి వస్తున్న కరసేవకులని, ఆ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్ 5, ఎస్ 6 కంపార్ట్ మెంట్లలో ప్రయాణం చేస్తున్నారని తెలిసే గోధ్రాలో ముస్లింలు తగులబెట్టారని, అందుకు ప్రతీకారం తీర్చుకోవాల్సిందిగా విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్, ఆర్ఎస్ఎస్ మెదలైన సంఘ్‌పరివార్ శక్తులన్నీ పిలుపునిచ్చాయి. ఒకవైపు బంద్‌కు పిలుపునిచ్చి మరొకవైపు రాష్ట్రమంతటా కనీవినీ ఎరగని మారణకాండను, ఎంచుకొని మరీ ముస్లింలపై అమలు చేశాయి. వేలాది మంది యువకుల చేతులకు కాషాయ జెండాలు, త్రిశూలాలు, బరిశలు, కత్తులు ఇచ్చి నిర్దిష్టంగా ముస్లింవాడల మీదికి, ఇండ్ల మీదికి పురిగొల్పాయి. కనిపించిన వాళ్లను కనిపించినట్లుగా చంపేశారు. మళ్లీ ఈ గడ్డ మీద ముస్లిం బిడ్డ కూడా పుట్టగూడదని గర్భస్థశిశువులను త్రిశూలాలతో పొడిచి పిండాలను ఆకాశంలో ఎగరేసి మృత్యుహేల అనుభవించారు. వందలాది మంది ముస్లిం స్త్రీలపై లైంగిక అత్యాచారం చేశారు. మొత్తం ఈ మారణ కాండలో ఆరు, ఏడు వేల మంది ముస్లింలు హతులై ఉంటారు. శిబిరాల్లో ఉన్న బాధితుల లెక్క ప్రకారమైతే పది వేల మంది దాకా చనిపోయారు. మానవతా దృక్పథం కల ముస్లిం సామాజిక కార్యకర్తలు నిర్వహించిన శిబిరాల్లో లక్షలాది మంది తలదాచుకున్నారు.

ఇంత జరుగుతుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ దాడిని, మారణకాండను అరికట్టడానికి ఏమీ చేయకపోగా, మోడీ స్వయంగా చర్యకు ప్రతిచర్య ఉంటుందని న్యూటన్ శాస్త్ర పరిశీలనను పేర్కొని రెచ్చగొట్టాడు. ఇందిరా గాంధీ హత్య జరిగినపుడు 'మహావృక్షం కూలినపుడు సుడిగాలి రేగుతుంది' అని రాజీవ్ గాంధీ చెప్పిన మాటలకూ నరేంద్ర మోడీ రెచ్చగొట్టే మాటలకూ ఏమీ తేడా లేదు.

ఈ పది సంవత్సరాలూ ఎందరో లౌకిక ప్రజాస్వామ్య కార్యకర్తలు దేశవ్యాప్తంగా గుజరాత్ మారణకాండపై న్యాయవిచారణ చేసి నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా బెస్ట్ బేకరీలో యజమానులను, పని చేస్తున్నవాళ్లను సజీవంగా దహనం చేసిన కేసు, ఎంపి జాఫర్ నివసించే కాలనీలో ఆయనతో సహా అసంఖ్యాకులను చంపిన కేసు, నరోడా పాటియాలో దాదాపు వంద మందిని చంపిన కేసు అత్యంత అమానవీయ చర్యలుగా ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి.

లౌకిక ప్రజాస్వామ్య భావాలకు, ఇరుగు పొరుగు వాళ్లకు సహాయం చేయడానికి ఎంతో పేరు మోసిన ఎంపి జాఫర్ నివసించే కాలనీలోకి వాటర్ ట్యాంకులు తెచ్చి, ఆ క్వార్టర్స్ ఉన్న కాలనీ అంతా నీళ్లతో నింపి, ఆ తర్వాత విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు తెచ్చి అందులోకి కరెంట్ వదిలారు. ఎంపి జాఫర్ పోలీసులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫోన్లు చేసినా ఎవరూ స్పందించలేదు. ఆయన తప్పించుకునే ప్రయత్నం చేయలేదు. తన ఇరుగు పొరుగు వారిని కాపాడే ప్రయత్నంలో వాళ్లతో పాటు అమరుడు అయ్యాడు. ఇప్పటికీ ఈ కేసులో న్యాయంకోసం ఆయన సతీమణి పోరాడుతూనే ఉంది.

ఈ రెండు కేసుల కన్నా పెద్దదీ అతి హేయమైనదీ నరోడా పాటియా సంఘటన. ఇందులో 96 మంది మరణించారు. 125 మంది గాయపడ్డారు. కోట్ల రూపాయల ఆస్తి దోచుకోబడింది, ధ్వంసమైంది. దేశవ్యాప్త ఉద్యమ ప్రభావం వల్ల సుప్రీంకోర్టు ఈ నేరాల విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ను ఏర్పాటు చేసింది. ఎన్నో ఫిర్యాదులను ఒకచోట చేర్చి నమోదు చేసిన ఛార్జిషీట్‌ల ఆధారంగా స్పెషల్ సెషన్స్ జడ్జి ఆగస్టు 29న చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు సిట్ కు అప్పగించిన తొమ్మిది కేసులలో ఇది ఒకటి. ఈ న్యాయం ఈ మైలురాయి దగ్గరే ఆగిపోతుందా, తలకిందులు అవుతుందా, మరిన్ని న్యాయాలకు దారి తీస్తుందా అనేది మన లౌకిక ప్రజాస్వామిక జాగరూకత మీద ఆధారపడి ఉంటుంది.

ఈ కేసు నిందితులలో ముప్పై ఇద్దరికి యావజ్జీవ శిక్ష పడింది. వాళ్లలో సంఘటన జరిగినపుడు బిజెపి ఎంఎల్ఏగా ఉండి, ఆ తర్వాత ఈ మారణకాండకు సూత్రధారి అయిన కారణంగానే మోడీ మంత్రివర్గంలోకి ప్రమోషన్ పొందిన శ్రీమతి మాయా కొద్నానీ కూడా ఉన్నది. బాబు భజరంగి, బిపిన్ పరివార్, అశోక్ సింధీ, కిషన్ కొరాని వంటి ప్రముఖ సంఘ్‌పరివార్ కార్యకర్తలు ఉన్నారు. కోర్టు 29 మందిని నిర్దోషులుగా వదిలేసింది.

హతులందరూ ముస్లింలు. కాశ్మీర్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వాళ్లు. కదుపేదలు. రోజుకో రొట్టె సంపాదించు కోవడానికి కూలిపని చేసుకొని బతుకుతున్నవాళ్లు. గుజరాతీ భాష మాట్లాడలేరు. సరిగా అర్థం కూడా చేసుకోలేరు.

అటు గోధ్రా రైలు తగులబడిందో లేదో ఇటు ఈ మారణకాండ

మొదలైంది. ఫిబ్రవరి 28వ తేదీ నుంచే నరోడా పోలీసు స్టేషన్ కు ఫిర్యాదులు రావడం ప్రారంభమైంది. అన్ని ఫిర్యాదుల సారాంశం ఒకటే – మరాని మసీద్‌కు, దానికి ఎదురుగా ఉన్న ముస్లిం చాల్స్‌లోకి ప్రవేశించే ద్వారం దగ్గరికి అప్పటికే బంద్‌కు పిలుపునిచ్చిన విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, బిజెపి నాయకులు రావడం ప్రారంభించారు. వాళ్లే అక్కడ కర్ఫ్యూను అమలు చేశారు. ఉదయం 9.30 గంటల తర్వాత వేల సంఖ్యలో హిందూ హంతక ముఠాలు అక్కడ చేరి అన్ని దిక్కుల నుంచి జై శ్రీరాం, జై భజరంగదళ్ అరుపులతో దాడి ప్రారంభించారు. ముస్లింల ఇండ్లలో చొరబడ్డారు. ఇండ్లు తగులబెట్టడం ప్రారంభించారు. రోడ్డుకు ఆవలివైపు ఎస్‌టి వర్క్ షాప్ గోడ ఉంటుంది. ఇంక ప్రజలు ఎటు పోవడానికీ వీలులేదు. రోజంతా ఈ మారణకాండ కొనసాగింది. మసీదు మీద, ఇండ్ల మీద వేల కొద్ది రాళ్లు రువ్వారు. మసీదులో గ్యాస్ సిలిండర్లు పేల్చారు. వారి దగ్గర లేని మారణాయుధం లేదు. కిరోసిన్, పెట్రోల్ వాడారు. అంత బహిరంగమే. వాడలోని ఇళ్లన్నీ తగులబెట్టారు. జైశ్రీరాం నినాదంతో పాటు 'నరకండి, చంపండి, ఒక మియా (ముస్లిం) కూడా బతకకూడదు' అని బిగ్గరగా అరుస్తూ, ఆస్తులు, వస్తువులు అన్నీ ధ్వంసం చేసి చిందరవందర చేశారు. స్త్రీలను చెరిచారు. అట్లా తల్లులను చెరుస్తుంటే ఏడుస్తున్న పిల్లలను సజీవంగా మంటల్లోకి విసిరారు. వాళ్లంతా ఖాకీ నిక్కర్లతో తలకు కాషాయ రిబ్బన్లు కట్టుకొని ఉన్నారు. ఎక్కడా పోలీసులు లేరు. ఉన్నా మౌన ప్రేక్షకులుగా ఉన్నారు.

జాతీయ రహదారి కారణంగా, ఈ ముస్లింబస్తీకీ రోడ్డుకు అవతలి వైపు కాలనీకి మధ్య పొడవైన ఎస్‌టి వర్క్ షాప్ గోడ కారణంగా ఎటూ వెళ్లే పరిస్థితి లేదు. పోలీసులు ఎక్కడైనా లాఠీఛార్జీ చేసి కాల్పులు జరిపితే అక్కడ కూడా గాయపడ్డ వాళ్లు, మృతులు ముస్లింలే అయ్యారు. ఇప్పుడు శిక్షలు పడిన నిందితులు కాల్పులు కూడ జరిపినట్లు సాక్ష్యాధారాలు ఉన్నాయి. దగ్గరలోనే స్టేట్ రిజర్వ్ పోలీసు క్వార్టర్స్ ఉన్నాయి గాని ఆ పోలీసులు ముస్లింలను తలదాచుకోవడానికి తమ క్వార్టర్లలోకి రానివ్వలేదు. మసీదులోకి వెళదామంటే అక్కడ పోలీసులు నిలబడి కాల్పులు జరుపుతున్నారు. టియర్ గ్యాస్ వదులుతున్నారు. దృశ్యం అంతా సంఘ్‌పరివార్, పోలీసులు కలిసి ముస్లింలను ఒక ఆవరణలో జంతువుల వలె బెదరగొడుతూ చంపుతున్నట్లుగా ఉన్నది. దినమంతా హిందూ సమాజం, పోలీసులు తరిమికొడుతుంటే ఎటు వెళ్లినా ఆశ్రయం దొరకక రాత్రికి గానీ వాళ్లు శిబిరాల్లో తలదాచుకో లేకపోయారు. ఆ శిబిరాలు కూడా ఇస్లామిక్ రిలీఫ్ కమిటీ ఏర్పాటు చేసినవే. ఇందులో పోలీసు నిష్క్రియాపరత్వం సంఘ్‌పరివార్ శక్తులకు క్రియాశీలకంగా సహకరించినట్లుగా కూడా స్పష్టంగా కోర్టు దృష్టికి వచ్చింది. కోర్టు తన తీర్పులో హిందూ ఫాసిస్టులు ఈ సంఘటన సందర్భంగా వహించిన ఉదాసీన వైఖరి గురించి కూడా వ్యాఖ్యానించింది.

ఇందులో కొందరు ముద్దాయిలు ఈ ప్రాంతంలో చాలా పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు. హిందూ సంస్థలైన ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌ల నాయకులు. ఒక బిజెపి నాయకుడి కార్యాలయం ప్రధాన రహదారిపై ఉంటుంది. ఆయన ఇక్కడి నుండి ఎన్నికైన అభ్యర్థి కూడా. ఆయనపై కోర్టులో ఎన్నో కేసులు నడుస్తున్నాయి. ముస్లిం యువకులను పెళ్లి చేసుకున్న హిందూ యువతులను వాళ్ల ఇళ్లలో చొరబడి బలవంతంగా విడదీయడానికి చేసిన ప్రయత్నాలకు సంబంధించిన కేసులవి. కనుక ఆయనకు అక్కడ ఏ ఇంట్లో ఎవరు ఉంటారో తెలియదనుకోవడానికి వీలు లేదు. ఈ నిందితులందరికీ ఇక్కడ వ్యాపారాలు ఉన్నాయి, రాజకీయ కార్యకలాపాలు ఉన్నాయి. వీళ్లలో కొందరు ఈ ప్రాంతంలో శాంతి కమిటీల్లో సభ్యులు కూడా! కనుక వీళ్లు స్వయంగా నిందితులైనప్పుడు పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేరని సులభంగా అర్థం చేసుకోవచ్చు. తీర్పును ముగిస్తూ కోర్టు 'సాధ్యమైన ప్రతిచోటా వాస్తవాలకు సంబంధించినంత వరకు కోర్టు న్యాయబద్ధమైన వివేకాన్ని ప్రదర్శించవలసి ఉంటుంది. తన కళ్లను, చెవులను తెరచి ఉంచాల్సి ఉంటుంది. సరైన సమయం వచ్చినపుడు నిందితులకు, సాక్షులకు, హతులకు గతంలో ఉన్న పరిచయాన్ని గణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే కోర్టు సత్యాన్వేషణలో నిమగ్నం కావలసి ఉంటుంది. ఈ మారణకాండలో తీర్పు చెప్పే హక్కును నిందితుల చేతికే వదిలేయకూడదు' అని వ్యాఖ్యానించింది.

సుప్రసిద్ధ న్యాయవాది, అర్ధశతాబ్ది పైగా లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న గిరీష్‌పటేల్ ఈ తీర్పు ఒక మైలురాయి అని, ధైర్యం, సాహసం, స్వాతంత్ర్యం, సంకల్పంతో న్యాయం చేసిందని, రాజ్యాంగం పట్ల, మానవహక్కుల పట్ల తన నిబద్ధతను ప్రకటించిందని భావించారు. ముఖ్యంగా ఈ మారణకాండ ఒక కుట్ర ఫలితమని న్యాయస్థానం అంగీకరించిందని గిరీష్‌పటేల్ అభిప్రాయపడ్డారు. ఆ కుట్ర ఏమిటో గిరీష్ పటేల్ స్పష్టంగా చెప్పకపోయినా అది ఈ దేశంలో 1980లలో సిక్కుల హననంతో ప్రారంభమై, 1992 బాబ్రీ మసీదు విధ్వంసకాలం నుంచి ముస్లింల హననానికి కూడా దారితీసిన హిందూ ఫాసిస్టు కుట్ర.

ప్రస్తుతానికి గుజరాత్ మారణకాండ సందర్భానికే పరిమితమవుదాం.

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకు హైదరాబాద్‌కు చెందిన మైనారిటీ హక్కుల మానిటరింగ్ కమిటీ కార్యదర్శి లతీఫ్ ఖాన్ తోపాటు దేశంలో నలుచెరగులా ఉన్న బుద్ధిజీవులతో కలిసి నేను గుజరాత్ వెళ్లాను. ఈ మారణకాండ జరిగిన ప్రాంతాలన్నీ విస్తృతంగా పర్యటించాం. పునరావాస శిబిరాలకు వెళ్లి బాధితులతో, తమ వాళ్లను కోల్పోయిన వాళ్లతో మాట్లాడాం. అప్పుడే అన్ని పత్రికల్లో వివరంగా రాయడం జరిగింది. ఇది చాలా స్పష్టంగా 1991లో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రారంభం కావడంతోనే దానికి దోహదంగా బాబ్రీ మసీదు విధ్వంసం అనే హిందూత్వ చర్య వలె ఎన్‌డిఎ ప్రభుత్వంలో జరిగిన అత్యంత హేయమైన ఫాసిస్టు చర్య! రాజీవ్ గాంధీని అధికారంలోకి తెచ్చిన సిక్కుల ఊచకోత, భోపాల్ గ్యాస్ దుర్ఘటన వలె నరేంద్ర మోడీ అధికారాన్ని స్థిరపరిచిన ఎన్ డి ఎ ప్రభుత్వకాలం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు హిందూత్వ దాడులకు ఉన్న అంతస్సంబంధాలను చూడడానికి ఇటువంటి ప్రత్యక్ష ఉదాహరణలెన్నో చూపవచ్చును.

మాకు ఆనంద్ నుంచి అహ్మదాబాదుకు 100 మైళ్లకు పైగా తగులపెట్టబడిన ముస్లింల ఆటోమొబైల్ దుకాణాలు కనిపించాయి. అట్లాగే అహ్మదాబాదులో ముస్లింల హోటళ్లన్నీ ధ్వంసమైనాయి. సామాన్యంగా బేకరీలు ఎక్కడైనా ముస్లింలవే ఉంటాయి. బెస్ట్ బేకరీ ఉదాహరణ చెప్పే ఉన్నాను. ముంబై, సూరత్ మారణకాండ తర్వాత (1992-93) అహ్మదాబాద్‌లో ముస్లింలు తమ హోటళ్లకు అభిరుచి

వంటి సంస్కృత పేర్లు పెట్టారు. అటువంటి హోటళ్లు ముస్లింలవేనని తెలపడానికి సంఘ్‌పరివార్ పత్రిక అహ్మదాబాద్‌లోని 500 హోటళ్ల జాబితా ఇచ్చి, వాటి యజమానులెవరో పేర్కొంది. అంటే అవి తగులబెట్టాల్సిన హోటళ్లు అని ఆరు నెలల క్రితమే ఒక పథకం రచింపబడింది.

నరోడా పాటియాలో ప్రజలు చెప్పిన విషయాలు మాకు ఆ మారణకాండలో ఇమిడి ఉన్న రాజకీయ ఆర్థిక కోణాన్ని స్పష్టంగా ముందుకు తెచ్చాయి. ఒకటి, అది జాతీయ రహదారికి ఇటు వైపు ఉన్నది. ఎస్‌టి వర్క్‌షాప్ పొడవైన గోడకు అటువైపు హిందువుల కోసం ఎన్నారైలు మంచి భవనాలు నిర్మాణం చేశారు. కానీ ఇటువైపు తామున్న ప్రాంతం ముస్లిం బస్తీ వలె కనిపిస్తుంది. కనుక కొన్ని భవనాలు అమ్ముడు పోలేదని, కొన్నవాళ్లు కూడా కొందరు రావడం లేదని, ఇటువంటి సందర్భం, సాకు దొరికితే ఇక్కడి బస్తీనంతా తగులబెట్టి, ఇక్కడి పేద ముస్లింలను చంపో, నిర్వాసితులను చేసో నిర్మానుష్యం చేస్తే ఇటువైపు కూడా అటువంటి భవనాలు నిర్మాణం చేసి హిందూ ఎన్‌ఆర్‌ఐలకు అమ్ముకోవచ్చునని, ఇది ఎన్‌ఆర్‌ఐల పథకమని వారు చెప్పారు. ఆర్‌ఎస్ రావుగారు రాజమండ్రి 2002 విరసం సభల్లో ఇది ట్రేడింగ్ కమ్యూనల్ (వ్యాపార మతవర్గతత్వ), ఎన్‌ఆర్‌ఐ కమ్యూనల్ (విదేశాల్లో ఉన్న హిందువుల మతవర్గ తత్వ) హింస అన్నారు. ఎంత విచిత్రం చూడండి. నరోడా పాటియాలో మారణకాండకు పథకం రచించిన వాళ్లంతా విదేశాల్లో స్థిరపడిన గ్రీన్‌కార్డు హోల్డర్లు. అయినా ఇక్కడ ఆస్తులు, రాజకీయ ప్రాబల్యం ఉండాలని కోరుకోవడం దేశభక్తి కాకుండా ఎట్లా పోతుంది? కాకపోతే ముస్లింలు అయినందువల్ల, ఆ రాష్ట్రం వాళ్లు కానందువల్ల ఇక్కడ విదేశస్తులు అవుతారు. దేశద్రోహులు అవుతారు. వాళ్లను చంపి ఈ గడ్డ మీద కూడా పూడ్చకుండా అరేబియా సముద్రంలో విసిరేయవచ్చు. బతికి ఉన్నవారిని మనకు చేతనైతే పాకిస్తాన్‌కు తరిమేయవచ్చు. లేదా ఐ ఎస్ ఐ ముద్రతో దేశంలోని జైళ్లన్నీ నింపవచ్చు. ఇది దేశభక్తి!

వాస్తవానికి సబర్మతి ఎక్స్‌ప్రెస్ తగులబడి పోవడం, అందులో 56 మంది చనిపోవడం గురించి మేం మూడు నాలుగు కథనాలు విన్నాం. గోధ్రా రైల్వేస్టేషన్‌లో తగులబడిన ఎస్ 5, ఎస్ 6 పెట్టెలు ఎక్కి నిశితంగా చూశాం. అక్కడ ఉన్న రైల్వే సిబ్బందితో, ప్రజలతో మాట్లాడాం. ఆ కథనాల్లో మేం, మేం మాత్రమే కాదు, మాకంటె ముందు వెళ్లి బాధ్యతాయుతంగా నిజనిర్ధారణ చేసి తాము ధృవపరచుకొని నమ్మిన జస్టిస్ వర్మ, రెబీరో ఏకీభవించిన కథనం మాత్రమే ఇక్కడ చెబుతాను. జస్టిస్ వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా పని చేశారు. ఆషామాషీ మనిషి కాదు. ఇంక రెబీరో సంగతి అయితే వాస్తవానికి పంజాబ్‌లో సిక్కుల ఉద్యమాన్ని అణచడానికి పంపితే పోయిన పోలీసు అధికారి. ఈ పద్ధతి అణచివేతలు ఏ ఉద్యమాన్నీ అరికట్టలేవని తర్వాత పశ్చాత్తాప పడినవాడు.

సబర్మతి ఎక్స్‌ప్రెస్ అయోధ్యలో బయలుదేరి రాత్లాం స్టేషన్ మీదుగా ఖేడాను తగులుతూ గోధ్రా మీదుగా అహ్మదాబాద్ చేరుతుంది. రాత్లాం స్టేషన్ గోధ్రాకు 200 కిలోమీటర్లు పైనే ఉంటుంది. రాత్లాం దగ్గరి నుంచే అందులో ఉన్న రామ కరసేవకులు రైలు ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ విపరీతమైన అల్లరి చేసుకుంటూ వస్తున్నారు. గొడవ పడడం, కొట్టడం, హూలిగానిజం చేస్తూ వస్తున్నారనే విషయం అక్కడ కనీసం రెండు మూడు రైల్వే స్టేషన్‌లలో రైల్వే పోలీసులు కేసులు రిజిస్టర్ చేశారు. మాకు రైల్వే పోలీసులు కూడా చెప్పిన విషయమేమిటంటే, ఎప్పుడో నాగపూర్‌లో సంజయ్ గాంధీ యూత్ కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించినప్పుడు, నాగపూర్ వచ్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, తాము వస్తున్న దారుల్లో రైల్వే ప్లాట్‌ఫారాల మీద హాకర్ల దగ్గర తినుబండారాలు కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా తన్నడం, కొంటె చేష్టలు చేయడం, గొడవలు సృష్టించడం... ఎంత విధ్వంసం చేశారో అంతకంటె ఎక్కువగా ఈ కరసేవకులు చేసారని. దీన్ని ఏమనుకోవచ్చంటే ఆనాడు సంజయ్ గాంధీ యూత్‌కాంగ్రెస్ ర్యాలీకి వచ్చిన యువకులకు ఏ లక్ష్యమూ లేదు, వాళ్లు వట్టి లంపెన్స్. కాని ఇవాళ ఈ గొడవలు చేసిన లంపెన్‌లకందరికీ కూడా స్పష్టమైన పథకం ఉంది. వీళ్లు రామ సేవకులు, వీళ్లంతా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు. వీళ్లకు ముస్లింలపై దాడి చేసి హింసించాలనే సమగ్ర పథకం ఉంది. వీళ్ల చేతులకు త్రిశూలాలివ్వబడ్డాయి. నెత్తికి కాషాయ రిబ్బన్లు కట్టుకున్నారు. ఇవన్నీ మాకు అక్కడ దగ్ధమైన రైలుపెట్టెలో కనిపించాయి. కొంతమంది ముస్లిం యువకులు మాకు చెప్పిందేమిటంటే, రాత్లాం నుంచే కొంతమంది ముస్లిం హాకర్లను ప్లాట్‌ఫారాల మీదే చంపేసి ఆ శవాలను రైల్లో పెట్టుకున్నారు. అలా పేర్చుకున్న శవాలను ఇక నెక్స్ట్ స్టేషన్ గోధ్రా అనగా అక్కడ దిగే కరసేవకులు శవాలను తగులబెట్టి జారుకున్నారని. వాళ్లు చెప్పిన విషయం మాకు అతిశయోక్తిగా అనిపించింది.

కాని రెబీరో మొదలు జస్టిస్ వర్మ దాకా అందరూ నమ్మిన విషయం చెపుతాను. ఇద్దరు జర్నలిస్టులు వెబ్ సైటులో పెట్టిన ఫొటోలు గాని, అంశాలు గాని, వాళ్లు కళ్లారా చూసినవి చాలా నమ్మదగిన అంశాలుగా కనిపిస్తున్నాయి. అవేమిటంటే గోధ్రాకు 70 కిలోమీటర్ల ముందు స్టేషన్‌లో ఒక ముస్లిం వృద్ధుడు హాకర్, అంటే టీ, చిన్న చిన్న వస్తువులు అమ్మే ఆయన మీద పడి అన్ని వస్తువులూ లాక్కొని, అతడు డబ్బులడిగితే అతడి గడ్డం పీకి కొట్టబోతుంటే అక్కడున్న ఓ పదహారేళ్ల అమ్మాయి, అతనికి బంధువు కూడానేమో ఈ కరసేవకులకు అడ్డం పడిందని, అలా అడ్డుపడిన అమ్మాయిని బలవంతంగా ఎత్తుకెళ్లి తమ కోచ్‌లో వేసుకొనిలోపలి నుంచి లాక్ చేసుకున్నారని. ఈ విషయమంతా తర్వాతి స్టేషన్లలో ముస్లింలకు చేరిపోయిందని. వాళ్ళు ఆ అమ్మాయిని చెరబట్టిన పెట్టెను తడుతూ అమ్మాయిని విడుదల చేయమని బతిమాలుకున్నారని. ఒత్తిడి చేసినా వాళ్లు వదలిపెట్టలేదని మాత్రం చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ విషయం వెబ్ సైట్లో ఉంది. రెబీరో నమ్మాడు. జస్టిస్ వర్మ నమ్మాడు. అలా నమ్మడానికి తగిన ఆధారాలు వాళ్లకక్కడ కనిపించాయి.

గోధ్రాకు వచ్చాక కూడా ఆ అమ్మాయిని వదలిపెట్టక పోవడం మాత్రమే కాకుండా, రైల్వే స్టేషన్‌లో చిన్న చిన్న వస్తువులమ్ముకునే ముస్లిం యువకుని దగ్గర వస్తువులు లాక్కొని డబ్బులడిగితే కొట్టారట. ఆ తర్వాత గోధ్రా నుండి రైలు కదిలింది. ఆ దెబ్బతిన్న పిల్లవాడు కదులుతున్న రైల్లో ఇంకో కంపార్ట్ మెంట్ ఎక్కి చైన్ లాగాడు. రైలు గోధ్రా స్టేషన్‌కు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. మేం అక్కడికి వెళ్లి

చూశాం. అక్కడ రైలు వెళ్లే కుడి చేతి వైపున గచ్చా అనే జాతివాళ్లు, ఒక రకంగా ముస్లిం ట్రైబల్ జాతికి చెందిన రైల్వే కార్మికులు పనులు చేసుకుంటారు. ఎడమ చేతివైపున కొంత మధ్యతరగతికి, ఆ పై మధ్యతరగతికి చెందిన ముస్లింల ఇళ్లున్నాయి. కంపార్ట్ మెంటు నిండా అప్పటికే కరసేవకులు పేర్చి పెట్టిన రాళ్లున్నాయి. వాళ్ళ ప్రయాణంలో ముస్లింల ఇళ్లు అని తెలిసిన ఇళ్ల మీద రాళ్లు వేసుకుంటూ వస్తున్నారు. అట్లా ఈ చైన్ లాగడంతో ఆగిపోయిన చోట కూడా ముస్లింల ఇళ్ల మీద రాళ్లు వేయడం మొదలుపెట్టారు. కుడిచేతివైపున పని చేసుకుంటున్న గచ్చా ట్రైబల్స్ వచ్చి ఈ కరసేవకులున్న కంపార్టుమెంట్ మీద దాడి చేసే అవకాశముంది. మరి వాళ్లు ఒకవేళ దాడి చేయాలంటే కంపార్టుమెంటులోపలి నుంచే లాక్ చేయబడి ఉందిగా, బహుశా వాళ్లు ఎదురుదాడిగా కంపార్టుమెంటు కిటికీ అద్దం పగలగొట్టి యాసిడ్ బాంబు వేసి వుండవచ్చు, లేదా మండుతున్న కాగడాలాంటిదేదైనా వేసి ఉండవచ్చు.లోపల కొంత మంటలేస్తే అది ఇంకా అంటుకోవడానికి వీలుంది. అంతకు ముందే వాళ్లు పేలుడుపదార్థాలు పెట్టుకుని వస్తున్నారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఆలోపలున్న పదార్థాలు పేలిపోయాయి.

ఇక్కడ ఈ పేలుడు పదార్థాల గురించి కొంచెం చెప్పుకోవాలి. ఎందుకంటే అలాంటి ఇంక్రిమినేటింగ్ మెటీరియల్ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండదు. మరి కరసేవకుల చేతికెట్లా వచ్చింది? ఒక పద్ధతి ప్రకారం ఇందులో రాజ్యం, ప్రభుత్వం, ట్రేడింగ్ కమ్యూనిటీ మూడూ జమిలిగా కలిసిపోయి ఎట్లా గుజరాత్‌లో ముస్లింల జీవన స్థితిగతులను విధ్వంసం చేయడానికి యాసిడ్ బాంబులు వాడుకున్నాయో చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

గోధ్రా ముస్లింలు మమ్మల్ని తెలుసుకొమ్మన్నది ఏమిటంటే 'వాళ్లు మామీద, మాఇళ్లమీద వేసిన యాసిడ్ బాంబులన్నీ మీ హైదరాబాదు నుంచే వచ్చాయి. అక్కడికి ఏఆర్‌డిఎక్స్ ఫ్యాక్టరీల నుంచి వచ్చినవో, ఎట్లా వాళ్లకి సప్లై అయ్యాయో తెలుసుకొండి' అని. హిందూ మతోన్మాదులు వేసిన యాసిడ్ బాంబులు చాలా ప్రమాదకరమైనవి. ముస్లింలుండే పెద్ద పెద్ద కాలనీల్లో అట్లాంటి బాంబుల్ని వాడారు. అటువంటి బాంబులు సప్లై కావాలంటే ప్రభుత్వం, బ్యూరాక్రాట్లు, టెక్నికల్‌గా చాలా సున్నితమైన సాంకేతిక రంగాలలో ఉండేవాళ్ల సహాయ సహకారాలు ఉంటే తప్ప సాధ్యమయ్యే విషయం కాదు. అలాగే జాఫర్ నివాసముండే కాలనీలోకి కరెంట్ పంపి కరెంటు షాకిచ్చి చంపారు. మరి ఆ ఫైరింజన్లు, ట్రాన్స్ ఫార్మర్లు విధ్వంసం జరిగేచోటికి తరలి రావాలంటే ఎన్ని శక్తులు కలిసొస్తే సాధ్యమయ్యే పరిస్థితో చెప్పండి! ఇదంతా క్షణికోద్రేకంతో, ప్రతీకారభావంతో 'నువ్వు కొడితే నేను కొడతాను' అనే భావనతో జరిగిన సంఘటనేనా? దాదాపు పదివేల గ్యాస్ సిలిండర్లను ఆ విధ్వంసకాండలో ఉపయోగించారు. నౌఖాలీ మతకల్లోలాలలో గాని, యూదుల పట్ల జర్మన్లు గాని కూడా ఇలా వ్యవహరించారో లేదో తెలియదు. బహుశా ఇప్పుడు పాలస్తీనీయుల పట్ల ఇజ్రాయెల్ సైనికులు చేస్తున్న దాడుల్లాంటి వాటితో పోల్చవచ్చునేమో. కనుక ఇదంతా పథకం ప్రకారం సర్వేలు చేసి ముస్లింల ఆర్థిక స్థితిగతులను విచారించి పథకం ప్రకారం నిర్వహించిన మారణకాండ అనేది చాల స్పష్టమే!

యుద్ధనేరాలు, రాజద్రోహాలు, నేరపూరిత కుట్రలు ఆరోపించి విప్లవకారులను, ముస్లింలను ఉరికంబాలు ఎక్కించే మన ఈ వ్యవస్థ ఇంతగా రుజువైన నేరంలో, ఇన్ని వేల మందిని పథకం ప్రకారం చంపిన ఈ ముద్దాయిలకు జీవితఖైదు వేసినందుకే గుండెలు బాదుకునే దేశభక్తులు సెషన్స్ కోర్టులో ఈ మాత్రమైనా ముస్లిం బాధితులకు, ప్రజాస్వామ్యవాదులకు కలిగిన ఊరటను బతకనిస్తారా? ఈ మారణకాండ వెనక ఉన్న ప్రయోజనాన్ని గమనించినప్పుడు ఈ దేశభక్తి వికృత రూపం మరింత జుగుప్స కలిగిస్తుంది. గుజరాత్‌లోని ముస్లింల వ్యాపారాలన్నీ ముఖ్యంగా ఆటోమొబైల్ షాపులు, హోటళ్లు, బేకరీలు వంటివి స్వతంత్రమైనవి, జాతీయమైనవి. ఏ విదేశీ పెట్టుబడులతో నడిచేవి కావు. స్వయంగా వ్యాపారదక్షత కలిగిన ముస్లింలు మరికొందరి తోడు తీసుకొని నడిపించుకుంటున్నవి. అట్లాగే ముందే చెప్పినట్లుగా నరోడా పాటియా వంటి స్థలాలు పేద ముస్లింల ఆవాసాలు. ఈ గడ్డమీద పుట్టి కష్టం చేసుకొని బతుకుతున్నవాళ్లు. విదేశీ కంపెనీల, గుత్తపెట్టుబడుల, విదేశాల్లో ఉన్న గుజరాతీల ప్రయోజనాల కోసం ఇంత విధ్వంసకాండ, నరమేధ మోడీ కనుసన్నల్లో అమలైంది. ఇటువంటి దళారీలకు, దళారీల పాలనలో వలసీకరణ చెందిన బుద్ధిజీవులకు ఆ మోడీ రేపటి దేశ నాయకత్వానికి ఆదర్శ నమూనాగా కనిపించడంలో ఆశ్చర్యమేమున్నది?

(రచయిత విప్లవ రచయితల సంఘం సభ్యులు,
రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు) వీ


యాభై ఏళ్లు కనుమరుగై దొరికిన మావో రచన

చైనా విప్లవోద్యమ క్రమంలో మావో చేసిన అరుదైన గ్రామ అధ్యయన నివేదికను పరిచయం చేస్తున్నారు

ఎన్. వేణుగోపాల్

నవ జనచైనా నిర్మాత మావో సే టుంగ్ విప్లవోద్యమ నిర్మాణంలో భాగంగా ఎన్నో ప్రాంతాలలో గ్రామ అధ్యయనాలు జరిపి దాదాపు ప్రతి అధ్యయనం మీద నివేదికలు తయారు చేశారు. ఆయన సైద్ధాంతిక, రాజకీయ, ఆర్థిక, సైనిక, సాంస్కృతిక రంగాల గురించి విస్తృతంగా రాసిన వందలాది వ్యాసాలలో ఎన్నోచోట్ల వ్యవసాయ, గ్రామీణ అధ్యయనాలను ప్రస్తావించడం తో పాటు, ప్రత్యేకంగా వ్యవసాయ, గ్రామీణ విశ్లేషణలతో కనీసం ఇరవై నివేదికలు, వ్యాసాలు రాశారు. వాటిలో కొన్ని ఆయాకాలాలలో జరిగిన దమనకాండలలోనో, జాగ్రత్త చేయవలసిన వారి నిర్లక్ష్యం వల్లనో మాయమై పోయాయి. కొన్ని మాత్రమే మిగిలి, అచ్చుకెక్కి ప్రస్తుతం లభ్యమవు తున్నాయి. అలా 1930లో ఆయన చైనా ఆగ్నేయ ప్రాంతంలోని జియాంగ్సీ రాష్ట్రంలో క్సున్‌వు కౌంటీని (కౌంటీ అంటే జిల్లాతో సమానమైన పాలనా భాగం) అధ్యయనం చేసి వెంటనే ఒక ఐదు అధ్యాయాల నివేదిక రాశారు. ఈ క్సున్‌వు నివేదికకు 1931లో రాసిన ముందుమాటలో తాను అంతకుముందే కొన్ని గ్రామ అధ్యయనాలు చేశానని, కాని ఆ సమాచారం దమనకాండలో మాయమైపోయిందని రాశారు.

మొదట క్సున్‌వు నివేదికను మరొక పది అధ్యయనాలతో కలిపి 1937లో ప్రచురించాలని అనుకున్నారు గాని ఎందువల్లనో అది జరగలేదు. అప్పుడు మావో రాసిన ముందుమాటలో, ఆ పుస్తకంలో క్సున్‌వు నివేదికతో సహా 11 గ్రామ అధ్యయనాలు ఉన్నాయని మొత్తం జాబితా ఇచ్చారు. చివరికి యేనాన్ లిబరేషన్ పబ్లిషింగ్ హౌజ్ ప్రచురణగా 1941లో 'గ్రామ సర్వేలు' వెలువడేటప్పటికి క్సున్‌వు నివేదిక మాయమైపోయింది. ఆ 1941 పుస్తకానికి రాసిన ముందుమాటలో తాను పోగొట్టుకున్న నివేదికల గురించి మావో ప్రస్తావించారు. ఆ తర్వాత, 1950లో క్సున్‌వు నివేదిక రాతప్రతి దొరికింది. దాన్ని మొత్తంగా పునర్ముద్రించడం అవసరం లేదని, చివరి అధ్యాయాన్ని మాత్రం ప్రచురిస్తే చాలని భావించి మావో స్వయంగా దానికి మెరుగులు దిద్దారు. కాని 1960లో మావో ఏరిన రచనల సంపుటాల ప్రచురణ మొదలయినప్పుడు ఆ అధ్యాయమూ, నివేదికా కూడ కనబడకుండా పోయాయి. అలా ఏరిన రచనల్లో ఆ అధ్యాయం చేరలేదు. ఆ తర్వాత 1970 దశకం చివరలోనో, 1980 దశకం మొదట్లోనో ఆ నివేదిక ప్రతి మళ్లీ దొరికింది. నలభై సంవత్సరాల కింద ప్రచురితమైన 'గ్రామ సర్వేలు' పుస్తకానికి కొత్త కూర్పుగా 'సమగ్ర గ్రామ సర్వేలు' పేరుతో 1982లో చైనీస్ భాషలో ప్రచురించినప్పుడు, దానిలో ఈ క్సున్‌వు నివేదికను కూడ చేర్చారు. దాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేసి, వివరమైన నలభై పేజీల ముందుమాటతో, ముప్పై పేజీల పాదసూచికలతో, మావో అధ్యయనం చేసిన నాటి పటాలతో, ఫొటోలతో కలిపి చైనా చరిత్ర పరిశోధకుడు, ప్రస్తుతం వెస్టర్న్ వాషింగ్టన్ యూనివర్సిటీ చరిత్ర శాఖలో ప్రొఫెసర్ రోగర్ ఆర్ థాంప్సన్ 1990లో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురణగా 'రిపోర్ట్ ఫ్రమ్ క్సున్‌వు' పేరుతో వెలుగులోకి తెచ్చారు.



ఈ నివేదిక మావో తొలి రచనలలో ఒకటి. అది చైనా గ్రామ సీమల గురించి, ప్రజల గురించి, రోజువారీ ప్రజాజీవితం గురించి, అప్పటికే అక్కడ సాగుతున్న వ్యవసాయ విప్లవం గురించి అపారమైన సమాచారాన్ని అందించడం మాత్రమే కాదు, ఒక పరిశీలనాంశాన్ని అర్థం చేసుకోవలసిన సంవిధానాన్ని కూడ సూచిస్తుంది. సార్వత్రిక సమ్మె, కార్మికవర్గం ప్రధానంగా ఉండే సోషలిస్టు విప్లవం వంటి బోల్షివిక్ పంథా, చైనా వంటి వ్యవసాయ ప్రధాన, అర్ధభూస్వామ్య, అర్ధవలస దేశానికి సరిపోకపోవచ్చునని, ఇక్కడ జరగవలసినది వ్యవసాయ విప్లవమని, నూతన ప్రజాస్వామిక విప్లవమని మావో చేసిన ఆలోచనలకు మూలం ఈ గ్రామ అధ్యయనాలలోనే ఉంది. ఆ తర్వాత రెండు మూడు దశాబ్దాలలో మావో చేసిన ఎన్నో ఆలోచనలకు, చేపట్టిన ఎన్నో ఆచరణ రూపాలకు బీజాలు క్సున్‌వు నివేదికలో కనబడతాయి. గ్రామ అధ్యయనాల గురించి, గ్రామాల వర్గ విశ్లేషణ గురించి, రైతాంగంలో విప్లవోద్యమ నిర్మాణం గురించి ఆలోచించే వారెవరైనా తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన పుస్తకం ఇది.

'మనకు ఈ నివేదికలో జిల్లాలోకెల్లా అత్యంత శక్తిమంతుడైన పెద్దమనిషి నుంచి తిండి కోసం కన్నబిడ్డలను అమ్ముకున్న నిరుపేద రైతుల వరకూ వందలాది మంది ప్రజలు తారసపడతారు. ఈ రెండు కొసల మధ్య మరెందరో, ఉప్పు వ్యాపారులూ, ధనిక రైతులూ, భూస్వాములూ, దర్జీలూ, కమ్మరులూ, మాంసం వ్యాపారులూ, బాణసంచా తయారీదారులూ, వేశ్యలూ, ప్రభుత్వాధికారులూ, పదిహేడో శతాబ్దపు పురాతన క్వింగ్ రాజవంశపు బిరుదులు పొందినవారూ, యువ విద్యార్థులూ, కొత్త జీవితం కోసం తపనపడుతున్న మహిళలూ, మావో చిత్రణలో మనకు కనబడతారు. బియ్యం, సారా, పంది మాంసం, చిక్కుడు గుజ్జు ఎంత ఖరీదుకు దొరుకుతాయో, అప్పులు ఎట్లా పుడతాయో, భూమి కౌలు తీసుకోవడానికి దస్తావేజు ఎలా రాయాలో, పన్నులు ఎలా చెల్లించాలో వివరాలు కూడ మనకు తెలుస్తాయి. స్థానిక

పాఠశాలలను, దేవాలయాలను, పూర్వీకుల స్మారక మందిరాలను పేరుపేరునా పరిచయం చేసి చర్చించడం జరుగుతుంది. శిరోజాలంకరణ, వస్త్రధారణ పాతరోజుల్లో ఎలా జరిగేవో, ఇప్పుడెలా జరుగుతున్నాయో, క్రమబద్ధంగా జరిగే సంతలలో ఏయే వస్తువులు అమ్ముతారో కూడ తెలుస్తుంది. మావో సే టుంగ్ దృష్టి నుంచి ఏ చిన్న వివరమూ తప్పించుకున్నట్టు లేదు' అని సంపాదకుడు, అనువాదకుడు థాంప్సన్ తన ముందుమాటలో వ్యాఖ్యానించారు. ఆయనే అన్నట్టు 'చైనా చరిత్రలో అతి ముఖ్యమైన సందర్భంలో ఒక జిల్లాకూ, ప్రాంతానికీ సంబంధించిన సమాజం, ఆర్థికవ్యవస్థ, రాజకీయాలు, చరిత్రల గురించి సమస్త సమాచారమూ ఈ నివేదికలో నిక్షిప్తమయింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన 1921 నుంచి 1927 వరకూ గడిచిన సంక్షుభిత కాలం గురించి కొంచెం అర్థం చేసుకుంటే గాని ఈ నివేదిక ప్రాముఖ్యతను గుర్తించలేం. ఒకవైపు సోవియట్ యూనియన్ మార్గదర్శకత్వం, రష్యా తరహా విప్లవమే చైనాలో కూడ వస్తుందనే అమాయక, యాంత్రిక ఆలోచనలు, జాతీయ బూర్జువా వర్గ ప్రతినిధిగా ముందుకు వచ్చిన కొమింటాంగ్ తో ఐక్యతా ప్రయత్నాలు, యుద్ధప్రభువుల భూస్వామ్య దౌష్ట్యం ఆ దశాబ్దంలో చైనా కమ్యూనిస్టు పార్టీ మీద తీవ్ర ప్రభావం వేశాయి. కమ్యూనిస్టులతో ఐక్యతను కోరుకున్న కొమింటాంగ్ నాయకుడు సన్ యట్ సేన్ మరణించడం, కమ్యూనిస్టులను ద్వేషించే చాంగ్ కై షేక్ ఆధిపత్యానికి రావడం ఆ దశాబ్దంలోనే జరిగాయి. బలం పుంజుకున్న వెంటనే 1927లో చాంగ్ కై షేక్ కమ్యూనిస్టుల మీద విరుచుకుపడి లక్షలాది మందిని ఊచకోత కోశాడు. కొమింటాంగ్ తో ఐక్యత భగ్నమైపోయి కమ్యూనిస్టు పార్టీ ఒంటరి అయిపోయింది. అప్పటి కమ్యూనిస్టు పార్టీ నాయకుడు లీ లిసాన్, వాంగ్ మింగ్ ల విధానాలు చైనా విప్లవాన్ని ఒక ప్రమాదం నుంచి మరొక ప్రమాదంలోకి నెట్టడం మొదలుపెట్టాయి. మావో ఆ విధానాలను వ్యతిరేకిస్తూ చైనాలో జరగవలసిన విప్లవ దిశను పునరన్వేషిస్తూ గ్రామ ప్రాంతాలకు తరలివెళ్లాడు. ఆ క్రమంలోనే లీ లిసాన్, వాంగ్ మింగ్ ల నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ సోవియట్ ప్రాంతాల ప్రతినిధుల జాతీయ మహాసభను షాంఘైలో నిర్వహిస్తూ అందులో పాల్గొనమని మావోను ఎన్నోసార్లు కోరింది. కాని, మావో ఆ ఆహ్వానాన్ని పెడచెవిన పెట్టి జియాంగ్సీ రాష్ట్రంలో విముక్త ప్రాంతాలను, విప్లవోద్యమ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలను అధ్యయనం చేస్తూ ఉండిపోయారు. రైతాంగమే చోదకశక్తిగా విప్లవ నిర్మాణానికి అవకాశం ఉందా, రైతాంగమే శ్రేణులుగా విశాల ప్రజాబాహుళ్య పార్టీని నిర్మించే అవకాశాలున్నాయా అని అధ్యయనం చేస్తూ ఉండిపోయారు. అందులో భాగమే క్సున్‌వు అధ్యయనం.

క్సున్‌వు ప్రాంతంలో 1921 నుంచే కమ్యూనిస్టుల ప్రభావం ఉండింది. 1928లో అక్కడ విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి ప్రయత్నం కూడ జరిగింది గాని కొమింటాంగ్ ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని రక్తపుటేర్లలో ముంచి అణచివేసింది. మార్చ్‌లో ఈ తిరుగుబాటు, అణచివేత జరిగితే, కొద్ది నెలల్లోనే కమ్యూనిస్టులు మళ్లీ తమ శక్తులను కూడదీసుకున్నారు. వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని చేపట్టి, భూస్వాముల భూములు స్వాధీనం చేసుకుని, పంపిణీ చేయడం ప్రారంభించారు. అలా 1930 ఏప్రిల్ నాటికి ఈ ప్రాంతమంతా కమ్యూనిస్టుల అధీనంలోకి వచ్చింది. ఆ స్థితిలో బహుశా మేలో మావో క్సున్‌వు అధ్యయనం ప్రారంభించారు. అప్పటికే స్థానిక నాయకులు చేసిన సర్వేల మీద ఆధారపడి తన నివేదిక తయారు చేయాలని మావో అనుకున్నారు గాని, ఆ పాత సర్వేలలో అవసరం లేని సమాచారమెంతో సేకరించారు. అందుకని 1930 జనవరిలో సమాచార సేకరణకు కొత్త విధివిధానాలు నిర్ణయించారు. ఈ సర్వే సమాచారాన్ని దగ్గర పెట్టుకుని మావో తనదైన పద్ధతిలో స్థానిక ప్రజలతో 'పరిశోధనా సమావేశాలు' ఏర్పాటు చేసి తన నివేదికకు అవసరమైన వివరాలను రాబట్టారు. 'మావోకు కావలసింది వాస్తవాలు మాత్రమే కాదు, అంతకన్న ఎక్కువ. ఆ వాస్తవాలు అలా ఎందుకు ఉన్నాయని అన్వేషించడమే ఆయన పని' అని థాంప్సన్ అంటారు.

క్సున్‌వు నివేదిక రాసిన 1930 నాటికే మావో దాదాపు పదిహేను సంవత్సరాల గ్రామ అధ్యయన అనుభవం సంపాదించి ఉన్నారు. ఆయన ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన సంవిధానం 'పరిశోధనా సమావేశం' (నిజనిర్ధారణ సమావేశం అని కూడ కొన్ని అనువాదాలు ఉన్నాయి). పార్టీ నాయకత్వం ప్రజలతో సంబంధం పెట్టుకోవడానికి, ప్రజల గురించి తెలుసుకోవడానికి, ప్రజల నుంచి తెలుసుకోవడానికీ, ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాపంథా అభివృద్ధి చెందడానికీ ఈ సంవిధానం చాల ఉపయోగపడింది. ఈ సంవిధానం గురించి కూడ మావో 1930లోనే 'పుస్తకపూజను వ్యతిరేకించండి' వ్యాసంలో వివరంగా రాశారు. క్సున్‌వు నివేదికకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి 'పరిశోధనా సమావేశం'లో మావోతో కలిసి పాల్గొన్న వాళ్లు పదకొండు మంది. వాళ్లు ఇరవై రెండేళ్ల నుంచి అరవై ఒక్క ఏళ్ల వయసు వరకూ ఉన్నవాళ్లు. ఎన్నో విషయాల మీద వ్యక్తిగత అనుభవం ఉన్నవాళ్లు. కేవలం సమాచార వనరులు మాత్రమే కాదు, వాళ్లందరూ కూడ అంతకు ముందరి దశాబ్దంలో క్సున్‌వులో జరిగిన సంక్షుభిత చరిత్రలో, విప్లవోద్యమ నిర్మాణంలో, పోరాటాలలో పాల్గొన్నవాళ్లు. అందుకే థాంప్సన్ అన్నట్టు 'మనం ఈ నివేదికను చరిత్ర, మానవ పరిణామ శాస్త్రం, మానవ శాస్త్రం, వాణిజ్యం, వ్యవసాయం, విద్యారంగం వంటి రంగాలను అధ్యయనం చేసే సమాచార వనరుగా భావించడం సరైనదే అయినప్పటికీ, అంతకన్న ముఖ్యంగా ఇది ఒక రాజకీయ దస్తావేజు అని, నిర్మాణమవుతున్న విప్లవ దస్తావేజు అని గుర్తుంచుకోవడం అవసరం.

ఈ అధ్యయనాల క్రమంలోనే మావో పరిశీలనా పద్ధతుల గురించీ, వాస్తవాల సేకరణ గురించీ, విప్లవోద్యమ నిర్మాణంలో ఈ అధ్యయనాలు నిర్వహించే పాత్ర గురించీ, అధ్యయనాల రాజకీయ లక్ష్యం గురించీ చాల విలువైన నిర్ధారణలు, సూత్రీకరణలు చేశారు. విప్లవ పోరాటానికి తగిన ఎత్తుగడలేవో అన్వేషించడమే, పోరాటంలో చోదకశక్తులైన వర్గాలేవో, కలుపుకురాదగిన వర్గాలేవో, కూలదోయవలసిన వర్గాలేవో గుర్తించడమే పరిశోధనా లక్ష్యం అని మావో స్పష్టం చేశారు. మనకు తెలిసిన సిద్ధాంతాన్ని సామాజిక వాస్తవికత మీద రుద్దడం కాకుండా, అట్టడుగు గ్రామస్థాయిలో వాస్తవికంగా ఉన్న స్థానిక ఆధిపత్య సంబంధాలనూ, రాజకీయాలనూ గుర్తించడం కోసమే ఈ అధ్యయనాలు సాగించాలని ఆయన అన్నారు. ఇలా గ్రామీణ స్థానిక ఆధిపత్య సంబంధాలనూ, రాజకీయాలనూలోతుగా అధ్యయనం చేసినందువల్లనే 1930, 40 దశకాలలో కమ్యూనిస్టులు చైనా గ్రామసీమలలో విస్తారమైన ప్రజా సమీకరణ సాధించగలిగారు. వర్గ విశ్లేషణ గురించిన సైద్ధాంతిక

అవగాహనలను, నిర్వచనాలను చైనా సమాజానికి సృజనాత్మకంగా అన్వయించగలిగారు.

క్సున్‌వు నివేదికను పరిశీలించడానికన్న ముందు, అసలు మావో చేసిన గ్రామీణ అధ్యయనాల జాబితాను ఒకసారి చూడాలి. ఆయన తన ఇరవైమూడవ ఏట, 1916లో చాంగ్షాలో ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు మొట్టమొదటి గ్రామీణ అధ్యయనం చేశారు. ఒక స్నేహితుడితో కలిసి హునాన్ రాష్ట్రంలో చాంగ్షా పరిసరాల్లో ఉన్న ఐదు జిల్లాలు కాలినడకన తిరిగి అధ్యయనం చేశారు. అప్పుడు ఆయన రాసుకున్న దినచర్య పుస్తకం చాంగ్షా విద్యార్థులలో చాల ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ పర్యటన గురించి ఆయన అప్పుడే హునాన్ నుంచి వెలువడే పత్రికలో వ్యాసాలు రాశారు. ఆ తర్వాత 1918లో ఆయన పెకింగ్ కు వెళ్లడానికి రైలు ప్రయాణంలో ఉండగా ఎల్లో రివర్ కు వరదలు వచ్చి రైలు ఆగిపోయినప్పుడు ఆ సమయాన్ని ఆయన హెనాన్ రాష్ట్ర పరిస్థితులు అధ్యయనం చేయడానికి వాడుకున్నారు. అలాగే 1920లో చాంగ్షా నుంచి పెకింగ్ కు వెళ్తూ మార్గమధ్యంలో వుహాన్ ప్రాంతంలో పది రోజులు ఆగి స్థానిక పరిస్థితులు అధ్యయనం చేశారు. అదే సంవత్సరం నవంబర్‌లో జియాంగ్సీ రాష్ట్రంలోని పింగ్ క్సియాంగ్ జిల్లాను అధ్యయనం చేశారు. ఏడాది తర్వాత 1921లో మళ్లీ అదే ప్రాంతాన్ని, దానితోపాటే అన్ యువాన్ జిల్లాలో గనికార్మికుల జీవితాలను అధ్యయనం చేశారు. ఈ ప్రాంతాలను 1922 సెప్టెంబర్‌లోనూ, కొద్ది నెలల తర్వాత మరొకసారీ కూడ అధ్యయనం చేశారు. ఇక తన స్వరాష్ట్రం హునాన్‌లో క్సియాంగ్టన్, తదితర ఐదు జిల్లాల్లో 1927లో చేసిన అధ్యయనం, అంతకు మూడు సంవత్సరాల ముందు ఆ ప్రాంతంలోనే చేసిన అధ్యయనాల నోట్స్ తో కలిపి ఆయన రాసిన 'హునాన్ రైతాంగ ఉద్యమంపై నివేదిక' 1927 మార్చ్‌లో అచ్చయి సుప్రసిద్ధమయింది. ఆ తర్వాత జరిగిన దమనకాండలో కొండప్రాంతాలకు వెళ్లిన మావో జియాంగ్సీ రాష్ట్ర పశ్చిమ ప్రాంతంలో అధ్యయనాలు జరిపి మరొక రెండు నివేదికలు రాశారు. అయితే 1927లో ఆయన రాసిన ఈ నివేదికలన్నీ కనబడకుండా పోయాయి.

తాను హునాన్ ప్రాంతంలో చేసిన ఐదు అధ్యయనాల నివేదికలను తన భార్య యాంగ్ కైహుయి దగ్గర పెట్టానని, 1930లో కొమింటాంగ్ సైనికులు ఆమెను చంపివేసినప్పుడు అవి ధ్వంసమైపోయి ఉంటాయని, అలాగే తాను జియాంగ్సీ ప్రాంతంలో చేసిన రెండు అధ్యయనాల నివేదికలను, 1929లో ఎర్రసైన్యం జింగాంగ్షాన్ ను వదిలి వచ్చేటప్పుడు మరొక స్నేహితుడి దగ్గర పెట్టానని, అవి కూడ పోయాయని, క్సున్‌వు నివేదిక ముందుమాటలో మావో చాల విచారంగా రాశారు. 'వస్తువులు పోగొట్టుకున్నందుకు నేను ఎప్పుడూ విచారించలేదు. కాని ఈ అధ్యయనాలు (ప్రత్యేకించి హెంగ్షాన్ గురించీ, యాంగ్సిన్ గురించీ చేసినవి) మాయమైపోవడం మాత్రం నాకు చాల బాధ కలిగించింది. వాటిని నేను ఎన్నటికీ మరచిపోలేను' అని ఆయన 1931 ఫిబ్రవరిలో రాశారు. ఆ తర్వాత 1934 సెప్టెంబర్‌లో ఆయన జియాంగ్సీ రాష్ట్రంలోని యుదు జిల్లాను అధ్యయనం చేశారు. తర్వాత కొద్దిరోజులకే లాంగ్ మార్చ్ ప్రారంభమయింది. ఇక విప్లవ విజయం వరకూ గాని, విప్లవానంతరం గాని ఆయనకు ప్రత్యక్షంగా గ్రామ అధ్యయనాలు సాగించడానికి అవకాశం దొరికినట్టు లేదు గాని, 1960ల దాకా కూడ ఆయన గ్రామ అధ్యయనాల గురించి రాస్తూనే ఉన్నారు.

ఇక మావో రాసిన క్సున్‌వు నివేదికను చూస్తే, ఇది ఒక చిన్న, మూడు పేజీల ముందుమాటతోపాటు, క్సున్‌వులో పరిపాలనా విభాగాలు, క్సున్‌వులో రవాణా, సమాచార సంబంధాలు, క్సున్‌వులో వాణిజ్యం, క్సున్‌వులో సాంప్రదాయిక భూసంబంధాలు, క్సున్‌వులో భూపోరాటం అనే ఐదు అధ్యాయాల, 173 పేజీల నివేదిక. ముందుమాటలో తాను అప్పటికే చేసిన అధ్యయనాల గురించి, పోగొట్టుకున్న సమాచారం గురించి చెప్పిన తర్వాత, అప్పటికి ధనిక రైతుల గురించీ, వాణిజ్యం గురించీ తన పరిజ్ఞానం సంపూర్ణంగా లేకుండిందనీ, అందువల్లనే ఈ పరిశీలన జరపవలసి వచ్చిందనీ మావో వినయంగా రాశారు. పరిశోధనా సమావేశాలలో తనతో పాల్గొన్న పదకొండు మంది గురించీ వివరంగా రాశారు. చివరిగా, ఈ నివేదికలో ఒక పెద్దలోపం ఉన్నదనీ, అది మధ్యతరగతి రైతుల గురించీ, జీతగాళ్లు–రోజుకూలీల గురించీ, దేశదిమ్మరుల గురించీ విశ్లేషించలేదని, అలాగే సాంప్రదాయిక భూసంబంధాలు అధ్యాయంలో ధనిక రైతులు, మధ్యతరగతి రైతులు, పేద రైతుల భూకమతాల గురించి ప్రత్యేక చర్చ జరపలేకపోయానని కూడ రాశారు.

మొదటి అధ్యాయం 'క్సున్‌వులో పరిపాలనా విభాగాలు' మొత్తం పుస్తకంలోకి చాల చిన్నది. దానిలో మావో కేవలం క్సున్‌వు కౌంటీలో ఏయే పరిపాలనా విభాగాలు ఉన్నాయో. ఈ కౌంటీ ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడిందో వివరించారు.

రెండో అధ్యాయం 'క్సున్‌వులో రవాణా, సమాచార సంబంధాలు'లో ఆ ప్రాంతంలోని నదీజల రవాణా మార్గాల గురించి, రహదారుల గురించి, టెలిగ్రాఫ్, పోస్టల్ సౌకర్యాల గురించి, కౌంటీలో ప్రయాణ సాధనాల గురించి వివరించారు.

మూడో అధ్యాయం 'క్సున్‌వులో వాణిజ్యం'లో ఈ కౌంటీ నుంచి ఇతర కౌంటీలకు ఎగుమతి అయ్యే సరుకుల గురించీ, ఇతర కౌంటీల నుంచి దిగుమతి అయ్యే సరుకుల గురించీ చాల సూక్ష్మమైన వివరాలు రాశారు. బియ్యం, తేయాకు, సోయా చిక్కుళ్లు, తేయాకు నూనె, కోళ్లు, ఎద్దులు, పందులు, విదేశీ సరుకులు, సముద్రాహార పదార్థాలు, ఉప్పు, కిరోసిన్, బట్టలు, పంచదార, పిండి, కాగితం, కలప, పుట్టగొడుగులు వంటి సరుకులన్నీ ఏయే పరిమాణాలలో ఎగుమతి, దిగుమతి అవుతాయో, వాటి విలువ ఎంతో వివరంగా నమోదు చేశారు. ఎద్దుల అంగళ్లు ఎప్పుడెప్పుడు జరుగుతాయో, అక్కడ ఎన్నెన్ని ఎద్దులు అమ్మకం – కొనుగోలు అవుతాయో, ఎంత డబ్బు చేతులు మారుతుందో వివరించారు. 'విదేశీ సరుకులు' అనే పేరుతో ఈ అంగళ్లలో అమ్ముడయ్యే వస్తువులన్నీ నిజంగా విదేశీవి కావని, కాని వాటిని అలా పిలవడం ఆనవాయితీ అని రాశారు. క్సున్‌వులోని ప్రధాన మార్కెట్లను, అక్కడ జరిగే లావాదేవీలను వివరించారు.

గ్రామీణ ప్రాంతాల గురించి వివరణ అయిపోయాక క్సున్‌వు నగరంలో జరిగే వాణిజ్యం గురించి కూడ చాల వివరాలు నమోదు చేశారు. ఈ క్రమంలో వాణిజ్యం గురించి ఎందుకు తెలుసుకోవాలో వివరిస్తూ, చాల మంది కామ్రేడ్స్ కు ఈ విషయాలు తెలియనందువల్ల వర్తక బూర్జువా వర్గంతో ఎలా వ్యవహరించాలో తెలియడం లేదని, అందుకే తానది తెలుసుకోదలచుకున్నానని, కాని ఆలోపలి విషయాలు చెప్పేవారు అంతవరకూ దొరకలేదని రాశారు. ఇప్పుడు క్సున్‌వులో స్థానిక నాయకుడు కామ్రేడ్ గు బో ఇద్దరు పెద్దమనుషులను పరిచయం

చేశాడని, వారిలో ఒకరు వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు, మరొకరు కౌంటీ సోవియట్ అధికారిగా పనిచేసినవారని, వారివల్ల చాల విషయాలు తెలిశాయని మావో రాశారు.

'మనకు గ్రామీణ సమస్యల అధ్యయనం ఎటువంటిదో పట్టణ సమస్యల అధ్యయనం కూడ అటువంటిదే. ఒక స్థలాన్ని అధ్యయనం చేయడంలో మనం ఏ ఒక్క అంశాన్నీ వదలగూడదు. (ఈ వాక్యం ఎంత ముఖ్యమైనదో చెప్పడానికి మావో దీని కింద గీత గీశారు). అలా ఒక స్థలం గురించి అధ్యయనం చేసిన తర్వాత మనకు మరొక స్థలం గురించి అధ్యయనం చేయడం, సాధారణ పరిస్థితులను అర్థం చేసుకోవడం సులభమవుతుంది. ఒక కామ్రేడ్ చెప్పినట్టు ఏదో ఒక చోటికి వెళ్లడం, యథాలాపంగా ప్రశ్నలు అడగడం అనే పద్ధతి పెట్టుకుంటే, గుర్రం మీద కూచుని పూలను పరిశీలించినట్టు ఉంటుంది. అలా చేస్తే జీవితాంతం ప్రయత్నించినా ఒక సమస్యనులోతుగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఆ అధ్యయన పద్ధతి స్పష్టంగా సరైన పద్ధతి కాదు' అని మావో ఇక్కడ రాశారు.

నగర పరిశీలనలో ఆయన ప్రత్యేకంగా ప్రజలు వాడే ప్రధాన వస్తువులు ఒక్కొక్కటీ తీసుకుని వాటి వాణిజ్యాన్ని వివరించారు. ఉప్పు, సాధారణ వస్తువులు (ఈ శీర్షిక కింద 131 సరుకులు ఇచ్చారు), మిల్లు బట్టలు, చేనేత బట్టలు, పొగాకు, తినుబండారాలు, సాంబ్రాణి, పూజాద్రవ్యాలు, బాణసంచా, నూనెలు, సోయా చిక్కుళ్లు, మాంసం, సారా, సముద్ర ఆహార పదార్థాలు, కూరగాయలు, మిరియాలు, పళ్లు, ఔషధ దినుసులు, గొడుగులు వంటి సరుకులు అమ్మే దుకాణాలు నగరంలో ఎన్ని ఉన్నాయో, అవి రోజుకు, నెలకు, సంవత్సరానికి ఎంత వ్యాపారం చేస్తాయో, ఆ దుకాణాలలో ఎంత మంది పనివాళ్లున్నారో, యజమానులెవరో సమస్త విషయాలూ మావో సేకరించి, ఈ నివేదికలో నమోదు చేశారు. అలాగే దర్జీలు, వడ్రంగులు, పూటకూళ్ల ఇళ్లు, చిక్కుడు గుజ్జు అమ్మే దుకాణాలు, క్షౌరశాలలు, కమ్మరులు, బాణసంచా తయారీదారులు, నగల దుకాణాలు, తగరపు పనివాళ్లు, గడియారాల మరమ్మత్తు దుకాణాలు (1930లో క్సున్‌వు జనాభా ఒక లక్షా ఇరవై వేలు కాగా, అందులో రెండు శాతం మందికి, అంటే 2,400 గడియారాలు ఉన్నాయట), క్రమబద్ధంగా ఆయారోజుల్లో జరిగే సంతలు, వేశ్యలు (2,700 జనాభాగల క్సున్‌వు నగరంలో 30,40 వేశ్యాగృహాలున్నాయట), ప్రభుత్వాధికారులు, దేశదిమ్మరులు, మతాధికారులు వంటి అన్ని విషయాల గురించీ ఈ అధ్యాయంలో మావో కళ్లకు కట్టినట్టు వివరించారు.

నాలుగో అధ్యాయం 'క్సున్‌వులో సాంప్రదాయిక భూసంబంధాలు' భూఆదాయాన్ని, పంటలో వారికి అందే వాటాను బట్టి గ్రామీణ జనాభాను వర్గాలుగా విశ్లేషించడంతో మొదలవుతుంది. గ్రామీణ జనాభాను మావో ఇక్కడ భూస్వాములు, మధ్యతరగతి భూస్వాములు, చిన్న భూస్వాములు, ధనిక రైతులు, మధ్యతరగతి రైతులు, పేద రైతులు, శారీరక శ్రమ చేసే వృత్తిపనివారు, దేశదిమ్మరులు, జీతగాళ్లు–రోజుకూలీలు అనే తొమ్మిది విభాగాల కింద విభజించారు. విప్లవానికి ముందు మత, భూస్వామ్య సంస్థల చేతుల్లో 40 శాతం, భూస్వాముల చేతుల్లో 30 శాతం, రైతుల చేతుల్లో 30 శాతం భూమి ఉండేదని మావో చెపుతారు. చైనా సమాజ ప్రత్యేకతగా వంశాల పేరుమీద ఉమ్మడి ఆస్తిగానూ, ఊరుమ్మడి భూమిగానూ, మత, ధార్మిక సంస్థల పేరుమీదా, దేవాలయాల పేరుమీదా, విభిన్న బౌద్ధశాఖల పేరుమీదా భూమి ఉండేది. దాన్ని కౌలుకు సాగు చేసుకోవడానికి రైతులకు ఇచ్చేవారు. వ్యవసాయ మిగులును భూస్వాములు హస్తగతం చేసుకోవడానికి అక్రమ కౌలు రూపాలు మాత్రమే కాక, ఇతర అనేక దోపిడీ రూపాలు ఉండేవి. మావో చాల వివరంగా ఆ రూపాలన్నిటినీ చర్చించారు.

మొత్తం భూమి గురించీ, భూసంబంధాల పద్ధతుల గురించీ వివరించిన తర్వాత కౌంటీలో ఉన్న ఎనిమిది మంది పేరుపొందిన పెద్ద భూస్వాముల గురించి, పన్నెండు మంది ఇతర పెద్ద భూస్వాముల గురించి పేరుపేరునా వివరాలు తెలియజేశారు. 'వీరందరి గురించి పేరుపేరునా ఎందుకు రాశాను? ఆ వర్గపు రాజకీయ వైఖరి ఏమిటో అర్థం చేసుకోవడానికి. మనం ఆ ఉదాహరణలు ఇవ్వకపోతే, ఆ వర్గపు దృక్పథం గురించి స్పష్టంగా చెప్పలేం. పెద్ద భూస్వాములకూ మధ్యతరగతి భూస్వాములకూ మధ్య విభజనరేఖ గీయడం ఎందుకంటే ఈ మధ్యతరగతి భూస్వాములకు అటు పెద్ద భూస్వాములతో పోల్చినా, ఇటు చిన్న భూస్వాములతో పోల్చినా స్పష్టంగా చూపదగిన రాజకీయ దృక్పథం ఉంది' అని మావో వివరణ కూడ రాశారు. అందుకే, ఆ కౌంటీలోని ఒక్కొక్క జిల్లాలో ఉన్న 113 మంది మధ్యతరగతి భూస్వాముల గురించి కూడ వివరంగా రాశారు. పెద్ద, మధ్యతరగతి భూస్వాములకు ఉత్పత్తి పట్ల, రాజకీయాల పట్ల ఉండే విభిన్న దృక్పథాలను కూడ మావో వివరంగా చర్చించారు. మధ్యతరగతి భూస్వాములను కూడ మళ్లీ సూక్ష్మంగా పరిశీలించాలనీ, వారిలో ప్రగతిశీలవాదులు (పెట్టుబడిదారీ విధానం ప్రభావంలో ఉన్నవాళ్లు), తటస్థులు (సగం కొత్త, సగం పాత), పాత అభిప్రాయాలు, జీవనసరళి ఉండే భూస్వామ్య వాదులు అనే మూడురకాలు ఉన్నారనీ మావో రాశారు.

ఈ వివరణలో భూస్వాములందరినీ కట్టగట్టి శత్రువులుగా చూడడం కాకుండా, విడివిడిగా ఒక్కొక్క భూస్వామి గురించీ 'విప్లవ ప్రతీఘాతకుడు', 'తనపని తాను చూసుకునేవాడు', విప్లవ ప్రతీఘాతకుడు కాదు', 'ఈలోకం పట్టని వాడు', 'విప్లవానికి అనుకూలుడు', 'వడ్డీవ్యాపారిగా ప్రారంభమయ్యాడు, కాని ప్రస్తుతం విప్లవ వ్యతిరేకి కాదు', 'నిజాయితీపరుడు', 'పిసినారి' అని నిర్ధారణలు చేశారు.

విప్లవ క్రమంలో ఈ భూస్వాముల భూములు స్వాధీనం చేసుకుని పంచడం గురించి, వారిలో కొందరిని చంపివేయడం గురించి, వారి మీద జరిమానాలు విధించడం గురించి కూడ మావో రాశారు. ఒక మధ్యతరగతి భూస్వామి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కూడ అయ్యాడని, ఆయనను బందిపోట్లు కాల్చేశారని మావో రాశారు. వీరిలో ఒక మధ్యతరగతి భూస్వామి కొడుకు రైతు సంఘంలో చేరినప్పటికీ, పొరపాటు అంచనావల్ల రైతులు ఆయనను కాల్చిచంపారని కూడ మావో రాశారు.

తర్వాత చిన్న భూస్వాముల గురించి వివరిస్తూ వారిలో చాలమందికి చిన్న చిన్న వ్యాపారాలు ఉన్నాయని, పిల్లలకు చదువు చెప్పిస్తున్నారని, సహకార సంఘాలు ఏర్పాటు చేస్తున్నారని రాశారు. వారిలో అటు పెట్టుబడిదారీ ఆలోచనల వైపు మళ్లడానికైనా, ఇటు విప్లవం వైపు రావడానికైనా తగిన ప్రగతిశీల భావాలు, ముందుచూపు ఉన్నాయని

విశ్లేషించారు. అలాగే ఈ వర్గంలోని ఒక చిన్న భాగం అత్యంత తీవ్రమైన విప్లవ వ్యతిరేక శక్తిగా మారుతున్నదని, పేదరైతుల దృష్టిలో వీరే ప్రధాన శత్రువుగా ఉన్నారని కూడ రాశారు. ఆ తర్వాత ధనిక రైతాంగం గురించి, పేద రైతుల గురించి, కొండ ప్రాంతాలలో భూసంబంధాల గురించి వివరించారు.

ఈ అధ్యాయంలో మిగిలిన భాగాన్ని మావో ఆ ప్రాంతంలో ప్రజల మీద దోపిడీ జరిగే పద్ధతులను వివరించడానికి వాడుకున్నారు. భూమి కౌలు రూపంలో దోపిడీ (పొత్తు, కౌలు, కౌలు రేట్లు, భూమి కౌలు పద్ధతులు, పన్నులు, నజరానాలు, విందులు, ధాన్యరూప కౌలు, ద్రవ్యరూప కౌలు, స్థిర కౌలు, అస్థిర కౌలు, భూమి క్రయ విక్రయాలు, భూమి ధరలు), అధిక వడ్డీ రేట్ల రూపంలో దోపిడీ (డబ్బు అప్పు వడ్డీ రేట్లు, ధాన్యం అప్పు వడ్డీ రేట్లు, తేయాకు నూనె అప్పు వడ్డీ, పిల్లల అమ్మకాలు, పొదుపు, పరపతి సంస్థల ఏర్పాటు), పన్నులు, సుంకాల రూపంలో దోపిడీ (భూమి శిస్తు, ప్రభుత్వ కౌలు, సాంప్రదాయిక పన్ను, భూబదిలీ పన్ను, దస్తావేజు పన్ను, రశీదు రుసుము, పండగ పన్ను, పొగాకు పన్ను, సారా పన్ను, కబేళా పన్ను, వ్యాపార పరిరక్షణ పన్ను, అమ్మకపు పన్ను, ఎద్దు పన్ను, జూదం పన్ను, వ్యభిచార పన్ను) లాంటి పన్నులను, రుసుములను వివరంగా చర్చించి వాటి ద్వారా మొత్తంగా ఎంత ధనం పోగు పడేదో, ప్రభుత్వ ఆదాయ వ్యయాల వివరాలు ఏమిటో కూడ మావో రాశారు.

ఈ అధ్యాయంలో చివరిగా క్సున్‌వులో సంస్కృతి అనే శీర్షిక కింద అక్షరాస్యత గురించి, విద్యాస్థాయి గురించీ, పాఠశాలలు, కళాశాలల గురించీ రాశారు. విప్లవ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి జనావాసంలోనూ పాఠశాలలు ఏర్పాటు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి కూడ రాశారు.

ఐదో అధ్యాయం 'క్సున్‌వులో భూపోరాటం'లో భూపంపకం సమస్యను పార్టీ ఎలా పరిష్కరించిందో వివరంగా చర్చించారు. ఒక విషయం గురించిన అవగాహనలు వర్గపోరాట క్రమంలో ఎలా మారుతూ, పదునెక్కుతూ ఉంటాయో చూడడానికి ఈ అధ్యాయం గొప్ప ఉదాహరణ. భూపంపిణీ జరిపేటప్పుడు ఏ ప్రాతిపదిక ఉండాలి? తలకు ఇంత భూమి సమానంగా పంపిణీ చేయడం సమానత్వం అవుతుందా, మనుషుల ఉత్పాదకతను బట్టి వారికి భూమి కేటాయింపు జరగాలా, ఆ మనుషుల ఆర్థిక వనరులను ప్రాతిపదికగా తీసుకుని పంపిణీ జరపాలా, భూసారాన్ని బట్టి పంపిణీ జరపాలా – ఈ నాలుగు ప్రశ్నలకు జవాబులు వెతకడంలో పార్టీ ఎలా పరిణతి చెందిందో మావో వివరించారు. అలాగే కొండ ప్రాంతాల, అటవీ ప్రాంతాల భూముల పంపిణీ గురించి కూడ వివరంగా చర్చించారు. చెరువులను, నివాసగృహాలను పంపిణీ చేయాలా వద్దా అనే సమస్యలను చర్చించారు. భూపంపిణీ జరిపేటప్పుడు ప్రాతిపదికగా తీసుకోవలసినది గ్రామమా, మండలమా అనే ప్రశ్నా ఉంది. ఇంతకాలం వ్యవసాయంతో, శారీరక శ్రమతో సంబంధం లేని దేశదిమ్మరులకు, వేశ్యలకు, రైతులు కానివారికి భూమి ఇవ్వాలా లేదా, ఒక్కొక్క వ్యక్తికి అందే భూమి మనుగడకు సరిపోతుందా, సరిపోకపోతే అదనపు జీవనోపాధి ఎలా కల్పించాలి, ఊరుమ్మడి భూములు ఉంచాలా లేదా వంటి సమస్యలూ చర్చకు వచ్చాయి. భూపంపిణీ ఎంత వ్యవధిలో సాధ్యమవుతుంది, భూపంపిణీలో న్యాయంగా ఉండడం ఎట్లా, న్యాయమైన పంపిణీని వ్యతిరేకించేవారెవరు, పంట వేసిన తర్వాత పంపిణీ జరిగితే ఆ పంట ఎవరికి చెందుతుంది లాంటి ప్రశ్నలను కూడ మావో చర్చించారు. పాత అప్పులను, రుణ పత్రాలను రద్దు చేయడం గురించి, భూమి శిస్తును కొత్త పద్ధతిలో విధించడం గురించి కూడ చర్చించారు. చిట్టచివరిగా భూపోరాటంలో మహిళలు అనే శీర్షిక కింద విప్లవానికి ముందు ఉత్పత్తిలో మహిళల పాత్ర, విప్లవంలో మహిళల పాత్ర, విప్లవ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా విముక్తి కోసం నాయకత్వం తీసుకున్న చర్యలు, వాటిలోలోటుపాట్లు, ఆ చర్యలను అతి తక్కువ కాలంలోనే నాలుగు సార్లు మార్చవలసివచ్చిన తీరు గురించి మావో వివరించారు.

మొత్తం మీద క్సున్‌వు నివేదిక చదవడం ఒక గొప్ప, ఉత్తేజకరమైన, ఆలోచనాస్ఫోరకమైన అనుభవం. ఇది ఎప్పుడో ఎనభై సంవత్సరాల కింద రాసిన, ముప్పై సంవత్సరాల కింద అచ్చయిన కాలం చెల్లిన పుస్తకం కాదు. సామాజిక పరివర్తన మీద ఆసక్తి ఉన్నవారు ఇవాళ్టికీ ఆలోచించవలసిన ఎన్నో అంశాలు ఇందులో ఉన్నాయి. భారత సామాజిక వాస్తవికతకు, భారత విప్లవానికి అవసరమైన వర్గ విశ్లేషణకు, గ్రామ అధ్యయనానికి, సైద్ధాంతిక అన్వయానికి సమానమైన అంశాలు ఈ నివేదికలో ఎన్నో చోట్ల కనబడతాయి. మావో రాసినందువల్ల, యాభై ఏళ్లు కనుమరుగై మళ్లీ దొరికిన అరుదైన రచన అయినందువల్ల మాత్రమే కాదు, ఒక అద్భుతమైన విప్లవోద్యమ నిర్మాణంలో అత్యంత కీలకమైన ఆధారంగా ఈ పుస్తకానికి చాల ప్రాధాన్యత ఉంది. ఇరవయో శతాబ్ది చరిత్రలో ఒక వ్యవసాయ సమాజంలోని రైతాంగాన్ని, గ్రామీణ ప్రాంతాలను ఏ ప్రేరణలు విప్లవం వైపు నడిపించాయో తెలియజెప్పే పుస్తకం ఇది. మన సమాజంలోని రైతాంగ స్థితిగతుల మీద, గ్రామ అధ్యయనాల మీద, విప్లవోద్యమ నిర్మాణం మీద ఆసక్తిగలవాళ్లందరూ తప్పనిసరిగా చదవవలసిన, సృజనాత్మకంగా అన్వయించుకోవలసిన నివేదిక ఇది.

(గ్రామ అధ్యయన పద్ధతుల మీద గత ఎనిమిది సంచికలలో ధారావాహికగా రాసిన వ్యాసం కోసం పరిశోధనలో భాగంగా సహజంగానే చైనాలో విప్లవ క్రమంలోనూ, విప్లవానంతరమూ మావో సేటుంగ్ నాయకత్వాన సాగిన గ్రామ పరిశీలనలన్నిటినీ మళ్లీలోతుగా చదవడం జరిగింది. ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, బీజింగ్ ప్రచురించిన మావో సెలెక్టెడ్ వర్క్స్ ఐదు సంపుటాలు, శ్రామికవర్గ ప్రచురణలు, హైదరాబాద్ ప్రచురించిన మరి నాలుగు సంపుటాలు చూస్తే వాటిలో గ్రామీణ అధ్యయనాల మీద మావో రచనలు దాదాపు పదిహేను కనబడ్డాయి. ఇంకా పరిశోధిస్తుండగా గూగుల్ బుక్స్ ద్వారా ఈ 'రిపోర్ట్ ఫ్రమ్ క్సున్‌వు' గురించి తెలిసింది. గూగుల్ బుక్స్‌లో థాంప్సన్ ముందుమాట మాత్రమే ఉంది గాని, మావో నివేదిక మొత్తం లేదు. ఆ పుస్తకం ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తున్నప్పుడు వెంటనే ఆ పుస్తకం కొని పంపించి, ఈ ప్రయత్నానికి సహకరించిన మిత్రుడు, అమెరికాలోని ఒహైయోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి. రంజిత్‌కు కృతజ్ఞతలు)

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

కసబ్.. మా దేశభక్తి ముందు నీవెంత?

***నేర సంస్కృతి పుట్టడానికి, వికసించడానికి, విస్తరించడానికి కారణమవుతున్న వ్యవస్థలను ఉరి తీయాలి తప్ప, వ్యక్తులను కాదని అంటున్నారు* పాణి**

ఈ పవిత్ర భారతదేశం పట్ల అపారమైన భక్తి భావంతో సదా మసలే అశేష ప్రజానీకం నన్ను దేశద్రోహి అన్నాసరే నీ ఉరిశిక్షను అంగీకరించలేను. ఈ దేశంలోని గాలి, నీరు, చెట్టు, చేమా అంతా దుమ్మెత్తిపోసినా సరే నేను నీ ఉరి శిక్షను ధిక్కరిస్తాను. గౌరవనీయులైన అత్యున్నత న్యాయాధిపతి అన్నట్లు నీవు నరరూప రాక్షసుడివే కావచ్చు. కించిత్ పశ్చాత్తాపం లేనివాడివే కావచ్చు. పాకిస్తాన్ దేశభక్తిని చాటుకోడానికే 166 మంది ప్రాణాలు తీసినవాడివే కావచ్చు. ఇవన్నీ నిజమే అయినా నీ ఉరి శిక్షను నేను ఒప్పుకోను. కానీ, ఏం చేద్దాం చెప్పు..! తెల్లారి లేచింది మొదలు పెళ్లాం బిడ్డల గురించి తప్ప ఏనాడు దేశం గురించి ఆలోచించనివాళ్లందరిలో నీవు ఎంతటి దేశభక్తిని తట్టి లేపావు? పక్కవాడి గురించి కలలో కూడా తలచనివాడికి నీవు బోలెడు సామాజిక స్పృహను అందించావు. మానవతకు స్పెల్లింగ్ కూడా తెలియనివాళ్లకు మానవతా పూనకం పురిపెట్టి ఎక్కించావు. నీవు అన్యాయంగా అంతమందిని పొట్టనపెట్టుకొని మా సమాజాన్ని ఎంత సెన్సిటైజ్ చేశావో చూడు!

పామరులేగాదు.. సకల విద్యాపారంగుతులు.. అనుక్షణం లోకరీతి గురించి ప్రవచించేవాళ్లు... తమ విశ్వాసాలను ఏనాడూ తరచి చూసుకోని దృఢ చిత్తులు... అందరూ నీ ఉరి వార్తను ఎంత సెలబ్రేట్ చేసుకున్నారో! ముసల్మాన్లకు రంజాన్ వచ్చిందిగాని, ఇటీవల పండగ మొగం ఎరుగని హిందూ బంధువులందరికీ మా దేశ అత్యున్నత న్యాయస్థానం బోనస్‌గా నీ ఉరిని గ్యారంటీ చేస్తూ ఒక పండుగను వాగ్దానం చేసింది. నీవు ఏం చేశావో.. మినిమం సమాచారం తెలియనివాళ్లు కూడా నీ ఉరి వార్తను విని.. 'వాళ్లంతే.. రాక్షస సంతతి..అదే సరైన శిక్ష..' అని ఎంత పరవశించారో! సరిగ్గా న్యాయమూర్తిగారు అన్నట్టే.. నీకు ఉరి తప్ప మరో శిక్ష లేదని మా పౌర సమాజమంతా కోడై కూస్తోంది. బ్రిటీష్‌వాడు ఇచ్చి పోయిన ఇండియన్ పీనల్ కోడ్ ఒరలో ఉరి శిక్షను నీలాంటి వాళ్ల కోసమే మేం భక్తిగా దాచి ఉంచుకున్నాం.

నిన్ను మేం అన్యాయంగా ఉరి తీస్తున్నామని నీవేమైనా అనుకుంటున్నావా? ఈ ఆఖరి గడియల్లో ఈ ఒక్క విషయంలోనైనా పునరాలోచించు. నిన్ను మేం రాజ్యాంగబద్ధంగా ఉరి తీస్తున్నాం. ఘనత వహించిన భారత రాజ్య వ్యవస్థకు నీవు సవాల్ విసిరావు. కాబట్టి నిన్ను రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా ఉరి తీస్తున్నాం తెలుసా? ఇదే మీ లాంటి బర్బర దేశంలో సాధ్యమా ఊహించుకో?

మేం ఏ పని చేసినా రాజ్యాంగబద్ధంగానే చేస్తాం. నీవు ఈ దేశంపై యుద్ధానికి దిగావని మా దేశభక్తుల చార్జిషీట్. నీవెంత మందిని చంపావు? అదే మేం అయితే రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింపు చేస్తూ పార్లమెంట్‌లో సెజ్‌ల చట్టం తెచ్చి వేలాది మంది రైతులను భూమి నుంచి తరిమి తరిమి కొట్టి కంపెనీల పునాదుల్లో సమాధి చేస్తాం. నీవు ఎంత మందిని చంపావు? అదే మేం అయితే రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ పాలన కోసం నిత్యం ఆసేతు హిమాచలం దొరికిన వాళ్లను దొరికినట్లు కాల్చిపారేస్తాం. వందలా.. వేలా.. మాకు లెక్కేలేదు. నీవు ఎంత మందిని చంపావు? అదే మేమైతే అభివృద్ధి పేరుతో ఊళ్లకు ఊళ్లు శ్మశానాలు చేసి పారేస్తాం. ఇవేవీ మావాళ్లు అన్యాయంగా చేయలేదు. రాజ్యాంగమే ప్రమాణంగా, పార్లమెంటే సాక్షిగా ఒక పద్ధతి ప్రకారం చేస్తాం. మా దేశం మాకు ఇచ్చేయమన్నందుకు దశాబ్దాల తరబడి లక్షలాది సైన్యాన్ని కాశ్మీరం మీద ఉసిగొల్పి వేలాది మందిని చంపేసైనా సరే రాజ్యాంగం ప్రకారమే మా అఖండ దేశ స్వప్నాన్ని నిజం చేసుకుంటున్నాం. అందుకే మా సగటు భారతీయుడికి ఇవన్నీ జరిగి తీరాల్సిన సత్కార్యాలని గట్టి నమ్మకం. ఇవన్నీ జరుగుతున్నప్పుడు దేశభక్తులైన మా మేధావులు సుబ్బరంగా దుప్పటి ముసుగేస్తారు. జాతీయతను, రాజ్యాంగవిలువలను, భారతమాత ఔన్నత్యాన్ని, ప్రజా సంక్షేమాన్ని ఎవడు అధికారంలో ఉంటే వాడి పందిరి గుంజకు కట్టేసి నిష్పూచీగా తొంగొంటారు. వీళ్లంతా నిన్ను ఉరి తీసే అమృత ఘడియల కోసం క్షణమొక యుగంగా బతుకీడుస్తున్నారు.

నీవు పాకిస్తాన్ నుంచి చొరబడి ఈ దేశం మీద యుద్ధం చేశావు. కానీ మేం ఈ దేశ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఈ దేశ ప్రజలపైనే లక్షల సైనిక, అర్ధ సైనిక బలగాలను మోహరించి మందలాదిందిని రాజ్యాంగబద్ధంగా చంపేస్తాం. నీవూ... నీలాంటి వాళ్లూ పాకిస్తాన్‌లో కుట్రపన్ని ముంబై మీదో, పార్లమెంట్ మీదో దాడి చేస్తారు. అదే మేమైతే నిస్సిగ్గుగా పార్లమెంట్‌లోనే ప్రకటించి మా దేశం మీదే యుద్ధం చేస్తున్నాం. ఎంత దర్జాగా మా ఆదివాసులపై వైమానిక దాడులు చేస్తున్నామో చూడు! మేం ఈ దేశాన్ని అంగుళాల చొప్పున దేశ దేశాల్లోని కంపెనీలకు రాసిచ్చి దేశభక్తిని చాటుకుంటుంటే- అడవిలోని బుడ్డ గోచిగాళ్లు లోనికి రానీయకుండా అడ్డంపడతారా? అందర్నీ చంపేయడానికి ప్రజల చేత, ప్రజల కోసం తయారు చేసుకున్న రాజ్యాంగం తరపున మేం మూడేళ్లుగా యుద్ధం చేస్తూనే ఉన్నాం. మా బలం చాలదనుకొని అమెరికా సాయం కూడా తీసుకొని భారత ప్రజలపై యుద్ధం చేస్తున్నాం. మాది ఎంత లావు దేశభక్తో చూడు!

మాది ఎంత సిగ్గులేని రాజ్యాంగమంటే- అది ఎలాంటి ప్రమాణాన్నయినా స్వీకరిస్తుంది. ఈ దేశ సార్వభౌమాధికారాన్ని

అసోంలో ఏం జరుగుతోంది?

***అసోంలోకి వలస వచ్చిన ముస్లింలకూ, స్థానిక బోడోలకూ మధ్య తలెత్తిన సమస్యలను విశాల దృష్టితో, విచక్షణతో, వర్గ ప్రాతిపదికన పరిష్కరించుకోవడమే మార్గమని అంటున్నారు* లోకే రాజ్‌పవన్**

ఈశాన్య భారతదేశంలో ప్రజలు అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. సెవెన్ సిస్టర్స్‌లోని ఏ రాష్ట్రం ఇందుకు మినహింపుకాదు. ప్రభుత్వాలు కూడ సాయుధ బలాల ప్రత్యేకాధికార చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) లాంటి నల్ల చట్టాలతో తమ ప్రతాపాన్ని ఈశాన్యంపైనే చూపుతాయి. ఇక్కడి అమాయక గిరిజన ఆదివాసులకు ప్రభుత్వాల దమననీతికి బలవడం సాధారణమే అయిపోయింది. ఇప్పుడు అసోం రెండు నెలలుగా అట్టుడుకుతోంది. రక్తపాతం జరగని రోజులేదు. లక్షల మంది నిర్వాసితులైపోయారు. ప్రతి రాజకీయపార్టీ తమ ఇష్టానుసారంగా మాట్లాడుతూ సమస్యను మరింత పెంచుతున్నది. అస్సామీలపై వివక్షలు, దాడులు దేశంలోని ప్రతిచోట నిత్యకృత్యమై పోయాయి. అసలు అస్సామీలు ఇలాంటి స్థితికి ఎందుకు నెట్టివేయబడ్డారు? కశ్మీర్ తర్వాత అంతటి సుందరమైన రాష్ట్రం ఎందుకు నిత్యం వార్తల్లో నలగాల్సిన పరిస్థితి ఏర్పడింది? అసోంలో ఈ అలజడికి కారణమేమిటి? అసలు అసోంలో ఏం జరుగుతోంది?

1955లో అసోం రాష్ట్రం ఏర్పడింది. అసోం ఏర్పడినాటి నుంచి చొరబాటుదార్ల సమస్య అసోంను వేధిస్తున్నది. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి అధిక సంఖ్యలో 1970ల నుంచి అసోంకు వచ్చి వ్యాపారాలు, జీవనోపాధులు నిర్వహించుకుంటున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చేవాళ్లు ఎక్కువగా ముస్లింలు కావడం చాలా సులభంగా వాళ్లు అసోంలోని స్థానిక ముస్లింలతో కలిసిపోయేవారు. అలా వలసగా వచ్చిన వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతూ వచ్చింది. మరీ ముఖ్యంగా 1971 ఇండో-పాక్ యుద్ధం సమయంలో గుంపులు గుంపులుగా బంగ్లాదేశ్ ముస్లింలు అసోంకు వలస వచ్చారు. బంగ్లాదేశ్ సరిహద్దును తాకుతూ అసోంలో ఉన్న ప్రాంతమంతా బోడో గిరిజనులు మెజారిటీగా ఉన్న ప్రాంతం. అంటే బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినవారు బోడోల ప్రాంతాలలో స్థిరపడి అక్కడ జీవనోపాధులు సృష్టించుకునేవారు. అయితే ఈ వలసలు ఎక్కువవడంతో బోడోలకు జీవనోపాధులు లేని పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక అవసరాలైనా తీర్చుకోలేని దీనస్థితికి బోడోలు నెట్టబడ్డారు. 1970ల మధ్య నుంచి జీవనశైలి, భూమి, రాజకీయ అధికారం తదితర విషయాలలో బోడోలకు ముస్లింలకు పోటీ పెరిగింది. క్రమంగా అది హింసకు దారితీస్తూ వచ్చింది. అసోంలో అక్రమ చొరబాటుదార్లను నియంత్రించేందుకు 1971లో ఇందిరాగాంధీ ముజిబుర్(బంగ్లాదేశ్)లు ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా సరే! పరిస్థితిలో పెద్దగా మార్పేమీ రాలేదు. చొరబాట్లు ఆగలేదు.

1979 నుంచి 1985 వరకు అసోంలో వలసలకు వ్యతిరేకంగా మహత్తర పోరాటం సాగింది. స్వతంత్ర భారతదేశంలో జరిగిన అనేక ఉద్యమాలలోకి ఈ ఉద్యమం అత్యంత ప్రభవవంతమైనది. ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్(ఆసు), ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్‌లు

పెట్టుబడుదారులకు అప్పగించడానికి పార్లమెంట్‌కు వెళ్తున్నానని ప్రమాణం చేసినా అంగీకరిస్తుంది. మంత్రిమండలిలో సగానికిపైగా ఈ దేశ సంపదను, ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను నల్లమార్కెట్‌కు, సామ్రాజ్యవాదుల తెల్ల మార్కెట్‌కు ధారాదత్తం చేసినా మా రాజ్యాంగం ఏమీ అనదు. భలే..భలే..మళ్లీ ఎట్లాగైనా ఓట్లు గెలుచుకో.. మళ్లీ నా మీద ప్రమాణం చేసి చట్ట సభలకు వెళ్లిపో అని ఉద్బోధిస్తుంది.

అసలు నిన్ను ఆనాడే పటా పటా మని కాల్చేయకుండా విచారణ పేరుతో ఇంత కాలం .. ఇన్ని కోట్ల రూపాయలు తగలేశారని మా దేశభక్తులకు, మానవతావాదులకు ఎంత ఉక్రోషమో! కోట్ల కోట్ల రూపాయలు కొల్లగొట్టుకొని పోతున్నా చీమ కుట్టినట్లు కూడా అనిపించనివాళ్లకు నిన్ను ఇప్పటికైనా తక్షణమే ఉరితీసి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని రాజ్యాంగ పరిరక్షకులకు విన్నవించుకుంటున్నారు. మా పౌరులు కూడా ఎంత రాజ్యాంగబద్ధంగా ఆలోచిస్తారో చూడు! అరవై ఏళ్లకు పైగా మేం నేర్పిస్తున్న చదువు వృథా కానందుకు ఈ క్షణాన గర్వంగా ఉంది.

కసబ్..

నీవు చేయరాని పని చేశావు. మనుషుల ప్రాణంపట్ల వ్యక్తిగా నీకు ఎట్లా విలువ లేదో.. మా రాజ్యావ్యవస్థకు, మా సగటు సమాజ చైతన్యానికి అంతే విలువ లేదని నీవెంత పచ్చిగా నిరూపించావు! మాది ప్రతీకారం తీర్చుకునే రాజ్యాంగం. ముమ్మాటికీ చెప్తున్నాను. నీవు .. ఓ చల్లని వేళ తలచుకోలేని గాయం చేశావు. నీవూ, నీలాంటి వాళ్లు ఎందుకు తయారయ్యారో చరిత్రకు తెలుసు. అయినా నీపై వేలాడుతున్న ఉరితాటిని నేను వ్యతిరేకిస్తున్నాను. నీ ఊపిరి ఈ దేశ శిక్షాస్మృతికి బలైపోయినా.. ఉరి రద్దయ్యేదాకా నీవే కాదు, నీకంటే దుర్మార్గాలు చేసిన వాళ్లు ఉరికంబం ఎక్కినా సరే .. ఆరిపోయే మీ జీవితం పక్షమే వహిస్తాను. నేరాలను గర్హిస్తూనే ఉరిశిక్ష ఉన్నంత కాలం రద్దయిపోయే జీవితం గురించే మాట్లాడతాను.

(రచయిత విరసం కార్యవర్గ సభ్యులు) వీ

ఈ ఉద్యమాన్ని నడిపించాయి. 1978లో హీరాలాల్ పట్వారీ అనే లోక్‌సభ సభ్యుని మరణంతో మంగల్‌దోయి లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలు జరపాల్సి వచ్చింది. దానికి ఓటర్ల జాబితా తయారు చేసే సమయంలో ఓటర్ల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు గమనించారు. ఇలా ఎందుకు జరిగిందో ఆరా తీయగా 1970 నుంచి 1978 మధ్యకాలంలో అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారందరికీ ఓటర్ల జాబితాలో చోటిచ్చారని తేలింది. దాంతో అస్సామీల కోపం తారాస్థాయికి చేరింది. జాబితా నుంచి విదేశీయులను తొలగించే దాకా ఎన్నికలు వాయిదా వేయాలని ఆసు డిమాండ్ చేసింది. అందుకోసం పోరాటాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమం భారత ప్రభుత్వాన్ని అక్రమ వలసలు గుర్తించి తీసివేసేలా శక్తివంతంగా డిమాండ్ చేయగలిగింది. కొన్ని ఘటనలు మినహా చాలా మట్టుకు ఉద్యమం అహింసాయుతంగా సాగింది. అయితే అంత గొప్ప ఉద్యమానికి ఒకే ఒక మచ్చ 'నెల్లి ఊచకోత'. 1983 ఫిబ్రవరి 18న జరిగిన ఈ ఘటనలో నగావ్ జిల్లాలోని అల్సింగా, కులాపతర్, బాసుందరి, బుగ్దుబాబీల్, బుగ్దుబాహబీ, బోర్జాలా, బుతుని, ఇందుర్‌మరి, మత్తి పర్బాబ్, మూలధారి, మత్తిపర్బాబ్ నెం.8, సిల్బెటా, నెల్లి అనే 14 గ్రామాలలో అధికారికంగా 2191 (అనాధికారికంగా ఐదు వేల మంది) మరణించారు. కేవలం ఆరు గంటల వ్యవధిలోనే ఈ దుర్ఘటన జరిగిపోయింది. మరణించినవారిలో ఎక్కువ మంది బంగ్లాదేశ్ మస్లింలే. వలసల వ్యతిరేక ఉద్యమాన్ని బలపరుస్తున్న బాలుంగ్ తెగ వారిచే జరపబడ్డట్లు భావిస్తున్న ఈ ఊచకోతను సాకుగా తీసుకొని ఆసు డిమాండ్‌ను కాదని 1983 వివాదాస్పద ఎన్నికలను భారత ప్రభుత్వం నిర్వహించింది. అందురూ వ్యతిరేకించినా, ప్రభుత్వం మాత్రం మొండిగా ఎన్నికలు నిర్వహించింది. ఆసు ఎన్నికలను బహిష్కరించింది. పూర్తిగా పోలీస్ పహారాలో, పోలీసుల కనుసన్నలలో ఎన్నికలు నిర్వహించబడ్డాయి. అప్పటి ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కెపిఎస్ గిల్, అసోంలోని 63 నియోజక వర్గాలలో పోలింగ్‌కు ఏమీ ఇబ్బంది లేదని, మిగిలిన 23 నియోజక వర్గాలు సమస్యాత్మకమైనవని తానే స్వంతగా ఎన్నికల అధికారి వలే ప్రకటించేంత పోలీస్ ప్రభావం ఆ ఎన్నికలపై ఉంది. 400 కంపెనీల కేంద్ర పారామిలటరీ, 11 ఆర్మీబ్రిగేడ్‌ల మధ్య దశల వారిగా ఎన్నికలు నిర్వహించారు. భారతదేశంలో కమిషన్‌ల వ్యర్థ పనితీరుకు, ప్రాధాన్యతా లేమికి చక్కని ఉదాహరణ ఏమిటంటే నెల్లి ఘటనపై నియమించబడ్డ తివారి కమిషన్ రిపోర్టు ఇప్పటికీ బయటకు రాలేదు.

1983లో అక్రమ వలసల నిర్ధారణ చట్టం(ఐ.ఎం.టి.,డి) రూపొందించారు. ఒక వ్యక్తి విదేశీ స్థాయిని నిరూపించాల్సిన బాధ్యతను ఆ రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగిస్తూ ఈ చట్టం చేయబడింది. 1971 సంవత్సరం వరకు వలస వచ్చిన వారిని పౌరులుగా అంగీకరించి ఆ తర్వాత వలసలను నియంత్రించే విధంగా ఈ చట్టం చేశారు. అయితే ఈ చట్టాన్ని 2005 జూలై 12న సుప్రీం కోర్టు కొట్టివేసింది.

ఆ తర్వాత 1985 ఆగస్ట్ 15న న్యూఢిల్లీలో విదేశీయులను గుర్తించి ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలిగించాలన్న విషయంలో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ, ఆసు నాయకుల మధ్య 'అస్సాం ఒప్పందం' జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ నుంచి వలసలను నిరోధించేందుకు సరిహద్దులలో గోడలు, కంచెలు నిర్మించాలని, 1946 విదేశీయుల చట్టం ప్రకారం చొరబాటుదార్లను కఠినంగా శిక్షించాలని ఆ ఒప్పందంలో రాసుకున్నారు. కానీ ఇప్పటికీ అక్కడ గోడలు లేవు, కంచెలు లేవు, కఠిన శిక్షలు పడిన దాఖలాలు లేవు. ఈ ఒప్పందం ఫలితంగా ఆసు పోరాటాన్ని విరమించింది. దాంతో ఆరు సంవత్సరాల మహోద్యమానికి తెరపడింది. ఆ తర్వాత ఆసు నాయకులంతా అస్సాం గణ పరిషత్ అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. 1985, 1996 ఎన్నిలలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది.

అయితే 1985 ఒప్పందం బోడోలను నిర్లక్ష్యపరిచింది. అస్సామీ భాషను, సంస్కృతిని బోడోలపై బలవంతంగా రుద్దాడానికి ఒప్పందం లోని అంశాలు దోహదపడేలా ఉన్నాయి. ముఖ్యంగా ఒప్పందంలోని ఆరో ప్రతిపాదన పట్ల బోడోలు వ్యతిరేకత కనబరిచారు. అస్సామీ ప్రజానీక సాంస్కృతిక ఐక్యత కోసం, సమగ్రత కోసమే అని ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నమే చేసింది గానీ ఆ పాయింట్‌ను తొలగించే చర్యలు తీసుకోలేదు. దాంతో బోడోలు తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక రాష్ట్రమే మార్గమని నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలోనే 1987లో ఉపేంద్రనాథ్ బ్రహ్మ ఆధ్వర్యంలో ఆల్‌బోడో స్టూడెంట్ యూనియన్ (అబ్సు) ఆవిర్భవించింది. తర్వాత బోడోల స్వయం ప్రతిపత్తి నినాదం ఊపందుకుంది. అప్పుడున్న అస్సాం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఈ యూనియన్‌కు మద్దతు పలికింది. ఆ తర్వాత తన ఓటు బ్యాంక్ కోసం వలసదారులనూ పెంచి పోషించింది. అంతేకాదు గడిచిన రెండు ఎన్నికలలోనూ తరుణ్ గోగోయ్ విజయానికి కూడ ప్రధానంగా ఈ విదేశీ ఓటర్లే దోహదం చేశారు. అలా కాంగ్రెస్ పార్టీ అసోంలో అవకాశవాద రాజకీయాలను ప్రారంభించింది.ఆ తర్వాత బోడో సాహిత్య సభ అనే సంస్థ ఏర్పాటై బోడో ఉద్యమాన్ని మరింత రగిలించింది. బోడోల్యాండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం మొదట్లో శాంతి యుతంగా సాగిన ఈ ఉద్యమం తర్వాత హింసాత్మకంగా మారడంతో బోడోల్యాండ్ స్వయం ప్రతిపత్తి మండలి(బాక్) ఏర్పాటుపై అస్సాం ప్రభుత్వం 1993 ఫిబ్రవరి 20న ఒప్పందానికి దిగివచ్చింది. అయితే అధికారాల పంపిణీ, సరిహద్దుల వివాదాల దృష్ట్యా అబ్సు ఈ ఒప్పందాన్ని తిరస్కరించింది. 1996లో బోడో లిబరేషన్ టైగర్స్ ఫోర్స్ అనే సాయుధ గ్రూపు, నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్‌లు ఏర్పడి హింసా పోరాటానికి తెరతీశాయి. దాంతో మరొకసారి ఒప్పందం చేసుకోవాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి ఏర్పడింది. 2003 ఫిబ్రవరి 10న జరిగిన ఒప్పందం ప్రకారం రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కనుగుణంగా బోడోలాండ్ ప్రాదేశిక మండలి(బి.టి.సి)ని ఏర్పాటు చేశారు. కానీ బోడోయేతర ప్రాంతాలను బి.టి.సి.లో కలపడం, బోడోల హక్కులు ఆచరణలో పరిరక్షించబడకపోవడం మరొకసారి బోడోలను నిరాశపరిచింది.

మరోవైపు ఏప్రిల్ 7, 1979లో స్థాపించబడ్డ ఉల్ఫా ఆధ్వర్యంలో ప్రత్యేక అస్సాం ఉద్యమం కొనసాగుతూ వచ్చింది. ఉల్ఫా సాయుధ పోరాట మార్గం ఎంచుకోవడంతో వరుస నిషేధాలకు గురవుతూ వచ్చింది. ఉల్ఫాకు, భారత సైన్యానికి సాగిన యుద్ధంలో ఇప్పటికి పద్దెనిమిది వేల మంది మరణించారు. అయితే ఉల్ఫాపై నిషేధం

విధించిన దరిమిలా ఉల్ఫా నాయకులకు సహాయం చేసినా, వారితో మాట్లాడినా బంధించవచ్చుననే ప్రభుత్వ ఉత్తర్వును అడ్డం పెట్టుకుని పోలీసులు, సైన్యం వేలాదిమంది అస్సామీలను, బోడోలను నిర్బంధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తూ వచ్చాయి. దాదాపు ఈ ఇరవై ఏళ్లుగా పరిస్థితి మరింత దయనీయంగా మారి వేలాది మంది అమాయక పౌరులు పోలీసుల చేతుల్లో చిత్రహింసల పాలయ్యారు. వందలాది మంది మిస్సింగ్‌కు గురయ్యారు. ఉల్ఫాతో సంబంధంలేని అనేకమంది ఈ దారుణ హింసలను భరించలేని స్థితిలో దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వలసపోయారు.

ఇదీ ఇప్పటి వరకూ అసోం చరిత్ర. ఇక అసోంలో ఇప్పుడు జరుగుతున్న ఆందోళనల విషయాన్ని చూద్దాం. జూలై 19న ఒక యువతిని అత్యాచారం చేసి హతమార్చారు. దీనికి నిరసనగా జరిగిన ఆందోళనల పర్యవసానాలే ఇప్పటివరకు అసోంలో జరుగుతున్న సంఘటనలు. జూలై 20న కోక్రఝార్‌లో బోడోలు, ముస్లింల మధ్య తలెత్తిన హింసాకాండ చిరాంగ్, ధుబ్రి జిల్లాలలకు వ్యాపించింది. బోడోల్యాండ్ టెరిటోరియల్ అటానమస్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి చెందిన జిల్లాలన్నీ అట్టుడికి పోయాయి. మొత్తం 82 మంది మరణించగా నాలుగు లక్షల మంది శరణార్థులుగా ప్రభుత్వ శిబిరాలలో తలదాచుకుంటున్నారు. ప్రతిక్షణం అభద్రతతో బతుకుతున్నారు. ఎస్ఎంఎస్‌ల రూపంలో అభద్రతాపూరితమైన వదంతులు వ్యాపించడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి అస్సామీలు తమ రాష్ట్రానికి ప్రయాణం కట్టారు. ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ముస్లిం సంస్థలు చేపట్టిన నిరసన హింసాత్మకం కావడం అందుకు మరింత ఆజ్యం పోసింది. రాజకీయ పార్టీలు పరిష్కారం మాట అటుంచితే సమస్యను తమకనుకూలంగా ఓట్ల లబ్ధి కొరకై వాడుకుంటున్నారు. దానికి అమాయక అస్సామీలు ఫలితం అనుభవిస్తున్నారు.

అయితే ఈ పరిస్థితులలో అసోంలో ఏం చేయాల్సి ఉంది? మొదట మీడియా అసత్య ప్రచారాలు ఆపివేయాలి. చాలా అన్యాయంగా అబద్ధాలు ప్రసారం చేస్తున్నాయి. బోడోలు ముస్లింలను చంపివేస్తున్నారంటూ చేసే ప్రచారం వల్ల సమస్య మరింత సెన్సిటివ్‌గా మారే ప్రమాదముంది. అది అంతిమంగా పేద ప్రజలు గొడవలకు బలై, నిర్వాసితులై, ప్రాణాలు కోల్పోయే స్థితి ఏర్పడవచ్చు. అసోంలో ఈనాటి సమస్యకు ప్రధాన కారణం అక్రమ చొరబాట్లే. కనుక అక్రమ చొరబాట్లను సీరియస్‌గా నియంత్రించాల్సి ఉంది. మెక్సికో నుంచి అమెరికా, చైనా నుంచి జపాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి పాకిస్తాన్, బర్మా నుంచి బంగ్లాదేశ్‌ల వలే బంగ్లాదేశ్ నుంచి అస్సాం కూడా వలస సమస్యను ఎదుర్కొంటున్నది. బంగ్లాదేశ్ తన పొరుగుదేశమైన బర్మా సైనిక పాలకులకు "రొహింగియా ముస్లింలు మీ దేశ పౌరులు, వారిని మీరు మీ దేశానికి తీసుకువెళ్లండి" అని స్పష్టంగా చెప్పింది. అలాంటి సమస్యే భారతదేశానిది కూడా కనుక బంగ్లాదేశ్‌తో కఠినంగా చెప్పాల్సి ఉంది. చొరబాట్ల విషయంలో కూడా మానవీయంగా వ్యవహరించాలి. వలస వచ్చిన వారు రెండు రకాలుగా ఉంటారు. మొదటి రకం బ్రిటిష్ వారి లాగా అధిక లాభాల వేటకై వచ్చి స్థానికులపైన ఆధిపత్యం చెలాయించేవారు. రెండోరకం పొట్టకూటి కోసం వచ్చేవారు. వలసలు, చొరబాట్లకు వ్యతిరేకంగా మనం మాట్లాడుతున్న ప్రతిసారి గమనించాల్సిన విషయమేమిటంటే బోడోల ఆగ్రహం మొదటి రకం వారిమీదే ఉండాలి. పొట్టచేత పట్టుకుని వచ్చిన వారిని మానవీయంగా ఆదరించాలి. శ్రీలంకలో అక్కడి తమిళులపై హింసాకాండ జరిగినపుడు వారంతా వలసలుగా తమిళనాడుకు వచ్చినపుడు ఇక్కడి తమిళులు వారికి ఆశ్రయమిచ్చి అక్కున చేర్చుకున్నారు. వారికి సహాయమందించారు. ఇది బోడోలకు స్ఫూర్తి కావాలి. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చేవారు ముస్లింలు కాబట్టి స్థానిక ముస్లింలు కూడా తమకు శత్రువులేననే భావనను వదిలిపెట్టాలి. బోడోలు ఎన్నో కష్టనష్టాల కోర్చి దీనస్థితి నుంచి కొంత మెరుగైన జీవనానికి ఇప్పుడిప్పుడే వస్తున్నారు. బిటిసి లాంటి ప్రాదేశిక మండలులు ఎన్నటికీ బోడోలకు పరిష్కారం కాజాలదు. ప్రత్యేక బోడోల్యాండ్ రాష్ట్రమే బోడోల సమస్యలకు పరిష్కారం. కానీ ఇలాంటి మండలుల ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను చల్లార్చగలుగుతాయి. అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న వారిగా బోడోలు ఆ మాయలో పడకూడదు. అది గూర్ఖాల్యాండ్ అయినా, బోడోల్యాండ్ అయినా, రేపు తెలంగాణ అయినా దృష్టి ప్రత్యేక రాష్ట్రం పైనే ఉండాలి. చొరబాట్ల విషయానికి వస్తే ఇప్పటివరకు వలసవచ్చిన వారిలో పొట్టకూటి కోసం వచ్చిన పేదవారికి మాత్రం పౌరసత్వమిచ్చి దేశంలో ఉండనివ్వాలి. వ్యాపారాలు చేసి కోట్లు గడించిన విదేశీ వలసదార్లను వెంటనే వెనకకు పంపించాలి. పౌరసత్వాన్ని ఫలానా సంవత్సరం ముందు వరకు మాత్రమే పౌరసత్వాన్నివ్వాలనే టైంబాండ్ ప్రాతిపదికన కాకుండా ధనిక–పేద వర్గ ప్రాతిపదికన నిర్ణయించాలి. నిరుపేద వలసలకు వెంటనే పౌరసత్వమివ్వాలి. బిటిసి పరిధిలోని భూమిపై బోడోలకు మాత్రమే హక్కులు కల్పించాలి. అక్కడ భూములు కలిగి ఉన్న నిరుపేద విదేశీయులెవరైనా ఉంటే వారికి మరోచోట భూములు కేటాయించాలి.

బిటిసి ఏర్పాటును ప్రాథమికంగా బోడోలు వ్యతిరేకించాలి. బోడోలను తాత్కాలికంగా ఉద్యమబాట పట్టకుండా నిలువరించే ప్రయత్నమే బిటిసి. దాన్ని వెంటనే రద్దు చేసి ప్రత్యేక బోడో రాష్ట్రం ఏర్పాటు చేసేలా ఉద్యమాలను నిర్వహించాలి. అసోం సమస్యను తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్న రాజకీయ పార్టీలను తరిమికొట్టాలి. బోడోల భూమికి కూలీలు అవసరం. నిరుపేద ముస్లింలు అనేకులు కూలిపని కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే ముస్లింలకు పొట్టకూటి కోసం బోడోల భూముల్లో పని కావాలి. కనుక బోడోలు, నిరుపేద ముస్లింలు కలిసి ఉండటం వల్ల ఇరువర్గాలలోని పేదలకు కొంతవరకైనా ఉపాధి లభిస్తుంది. పేద ముస్లింలను కలుపుకుని బోడోలు ఉద్యమాలు నిర్వహిస్తే అది కూడా కోట్లకు పడగలెత్తిన వారు బోడోలైనా, ముస్లింలైనా వారి ఆర్థిక వనరులను సమిష్టిగా పేదలకు పంచమనే కోణం నుంచి ఉద్యమాలు నిర్వహించబడితే ఆ తరహా ఉద్యమాలు ఒక చక్కని సమైక్య సందేశాన్ని దేశీయ ఉద్యమాలకు అందిస్తాయి. మతం, ప్రాంతీయతలు ఉద్యమాలకు పునాది కాబోవని గ్రహించి వర్గపరమైన ఐక్య ఉద్యమాలు నిర్వహించడమే ఇవ్వాళ బోడోల, ముస్లింల ముందున్న ప్రధాన కర్తవ్యం.

(రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయుడు) వీ

విశాఖ మన్యం ఆదివాసులపై హింస

***బాక్సైట్ ఖనిజంతో సహా ప్రకృతి వనరులన్నిటినీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే క్రమంలో ఆదివాసులపై అమలవుతున్న హింసను, వారి ప్రతిఘటనలను వివరిస్తున్నారు* సిందేరి జాంబ్రి**

విశాఖ మన్యం నిత్యం మండుతున్న అగ్నిగుండం. పోలీసు పదఘట్టనలతో, అరెస్టులు, చిత్రహింసలు, అక్రమ కేసులు, పోలీస్ కూంబింగ్‌లు, బూటకపు ఎన్‌కౌంటర్‌లతో భయానక పరిస్థితిని తలపింప జేస్తోంది. విశాఖ మన్యం ఏజెన్సీ ప్రాంతం అంటే పచ్చని అడవనీ, ఎత్తైన కొండలనీ, గలగలపారే సెలయేర్లనీ, పక్షుల కిలకిల రావాలనీ, అనేక రకాల జంతు, వృక్షజాలాలు, అహ్లాదకరమైన వాతావరణం అనీ, హాయిగా ఉంటుంది అనీ అనుకొనేవారు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. కానీ ఆ అడవిలో ఆదివాసుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంది, ఆ ప్రజలపై బలవంతంగా, రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు చేస్తూ వారి జీవనాధారమైన అడవి నుండి ఎందుకు గెంటి వేయాలనుకుంటున్నారు? వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది అనే విషయాల గురించి మాట్లాడుతుంది, చర్చిస్తుంది కొంతమంది మాత్రమే.

బ్రిటిష్ వలసవాదుల నుండి స్వతంత్రతను కోల్పోయిన ఈ ఆదివాసులు నేడు మరింత అభద్రతా భావానికి గురవుతున్నారు. గతంలో అడవి సంపదను, కలపను, తీసుకుపోయిన ఆనాటి పాలకులు నేడు మొత్తం ప్రాంతాన్నే ఖాళీ చేయించే చట్టాలను చేస్తున్నారు. నేడు పాలకులు చెబుతున్న బూటకపు అభివృద్ధి పుణ్యమా అని నిలువ నీడ లేకుండా చేస్తున్నారు.

వైఎస్ఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ మన్యంను జిందాల్, రస్ అల్ ఖైమా (ఆన్‌రాక్)లకు తొమ్మిది వేల కోట్ల రూపాయలకు అమ్మివేసిన తరువాత ఆదివాసుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. బాక్సైట్ ఖనిజాన్ని ఎలాగైనా అప్పజెప్పాలనే ఉద్దేశంతో ఆదివాసి ప్రజలను భీతావహులను చేస్తుంది. 1998లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో బాక్సైట్ వెలికితీత ప్రయత్నాలను అడ్డుకుంటూ వస్తున్న ప్రజల మిలిటెంట్ పోరాట ప్రతిఘటనను గమనంలో ఉంచుకున్న నేటి పాలకులు ముందు నుండే ప్రజలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అత్యాచారాలు, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు ఇవన్నీ కొనసాగుతూనే ఉన్నాయి. పలు సందర్భాల్లో ఆదివాసి శ్రేయోభిలాషులు, మేధావులు తమ నిరసనలను, ఆందోళనలను తెలియజేస్తూనే ఉన్నారు.

ఈ నిర్బంధ పరిస్థితి, సంస్కరణలు, కుట్రలు ఈ సంవత్సరంలో ఏ రకంగా ఉన్నాయో తెలియచెప్పడం కోసమే ఈ వ్యాసం.

ఈ సంవత్సరం ఏజెన్సీ ప్రాంతంలో కేంద్ర మంత్రులు జైరాం రమేష్, కిషోర్ చంద్రదేవ్, రాష్ట్ర మంత్రులు బాల్‌రాజ్, వట్టి వసంత కుమార్, స్పీకర్ నాదెండ్ల మనోహర్‌లు పలు సందర్భాల్లో పర్యటించారు. 150 మంది ఎంఎల్ఏ.లు మన్యంలో పర్యటించి 'అరకు డిక్లరేషన్' ప్రకటించారు. ఈ మధ్య గిరిజన సమగ్ర విధానం పాడేరులో ప్రకటించారు. ఈ ప్యాకేజీలు, డిక్లరేషన్‌లు, విధానాలు ఎన్ని చేసినప్పటికీ వీటిలో మన్యం మొత్తం, మిగతా ఆదివాసేతర ప్రజలు కోరుకుంటున్న బాక్సైట్ వెలికితీతను ఆపాలనేది ఎక్కడా లేదు. ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ విచిత్రమేమిటంటే గిరిజన సలహా మండలి చైర్మన్ హోదాలోని మంత్రి బాల్‌రాజ్ బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకమంటాడు. మిగతా ఆదివాసి ఎంఎల్ఎలు అందరూ వ్యతిరేకమంటారు కానీ తీర్మానం మాత్రం చేయడం లేదు. కేంద్ర గిరిజన మంత్రి కిషోర్ చంద్రదేవ్ తాను మొదటి నుండి వ్యతిరేకం అంటూ గవర్నర్‌కు సైతం లేఖ రాశాను అంటాడు. కానీ బాల్‌రాజ్‌కు మాత్రం తీర్మానం చేయమని చెప్పడు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రి జైరాం రమేష్ సైతం పర్యావరణం దెబ్బతింటుందని అంటాడు. ఒకరేమిటి అందరూ అదే మాట కానీ వెలికితీతకు ఏర్పాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఎవరు మరి అనుకూలంగా ఉన్నారు? ఎందుకు ఆపలేక పోతున్నారు? వీరి అసలు ఉద్దేశం అందరికీ తెలిసిందే. ఇవన్నీ పైపై మాటలేనని, చిత్తశుద్ధితో, నిజాయితీతో కూడిన మాటలు కాదనేది అందరికీ తెలిసిందే.

వీరి పర్యటన అనంతరమే అరెస్టులు, ఎన్‌కౌంటర్ల పర్వం తీవ్రమైంది. ఇప్పటికీ ఏజెన్సీలోని బాక్సైట్ ప్రభావిత ప్రాంత మండలాలు చింతపల్లి, గూడెం, పెదబయలు గూడెం మండలాలకు ఆనుకొని ఉన్న కొయ్యూరు, జి. మాడుగుల మండలాల్లో ఈ నిర్బంధం తీవ్రమైంది. కేవలం ఈ మూడు నెలలలోనే 37 మంది అరెస్ట్ అయ్యారు. దీనిలో కొయ్యూరు మండలం పరిధిలో 12 మంది, గూడెం మండలం గూడెం పంచాయతీ పరిధిలో 24 మంది, చింతపల్లి మండలం పరిధిలో ఒకరిని అరెస్ట్‌గా చూపెట్టారు. వీరంతా మావోయిస్టు పార్టీ కార్యకర్తలనీ, సానుభూతి పరులనీ, మిలీషియా సభ్యులనే రకరకాల పేర్లు తగిలించి అరెస్ట్‌గా చూపారు. మావోయిస్టు పార్టీ వీరిలో నలుగురిని మాత్రమే తమ సంఘ, మిలీషియా సభ్యులని మిగతా వారంతా అమాయక ఆదివాసులని పేర్కొంది. కానీ పోలీసులకు పై నుండి వస్తున్న ఆదేశాలు, వారికి వస్తున్న అవార్డ్, రివార్డ్, ప్రమోషన్స్ వారిని ఆ రకంగా చేయడానికి పురిగొల్పుతోంది. ఈ అరెస్ట్ అయిన వారంతా మెజారిటీగా ఒకరిద్దరు తప్ప బాక్సైట్ ప్రభావిత ప్రాంతం వారే. ముఖ్యంగా గత రెండు, మూడు సంవత్సరాల నుండి ఈ ప్రాంతం ప్రజలు అడవిపై స్వయం ప్రతిపత్తిలో భాగంగా ఎపిఎఫ్‌డిసి ఆక్రమించుకున్న కాఫీ తోటలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి చురుకుగా పాల్గొంటున్నారు. గూడెం మండల పరిధిలోని మర్రిపాకల, తీములబంద, లంకపాకల, చింతపల్లి మండలం పరిధిలోని బలపం ఎస్టేట్ పరిధిలోని దాదాపు 1200 ఎకరాల తోటలను స్వాధీన పర్చుకున్నారు. ప్రభుత్వం కల్పించలేని గిట్టుబాటు ధరలను రైతులే ఆదివాసి రైతుకూలీ సంఘంలో సంఘటితపడి గిట్టుబాటు ధరలను వ్యాపారస్తులతో ఒప్పందాలను చేసుకుంటున్నారు. ప్రజల మధ్య సమస్యలను వారే పరిష్కరించుకుంటున్నారు. భూ పంపకాలు, కాలువలు, చెక్‌డ్యాంల వంటివి నిర్మాణాలు స్వతంత్రంగా చేసుకుంటున్నారు. గత సంవత్సరం ఐటిడిఎ పిఒ శ్రీకాంత్ ప్రభాకర్, సబ్ కలెక్టర్ కార్తికేయ మిశ్రాలు కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయితీలో పర్యటించి హామీలు గుమ్మరించారు. అవి నేటికీ ఒక్కటి పరిష్కారం కాలేదు. వీరి హామీలను నిరసిస్తూ పంచాయితీ ప్రజలు పంచాయితీ స్థాయిలో కమిటీగా

ఏర్పడి మూడుసార్లు ఆందోళనలు చేశారు. చింతపల్లి మండలంలో బలపం పంచాయితీ ప్రజలు మూడు సార్లు లోతుగెడ్డ బ్రిడ్జి వద్ద రోడ్డుపై బైఠాయించారు. పిఒ, సబ్ కలెక్టర్, మంత్రి బాల్‌రాజ్‌ల బొంకుడును విమర్శిస్తూ నిరసన తెలిపారు. పోలీసులు రంగప్రవేశం చేసి బెదిరింపులు, వీడియోలు, ఫొటోలు తీసినా తమ ఆందోళన కొనసాగించారు. వీరి చైతన్యాన్ని, సంఘటితపడడాన్ని చూసి ప్రభుత్వం వీరు బాక్సైట్ వ్యతిరేక పోరాటంలో కీలకంగా మారుతారని గ్రహించి తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తోంది.

ప్రభుత్వం సంస్కరణలను అమలు చేస్తూనే తీవ్ర నిర్బంధాన్ని పలు రూపాల్లో అమలు చేస్తోంది. ప్రధానంగా ఈ అరెస్టులు బాక్సైట్ ప్రభావిత ప్రాంతంలోని గ్రామాలపై, కాఫీ తోటల స్వాధీనంలో చురుకుగా పాల్గొన్న గ్రామాల ప్రజలపై దాడులు చేసి పట్టుకుని వారంరోజుల వరకు చిత్రహింస లకు గురిచేసి ఆ తరువాత తీరికగా అరెస్టులు చూపెట్టారు. అరెస్టయిన వారిలో ప్రజలకు వైద్యం చేస్తున్న పూజారులు, గురువ గాండ్లు (ఆదివాసి ప్రాంతంలో జబ్బులకు మందులిచ్చే వైద్యులు), కరువు వల్ల వేరే ప్రాంతం నుండి ఇటువైపు వచ్చి ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న వారు, కరువు వల్ల వేరే ప్రాంతాలకు వలసవెళ్లి ఇప్పుడిప్పుడే తమ స్వంత గ్రామాలకు వచ్చిన వారు ఉన్నారు. ఈ అరెస్ట్ కాబడిన వారంతా నిత్యం పోలీస్‌స్టేషన్, నర్సీపట్నం లాంటి కేంద్రాలకు వెళ్తున్నవారే. తమ తోటి గ్రామస్తులు అరెస్టు అయినప్పుడు స్టేషన్‌కు వెళ్లి ఆందోళన చేసినవారే. ఇలాంటి వారందరిపై గతంలో కేసులు లేవు, అనుమానాలు లేవు, వారెంట్లు, సెర్చ్ వారెంట్స్ ఉండవు కానీ, పట్టుకున్న తరువాత ఆ గ్రామం ఎలాంటిది అనే దానిని బట్టి, వ్యక్తులను చూసి కేసులు రాయడం చేస్తున్నారు. కొయ్యూరు మండలం అంతాడా పంచాయితీ ములుసల గ్రామానికి చెందిన సత్యనారాయణ (ఆర్‌ఎంపి డాక్టర్) సిపిఐ పార్టీ కొయ్యూరు మండల సహాయ కార్యదర్శి ప్రజల పక్షాన నిలబడినందుకు అక్రమంగా ఆయుధాలు సరఫరా చేస్తున్నాడని కేసులు బనాయించి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేశారు. ఇతనికి ప్రజల్లో మంచి పేరు ఉంది. ప్రజల సమస్యల పట్ల స్పందిస్తున్నందుకే కేసులు పెట్టి శిక్ష పడేలాగ చేశారు.

ఈ సంవత్సర కాలంలో ఉద్యమంలో (మావోయిస్టు) పని చేసి స్వచ్ఛందంగా లొంగిపోయిన వారు లేరు. కూంబింగ్‌కు వచ్చినపుడు వారికి కనిపించిన వారిని తీసుకువెళ్తున్నారు. ఇక పోలీసు ఇష్టాయిష్టాలపై ఆధారపడి అరెస్ట్ లేదా సరెండర్‌గా చూపెడుతున్నారు. వీరిలో గతంలో అరెస్ట్ అయి ప్రస్తుతం వాయిదాలు తిరుగుతున్న వారున్నారు. అలాగే సంతలకు వెళ్లిన వారు, దారిలో కనిపించిన వారు, చావు కబురుకు వెళ్తున్న వారున్నారు. వాస్తవానికి సరెండర్ అయినట్టు వీరెవరికి తెలియదు. స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీసులే ఫొటోలు తీసి మీడియాకు ఇచ్చి ప్రకటిస్తున్నారు. ఒక రకంగా ఏజెన్సీలో కనిపించే ప్రతి యువకుడు మావోయిస్టు అని అనుమానించి పట్టుకొని వేధించడం, మరొకసారి ఏ సమస్యపైనా స్పందించవద్దనీ, ఆందోళనలో పాల్గొనవద్దనీ వేధిస్తున్నారు.

అరెస్ట్ అయిన వారిని బయటకు రాకుండా చూస్తున్నారు. మావోయిస్టు పార్టీకి అనుకూలంగా ఉన్న గ్రామాల నుండి ఎవరినైనా పట్టుకుంటే అనేక కుట్ర కేసులు పెట్టి సంవత్సరాల తరబడి జైలులో ఉండేలాగ చేస్తున్నారు. గతంలో కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయితీ కన్నవరం గ్రామానికి చెందిన మర్రి భాస్కరరావు (కుప్పి), కంకిపాటి లక్ష్మి (భగత్)లు రెండు తెగలకు పెద్దలుగా ఉన్న వీరిని కేవలం ప్రజా సమస్యలకు స్పందిస్తున్నందుకే మూడు సంవత్సరాలు జైలులో నిర్బంధించారు. వీరిపై అక్రమ కేసులు. లక్ష్మి(40) పై క్లైమోర్ మైన్‌తో పోలీసులను చంపే కుట్ర పన్నిందని, దాడులలో పాల్గొందని పెట్టారు. వాస్తవానికి ఈమె వంట పని చేసి బతుకుతుంది. మధ్యాహ్న భోజనం బిల్లు కోసం కొయ్యూరు మండల కేంద్రంకు వెళ్లితే అరెస్ట్ చేసి అక్రమ కేసులు పెట్టారు. లక్ష్మి బెయిల్‌కు జామీన్ కోసం వెళ్తున్న మర్రి భాస్కరరావ్‌ను పట్టుకొని హత్యానేరాలు, బ్లాస్టింగ్ కేసులు పెట్టారు. ఇలాంటివి వీరిద్దరే కాదు అనేక మంది ఆదివాసి ప్రజలు ఎదుర్కొంటున్న నిత్య నిర్బంధం. ప్రస్తుతం జైలులో ఇలాంటి శిక్షలు అనుభవిస్తున్న వారు ఉన్నారు.

అరెస్ట్ అయిన వారిని తమ కుటుంబ సభ్యులను చూడకుండా పోలీసులు మానసికంగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఇంటిలిజెన్స్ సి.ఐ. వెంకటరావు పర్యవేక్షణలో ఇదంతా నడుస్తోంది. సెంట్రల్ జైలు వద్ద ఎప్పుడూ ఇద్దరు, ముగ్గురు హోంగార్డ్స్ ఉండి ఎవరు వస్తున్నారో చూసి సి.ఐ. వెంకటరావుకు చెపితే, వెంకటరావు గైడెన్స్ ప్రకారం వారిని కైలాసగిరిలోని పోలీస్‌క్వార్టర్స్‌కు తీసుకుపోయి ములాఖత్‌కు వెళ్లేవాళ్లను భయపెడుతున్నారు.

సెంట్రల్ జైలులో ఉన్న వారిని కోర్టు పర్మిషన్ లేకుండా అక్రమంగా చొరబడి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. 2010లో అరెస్టయిన గెమ్మెలి సోబనను జైలులో ఉండగా ఈ రకంగా వేధించడం వల్ల 2010 సెప్టెంబర్‌లో చనిపోయాడు.

యాభై నుండి నూట యాభై మంది పోలీసులు సంతలలో మోహరించి ప్రజలను బెదిరించడం, అరెస్టులు చేయడం ఆనవాయితీగా మారింది. ముందే కరువు పరిస్థితుల్లో ఉన్న రైతాంగం అడ్డాకులు, చింతపండు, తేనె, ఉసిరి తదితర అటవీ ఉత్పత్తులను సేకరించి సంతలలో విక్రయించి తమకు అవసరమైన ఉప్పు, కారం, నూనె లాంటి వస్తువులను కొనాలన్నా భయపడే పరిస్థితి ఉంది. పోలీసులు ప్రజలను వెంబడించి తిరుగుతూ ఏ ఊరు అని ప్రశ్నించడం, వారిని చూసి కొంత బెరుకుగా సమాధానం చెప్పినా, అనుమానం కలిగినా పట్టుకుపోవడం చేస్తున్నారు. ఈ భయాలను ఆసరా చేసుకొని వ్యాపారులు తక్కువ ధరలకే కొనడం చేస్తున్నారు. పోలీసులకు ప్రజల నుండి ఏమైనా ప్రతిఘటన ఉంటే బలవంతంగా సంతలు జరుగకుండా చేస్తున్నారు. గతంలో కోరుకొండ సంతను నాలుగు నెలలు, పెదవలసలో రెండు నెలలు బలవంతంగా ఆపేశారు. ఈ మధ్యకాలంలో కొయ్యూరు, కోరుకొండ, గూడెం, పెదవలస, ఆర్‌వి నగర్ సంతలు జమ్మూ కాశ్మీర్‌ల పరిస్థితిని తలపించే విధంగా ఉంటున్నాయి. కొయ్యూరు, గూడెం మండల కేంద్రాలు ఎప్పుడూ కర్ఫ్యూను తలపించే విధంగా ఉంటాయి.

ప్రజలను భీతావహులను చేయడంలో భాగంగా కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. మావోయిస్టుల కోసం వేట పేరుతో వచ్చే ఈ బలగాలు ప్రజలపై దౌర్జన్యం చేయడం, అనుమానం పేరిట చెకింగ్‌లు, లూటీలు చేయడం సాధారణం అయ్యాయి. పోలీసు బలగాలు లోపలికి వస్తే ప్రజలు రోజువారీ పనులు ఆపుకోవాల్సిందే. మే, జూన్, జూలై నెలల్లో కోరుకొండ అటవీ, బూదరాళ్ల, గూడెం పంచాయితీలలో వందల బలగాలు కూంబింగ్ చేసి ప్రజలకు భయానక పరిస్థితి కల్పించాయి. పది గ్రామాల చొప్పున కేంద్రీకరించి పన్నెండు మంది పదిహేను బ్యాచ్‌లు (ఒక్కో బ్యాచ్‌కు ఇరవై ఐదు నుండి ముప్పై మంది) కూంబింగ్ నిర్వహించాయి. (గ్రామం అంటే ఇరవై ఇండ్ల లోపు ఉండేది. పెద్ద గ్రామం అంటే యాభై ఇండ్ల వరకు ఉండేది) ఈ కూంబింగ్ వల్ల వర్షాకాలంలో దుక్కులు చేసే రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యువకులు బంధువుల వద్దకు పారిపోయారు.

ప్రజలను భీతావహులను చేయడానికి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను ఎన్నుకుంటున్నది. ఈశాన్య రాష్ట్రాలలో ఉండే సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం ఉండగా ఇక్కడ అనధికారికంగా అమలవుతుంది. వైఎస్‌ఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత మరింతగా పెరిగింది. 2006 డిసెంబర్ 5న కన్నవరంలో మర్రి నాగేశ్వరరావును,

వికలాంగులకు గౌరవం అందని ద్రాక్షేనా!

కులం, మతం, లింగం, ప్రాంతం, హోదాలతో సంబంధం లేకుండా వికలాంగులు సమాజం నుంచి ఎదుర్కొంటున్న వివిధ రకాల వివక్షను, హింసను వివరిస్తున్నారు **డా. పెదమళ్ళ శ్రీనివాస రావు**

జనాభాలో పది శాతం ఉన్న వికలాంగులకు కనీసం సహజ హక్కులు, సహజ న్యాయం కూడా అందడం లేదనేది జగద్విదితం. వైకల్య వివక్షత లేని సమాజ నిర్మాణ లక్ష్యాలను మానవ హక్కుల కోణం నుండి పరిశీలించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు వికలాంగుల చేత, వికలాంగుల కొరకు, వికలాంగుల సాధికారిత సాధన రావలసిన పరిస్థితులు.

సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి, అణిచివేతకు, దోపిడికి, వివక్షతకు గురైన వర్గంలో ముఖ్యంగా వికలాంగులని చెప్పవచ్చు. సమాజంలో వికలాంగులను సాటి మనుషులుగా సకలాంగులు చూసే పరిస్థితి లేదు. సమాజంలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి, ఒసి, మహిళలు అనే తేడా లేకుండా అన్ని కులాల్లో, మతాల్లో భూమి పుట్టినకాడి నుంచి వికలాంగులు ఉన్నారు. సంక్షేమ పథకాల తయారీలో, అమలులో, నిర్వహణలో భాగస్వామ్యం లేని కారణంగా వికలాంగుల సంక్షేమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వర్ధిల్లుతోంది.

వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కుల పరిరక్షణ, సంపూర్ణ భాగస్వామ్యాలను 1995 చట్టం ప్రకారం అమలు చేయాలి. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఆమోదం పొందిన 'వికలాంగుల హక్కులు ఒడంబడిక' అంగ వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులను సంరక్షించడంలో ప్రభుత్వాల బాధ్యతను స్పష్టంగా నిర్దేశించిన మొట్టమొదటి అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం ఆలోచనా స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటు చేసుకోవడం, మత, రాజకీయ కార్యకలాపాలలో భాగస్వాములు కావడం, గృహవసతి, విద్య, ఉపాధి హక్కులతో సహా సకల పౌర, రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కులను వికలాంగులకు ప్రసాదించాలి. కానీ, సెర్చిలైట్ వేసి వెతికినా మచ్చుకైనా కనిపించని పరిస్థితులు మన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయి.

ఐక్యరాజ్య సమితి 1948 సంవత్సరంలో మానవహక్కులను ప్రకటించడం దీనికి 1966 నుంచి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులకు సంబంధించిన ఒడంబడికకు కట్టుబడి మన దేశం 44వ గణతంత్ర సంవత్సరంలో పార్లమెంట్‌చే చట్టం రూపొందించబడింది. అంతే కాక, రాజ్యాంగం ద్వారా వచ్చిన ప్రాథమిక హక్కులు గాని, ఆదేశిక సూత్రాలుగాని, న్యాయ స్థానాలతో లభించిన పౌరహక్కులు గాని వికలాంగులకు ఉపయోగపడే దాఖలాలు ప్రస్తుత సమాజంలో లేకపోవడం విచారకరం.

పరిపాలనలో సకలాంగుల పెత్తనం, రాజకీయాల్లో వికలాంగు లకు భాగస్వామ్యం లేకపోవడం, అధికారుల అలసత్వం లేదా నిర్లక్ష్యం,

---

గెమ్మెలి సోబనను జైలులో చంపేశారు. 2012 మే 10న జి. మాడుగుల మండలం లువ్వాసింగ్ పంచాయితీ పినలువ్వాసింగ్‌లో ఇద్దరు రైతులను కాల్చి చంపారు. ఒంటెంపాడుకు చెందిన తెల్లంపడాల్, విస్తరికి చెందిన ఉండలం అప్పారావులను పట్టుకొని కాల్చి చంపి, శవాలను ప్రజలకు తెలియనీయకుండా దాచిపెట్టారు. ప్రజలు ప్రతిఘటించడంతో నక్సలైట్లుగా చిత్రీకరించడం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. ప్రజల ఆందోళన వల్ల – ఆయుధాలు ఉన్నందునే కాల్చి చంపామని పాడేరు ఒఎస్‌డి దామోదర్ బుకాయించాడు. అదే రోజు చింతపల్లి మండలం కోరుకొండ వద్ద వేలంజువ్వి గ్రామ వాసి నాగేంద్ర అనే రైతు కల్లు చెట్టుకు పోగా పట్టుకొని యూనిఫామ్ తొడిగారు. అప్పటికే (ఒక గంట క్రితం) లువ్వాసింగ్‌లో చంపడంతో నాగేంద్ర బతికిపోయాడు. ఈ ఘటనలు అన్నీ బాక్సైట్ ప్రభావిత ప్రాంతాలలో ప్రజల ప్రతిఘటన చురుగ్గా ఉండడం వల్ల ఈ ప్రాంతాలను ఎన్నుకొని మరీ ఈ దారుణ, పాశవిక హత్యాకాండలకు పాల్పడుతున్నారు.

గతంలో ప్రభుత్వం ఇదే రకమైన పాశవిక నిర్బంధం అమలు జరిపింది. బూటకపు ఎన్‌కౌంటర్‌లు, వాకపల్లి, భల్లుగూడ, కిండింగి, బాలరేవుల... లాంటి సామూహిక అత్యాచారాలు, గ్రామాల సామూహిక దహనాలు, ఇండ్లలో ప్రజలను వేసి తగులబెట్టడం, పంటలను నాశనం చేయడం వంటి దారుణమైన హింసను ప్రయోగించింది. ఇదంతా అడవిపై ఆధిపత్యం, దోపిడీదారులకు కట్టపెట్టడం కోసమే.

ప్రస్తుతం మన్యంను అప్పజెప్పేందుకు మరింత సమగ్రమైన పథకంతో ఒకవైపు సంస్కరణలను అమలు చేస్తూనే, మరోవైపు తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. ప్రజల మౌలిక సమస్యలైన భూమి, అడవి, సాగు, తాగు నీళ్లు, విద్య, వైద్యం పట్టించుకోకుండా వీటికి ఏమాత్రం నిధులు ఖర్చు చేయకుండా వందల కోట్లతో రోడ్లు వేస్తున్నారు. ఈ రోడ్లు త్వరగా పూర్తి చేయడానికి అన్ని శాఖలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి. అడవి సంపదను తరలించడానికి, నిర్బంధాన్ని తీవ్రం చేయడానికి ఈ రోడ్లు అని అందరికి తెలిసిందే. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ నిర్బంధం మిగతా ప్రపంచానికి అర్థం కాకుండా ఉండడం కోసం మీడియాను తన గుప్పెట్లో పెట్టుకొని బయటి ప్రపంచానికి తెలియనీయకుండా చేస్తోంది. ప్రజల ఆక్రందనలు, ఆందోళనలను తక్కువ చేయడం, ప్రభుత్వం, పోలీసులు చేయని అభివృద్ధిని హైలైట్ చేయడం చేస్తున్నాయి. ఈ ప్రపంచీకరణ కాలంలో ప్రచారాన్ని ఎక్కువగా నమ్మే ప్రజలకు వాస్తవాలను కప్పేసి, అవాస్తవాలను, కల్పితాలను వాస్తవాలుగా చూపెడుతున్నాయి. ఈ అవాస్తవాలు కొన్ని సందర్భాలలో మేధావులను సైతం ప్రభావితం చేయగలిగేవిగా ఉంటున్నాయి. ఈ విషయాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే మరింతగా లోతుల్లోకి వెళ్లాలి. వార్త సాధనాలను కాకుండా ప్రజల అభివృద్ధిని, వారి బతుకులను దగ్గరగా పరిశీలించినపుడే సత్యాలు తెలుసుకోవడం సాధ్యం.

మూలవాసులైన ఆదివాసుల పట్ల కొనసాగుతున్న వివక్ష, అణచివేతను వ్యతిరేకించడం, దానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం మనందరి బాధ్యత.

(రచయిత ఆదివాసి రైతు కూలీ సంఘం కార్యకర్త) వీ

అవగాహన లోపం, ఛీత్కార ధోరణులు, సమాచార లోపం, అన్నింటిని మించి సమాజపు చులకన భావం మూలంగా వికలాంగులు వెనకబడేలా చేస్తున్నాయి. ఎక్కడైనా కూడా వికలాంగులు అధమ శ్రేణి పౌరులుగానే పరిగణించబడడం కడు శోచనీయం. ఈ సమస్యను మానవ హక్కుల కోణం నుండి వికలాంగుల సాధికారితా దృష్టి నుండి, రాజ్యాంగ హక్కుల కోణం నుండి పరిశీలించి పరిష్కారాలు కనుగొనే విధంగా ఎవరూ పాటు పడడం లేదనేది కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

దినదినగండం నూరేళ్ల వయస్సు అనే చందంగా ప్రస్తుత సమాజంలో వికలాంగుల పరిస్థితి నెలకొని ఉంది. కడుపులో పడినప్పటి నుంచి నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల వల్ల, ప్రభుత్వాల లోపభూయిష్ఠమైన పాలన మూలంగా అనేక మంది వికలాంగులుగా తయారవుతున్నారు. ఒక వైపు అంగ వికలత్వం తమ పాలిట శాపమని భావిస్తూ, మానసిక వేదనలో సతమతమవుతున్న వికలాంగులను సమాజంలో అంగవైకల్యం పేరుతో కుంటోడు, గుడ్డోడు, చెవిటోడు, కుష్టోడు, గూనోడు వంటి పదాలతో నీచంగా తిట్టుతూ అవహేళనలకు గురిచేయడం జరుగుతోంది.

తరతరాలుగా వివక్షతకు, అపహాస్యాలకు, అవమానాలకు, అన్యాయాలకు, దోపిడికి గురైన వికలాంగులకు సామాజిక న్యాయం అందక పోగా, అమాయకులైన వికలాంగులపై సకలాంగులు దౌర్జన్యాలు, అత్యాచారాలు, దాడులు, అకృత్యాలు, అడ్డూ, అదుపు లేకుండా రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. కంచే చేను మేసిన చందంగా రక్షించ వలసిన మన ప్రభుత్వాలు వికలాంగుల పట్ల బాధ్యతా రహితంగా, కల్లబొల్లి కబుర్లు చెబుతూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి.

రాజకీయ అధికారం మాస్టర్‌కీ అని డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పారు. రాజకీయ అధికారం ఎవరి చేతుల్లో ఉంటుందో వారే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన నగ్న సత్యమే. రాజకీయ ప్రక్రియలో అందరికీ భాగస్వామ్యం కల్పించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రం. మన దేశ స్వతంత్ర, స్వేచ్ఛా ఫలాలను వికలాంగులు అనుభవించడం లేదని తెలిసి కూడా పాలకులు వికలాంగులను రాజ్యాధికారానికి దూరంగా ఉంచడం విడ్డూరంగా ఉంది. గ్రామస్థాయి వార్డు మెంబరు మొదలు పార్లమెంట్ వరకు చట్టసభల్లో వికలాంగులకు భాగస్వామ్యం కల్పించినప్పుడే తమ సమస్యలకు తామే పరిష్కారాలు కనుగొనడానికి అవకాశం ఉన్నదనేది వాస్తవం.

ఒక వైపు మానవ హక్కులు, మరొక వైపు వికలాంగుల హక్కులకు గల పరస్పర సంబంధాన్ని నిరంతరం విశ్లేషించాలి. కాలానుగుణంగా సమాజంలో వచ్చే మార్పులు, అవి వికలాంగులపై చూపే ప్రభావం మొదలైన అంశాలపై అధ్యయనం, విశ్లేషణ చేయాలి. ప్రతి జిల్లాలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వికలాంగుల సమస్యలపై ఈ కేంద్రాలలో తరచుగా చర్చలు, గోష్ఠులు జరగాలి. వికలాంగుల సంక్షేమం తీరు తెన్నులపై సూక్ష్మస్థాయి పరిశీలన, పరిశోధన జరగాలి. చర్చల తర్వాత మూల్యాంకనం చేయాలి. మార్గదర్శకంగా ఎదిగిన వికలాంగులను మిగతా వికలాంగులు ఆదర్శవంతంగా తీసుకునేలా వివరించగలగాలి. ఇటువంటి ఆదర్శ వికలాంగులను కలవడం, సంభాషించడం, స్ఫూర్తిని పొందడం కోసం తగు ఏర్పాటు చేయాలి. వికలాంగులు ఏ సామాజికవర్గానికి చెందిన వారైనా ఏదో ఒక సందర్భంలో అందరూ వివక్షతకు గురవుతున్నవారే. కనుక వారు నిరంతరం కలుసుకొని మాట్లాడుకునే విధంగా చేయడం వల్ల వారిలో న్యూనతా భావం పోయి ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఒకరి అనుభవాన్ని మరొకరు పంచుకొని, ఆచరించడం ద్వారా మెరుగవడానికి అవకాశం ఉంది. ఆర్థిక పరమైన సమస్యలు, నిరక్షరాస్యత, అంటరానితనం, వివక్షత, ఆత్మన్యూనత పోవాలంటే అక్షరాభ్యాసం కూడ నేర్పాలి. ప్రాథమిక అంశాల పట్ల కనీస అవగాహన కల్పించాలి. సామాజిక సమస్యలను ఎదుర్కొనేందుకు ఆత్మస్థైర్యం కలగడానికి అవకాశం ఉంది. వికలాంగులను మన సమాజం, పాలకులు బిచ్చగాలుగా చేసినంత తేలికగా తప్పని సరిగా భృతిని కూడ కల్పించవలసిన బాధ్యత ఉంది.

వికలాంగులు చట్టాలపై అవగాహన కల్గియుండవలసిన అవసరం ఎంతైనా ఉంది. వికలాంగులపై నానాటికి వివక్ష, దోపిడి, అత్యాచారాలు, అపహాస్యాలు ఎక్కువై పోతున్నాయి. సమాజంలో ప్రతి వ్యక్తి బాధ్యతలు మరవకుండా వికలాంగులను అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, బంధువుగానో గౌరవించిన నాడే సమాజం అభివృద్ధి చెందుతుంది. వికలాంగ మహిళలపై వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయి. వికలాంగులకు, ఆత్మస్థైర్యం, సమానత్వం కల్పించవలసిన బాధ్యత సమాజంలో అందరి మీద ఉంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి వారిని సమాజంలో కలిసి పోయే విధంగా పెంచాలి. వికలాంగుల చట్టం–1995 ప్రకారం మానసికంగా, శారీరకంగా హింసకు గురిచేసినా చట్ట రీత్యా కఠిన చర్యలు, శిక్షలు తప్పవని, వికలాంగుల చట్టం 1995లో ఉన్న హక్కులు, పథకాలతో పాటు ఇతర చట్టాలపై అవగాహన పెంచి వికలాంగులకు 'లా' అందుబాటులోకి వచ్చే విధంగా అవగాహన కార్యక్రమాల రూపకల్పన చేయాలి. ఎందుకంటే తమకు జరిగిన అన్యాయాన్ని సమీపంలో ఉండే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చెప్పుకోలేని స్థితిలో వికలాంగులు అల్లాడి పోతున్నారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన సమానత్వపు హక్కు, స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు, దోపిడి నుండి రక్షణ పొందడానికి హక్కు, సాంస్కృతిక, విద్యా పరమైన హక్కులు, ఆస్తి హక్కుతో పాటు అధికరణలు 39(ఎ), 39ఎఫ్, 39ఎ, 41, 45, 21ఏలు ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నట్లు ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం చేకూర్చడం, ప్రజలకు పోషకాహారాన్ని అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం, వెనుకబడిన జాతుల ప్రయోజనాలు కాపాడడం, నిరక్షరాస్యతా నిర్మూలన, సమాన న్యాయం లభించేటట్లుగా ఉచిత న్యాయ సహాయం వికలాంగులకు అందజేయాలి. అంతేకాక మానవ హక్కులు కమిషన్‌లోని ఆర్టికల్స్ 1, 2, 3, 4, 5, 6, 7, 19, 20, 21, 22, 23ల ప్రకారం రక్షణ, అవగాహన కల్పించాలి. న్యాయవ్యవస్థలోని ఇతర చట్టాలపై కూడ అవగాహన కల్పించాలి.

వికలాంగుల సాధికారిత, సామాజిక న్యాయం అనేవి మానవ హక్కులుగా చెప్పుకొన్నప్పుడు మానవ హక్కుల సాధన ద్వారా వికలాంగుల హక్కుల్ని, సామాజిక న్యాయం ద్వారా వికలాంగుల సాధికారితను సాధించాలి. రాజ్యాంగం 15వ అధికరణంలో చెప్పినట్లు సామాజిక, విద్యారంగాల్లో వెనుకబడిన వర్గాలను ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా అభివృద్ధి పరచడం, అంటే అధికారక పదవుల్లో వికలాంగుల జనాభా ప్రాతిపదికన స్థానాల్ని కేటాయించడం వంటి ఏర్పాట్లు చేయాలి. నిర్ణయాధికారంలో భాగస్వామ్యంతోపాటు, సమాజంలో గౌరవ ప్రదమైన స్థానాన్ని వికలాంగులకు కల్పించాలి.

కంచె చేనుమేసిన చందంగా వికలాంగుల హక్కులను కాపాడ వలసిన పోలీసులు, ఇతర ప్రభుత్వాధికారులే ఆ స్ఫూర్తికి తిలోదకాలు ఇస్తూ వికలాంగులను మనుషుల్లాగా చూసే పరిస్థితులు లేవు. ముందు ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు వికలాంగుల హక్కులకుగాని, గౌరవానికి గాని భంగం కలిగించి చులకన భావంగా చూస్తే శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకొనే విధంగా చట్టాలు చేయాలి. అంతేకాకుండా సమాజంలో వికలాంగులు ఎదుర్కొంటున్న వివక్షత పోవాలంటే ఎస్.సి, ఎస్.టి. వారికి ఉన్న విధంగా 'అట్రాసిటీ' చట్టం వికలాంగుల కొరకు త్వరితగతిన చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

వికలాంగులు బయటికి రాలేరు, చెప్పలేరు, చూడలేరు, మాట్లాడలేరు కాబట్టి మేధావులు, సంఘ సంస్కర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, యువతి, యువకులు ముందుకు వచ్చి ఎంతో మనోవేదనకు గురవుతున్న వికలాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని కల్గించి, చేయూత అందించవలసిన అవసరం ఉంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ) వీ

దోపిడీకి గురవుతున్న ఆదివాసుల సంస్కృతి

***ఆదివాసులను ఏనాడూ పట్టించుకోని పాలకవర్గాలు టూరిజం పేరిట వారిని ప్రదర్శన వస్తువులు చేయడం, అలా చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గం అంటున్నారు* వూకే రామకృష్ణ**

సామ్రాజ్యవాద, నయా ఉదారవాద విధానాలు ఆధునిక నాగరికత పెంచి పోషిస్తున్న క్రూర అవమానవీయ దోపిడీ వాస్తవ రూపం నానాటికీ తన ముసుగునూ తొలగించుకొని బట్టబయలవు తోంది. తిండిని ఆశజూపి మన దేశపు అండమాన్ నికోబార్ దీవుల సముదాయంలో అంతరించిపోతున్న జార్వా ఆదివాసీ తెగకు చెందిన కొందరు మహిళలచే బలవంతంగా అర్ధనగ్న నృత్యాలు చేయిస్తున్న వీడియో దృశ్యాలను ఇటీవల అబ్జర్వర్ బ్రిటిష్ దినపత్రిక ప్రచురించింది. జార్వా తెగ మహిళలకూ తిండి పెట్టి అందుకు బదులుగా పర్యాటకుల ఎదుట బలవంతంగా నృత్యం చేయించారనేది ఆ వార్త సారాంశం.

అమాయక ఆదివాసీలపై జరిగిన ఈ నీతి బాహ్యమైన, అమానవీయమైన దుష్కృత్యానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ పార్శ్వాల నుండి తీవ్రమైన ఖండనలు, నిరసనలు వ్యక్తం అయ్యాయి. అండమాన్ నికోబార్ దీవుల ప్రభుత్వ అధికార యంత్రాంగం చాలా సహజంగానే ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఎప్పుడో, పది సంవత్సరాల క్రితం చిత్రించిన వీడియో దృశ్యాలుగా వాటిని పేర్కొంటూ, ఒక విచారణకు ఆదేశించి చేతులు దులుపుకుంది.

ఆ వీడియో దృశ్యాలు కనీసం నాలుగు లేదా ఐదు సంవత్సరాల క్రితంవి అనీ, ఆనాటి ఆదివాసీ నృత్యాలు (మహిళల నృత్యాలు) ఏర్పాటు చేసిన వారిని గుర్తించడం కష్టమనీ మరోవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. అండమాన్ దీవుల డిజిపి మరో అడుగు ముందుకేసి 2002 ప్రాంతంలో ఆ దృశ్యాలను చిత్రీకరించారనీ, ఆదివాసులను నృత్యం చేసే విధంగా పురిగొల్పడం ద్వారా ఆ వీడియో గ్రాఫర్ చట్టాన్ని అతిక్రమించాడనీ, కనుక అతనిని నేరస్తుడుగా గుర్తించామనీ ప్రకటించాడు. ఇంకా పర్యాటక శాఖ నుండి అండమాన్ పోలీసులు లంచాలు తీసుకొన్నారనే ఆరోపణలు అసత్యమైనవనిగా పేర్కొంటూ, లండన్‌కు చెందిన అబ్జర్వర్ అనే పత్రిక తమకు క్షమాపణలు చెప్పాలనే డిమాండ్ చేసింది. సర్వైవల్ ఇంటర్నేషనల్ అనే లండన్‌కు చెందిన ఓ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ తన నిధులు పెంచుకోవడానికి ఈ రకమైన సంచలనాత్మక అసత్యాలను ప్రచారం చేస్తూ మోసానికి పాల్పడిందని ఆరోపించారు.

జార్వాలు – అండమాన్ నికోబార్ దీవులలో వేటాడి జీవనం సాగించే ఆదివాసీ తెగకు చెందిన వారు. 18వ శతాబ్దంలో బ్రిటిష్ వలసవాదులు ఈ ప్రాంతంలో ప్రవేశించి, ఈ దీవులనూ తమ ఖైదీల స్థావరంగా మార్చుకునే నాటికి, జార్వా తెగ ఆదివాసులు సుమారుగా ఐదు వేల మంది జీవనం సాగిస్తున్నారు. బ్రిటిష్ పాలకులు అనుసరించిన ఆదివాసీ వ్యతిరేక విధానాల ఫలితంగా వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. అధికార మార్పిడి అనంతర కాలంలో ఆదివాసీ వ్యతిరేకమైన అవే చట్టాలు, విధానాలు కొనసాగుతూ, వారి జీవనం మరింత దుర్భరం అవుతూ వారి సంఖ్య సుమారు రెండు వందలకు తగ్గింది. బాహ్య ప్రపంచంతో సంపర్కం ఫలితంగా ప్రమాదకరమైన మశూచికం వంటి వ్యాధులు సోకి మిగిలిన వారు ఒక్కొక్కరూ మరణిస్తూ, అంతరించిపోయే తెగగా నేడు వారున్నారు.

21వ శతాబ్దం ప్రపంచీకరణ, ప్రపంచపు ఆధునిక నాగరిక సమాజం వీరిని దోచుకోవడానికి అనువైన వనరుగా మార్చుకుంది. మద్యం, పొగాకు వంటి మత్తు పానీయాలను, సామ్రాజ్యవాద విష సంస్కృతిని ఎరగా చూపి ఆధునిక నాగరిక పర్యాటకుల కామాతుర వినోదానికి అమాయక ఆదివాసీలను వర్తకపు వస్తువులుగా మార్చారు. కొద్దిపాటి చిల్లర నాణాలనో, బిస్కట్లనో, బంగాళదుంప పలుకులనో, అరటి పళ్లనో వారికి విసిరేస్తూ, పొగాకునూ అడుక్కునే బిచ్చగాళ్లుగా వారిని మార్చివేసి, దిగజార్చబడిన వారి చేష్టలనూ ఆనందిస్తూ వీడియోలలో చిత్రీకరిస్తున్నారు. పాటలకు తలలు ఊపుతూ, అర్ధనగ్నంగా నృత్యం చేస్తున్న జార్వా ఆదివాసులనూ, వారి నృత్య దృశ్యాలనూ సెల్‌ఫోన్‌లలో ప్రదర్శిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారు.

కాగా ప్రస్తుత పరిస్థితులలో అండమాన్ ప్రజలు తమ జీవనాధారమైన జాతీయ రహదారిని తెరవాలని ఆందోళనను సాగిస్తుండగా, జాతీయ రహదారిని తెరవకుండా మూసి ఉంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నవారు – జార్వా తెగ ఆదివాసీ వీడియో దృశ్యాలనూ ఈ సమయంలో విడుదల చేశారని బిజెపి అండమాన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు.

హిందు(త్వ) సంస్కృతికి తామే ఛాంపియన్లమని గొంతు చించుకొనే పార్టీ ప్రతినిధి ఆదివాసీలపై సాగుతున్న ఈ దుస్సంఘటనలు మానవత్వానికే తీరని కళంకంగా, తన రాజకీయ ప్రత్యర్థులపై పై చేయి సాధించేందుకు ఉపయోగించుకోచూశారని స్పష్టం అవుతోంది. ఏమైనా ఆదివాసీ నృత్యాల సంఘటనలు నాలుగు సంవత్సరాల క్రితం జరిగినవిగా పేర్కొంటూ దీనికి సూత్రధారుడైన నేరస్తుడిగా ఒక పోలీసును ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇక దీంతో ఎప్పుడో గతించిన సంఘటన గురించి అందరూ మరిచి పోవాలని దబాయిస్తోంది.

మరోవైపు, పర్యాటకుల ఎదుట జార్వా ఆదివాసుల అర్ధనగ్న దృశ్యాల గురించి ప్రజల మధ్య చర్చకు రాకముందే ఒడిశా, మల్కన్‌గిరి జిల్లాలోని బోండాలు అనబడే ఆదివాసీ తెగకు చెందిన సమూహంపై కూడా ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 'మానవవేట – ఒక సదవకాశం' పేరిట ప్రభుత్వ పర్యాటక శాఖ యంత్రాంగం ఇటువంటి సంఘటనలకు పాల్పడిందనే వార్తలు మీడియాలో వెలువడ్డాయి. జీవితకాలంలో 'ఒకే ఒక అరుదైన అవకాశం' ని పచ్చబొట్లతో, వంటి నిండా పూసలతో, దాదాపుగా నగ్నమైనా ఆదివాసులను చూడవచ్చు అని వారి ఆదిమ కాలపు సంస్కృతిని, జీవనాన్ని చూడవచ్చు అని ఆదివాసుల నగ్నత్వంపై ప్రచారం చేస్తూ, దానినే ప్రధానం చేస్తూ పర్యాటకులను ఆకట్టుకునేందుకు పర్యాటక ఏజెంట్లు వ్యాపార ప్రకటనలు గుప్పించారు. పర్యాటక ఆపరేటర్లు వారి వారి వెబ్‌సైట్ల లోను బ్రోచర్లలో బోండా తెగ స్త్రీ పురుషుల నగ్న చిత్రాలను

కనుమరుగవుతున్న ప్రభుత్వ పాఠశాలలు

పాఠశాల విద్యారంగంలో అసమానతలు పెంచే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయనీ, కొఠారీ కమిషన్‌తో సహా వివిధ కమిషన్‌లు చేసిన సూచనలు తక్షణమే అమలు చేయాలనీ అంటున్నారు **ఎల్. ఆర్. అనిత**

స్వాతంత్ర్యం వచ్చి, 65 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన పాఠశాల విద్య సంక్షోభ దిశవైపు పయనిస్తోంది. పేద, మధ్య తరగతి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించడం ఒక సవాలుగా మారింది. అరకొర వసతులతో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేటు పాఠశాలలతో పోటీ పడలేక వాటి భవిత ప్రశ్నార్థకంగా మారి, వాటి మనుగడ దిన దినం పతనావస్థకు చేరుతోంది. ఆర్టికల్ 45 రాజ్యాంగ సవరణ ద్వారా 6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను ప్రభుత్వమే అందించాలి. కాని, ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేటు పాఠశాలలకు మార్గం సుగమం చేస్తూ, తన బాధ్యతను విస్మరిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు అనేక విద్యా కమిషన్‌లు, కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, ఆసూచనలను అమలు చేయకుండా విద్యా రంగంలోని లోపాలను యథాతథంగా కొనసాగిస్తూనే ఉన్నాయి. రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. అయినా పాఠశాల విద్యకోసం అనేక కోట్ల రుపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ఉత్తర ప్రగల్భాలు పలుకుతోంది. ఒక నాణానికి రెండు పార్శ్వాలు ఎలా ఉన్నాయో, అలానే ప్రతి రంగంలో మనకు భిన్న పార్శ్వాలు కనిపిస్తాయి. పట్టణాలకు–పల్లెలకు, స్త్రీలకు– పురుషులకు, సంపన్నులకు – పేదలకు మధ్య అంతరాలు ఎలా ఉన్నాయో కార్పొరేటు పాఠశాలలకు, ప్రభుత్వ పాఠశాలలకు అంతే స్పష్టంగా అంతరాలు ఉన్నాయి. ఈ నాటికీ దళితుల్లో, స్త్రీలలో అక్షరాస్యతా శాతం ఎలా ఉందో ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. విద్యారంగంలో అసమానతలు ఉండడం ప్రజాస్వామ్య దేశంలో విద్యా విధానానికీ గొడ్డలిపెట్టు.

ప్రస్తుత తరుణంలో పల్లె పల్లెనా, వీథి వీథినా ప్రైవేటు పాఠశాలలు

ఉంచడం ద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నారనే విషయం వెల్లడైంది.

ఈ సంఘటనలపై ఒడిశా ముఖ్యమంత్రి స్పందిస్తూ తాను కొందరు పర్యాటక ఏజెంట్లతో మాట్లాడినట్లు, అలాంటిదేమీ జరగలేదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ మీడియాలో వచ్చిన వార్తలపై తానే ఉదారంగా సంబంధిత జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ సీనియర్ అధికారిచే విచారణ జరిపించి వాస్తవాలు వెల్లడించవలసిందిగా కోరినట్లు చాలా తాపీగా ప్రకటించారు.

వాస్తవానికి ఒడిశాలోని ఆదిమ నిగ్రోయిడ్ తెగకు చెందిన ఆదివాసులను లాభాల దాహంతో పరితపిస్తున్న పర్యాటక వ్యాపార 'నాగరిక' ప్రపంచం హీనమైన దోపిడీకి గురిచేస్తోంది. కొత్తవారి నుండి, ముఖ్యంగా బయటి వ్యక్తుల నుండి దూర దూరంగా మసిలే బోండా తెగ ఆదివాసులను, జంతు ప్రదర్శనశాలలోని వింత జంతువులను చేసి, వారి అమాయక ఆదివాసీ జీవనాన్ని ప్రదర్శనకు పెట్టి నాగరికతను మంటగలుపుతున్నారు. పర్యాటక రంగం అభివృద్ధి పేరిట ప్రభుత్వాలు ఈ మారుమూల ప్రాంతాలకూ ప్రసార, రవాణా సౌకర్యాలు కల్పిస్తూ, 'మానవ వేట' లంటూ పర్యాటక ప్యాకేజీలను ప్రకటిస్తూ మన దేశంలో ఆదిమ తెగల సంస్కృతిని దోపిడీకి గురిచేస్తున్నాయి.

ఇలాంటి వార్తలు వెల్లడైన తర్వాత ప్రభుత్వాలు, ఉన్నతాధికారాలు, పోలీసు యంత్రాంగం, మొదట తీవ్రంగా ఖండించడం, గట్టిగా నిరాకరించడం, ఆ పై రాజకీయ జిత్తులతో ప్రధాన విషయం నుండి పక్కతోవ పట్టించడం చేస్తూ వస్తున్నారు. ఆదిమ తెగల ఆదివాసుల పట్ల మన దేశంలో సాగుతున్న ఘోరాలలో ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. కాగా, 12న బ్రెజిల్ దేశానికి సంబంధించిన మరో వార్త ప్రచార మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది.

బ్రెజిల్‌లో జనవరి 10న ఆదిమ ఆదివాసీ తెగకు చెందిన ఎనిమిది సంవత్సరాల బాలికను 'లాగర్' (అడవులలో కలప దుంగలనూ నరికి వ్యాపారం చేసేవారు) పట్టి బంధించి నిలువునా కాల్చి చంపారు. అటవీ భూములనూ కైవసం చేసేందుకూ 'ఆవా' తెగ ఆదివాసులనూ వారి నివాసాల నుండి పారదోలేందుకు సాహసికులైన ఆదిమ ఆదివాసీ తెగలనూ క్రూరంగా హత్య గావిస్తూ అంతం చేయడంలో భాగంగానే పై సంఘటన జరిగింది. వాస్తవానికి, ఆధునిక నాగరిక ప్రపంచానికి పూర్తిగా దూరంగా ఉంటున్న ఆవా తెగ ఆదివాసులు ఇప్పటికీ తమ ఆదిమ కాలపు జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. అమెజాన్ అటవీ ప్రాంతంలో ఆలస్యంగా సంబంధాలలోకి వచ్చిన ఈ తెగ ఆదివాసులు వీరు. అరవై మంది ఆవా ఆదివాసీలు ఒక సమూహంగా గడుపుతారు. వీరి నుండి వేరుబడిన ఆవా తెగ బాలిక లాగర్స్ చేతచిక్కి హతమైంది.

అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియాలతో సహా అనేక ఖండాలలోని వివిధ దేశాల్లో అక్కడి ఆదిమ తెగల భూములను తాము స్వాధీనం చేసుకునేందుకు, వారిపై ఆధిపత్యం సాగించేందుకు వలసవాదం అత్యంత క్రూరంగానూ, అమానుషంగానూ వ్యవహరించిందని మనకు తెలుసు. ఆధునిక ప్రపంచంలో సభ్యులుగా మనం అలాంటి క్రూర ఘటనల్నిటినీ తీవ్రంగా ద్వేషించాలి. ఆదివాసీ తెగల పట్ల ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దాడి మరింత క్రూరంగా, కర్కశంగా, మానవ గౌరవాన్ని తెగనమ్ముకునే ఘోర వంచనను సాగిస్తూ మానవులను వ్యాపార లాభాలు సంపాదించే సరుకులుగా దిగజారుస్తున్నది.

సామ్రాజ్యవాద నయా ఉదారవాద ఆర్థిక విధానం గతకాలపు వలసవాద లూటీ, దోపిడీ కంటే కూడా క్రూరంగా, అమానుషంగా ఆదివాసీల ఆదిమ సంస్కృతిని వ్యాపార ప్రయోజనాల పేరుతో దోపిడీ సాగిస్తున్నది. ఈ దోపిడీకి వ్యతిరేకంగా విప్లవ సంస్థలు, ప్రగతిశీల, అభ్యుదయ సంస్థలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు ఆదివాసులతో కలిసి పోరాడాలి.

(రచయిత ఆదివాసీ రచయితల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి) వీ

తమదైన శైలిలో, టెక్నోస్కూల్, డిజి స్కూల్స్, ఈ– టెక్నో స్కూళ్ల పేర్లతో సామాన్య ప్రజలను ఆంగ్ల మాధ్యమం ముసుగులో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రెసిడెన్సియల్, సెమి రెసిడెన్సియళ్ల పేర్లతో విద్యార్థులను తమ పాఠశాలల వైపు ఆకర్శిస్తున్నారు. అటు ప్రభుత్వం, ఇటు ఉపాధ్యాయలోకం తమ పాఠశాలల మనుగడ పట్ల ఏ మాత్రం ఆలోచించడం లేదు. అదే క్రమంలో ప్రభుత్వం ఏమైనా తక్కువనా అన్నట్లుగా మోడల్ స్కూల్స్, సక్సెస్ స్కూల్స్, కస్తూరిబా వంటి వివిధ పేర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అంతరాలను పెంచడానికి ప్రయత్నిస్తోంది. ఇవన్నీచేస్తూ, ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక ప్రయోగాలు చేస్తూ, విద్య పక్షోత్సవాల పేరుతో ఉపాధ్యాయులను వీధుల వెంటా తిప్పుతూ, బోధించాల్సిన సమయంలో విద్యార్థులకు పాఠాలు చెప్పనీయకుండా పరోక్షంగా, కార్పొరేటు పాఠశాలలకు మార్గం చూపుతోంది ప్రభుత్వం. ధనికుల కోసం కార్పొరేటు పాఠశాలలు, పేదల కోసం ప్రభుత్వ పాఠశాలలు అన్న చందాన గతంలో ఉండేవి. పేదవారు కూడా తమ పిల్లలకు ప్రైవేటు విద్యనందించాలనే ఆశతో గంజో, అంబలో తాగుతూ, అప్పులు చేస్తూ తమ పిల్లలను ఆంగ్ల మధ్యమంలో చేర్పిస్తున్నారు. ఇలా పేద పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలకు దూరం అవుతూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యర్థులు లేని తరగతి గదులుగా బోసిపోతున్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలేది పేద మధ్యతరగతి అమ్మాయిలు మాత్రమే.

గత దశాబ్ది కాలంలో ప్రభుత్వం ఎపిఇటి, డిపిఇపి, ఆర్‌విఎం, ఆర్‌ఎంఎస్‌ఎ ల పేర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో అనేక ప్రయోగాలు చేస్తూ, విద్యా వ్యాప్తికి కృషిచేస్తున్నట్లుగా ప్రజల్లో భ్రమలను కల్పిస్తోంది. ఆశించిన ఫలితాలు రావడంలేదు అనే సాకుతో ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చూపెట్టడానికీ దారులు వెతుకుతోంది. కార్పొరేటు పాఠశాలలు రోజురోజుకు మూడుపువ్వులు, ఆరుకాయలు అన్న చందాన అభివృద్ధి చెందుతూ ఉంటే ప్రభుత్వ పాఠశాలలు మాసిన గోడలతో, విద్యార్థులు లేక, వెలవెలబోతూ ప్రజలకు దర్శనమిస్తున్నాయి. విద్య ఎక్కడ నేర్చినా ఒక్కటే అయినప్పటికీ, ప్రభుత్వం పేదవారిలో కూడా అంతరాలను సృష్టించడానికి వివిధ పాఠశాలలను వివిధ పేర్లతో స్థాపిస్తూ, అది కొద్ది మంది పిల్లలకే అందుబాటులో ఉంచుతూ పసిప్రాయంలోనే విద్యార్థులలో విద్యనభ్యసించడానికి అనేక వ్యత్యాసాలను పెంచుతోంది.

విద్యార్థుల నమోదు విషయాన్ని గమనిస్తే ప్రతి సంవత్సరం 25 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు దూరమవుతున్నారు. అదే క్రమంలో ప్రైవేటు పాఠశాలలో నమోదులో ఆధిక్యత కనబడుతోంది. ప్రాథమిక పాఠశాలల విషయానికీ వస్తే, పది మంది లోపు ఉన్న పిల్లలు గల పాఠశాలలు ప్రతి జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నాయి. ఇరవై అంకె గల పాఠశాలు అత్యధికం అని చెప్పాలి. ఏ కొద్ది పాఠశాలలో మాత్రమే 100 మంది విద్యార్థులు ఉంటారు. ఇలా ప్రతి సంవత్సరం ప్రవేశాలను అంచనాలు వేస్తే ఒక ఐదు సంవత్సరాలలో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి చాలా దయనీయంగా ఉంటుందనేది మేధావుల ఆలోచన.

ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తూ ఉన్నప్పటికీ(మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, ఉపకారవేతనాలు, వైద్యం, హాస్టల్ ఏర్పాటు) ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు అయ్యేదిశలోనే ఉన్నాయి. అందుకుగాను, వాటిలోని మూలాలను వెతికి వాటి మనుగడ కోసం మనవంతు కర్తవ్యంగా కృషి చేద్దాం. అందుకు గాను ప్రభుత్వానికి సూచనలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాడికి ఉంది.

ఒక వైపు విద్యహక్కు చట్టం ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు, పాఠశాల భౌతిక వసతులు మెరుగుపడుతాయని సంతోషపడుతుండగా, ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చేరడానికి అనుమతిని ఇవ్వడం మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లుగా పరిస్థితి ఉంది. ప్రభుత్వ పాఠశాలను మూసి వేయడానికే ప్రభుత్వం కంకణం కట్టుకున్నగా కన్పిస్తోంది. కార్పొరేటు పాఠశాలల కబంధ హస్తాల నుండి, ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించు కోవడానికి దారులు వెతుకాల్సిన అవసరం ఉంది. అందుకు సూచించిన అంశాలను పరిశీలిస్తే మరో పది కాలల పాటు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవచ్చు.

1. కార్పొరేటు పాఠశాలలను కట్టడి చేస్తూ, కొఠారీ సూచించిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. 1966లో సూచించిన కామన్ స్కూల్ విధానం నేటికీ అమలుకు నోచుకోలేకపోవడం ప్రభుత్వం విద్యపట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం.

2. బ్రిటిష్ కాలం నాటి బోధనా పద్ధతులు, పాఠ్యాంశాలు, పరీక్ష విధానంలో సమూల మార్పులు చేసి ప్రాథమిక స్థాయి నుండే పాఠశాల విద్యను పటిష్టం చేస్తూ, గాంధీ సూచించిన బేసిక్ విద్యా విధానం పటిష్టంగా అమలు చేయాలి.

3. విద్యా హక్కు చట్టం ద్వారా కొంతమేర న్యాయమే జరుగు తున్నప్పటికి 25 శాతం విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనను మానుకొని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందేటట్టుగా చట్టంలో సవరణలు చేసి, పాఠశాలలో మౌలిక వసతుల రూప కల్పనను వేగవంతం చేయాలి.

4. పేద, ధనిక విద్యార్థులు ప్రాథమిక విద్యను తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలలో చదువాలని రాజ్యాంగ సవరణ చేసినప్పుడే, ఆర్టికల్ 45ను అమలు చేసినవాళ్లం అవుతాం.

5. మాతృభాషను విస్మరించకుండా, ఒకటవ తరగతి నుండే ఇంగ్లిషును బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈశ్వరీబాయి పటేల్ సూచించిన 'పని ఉత్పాదక పథకం' అమలు అయ్యేటట్లు వృత్తి విద్యా ఉపాధ్యాయులను నియమించాలి.

6. విద్య అక్షరాస్యత కొరకు అన్నట్లు కాకుండా, వారిలో మానసిక, నైతిక విలువలను పెంపొందించే దిశలో ప్రభుత్వ పాఠశాలలో యోగ, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ వంటి కార్యక్రమాలను విధిగా ప్రవేశపెట్టాలి.

7. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మూడవ తరగతి నుండే ప్రతి పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టి, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టరును నియమించాలి.

8. ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానంగా, వీలైనన్ని ప్రీ ప్రైమరీ పాఠశాలలను నెలకొల్పి, ప్రాథమిక పాఠశాలకు సన్నద్ధం చేయాలి.

9. ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాలలు వేరువేరుగా ఉంచుతూ, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయలు బోధించేటట్లుగా చూడాలి.

10. ప్రతి ప్రభుత్వ పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దీ, ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి నుండే రోజుకు పది రుపాయల చొప్పున, నెలకు 300 రుపాయల ఉపకార వేతనం అందించాలి.

విద్య ఒక ప్రాథమిక హక్కు, విద్య సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది. ఒక మంచి సమాజ స్థాపనకు, ప్రతి బాలుడు, బాలిక విద్య ఫలాలను అందుకోవాల్సిన అవసరం ఉంది.

అమ్మ ఒడి ఎంత హాయిగా ఉందో, మా బడి చదువుల ఒడి కూడా అంతే ఆనందాన్ని ఇస్తుంది అని రుజువు చేసిన నాడే ప్రభుత్వ పాఠశాలల మనుగడ కొనసాగుతుంది.

(రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు) వీ

ప్రాపంచిక దృక్పథాన్నిచ్చే 'బౌద్ధ దర్శనం'


- బి.వి.ఎన్. స్వామి

ప్రపంచ దార్శనికులలో అత్యంత ఉత్తమ శ్రేణికి చెందిన వాడు బుద్ధుడు. అలాంటి బౌద్ధ దర్శనాన్ని, లోకాయత ప్రచురణ ద్వారా కత్తి పద్మారావు లోకానికి అందించారు. సిద్ధార్థుడు బ్రాహ్మణేతరుడైన శాక్యముని. ఇతడు క్షత్రియుడైనందున, బ్రాహ్మణులకు సేవ చేయాల్సి వచ్చింది. బ్రాహ్మణేతరులు ఆర్యీకరణకు వేగంగా గురవుతున్న సమయంలో, దానికి భిన్నంగా సంఘర్షించి, బ్రాహ్మణ వైయక్తిక వాదాన్ని కాదని సామాజిక జిజ్ఞాసను పెంచుకోవడంలోనే గౌతముని ప్రత్యేకత దాగి ఉంది. నాటి కట్టును కాదన్న వారు ఎంతటి వారైనా, దేశ బహిష్కరణకు గురికావడం జరిగేది. బుద్ధుని వ్యక్తిత్వ ప్రతిభ, శిక్షకు అడ్డంకిగా మారిన క్షణంలో 'నేను పరివ్రాజ కున్నయి ఈ దేశాన్ని వదలి వెళ్లిపోతాను. ఇది ఒకరకమైన బహిష్కారమే కదా' అంటాడు. ఇదీ బుద్ధుని ఆచరణ.

సిద్ధార్థుడు, బుద్ధునిగా మారే క్రమంలో అనేక ప్రభావాలకు లోనయ్యాడు. సాంఖ్యం బుద్ధుని తర్కబద్ధమైన ఆలోచనకు పురికొల్పింది. జ్ఞానం ధ్యానం నుంచి వచ్చేది కాదని, అది తర్కబద్ధమైందనీ, హేతు వివేచనా పూర్ణమైందని ఆయన గ్రహించాడు. పూర్ణాకాశ్యపుడు చెప్పిన 'పరలోకమనేది లేదు' అనే ప్రక్రియావాదం బుద్ధునిపై ప్రభావం వేసింది. ప్రాకృత కాత్యాయనుడు, సంజయ బెలత్తపుట్ట, చార్వాక, లోకాయత మొదలగు వారి ప్రభావం గౌతమునిపై ఏ విధంగా ఉందో పద్మారావు సోపపత్తికంగా నిరూపించాడు. 'జైనం హిందూ హింసకు వ్యతిరేకంగా తీవ్రమైన అహింసా ఉద్యమాన్ని చేపట్టింది', 'సమాజాన్ని ఏకకాలంలో మార్చకలిగిన అంతస్సూత్రాలను ఆయన కనిపెట్టగలిగాడు' అనే వాక్యాలు చరిత్రను అర్థం చేసుకోవడానికి నిచ్చెన మెట్లుగా ఉపయోగపడతాయి. బుద్ధ తత్వాన్ని యాంటీ థిసిస్‌గా అభివర్ణించడం పద్మారావు అవగాహనను తెలుపుతుంది.

తత్వశాస్త్రం సమాజాన్ని వివరించడం కాదు, సమాజాన్ని మార్చాలి అన్న మార్క్స్ ప్రకారం, హిందూ సమాజాన్ని, జీవిత విధానాన్ని పూర్తిగా మార్చగలిగిన శక్తి బౌద్ధం కలిగి ఉంది. ఈ విషయాన్ని పద్మారావు అనేక చోట్ల విశదీకరించాడు. చార్వాక, జైన, సాంఖ్య దర్శనాల ద్వారా తత్వశాస్త్రం కొలిమిలో కాల్చబడి శక్తిగా మారింది. బుద్ధుని కాలంలో ఆయుధంగా మారి సమాజ పునర్నిర్మాణానికి పూనుకొంది. సమాజం దృష్టిని మోక్షం నుండి సంఘం మీదికి, భోగం నుండి త్యాగం మీదికి బుద్ధుడు మరల్చాడు. బౌద్ధం వ్యక్తినీ, సంఘాన్నీ పతనం కాకుండా కాపాడింది. ఇందులోని సమతాభావం అంబేద్కర్‌ను ఆకర్షించింది. కనుకనే బౌద్ధ దర్శనం ద్వారా తన సమాజానికి విముక్తి లభిస్తుందని అతడు విశ్వసించాడు. వాస్తవంగా కూడా బౌద్ధం నాటి కాలానికి ఒక విప్లవాత్మక ఆచరణ. విధ్వంసానికీ, నిర్మాణానికీ ఉండే వైరుధ్యమే హైందవ, బౌద్ధ వైరుధ్యంగా ముందుకు వచ్చింది. బుద్ధుని మతం కచ్చితంగా ఒక నూతన ఆవిష్కరణ. ఎందుకంటే భూమిపైన మానవుని జీవన గమనమూ, మానవుడు పుట్టుకతో పాటు సహజాతంగా సంతరించుకున్న స్వాభావిక లక్షణాలనూ పరిశోధించి, పరిశీలించి ఆవిష్కృతమైనదే బౌద్ధ దర్శనం.

రాజు అనే భావనను ఈ రోజు మనం అంగీకరించలేం కానీ, రాజుకు ఉండాల్సిన లక్షణాలను బుద్ధుడు ఈ విధంగా చెబుతాడు. 'రాజు హింసను, దొంగతనాన్ని, వ్యభిచారాన్ని, మాదకద్రవ్యాల సేవలను తాను త్యజించి ప్రజలకు మార్గదర్శకుడిగా ఉండాలి. ఒక తండ్రి తన పిల్లల భవిష్యత్తు పట్ల ఎంత ప్రేమగా వ్యవహరిస్తాడో రాజు తన ప్రజల పట్ల అలా వ్యవహరించాలి'. ఇలాంటి లక్షణాలు మన పాలకులకు ఉన్నాయా అని ప్రశ్నిస్తే తప్పేంటి? ఉండాలని కోరుకుంటూ, బుద్ధుడి ఆలోచనల్ని ఆచరణగా స్వీకరిస్తే సంఘంలో ఇంతటి అలజడి ఉండేదా? మార్క్స్ ఆర్థిక వాదానికి బుద్ధుడు మానసికత అనే కోణాన్ని చేర్చాడు. మనుషులు భౌతిక, ఆర్థిక జీవులేకాక, అంతకంటే ఎక్కువగా మానసిక జీవులు కాబట్టి, సమగ్ర వివేచనతో న్యాయ నిర్ణయం జరగాలని బౌద్ధం చెప్తుంది. 'పట్టాభిగాలి' వీస్తున్న నేటి కాలంలో బౌద్ధం ప్రాసంగికత ఎంతో ఉంది. ఈనాటి సామాజిక వాస్తవికతలో ధమ్మపదం నిరంతర అధ్యయనం కావాలి అని నమ్ముతూ, ఆవైపు కృషి చేస్తున్న పద్మారావు అభినందనీయుడు.



బౌద్ధ దర్శనం – డా. కత్తి పద్మారావు – లోకాయత ప్రచురణలు – 176 పేజీలు, 1/8 డెమీ, రు: 100, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు, గుంటూరు– 522124, ఫోన్: 08643–42840 సెల్: 9849741695; ఈమెయిల్ :padmaraokathi.@yahoo.co.in;

కులవ్యవస్థ గురించి చెబుతూ ఇతరుల శ్రమను దోచుకునే పరాన్న భుక్కులు, ఎవరి శ్రమను దోచుకుంటున్నారో వారికంటే అధికులు ఎలా అవుతారని బుద్ధుడు ప్రశ్నించాడు. ప్రజల్ని రక్తకాసారంలో ముంచి, రాజ్యాల్ని ఆక్రమించుకొని సామ్రాజ్యాధిపతులుగా వెలుగొందిన రాజుల చరిత్రలో బౌద్ధాన్ని ఆశ్రయించిన ఆశోకుడు ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు అంకితమవడం అనేది చరిత్రకు బుద్ధుడు పెట్టిన భిక్ష. అశోకుడు భౌతిక యుద్ధం మానేసి హృదయ సంబంధమైన ఘర్షణకు లోనయ్యాడు. ఆ విధంగా అతడు యుద్ధరంగంలోనే నిలిచాడు. అందువల్లనే శ్రీనగర్‌లాంటి పట్టణం ప్రజలకు లభించింది. చట్టాల అమలులో నైతికత ప్రధాన పాత్ర వహించాలన్న గౌతముని ఆలోచనకు భిన్నంగా చాణక్యం ఉండడం గమనార్హం. బుద్ధుని ఆలోచనల్లోని వాస్తవిక దృక్పథం, ధర్మ చక్ర సిద్ధాంతం ద్వారా తెలుస్తుంది. దీని ప్రకారం లాభం–నష్టం, ప్రతిష్ట– అప్రతిష్ట, తిట్లు–పొగడ్తలు, సౌకర్యం–అసౌకర్యం అనేవి ఎనిమిది లోకధర్మాలు. బుద్ధుడు మనిషిని చైతన్యవంతుడైన భౌతిక జీవిగా గుర్తించాడు. బౌద్ధ విశ్వవిద్యాలయాల్లో విజ్ఞానవంతమైన చర్చలు జరిగేవి. ఈ పద్ధతి గొప్ప విద్యా సాంప్రదాయాన్ని నెలకొల్పింది. అంతకు ముందున్న శబ్ద ప్రధానమైన, ఒక మనిషి నుండి మరొక మనిషికి ప్రసారమైన విద్యకు ఇది భిన్నంగా ఉంది.


రాహుల్ సాంకృత్యాయన్, రొమిల్లా థాపర్, రాధాకుముద్ చటర్జీ, డి.డి. కోశాంబి, ప్రొ. లక్ష్మీనరసు, అంబేద్కర్, దేవీప్రసాద్ చటోపాధ్యాయ్, జి.టి. గారేట్, మాక్స్‌ముల్లర్, ఎ.కె. వార్డర్, కలుపహాన, ఎడ్విన్ ఆర్నాల్డ్, ట్రవర్‌లింగ్, హాజ్మీనకమురా, సర్ మోనియర్ విలియమ్స్ మొదలగువారి ఆలోచనల్ని అందిస్తూ, బౌద్ధ దర్శనానికి వారి విశ్లేషణల్ని జతచేస్తూ రచన జరిగింది. ప్రవాహాధృతిని మించిన వాగ్ధాటి గల పద్మారావు కలం మాత్రం, రెండు తీరాల్ని తన చేతుల్తో నిమురుతూనే సాగే నిండు గోదారిలా సాగుతుంది. అందుకు ఒక్క ఉదాహరణ – 'రక్తస్రవంతికి అడ్డు కట్టవేసి, ధార్మిక నదీనదాలు పారించే మానవ మనోక్షేత్రంలో మానవతా పంటలు పండించిన ఆశోకుడు ఆచరణాత్మక బౌద్ధ దార్శనికుడు. ప్రత్యామ్నాయ ప్రవర్తకుడు'. ఇదీ పద్మారావు వచన శైలి. అనేక వాదాల్ని అద్దంలో చూపించిన రచయిత అభినందనీయులు

(సమీక్షకులు ఉపాధ్యాయులు)

వీ

'దళితులు, ఆదివాసులకు అసలు న్యాయం అందుతోందా?'

- లోకసంచారి



ఎస్.సి. ఎన్.టి.లపై అత్యాచారాలు - పోలీసు-కోర్టులు-ఎలా పనిచేస్తున్నాయి? - బొజ్జా తారకం - రిపబ్లికన్ పబ్లికేషన్స్ - 118 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: రిపబ్లికన్ పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం.1, బాల్‌రెడ్డి నగర్‌కాలనీ, టోలిచౌకి, హైదరాబాద్ - 500008; ఫోన్: 040-23562525, సెల్: 9441441891, 944075954; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

బొజ్జా తారకం రాసిన 'ఎస్.సి., ఎస్.టి.లపై అత్యాచారాలు - పోలీసులు - కోర్టులు - ఎలా పని చేస్తున్నాయి?' అనే పుస్తకం చదివిన తర్వాత మనసున్న ఏ వ్యక్తి అయినా చలించిపోక తప్పదు. ఒక దేశంలోని అన్ని వనరులు ఆ దేశ ప్రజలందరికీ సమానంగా చెందుతాయి. అలాగే, ఏ రకమైన హెచ్చుతగ్గులు లేకుండా మనుషులందరూ సమానమే అని చెప్పే సోషలిస్ట్ ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టి, కేవలం ఇప్పుడున్నదని చెప్పబడుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లో, ప్రజల పరిస్థితి, మరీ ముఖ్యంగా అట్టడుగు వర్గాల పరిస్థితి ఎలా ఉందో పరిశీలిస్తే, ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు నిజస్వరూపం ఏమిటో అర్థం అవుతుంది. 'ప్రజాస్వామ్యం' ఉంది అని నమ్మే వాళ్లు వేసుకోవాల్సిన ప్రశ్న ఏంటంటే, ప్రజాస్వామ్యం అనేది (రాజ్యాంగం, చట్టాల రూపంలో) కాగితంపై రాసి ఉంటుందా లేదా ఆచరణలో ఉంటుందా? కేవలం కాగితంపై రాసి ఉన్నప్పటికీ దాన్ని ప్రజాస్వామ్యం అనవచ్చు అని ఎవరైనా భావిస్తే అలాంటి ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి స్వభావరీత్యా ఏ తేడా లేనట్టే. అలా కాకుండా, కనీసం కాగితంపై రాసి ఉన్నదైనా ఆచరణలో అమలు జరిగితేనే దాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటారు అని ఎవరైనా భావిస్తే వారు ఈ పుస్తకం తప్పక చదవాలి. ఎందుకంటే భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఆచరణలోకి వచ్చేసరికి తన నిజ స్వరూపాన్ని, విశ్వరూపాన్ని ఎలా చూపిస్తున్నదో తెలుస్తుంది.

భారతదేశంలోని ఎస్.సి., ఎస్.టి. కులాలకు చెందని ప్రజలకు ఎస్.సి., ఎస్.టి. ప్రజల పరిస్థితి పట్ల ఎన్నో అపోహలున్నాయి. ఉదాహరణకు, ఎస్.సి., ఎస్.టి.లకు రిజర్వేషన్లు ఎన్నో ఉన్నాయని, వాటి వలన వారికి ఎంతో లాభం జరుగుతున్నదని ఒక అపోహ. రిజర్వేషన్‌లు వలన లాభపడిన వారు మొత్తం ఎస్.సి., ఎస్.టి. జనాభాలో 0.1 శాతం కూడా ఉండరు. విద్యారంగంలో రిజర్వేషన్‌లను పరిశీలించినా, ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు, పీజీ, ఆపై చదువులు రిజర్వేషన్‌ల ద్వారా చదువుకుంటున్న ఎస్.సి., ఎస్.టి.లు వారి మొత్తం జనాభాలో ఒక్క శాతం కన్నా మించి ఉండరు. అలాగే, ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలున్నాయని, వారి అడవిపై వారికే హక్కు ఉన్నదని అపోహలున్నాయి. వాస్తవం మాత్రం భిన్నంగా ఉంది. దేశవ్యాప్తంగా రకరకాల 'అభివృద్ధి' ప్రాజెక్టుల పేరు మీద, మైనింగ్ పేరు మీద ఆదివాసీలను నిర్వాసితులను చేస్తూ, పరిహారం కూడా చెల్లించడం లేదు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు, మానభంగాలు, అత్యాచారాలు, మారణకాండలు జరుగుతుండడం ప్రతి రోజూ వింటున్నాం. ఈశాన్య, మధ్య భారత రాష్ట్రాల్లో ఆదివాసులపై పాలక వర్గాలు ఏకంగా మిలిటరీ, పారా మిలిటరీని దింపి యుద్ధమే చేస్తున్న వాస్తవం కూడా కనబడుతుంది (చూడాలనుకున్న వారికి).

తమపై అత్యాచారం జరిగిందని (తీవ్రమైన గాయాలతో కాని, సామూహిక మానభంగం చేయబడి తీవ్ర మానసిక, శారీరక గాయాలతో కాని) పోలీస్ స్టేషన్‌కు వెళితే, కనీసం కేస్ కూడా బుక్ చేసుకోవడం లేదంటే, చివరికి శవాన్ని తీసుకొని పోలీసు స్టేషన్‌కు పోయినా కూడా కేస్ బుక్ చేసుకోవడం లేదంటే మొట్టమొదటి అడుగు నుండే ఎంత దారుణంగా ఈ చట్టాన్ని బలహీనపరుస్తున్నారో అర్థం అవుతుంది. కేస్ బుక్ చేయండి అని ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి. దాంతో వారిపై లాఠీచార్జీలు, భాష్పవాయు ప్రయోగాలు, వారిపై కేసులు పెట్టున్న పరిస్థితి. ఈ లోపు ముద్దాయి తన రాజకీయ, ఆర్థిక, కుల పలుకుబడితో బాధితునిపైనే కేసు పెట్టి బాధితున్ని భయపెట్టడం, అరెస్ట్ చేయించడం జరుగుతోంది. వంద సంఘటనలలో అయిదో, ఆరో కేసు బుక్ అయ్యే స్థాయికి వెళ్లినా, దర్యాప్తు స్థాయిలోనే ఆ కేసును నీరు గార్చేయడం, తద్వారా కోర్టులో ఆ కేసులు వీగిపోయేట్టు చేయడం. చివరికి బాధితుల పక్షాన నిలబడాల్సిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కూడా కేసును బలహీనం చేయడానికి ఎన్నెన్నో కుయుక్తులు వాడుతారు. ఒకవేళ అన్నీ సక్రమంగానే ఉన్నాయనుకున్నా జడ్జీలు ఆ సాక్ష్యాలను, ఆధారాలను కాలదన్ని ముద్దాయిని నిర్దోషిగా ప్రకటించి ఎలా వదిలేస్తారు, పై కోర్టులకు అప్పీలుకు వెళుతున్న కొద్దీ పరిస్థితి ఇంకా ఇంకా ఎంత క్లిష్టంగా మారుతుంది అని రచయిత ఉదాహరణలతో వివరించారు. పుస్తక ప్రారంభంలోనే ఈ చట్టంలోని ముఖ్యాంశాలు వివరిస్తూ ఉన్న అధ్యాయాలు చదివినపుడు, ఎస్.సి., ఎస్.టి. ప్రజలు 'ప్రజాస్వామ్య' స్వర్గంలో ఉన్నారని అనిపిస్తుంది. తర్వాత అధ్యాయాలలో ఈ చట్టం అమలు ఎలా జరుగుతున్నదనే వాస్తవాలు వివరిస్తున్నప్పుడు, కేస్ బుక్ చేయడం అనే మొదటి అడుగు నుండి, (తగిన) శిక్ష పడడం, తగిన నష్టపరిహారం లభించడం అనే చివరి అడుగు వరకు ఎస్.సి., ఎస్.టి. ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తుంటే, నిజంగా వారు 'ప్రజాస్వామ్య' నరకంలో బతుకుతున్నారని అర్థం అవుతుంది. ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్‌లు వాడుకొని ఉద్యోగాలు పొందిన పోలీసు అధికారులు కూడా ఇతర కులాల అధికారుల వలే ప్రవర్తిస్తున్నారనే మరో వాస్తవం కూడా రచయిత వివరిస్తారు. దేశవ్యాప్తంగా ఎస్.సి., ఎస్.టి.లపై ఏదో ఒక రూపంలో వివక్ష, అవమానాలు, అత్యాచారాలు, మారణకాండలు జరుగని రోజు కాదు, కనీసం నిమిషం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. రచయిత తన పుస్తకంలో చెప్పినట్టు ఎస్.సి., ఎస్.టి.లపై అత్యాచార నిరోధక చట్టంను ఎలా వాడుకోవాలని వివరించే ఈ పుస్తకాన్ని ఆయుధంగా వాడుకొని న్యాయం కొరకు పోరాడాలని చెప్పారు. ఇదే పుస్తకంలో రచయిత వివరిస్తూ బుక్ అయిన కేసుల్లో కూడా వందకు కేవలం రెండు కేసుల్లోనే శిక్ష పడుతోందని చెప్పారు. ఆ శిక్షలు కూడా ఆ నేర తీవ్రతకు తగిన శిక్షలు కావు అనేది కూడా వాస్తవం.

'ప్రజాస్వామ్యం' ఉందనుకున్నంత వరకు ఈ పుస్తకాన్ని ఆయుధంగా వాడుకోవచ్చు. ఎస్.సి., ఎస్.టి.లపై అమలవుతున్న వివక్ష, అన్యాయం, అత్యాచారాలు, మారణకాండ వ్యవస్థీకృతమయి ఉన్నాయి. సరిగ్గా ఆ వ్యవస్థే భారత అశేష ప్రజానీకంపై దోపిడీ, మారణకాండలను అమలు చేస్తున్నది. ఎస్.సి., ఎస్.టి.ల విముక్తి గురించి ఆలోచించడమంటే మనందరి విముక్తి గురించి ఆలోచించడమే. కాబట్టి కుల, మతాల కతీతంగా ప్రతి ఒక్కరూ చదవాల్సిన, చదివించాల్సిన పుస్తకం ఇది.

(సమీక్షకులు అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

కొడవటిగంటి రోహిణీప్రసాద్

అణుభౌతికశాస్త్రవేత్త, పాపులర్ సైన్స్ రచయిత, సంగీతకారుడు, వక్త కొడవటిగంటి రోహిణీప్రసాద్ (1949–2012) సెప్టెంబర్ 8న ముంబాయి జస్లోక్ ఆస్పత్రిలో మరణించారు. గత ఐదు సంవత్సరాలలో ఏడు పాపులర్ సైన్స్ పుస్తకాలు ప్రచురించి, దాదాపు పది పత్రికలలో శాస్త్రవిజ్ఞాన విషయాలను సుబోధకంగా విరివిగా రాస్తున్న రచయితగా, ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రవిజ్ఞాన విషయాలపై ప్రసంగాలు చేస్తున్న వక్తగా రోహిణీప్రసాద్ తెలుగు సమాజంలో సుప్రసిద్ధులయారు.

సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు – వరూధిని దంపతుల కొడుకుగా రోహిణీప్రసాద్ డిగ్రీవరకు మద్రాసులో చదువుకున్నారు. చిన్ననాటి నుంచీ శాస్త్రీయ సంగీతం మీద చాల ఆసక్తి కనబరచి సితార్ వాదన అభ్యసించారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అణు భౌతిక శాస్త్రంలో ఎంఎస్సీ చేసి, ట్రాంబే లోని భాభా అణు పరిశోధనా కేంద్రం (బార్క్) లో శాస్త్రవేత్తగా చేరారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి అణుధార్మికత అన్వేషణ సాధనాల గురించి పరిశోధనా పత్రానికి పిఎచ్‌డి పొందారు. మూడు దశాబ్దాలుగా బొంబాయిలోనే ఉద్యోగం చేసిన రోహిణీప్రసాద్, ఉద్యోగ విరమణ తర్వాత అమెరికాలో అట్లాంటాలో కొంతకాలం కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఇటీవల ఇసిఐఎల్‌లో కన్సల్టెంట్‌గా పనిచేయడానికి హైదరాబాదు వచ్చారు.



కొడవటిగంటి రోహిణీప్రసాద్
(1949–2012)

బొంబాయి రోజుల నుంచే రోహిణీప్రసాద్ లో సంగీత, సాహిత్య అభిరుచులు ఎంతగానో విస్తరించాయి. సితార్ వాదనకు మెరుగులు దిద్దుకోవడం మాత్రమే కాక, బొంబాయిలోనూ, దేశంలో అనేక చోట్ల, అమెరికాలోనూ సితార్ కచేరీలు ఇచ్చారు. ఎన్నో టెలివిజన్ కార్యక్రమాలకు సంగీతం సమకూర్చారు. పాపులర్ సైన్స్ రచనలు చేయడం ప్రారంభించారు. బొంబాయిలోని కాలనిర్ణయ్ పంచాంగం/ క్యాలెండర్ లో తెలుగు సాహిత్యాన్ని చేర్చడంలో సహాయం చేశారు.

పదవీవిరమణ అనంతరం ఆయన సాహిత్య సృష్టి మరింతగా విస్తరించింది. ఆయన పాపులర్ సైన్స్ వ్యాసాల తొలి సంపుటం 'జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం' జనసాహితి ప్రచురణగా 2007లో వెలువడింది. అప్పటి నుంచీ ఆయన తెలుగులో ప్రధాన స్రవంతి పత్రికలలోనూ, ప్రత్యామ్నాయ పత్రికలలోనూ పాపులర్ సైన్స్ వ్యాసాలు రాస్తూ వచ్చారు. అలా ఆయన ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ప్రజాసాహితి, అరుణతార, వీక్షణం వంటి అచ్చు పత్రికలలోనూ, ప్రజాకళ, ప్రాణహిత, వంటి అనేక వెబ్‌సైట్లలోనూ గత ఐదు సంవత్సరాలలో దాదాపు ఐదు వందల వ్యాసాలు రాసి ఉంటారు. ఆ వ్యాసాలలోంచి స్వేచ్ఛాసాహితి, వీక్షణం ప్రచురణలుగా 'విశ్వాంతరాళం', 'మానవ పరిణామం', 'జీవకణాలూ నాడీకణాలూ', 'ప్రకృతి – పర్యావరణం' వెలువడ్డాయి. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణలుగా 'అణువుల శక్తి', 'జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం' 'మనుషులు చేసిన దేవుళ్లు' వెలువడ్డాయి. సమాజంలో శాస్త్రీయ దృష్టిని పెంపొందించడానికి విద్యార్థుల స్థాయి నుంచే పాపులర్ సైన్స్ ఉపన్యాసాలు ఏర్పాటు చేయాలనీ, తాను ఎక్కడికైనా వచ్చి ఉపన్యాసం ఇస్తాననీ చెపుతూ ఆయన ఆరోగ్యం సహకరించకపోయినా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వంద చోట్ల ఉపన్యసించారు. మధుమేహ వ్యాధితో చాలకాలంగా బాధపడుతున్న రోహిణీప్రసాద్ మూత్రపిండాల ఇన్ఫెక్షన్‌తో అకాల మృత్యువుకు బలి అయ్యారు.

నవంబర్ 2007 నుంచి సెప్టెంబర్ 2012 సంచిక వరకు క్రమం తప్పకుండా శాస్త్రీయ దృష్టితో యాభై మూడు వ్యాసాలు అందించారు. వ్యాసాలు అడగడంలో మేము వెనుకబడ్డామేమో గానీ, అందించడంలో ఎప్పుడూ వెనుకబడలేదు. యూనికోడ్ నుంచి తెలుగు అను ఫాంట్‌లోకి మార్చే సాంకేతికతను అభివృద్ధి చేయడంలోనూ, అందుబాటులోకి తేవడంలోనూ సురేశ్ కొలిచాల గారితో ఆలోచనలు పంచుకుంటు ఆ పనిని ముందుకు తీసుకెళ్లడంలో రోహిణీప్రసాద్ కృషి చేశారు.

వీక్షణం కార్యాలయానికి మూడు సార్లు వచ్చి వీక్షణం టీంతో వీక్షణం అభివృద్ధి కోసం అనేక ఆలోచనలు పంచుకున్నారు. వీక్షణంను ఆర్థికంగా బలోపేతం చేయడానికి తనవంతు సూచనలు, సలహాలు ఇచ్చారు. మానవ పరిణామంపై, విశ్వ రహస్యాలపై వీక్షణం కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లాస్‌లో ప్రసంగించారు. ఇవే కాకుండా ఫోన్ సంభాషణల ద్వారా, మెయిల్స్ ద్వారా తన ఆలోచనలను చివరి నిమిషం వరకు వీక్షణంతో పంచుకుంటూనే ఉన్నారు.

ఇంకా ఎన్నో రచనలు చేయాలనీ, ఎంతో మాట్లాడాలనీ, ఎన్నో పనులు చేయాలనీ నిరంతరం తపనపడిన రోహిణీప్రసాద్ అకాల మరణం తెలుగు ప్రగతిశీల ప్రపంచానికీ, సాహిత్య, సంగీత. శాస్త్రవిజ్ఞాన రంగాలకూ తీరనిలోటు. వీ

వీక్షణంలో అచ్చయిన కొడవటిగంటి రోహిణీప్రసాద్ వ్యాసాలు

2007 : *1. రెండుకాళ్ల మీద మానవ ప్రస్థానం; 2. విశ్వంలో మనిషి స్థానం;*

2008 : 3. మనుషులూ, మాటలూ; 4. మౌఖిక సాహిత్యం, లిపుల ఆవిర్భావం; 5. అక్షరాస్యత; 6. రాసినది చదవడం; 7. జీవపదార్థం ఎలా ఏర్పడింది?; 8. ప్రాచీన లిపుల సమస్యలు; 9. సింధు నాగరికత విశేషాలు; *10. ప్రాచీన సింధు ప్రజలు నిరక్షరాస్యులా?;*

2009 : *11. ఆర్య – ద్రావిడ సమ్మేళనం; 12. అశ్వ సంప్రదాయం – సంకర్షణలు, సంఘర్షణలు; 13. చరిత్ర కూడా విజ్ఞాన శాస్త్రమా?; 14. హిమయుగాలు, చరిత్ర; 15. చిన్నా, పెద్ద హిమయుగాలు; 16. అమెరికా వలసలకు తొలి ప్రయత్నాలు; 17. పర్యావరణం, జాతుల వైవిధ్యం; 18. మనుషుల్లో జాతులు; 19. సంచార జీవితం, జన్యువుల మార్పులు; 20. ఆలోచనలు, అవగాహన;* 21. జీవపరిణామం లక్షణాలు

2010 : *22. మనుషుల ఆవిర్భావం; 23. తొలి మానవుల మనోవికాసం; 24. అతీంద్రియ శక్తులూ, ఆటవిక మనస్తత్వం; 25. మతవిశ్వాసాల పునాదులు; 26. ప్రాచీన యుగాల్లో శ్రమ విభజన; 27. తొట్టతొలి దేవాలయాలు; 28. ఆదిమ సమాజాల్లో వర్గ విభజన; 29. ఆదిమ మతాల లక్షణాలు; 30. సుమేరియన్ మత వ్యవస్థ; 31. ప్రాచీన మతాల పెత్తనం; 32. ప్రాచీన మతాలకు మద్దతు; 33. మానవ సమాజాల అధ్యయనం*

2011 : *34. సృష్టి ప్రతిపాదనలు; 35. అపోహలూ, గుడ్డి నమ్మకాలూ; 36. మంత్రాలూ, చింతకాయలూ; 37. మతాల హిప్నొసిస్; 38. 'అతీంద్రియ' పరిశోధనల చరిత్ర; 39. అణుశక్తి అంటే ఏమిటి?; 40. యూరేనియం స్వరూప స్వభావాలు; 41. గొలుసుకట్టుగా అణువిచ్ఛిత్తి; 42. అణు బాంబుల ప్రయోగాలు; 43. హైడ్రోజన్ బాంబు భౌతిక సూత్రాలు; 44. అణు ఇంధన పదార్థాలు*

2012 : *45. అణు రియాక్టర్ల ఉపయోగం; 46. అణు విద్యుత్తు; 47. రియాక్టర్లలో రకాలు; 48. చెర్నోబిల్ అణు విద్యుత్కేంద్రం; 49. చెర్నోబిల్ దుర్ఘటన; 50. నిత్య జీవితపు వికిరణం; 51. అణు వ్యవస్థల భద్రత; 52. అణువులనేవి ఉన్నాయా?; 53. అణు రియాక్టర్ల గురించిన సందేహాలు*

భారత్ - పాకిస్తాన్ వాణిజ్యం - రాజకీయాలు

'అంతర్దేశీయం' శీర్షికలో 'వీక్షణం' ఆగస్ట్, సెప్టెంబర్ సంచికల్లో లోకసంచారి రాసిన వ్యాసాల్లోని కొన్ని అంశాలపై వ్యాఖ్య ఇది. పాశ్చాత్యదేశాలు, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలపై సాగిస్తున్న బహుముఖ, బహురూప దాడులను బట్టబయలు చేస్తూ, అనేక మంచి విషయాలు రాశారు. వారి విస్తృత ఎజెండాలో భాగంగానే సిరియా పరిణామాలు సాగుతున్నాయని చక్కగా వివరించారు. యుద్ధం, జోక్యందారీ విధానాలతోపాటు మత్తుమందులు, సాంస్కృతిక దాడుల ద్వారా (టీవీ, సీరియల్స్, ఆటలు, పబ్బులు, మతం మొదలైన) మనల్ని దెబ్బతీయడానికి ఎలాంటి కుట్రలు సాగుతున్నాయో చెప్పారు. అందులోభాగంగా, భారతపాలకవర్గాలు సైన్యాన్ని మన ప్రజలపైనే ప్రయోగించి 'గ్రీన్‌హంట్', దానికి తోడుగా ప్రజాస్వామ్యంపేరిట బ్రెయిన్‌హంట్ – ఈ రెండింటినీ ఎలా జోడించి సాగిస్తున్నారో చిత్రించారు. ఇదంతా బాగుంది. కానీ, కొన్ని తప్పుడు అభిప్రాయాలను కూడ బలంగా వెదజల్లారు. భారత ప్రజలకు నష్టకరమేకాక, ప్రమాదకరమైన అంశాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది పాకిస్తాన్ వ్యతిరేకత. రచయిత ఏ ఉద్దేశంతో రాశారోగానీ, ఇరుగుపొరుగు దేశాలను ప్రాంతీయ యుద్ధాల్లో ముంచెత్తే సామ్రాజ్యవాద వ్యూహానికి దోహదంచేసే విషయం ఇది. రెండు సంచికల్లోనూ ఈఅంశం బలంగా ఉంది. దీన్ని రచయిత, పాఠకులూ జాగ్రత్తగా గమనించి పునర్విమర్శ చేసుకోవాలి. వాస్తవాల ఆధారంగా, సంయమనంతో, బేలన్స్‌డుగా సమీక్షించుకోవాలి. దాని కోసమే ఈ విమర్శ.

భారత్‌కి 'అత్యంత ప్రమాదం పాకిస్తాన్. ఇది భారత పాలకవర్గాలు మన మెదళ్లలో ఎక్కించిన పాత సాఫ్ట్‌వేర్... పాకిస్తానీయులను ప్రేమించండి, భారతీయులను ద్వేషించండి... (ఇది) సరికొత్త సాఫ్ట్‌వేర్'. భారత పాలకవర్గాలకు 'పాకిస్తాన్, చైనాలు ఎప్పుడూ శత్రువు కాదు. వీరికి ప్రథమ శత్రువు' భారత ప్రజలు అని ఆగస్ట్ సంచికలో రాశారు. పాకిస్తాన్‌కు 'ఎంఎఫ్ఎన్ (అంటే అత్యంత ఆప్తులైన దేశం) ప్రతిపత్తిని.... దొడ్డిదారిన' ఇచ్చారని, దీన్ని ఏ పార్టీ, ఏ మీడియా, చివరికి సంఘ్ పరివార్ కూడా ప్రశ్నించలేదనీ, ఇదంతా 'పాలకవర్గాల విస్తృత ఎజెండాలో భాగమే'నని సెప్టెంబర్ సంచికలో రాశారు. 'ప్రజాపక్షం వహించే శక్తులు ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పాలక వర్గాల, వారి సేవకుల నిజస్వరూపాన్ని బయటపెట్టాలి' అని పిలుపు నిచ్చారు. అనేక విషయాలున్నా, కొన్నింటి గురించే పరిమితమై చూద్దాం:

1) ఎంఎఫ్ఎన్ అంటే 'అత్యంత ఆప్తులైన దేశం' ప్రతిపత్తి అనేది సుమారు సరైన అనువాదమే. కాని దాని అర్థం అచ్చంగా అదే కాదు. అంతర్జాతీయ వాణిజ్య పరిభాషలో దాని తాత్పర్యం – వివక్ష లేని, పరస్పర సాధారణ వాణిజ్య సంబంధాలు మాత్రమే. ఇది రెండు దేశాల మధ్య (ద్వైపాక్షికంగా) – మొదట్లో 'గ్యాట్' ఆధారంగా ఉండేవి. భారత్–పాక్‌ల మధ్య 1948 నుంచి 1965 (భారత–పాక్ యుద్ధం) దాకా ఉన్నవి. తర్వాతి దశలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో చేరిన దేశాలన్నీ బహుళ పక్షంగా (మల్టీలేటరల్‌గా) ఈ సంబంధాలను కలిగి ఉండాలని సాధారణ నియమం. అయితే ఏవైనా కారణాల వలన కొన్ని మినహాయింపులు, షరతులు ఉండవచ్చును. భారత్ 1995లోనే ఈ ప్రాతిపదికపై పాక్‌తో ఎం ఎఫ్ ఎన్ స్థాయి సంబంధాలు పెట్టుకుంటున్నట్లు ప్రకటించింది. అయితే అనేక షరతులతో, వందలాది వస్తువుల ఎగుమతి దిగుమతులపై ఆంక్షలు పెట్టే 'నెగిటివ్' లిస్టులతో, ఈ సంబంధాలు ఆచరణలో కుంటుపడి ఉన్నాయి. కాశ్మీర్ వివాదం నుంచి కార్గిల్ యుద్ధందాకా అనేక కారణాలు చూపెట్టి పాకిస్తాన్ కూడా దీనికి ప్రతిస్పందించకుండా వాయిదా వేస్తూ వచ్చింది. చివరికి ఆ ప్రతిపత్తితో ఇండియాతో వాణిజ్యం నెరపుతామని పాకిస్తాన్ మంత్రివర్గం 2011 నవంబర్ 1 నాడే నిర్ణయించింది. భారతపాక్‌ల మధ్య మామూలు స్థాయి సంబంధాల ఏర్పాటు (నార్మలైజేషన్) కోసం ప్రయత్నాల్లో భాగంగా భారత్ కూడా ఇటీవలే కొన్ని చర్యలు ప్రకటించింది.

ఇలా చివరికి ఇరుదేశాలు ఎంఎఫ్ఎన్ ప్రతిపత్తిని అమలు చేయడానికి నిర్ణయించాయి. ఇందులో భాగంగా 2012 ఆగస్ట్ 1 నాడు భారత్ తీసుకొన్న చర్యలనే లోకసంచారి సెప్టెంబర్ సంచికలో ప్రస్తావించారు. వాటికి ప్రతిస్పందనగా తాజాగా సెప్టెంబర్ 21 నాడు పాకిస్తాన్ కూడా ప్రకటించింది. భారత్ 'అత్యంత ఆప్తులైన దేశం' ఎలా అవుతుంది? అని పాకిస్తాన్‌లో కొన్ని వర్గాలు అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దానికి జవాబుగా అలాటి సంబంధాలను ఇప్పటికే 100కి పైగా దేశాలతో కలిగి ఉన్నామని, పేరు అలా ఉన్నా ఇవి మామూలు సంబంధాలు మాత్రమేనని పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. భారత్‌కు అంతకన్నా ఎక్కువ దేశాలతో ఆస్థాయి సంబంధాలున్నాయి. అమెరికా, చైనా వంటి దేశాలకి 150 దేశాలతో ఉన్నాయి. ఎంఎఫ్ఎన్ అంటే పేరు గొప్పే తప్ప, నిజానికి సాధారణ సంబంధాలేననడానికి ఈ సమాచారం సరిపోతుంది.

2) భారత్‌కి అమెరికా, యూరపు, ఆస్ట్రేలియా, జపాన్ ప్రాంతాల్లోని అన్ని పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలతోనూ మొదటినుంచీ ఈ హోదా సంబంధాలున్నాయి. రష్యా, చైనా, వియత్నాంలతోనూ ఉన్నాయి. దురాక్రమణ యుద్ధాలు చేస్తున్న, వాటికి సహకరిస్తున్న, విశ్వవ్యాప్త దోపిడీకి మూలాలైన, టెర్రరిజంని ప్రోత్సహిస్తున్న అమెరికా వంటి సామ్రాజ్యవాదులతో ఇలాటి సంబంధాలున్నప్పుడు, పొరుగున ఉన్న పాకిస్తాన్‌తో పెట్టుకుంటే తప్పేమిటి? వచ్చేనష్టమేమిటి? ఈ సంబంధాలను ఎవరైనా ఎందుకు తప్పుపట్టాలి, లేదా విమర్శించాలి? లోకసంచారి ఈ విషయంపై రెండు సంచికలలోనూ చేసిన వ్యాఖ్యలు నెగెటివ్‌గా ఉన్నాయి.

3) పొరుగుదేశాలైన భారత్–పాక్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు ఎంత పెరిగితే అంతమంచిది. నేడు ప్రాబల్యం వహిస్తున్న సామ్రాజ్యవాదులతో వాణిజ్య సంబంధాలకన్నా పదింతలు మేలు. దేశ విభజన, దానితో పాటు కాశ్మీర్ సమస్య మూలంగా 65 ఏళ్లుగా – ఇరుదేశాల మధ్య శతృభావం, నాలుగు యుద్ధాలు (1948, 1965, 1971 బంగ్లా, కార్గిల్), నిరంతర విద్వేష ప్రచారం–యుద్ధోన్మాద ప్రచారం నెలకొని ఉన్నాయి. స్వయంగా ఇవి ఇరుదేశాల ప్రజలకూ నష్టదాయకం. దానికి తోడు 'రెండు పిల్లులు–కోతి' కథలో వలె సామ్రాజ్యవాదులు, అగ్రరాజ్యాలు (ముఖ్యంగా వేర్వేరు దశల్లో ఇంగ్లండు, అమెరికా, రష్యా) ఈ స్థితిని తమ తమ ప్రపంచ వ్యూహాల కోసం దశాబ్దాలుగా వాడుకొంటున్నాయి. ఇరుదేశాల ద్వారా లక్షల కోట్ల రూపాయిల ఆయుధాల వ్యాపారం చేసుకుంటున్నాయి. ఈ విధానాల మూలంగా ఇరుదేశాలూ భారీస్థాయిలో మిలటరీ యంత్రాంగాన్ని నిర్మించుకున్నాయి. వాటిపై ఆధారపడి బలిసిన దళారీపాలకులు, ఆయుధ దళారులు తయారైనారు. ఈ యంత్రాంగమే ఇరు దేశాల ప్రజలనూ అణచడానికి ప్రయోగించబడుతున్నది. 'దేశభక్తి' పేరిట విషప్రాయమైన

విద్వేషసంబంధాలు ప్రోత్సహించబడుతున్నాయి. ఇవి ప్రజల దృష్టిని మౌలిక సమస్యల నుంచి, ఆంతరిక వర్గపోరాటాల నుంచి మళ్లించి, పక్కదారి పట్టిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొనే, పెంపొందే వాణిజ్య సంబంధాలు అనివార్యంగా యుద్ధోన్మాదాన్ని, పరస్పర విద్వేషాన్ని తగ్గిస్తాయి. అవి తగ్గి, ఆ మేరకు ప్రజల సమస్యలు ముందుకి వస్తాయి. అమెరికాతో వాణిజ్యం రష్యాపట్ల అక్కడ ఉన్న వైషమ్యాన్ని తగ్గించడానికి ఉపయోగ పడ్తుందని, వాణిజ్యంతోపాటు దానికున్న వ్యూహ ప్రభావం గురించి లెనిన్ వివరించాడు (1920లో). భారత–పాక్‌లు నిజానికంత బద్ధ శత్రువులూ కాదు.

4) ఇరుగు పొరుగు దేశాల మధ్య, అభివృద్ధి చెందుతున్న మూడో ప్రపంచదేశాల మధ్య వాణిజ్యసంబంధాలు ఎంత పెరిగితే అంత మంచిది. ప్రత్యేకించి, సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ సాగుతున్న నేటియుగంలో ఇది అవసరంకూడా. సామ్రాజ్యవాద, అగ్రరాజ్య ఆధిపత్యానికీ, దోపిడీకీ పరిమితులు విధించే పరిణామం ఇది. సామ్రాజ్యవాదుల అపారదోపిడీని తగ్గించడంతో పాటు, పొరుగు దేశాల మధ్య వ్యాపారం తక్కువ రవాణా, తదితర ఖర్చులతో సాగే అవకాశం ఉంది. ఇరువైపులా ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు లాభదాయకంగా ఉండే వీలుంది. ఇండియా చట్టం ప్రకారం 'పాకిస్తాన్ కంపెనీలే కాదు, చివరకు పౌరులు కూడా భారతదేశంలో వ్యాపారం చేసుకోవచ్చు.... పెట్టుబడులు పెట్టుకోవచ్చు' అని రాశారు. (సెప్టెంబర్ సంచిక, పేజీ 35). అయినా ఈ చట్టాన్ని వ్యతిరేకించలేదని పార్టీలను, మీడియాను రచయిత విమర్శించారు. ప్రజల మధ్య సంబంధాలు–వాణిజ్యం కూడా – మంచి పరిణామమే. దీన్ని వ్యతిరేకిస్తే తప్పు. ప్రజల మధ్య సంబంధాల మెరుగుదల ద్వారా శాంతి వాతావరణం పెంపొందుతుంది. ఇది యుద్ధ బేహారుల క్రీడలను తగ్గిస్తుంది. భారత పాక్‌ల మధ్య రావణకాష్టంలా ఉన్న వైషమ్యాలు తగ్గితే, అదనంగా దానికున్న మతోన్మాద కోణం వల్ల ఇరుదేశాల్లోని ప్రజల మధ్య ఆంతరంగిక వైరుధ్యాలు, విద్వేషాలు తగ్గి మతోన్మాద శక్తుల, యుద్ధోన్మాదుల పలుకుబడి తగ్గుతుంది. ఏ చర్యలైనా పాలకవర్గాలు తమ లాభం కోసమే తీసుకొంటాయి. ఇదీ అంతే. కానీ దీనిలో ప్రజలకు మేలు చేసే అంశం ఉన్నది. ఇది ఆహ్వానించవలసిన పరిణామమే కానీ, వ్యతిరేకించాల్సినది కాదు.

5) 'భారతదేశానికి అత్యంత ప్రమాదం పాకిస్తాన్' – అన్నది ప్రజల 'మెదళ్లలోకి ఎక్కించిన పాత సాఫ్ట్‌వేర్'. దాని స్థానంలో 'పాకిస్తానీయులను ప్రేమించండి. భారతీయులను ద్వేషించండి.... (అన్నది) సరికొత్త సాఫ్ట్‌వేర్' అని రాశారు (ఆగస్ట్ సంచిక). పాత సాఫ్ట్‌వేర్ గురించి రచయిత ఏం చెప్పారు? సామ్రాజ్యవాదం కన్నా, అగ్రరాజ్యాల కన్నా పాకిస్తానే ప్రమాదమా? దీని గురించి రచయిత తన వైఖరిని స్పష్టం చేయలేదు.

పాలకవర్గాలు తమ వాణిజ్యంకోసం ఎం ఎఫ్ ఎన్ హోదా ఇచ్చారు. రెండు దేశాల పాలకవర్గాల మధ్య, రాజ్యాల మధ్య మామూలు దౌత్య, వాణిజ్య సంబంధాల మెరుగుదలకు ప్రకటనలు చేస్తున్నారు. అయితే ప్రజలమధ్య స్నేహభావం పెంపొందడం వారిలోని ప్రాబల్య వర్గాలకు ఇష్టంలేదు. నిజానికి 'పాకిస్తానీయులను ప్రేమించండి' అన్న సాఫ్ట్‌వేర్ ఏమీ వారు విడుదల చేయలేదు. ఇలాటి స్థితిలో దీనికి 'భారతీయులను ద్వేషించండి' అన్నారని కూడా రచయిత చేర్చారు. ఇది వాస్తవాలతో పొసగనిది. అంతేకాదు, దేశంలోని మతోన్మాద, యుద్ధోన్మాద శక్తుల అభిప్రాయాలకు ఊతం ఇచ్చే వాదన. ఇలాటి వాదనలను వ్యాప్తిచేయడం తప్పు. హిందూ మతోన్మాదులు కూడా ఇలాటి ప్రచారం చేస్తున్నారు. అది నిర్హేతుకం. అయినా వారు చెపితే, అది వారికి సహజమేలే అని ఇతరులందరూ దాన్ని అంతగా తలకు ఎక్కించుకోరు. కానీ అభ్యుదయ వాదులు, ప్రగతిపర వేదికల ద్వారా ఇలా చెపితే చాలా ప్రమాదం. రచయిత దానికే దోహదం చేశారు–ఆయనకా ఉద్దేశం ఉన్నా, లేకున్నా.

6) 'ఇప్పుడు దేశభక్తి అంటే శత్రుదేశాలను అసహ్యించుకోవడం కాదు. మన దేశ ప్రజలను మనమే అసహ్యించుకొని, వారిని చంపమని పాలకవర్గాలకు వత్తాసుగా నిలవడం' అంటూ పై ధోరణినే కొనసాగించారు. భారత 'పాలకవర్గాలకు పాకిస్తాన్‌లు, చైనాలు ఎప్పుడూ శత్రువులు కాదు. వారికి ప్రథమ శత్రువు భారతదేశంలోని 99.5 శాతం ప్రజల'ని రాశారు. రచయిత వేరే వ్యాఖ్య చేయకుండా ఇలా రాయడం ద్వారా పాఠకులకు ఏమి సూచిస్తున్నారు? మన పాలకవర్గాలు సామ్రాజ్యవాదాన్ని కాక, పాకిస్తాన్, చైనాలను శత్రువులుగా గత 50–60 ఏళ్లుగా చిత్రిస్తున్నాయి. దీనినే దేశభక్తిగా చెలామణీ చేస్తూవచ్చారు. ప్రభుత్వ అధికారిక పత్రాల్లోనూ, ప్రచారంలోనూ ఇది స్పష్టంగా కనబడుతుంది. ఎన్‌డిఎ హయాంలో బాహాటంగా – అందులోనూ అణ్వస్త్ర పరీక్ష సందర్భంగా – చైనా ప్రమాదం గురించి చెప్పి, చిక్కుల్లో పడ్డారు. యుపిఎ మాటలెలాఉన్నా, ఆచరణ అదే. ఆ సరిహద్దుల్లో భారీ మిలటరీ మోహరింపు – పదులవేల కోట్ల ఖర్చుతో – కొనసాగుతున్నది. ఇది ప్రజలకు భారం, దేశానికి ప్రమాదం కూడా. ఈ విషయాల్ని ఎత్తిచూపకుండా, ఖండించకుండా, ఈ భావనకు ప్రజలే ప్రథమ శత్రువు అన్నదాన్ని జోడించడం ద్వారా ఎలాటి అభిప్రాయాన్ని కలిగిస్తున్నారు? అభ్యుదయ, వామపక్ష భావాలున్నవారిలో సైతం తరచూ 'దేశభక్తి' గురించి లోపభూయిష్టమైన అభిప్రాయాలున్నాయి. ఈ శిబిరాన్ని అభిమానించే వారిలో కూడా కోట్లాది అమాయకులున్నారు. తప్పుడు భావాల్ని సరిచేయాల్సింది పోయి, ఇలా రాయడం ద్వారా ఈ శిబిరంలో కూడా జింగోయిజంని పెంచడానికి దోహదం చేసినట్టయింది. రచయిత మనసులో ఏముందో కానీ, రచన చెప్తున్నదిదే. ఇది తప్పుడు భావాల ప్రచారమా? లేక అజాగ్రత్త లక్షణమా? 'వీక్షణం' వంటి ప్రజల వేదికలో ఇలాటివి – అదీ సంపాదకుల వ్యాఖ్య/విమర్శ లేకుండా – ప్రచురించ దగునా? మాకు 'ఏకీభావం ఉండనవసరంలేదు' అనే వాదనతో ఎలాంటి తప్పుడు అభిప్రాయాన్నయినా అనుమతిస్తారా? పాఠకులందరిలో విమర్శనా దృష్టి తగినంత ఉండని స్థితిలో దీని ప్రభావం ఏమిటి? ఇలాటివి వచ్చినప్పుడు సంపాదకులు తమ వైఖరి స్పష్టంచేయాలి. లోకసంచారి వ్యాసాల్లో ఎత్తిచూపాల్సినవి ఇంకా అనేకం ఉన్నా స్థలాభావంవల్ల ప్రస్తుతానికిది చాలు.

ఎస్. కృష్ణమూర్తి, రాజమండ్రి వీ

గమనిక : పాఠకుల వీక్షణం శీర్షికకు, వ్యాసాలపై చర్చకు పాఠకుల నుంచి ఇతోధికమైన స్పందనను ఆశిస్తున్నాం. కాని, ఎక్కువ మంది పాఠకుల స్పందనకు అవకాశం కల్పించేలా, స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ స్పందనలను వీలైనంత క్లుప్తంగా రాయాలని కోరుతున్నాం. చర్చ ఏ వ్యాసంపై జరుగుతుందో దానికే పరిమితమయి ఉండడం, చద్దికన్న ఊరగాయ ఘనం కాకుండా ఉండడం అవసరం. స్థలాభావం దృష్ట్యా ఉత్తరాలు, చర్చ ఎడిట్ చేసి ప్రచురించే అధికారం సంపాదకవర్గానికి ఉంది. ఇప్పటివరకూ వాడని ఈ అధికారాన్ని ఇకముందు కూడా వాడని స్థితి కల్పించాలని కోరుతున్నాం. – సం.

లక్షింపేట - భూమి, కులం, వర్గం - పరస్పర సంబంధం

'లక్షింపేట హత్యాకాండ – భూమి – కులం' (ఆగస్ట్ సంచిక) వ్యాసంపై సెప్టెంబర్ సంచికలో రెండు వ్యాఖ్యలు వచ్చాయి. వాటిని విశ్లేషించి చూడాల్సిన అవసరం ఉంది. అందులో ఒకటి, 'ఐక్యపోరాటాన్ని రగిలించడమే నేటి లక్ష్యం' (పేజీ 57) అన్న శీర్షికతో 'లక్షింపేట నుంచి గ్రహించాల్సిన సందేశం ఇదే' అని ముగించిన వ్యాసం. 'లక్షింపేట – భూమి సమస్యే మౌలికం' అన్న వీక్షణం కవర్ పేజీ శీర్షికలోని వైఖరిని బలపరుస్తూ, అదే సమయంలో కుల సమస్య ఎలా ముడిపడి ఉన్నదో అందులో కృష్ణమూర్తిగారు వివరించారు. 'కులతగాదాల కుంపటిని రాజేయడం' వల్ల 'రావణ కాష్టమే కొనసాగుతుంది. దళితులకి నష్టమే జరుగుతుంది' అని స్పష్టం చేశారు ఆ వ్యాస రచయిత. ప్రజల మధ్య వైరుధ్యాలు పాలకవర్గాలు ప్రేరేపించే కుల తగాదాలతో పెనవేసుకు పోతున్నాయి. వర్గ చైతన్యంతో వాటిని జాగ్రత్తగా వేరుచేసి, పరిష్కరించాలి – అని సరైన విశ్లేషణ చేశారు.

మరొక వ్యాఖ్య కడియాల సుబ్బనాచారి గారి ఉత్తరంలో ఉంది. అందులో దళితులపై శతాబ్దాలుగా సాగుతున్న అణచివేతపై ఆయన వ్యక్తం చేసిన ఆందోళన ఎవ్వరూ కాదనలేనిది. అయితే దానికి పరిష్కారం ఏమిటి? పైవ్యాసంలో పేర్కొన్నట్టు – ఐక్య పోరాటాన్ని రగిలించడమే నేటి లక్ష్యం. అగ్రకులాలతో సహా అన్ని కులాలలో సగం మంది, ఇంకా ఎక్కువగా పేద, సెంటు భూమిలేని రైతులు, కౌలుదార్లు, కూలీలు ఉన్నారని చెప్పి, నూటికి పది మంది కూడా లేని భూస్వామ్యవర్గానికి వ్యతిరేకంగా వారంతా – దళితులతో సహా – ఐక్యంగా పోరాడాలని కృష్ణమూర్తి సూచించారు. ఇది వాస్తవికతకు దగ్గరగా ఉంది. వర్గ దోపిడీతో పాటు, సాంఘిక అణచివేతను ఫలప్రదంగా ఎదుర్కోగల మార్గం ఇదే. కాగా సుబ్బనాచారిగారి వాదనల్లో కొంతపాలు అవాస్తవికత కూడా ఉంది. 'గతంలో జరిగిన దాడులు కాని, ఈనాడు జరిగిన దాడులు గాని చూస్తే ఒక్క మాల, మాదిగ కులస్తుల మీదనే జరుగుతున్నాయనేది యదార్థమే కదా!' అని రాశారు. ఇది నిజం కాదు. తరతరాలుగా భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు గురైన పీడితుల్లో 'ఒక్క మాల, మాదిగ కులస్తులే' కాదు, అన్ని కులాల పేద రైతాంగమూ, కూలీలూ ఉన్నారు. ఉదాహరణకి, నల్లగొండ జిల్లాలో రెడ్లూ, చల్లపల్లిలో (కృష్ణా జిల్లా) కమ్మలూ, ఉత్తర తెలంగాణలో బీసీలూ, శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాల్లో గిరిజనులు కూడా ఇలా దెబ్బతిని, తర్వాత ఆయా రైతాంగ పోరాటాల్లో ఐక్యంగా పోరాడి ఫ్యూడల్ భూస్వాములని దెబ్బతీశారు. ఉత్తర తెలంగాణలో అణచివేతకు గురైనవారిలో తిరగబడ్డ జనంలో దళితులే కాదు, లక్షలాదిగా సబ్బండవర్ణాల పేదలూ ఉన్నారు. 'వారిమీద దాడులు జరగడం లేదు కదా' అని సుబ్బనాచారి గారు అన్నది వాస్తవంతో పొసగదు. భూస్వాములు, వారి తరపున పోలీసులూ 1970–80లలో వందలాది తెలంగాణ గ్రామాలను చుట్టుముట్టి, వేలాది మంది యువకులను ఊరి మధ్యకు లాక్కొచ్చి, నిలబెట్టి విపరీతంగా కొట్టారు. అరెస్టులు, చిత్రహింసలు చేశారు. 1940–51 తెలంగాణ రైతాంగ పోరాటంలో కూడా ఇలాగే జరిగింది. ఆనాడూ, ఈనాడూ కూడా బాధితుల్లో దళితులూ ఉన్నారు. సంఖ్యాపరంగా చూస్తే అంతకన్నా ఎక్కువ మంది ఇతర కులాల పేదలూ ఉన్నారు. (దళితులు నూటికి 15–20 మందే అని గమనించాలి.)

సుబ్బనాచారిగారే కాక ఇతరులనేకులు కూడా వ్యక్తం చేస్తున్న ఇలాంటి అభిప్రాయాలు వాస్తవికతకు పొసగవు. పరిష్కారానికి అసలే ఉపయోగపడవు. ఈ అభిప్రాయాలను శాస్త్రీయంగా, లోతుగా, వాస్తవాల ఆధారంగా విశ్లేషించుకోవాలి. మన సమాజంలో, చరిత్రలో, వర్తమానంలో కూడా వర్గ–కుల సమస్యలు ఎలా పెనవేసుకుపోయాయో అర్థం చేసుకోవాలి. పరిష్కారానికి అది ముఖ్యం. మొదటి వ్యాఖ్యలో అలాంటి సరైన దృక్కోణం ఉంది. దళితుల పట్ల ఆవేదన ఒక్కటే చాలదు. విడిగా ఏకులమైనా తక్కువ సంఖ్య (శాతం)లోనే ఉంటారు. ఎస్‌సి కులాలన్నిటినీ కలిపి చూసినా, గ్రామాల్లో నూటికి 15–20 మందిగా ఉన్న మైనారిటీయే అవుతారు. కాబట్టి దళిత పేదలు, ఇతర అన్ని కులాల పేదలు ఐక్యమై, కులాలకతీతమైన వర్గపోరాటం చేయడమే మార్గం. అలాకాక, ఇతరుల నుంచి దళితులు విడిపోతే, లేదా వారిని విడగొడితే, వారి ఓటమి తథ్యం. కులం ప్రాతిపదికన విడిగా దళితులని ఐక్యం చేయాలని చూస్తే, భూస్వాములు ఇతర అన్ని కులాల వారినీ రెచ్చగొట్టి తమ వెనుక సమీకరించుకుంటారు.

జరుగుతున్నది అదే. రాజ్యాంగమూ, ప్రభుత్వమూ, పోలీసులూ, చట్టాలూ, ఇవి ఏవీ దళితపేదలను కాపాడలేకపోయాయన్నది 1947 తర్వాతి 65 ఏళ్ల అనుభవం. కాగా సమైక్య వర్గపోరాటాలు భూస్వాముల, ఇతర పెత్తందారుల దౌర్జన్యాలను సమర్థవంతంగా ఎదుర్కోగలిగాయని కూడా ఈ కాలమంతటా రుజువైంది.

'పైకి భూమి సమస్యగానే కనపడవచ్చు. అంతర్గతంగా కులమే' అని రాశారు సుబ్బనాచారిగారు. మొదటి వ్యాఖ్యలో మత, కుల ఘర్షణల చాటున దాగి ఉన్న వర్గసంఘర్షణను వెలికితీసి చూడాల్సిన అవసరాన్ని వివరించారు. దాన్ని అర్థం చేసుకోవాలి. 'దీనికి మూలాలు ఎక్కడున్నాయంటే, హిందూ సంస్కృతిలోనే ఉన్నాయనవచ్చు' అని సుబ్బనాచారిగారు రాశారు. సామాజిక, చారిత్రక విశ్లేషణ రీత్యా చూస్తే ఇందులో నిజం ఉంది అన్పిస్తుంది. కానీ పరిష్కారం కావాలంటే ఆ హిందూ సంస్కృతిలో భాగంగానే ఉన్న అన్ని కులాల పేదలనూ ఐక్యం చేయడమొక్కటే మార్గం. దేశంలో, రాష్ట్రంలో జరిగిన పోరాటాలన్నిటా ఆ హిందూ సంస్కృతి ప్రభావంలోనే ఉన్న కోట్లాదిపేదలు పాల్గొన్నారు. మోప్లా తిరుగుబాటు వంటివి, బెంగాల్లో కొన్ని తప్ప, రైతాంగ పోరాటాల్లో అత్యధికంగా పాల్గొన్నది హిందూ సంస్కృతికి చెందినవారే. (గిరిజనుల్లో కూడా హిందూసంస్కృతికల వర్గాలు అధికసంఖ్యలో ఉన్నాయని గమనించాలి. వారి పేర్లలో అది కన్పిస్తుంది.)

ఫ్యూడల్ దోపిడీ, అణచివేతలు విశ్వవ్యాప్తమైనవి. చరిత్రనిండా ఉన్నాయి. అవి మనదేశానికీ, హిందువులకూ పరిమితమైలేవు. ఇస్లాం ప్రబలంగాఉన్న పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో, ఇండోనేషియాల్లో కూడా ఉన్నాయి. మనదేశ ప్రత్యేకతగా చెప్పబడే కులవివక్ష హిందువుల్లో మొదలైనా, ముస్లింలలోకీ, క్రైస్తవుల్లోకీ, బౌద్ధులలోకీ కూడా విస్తరించింది. ఇలాంటి కోవకి చెందిన వర్ణవివక్ష, అణచివేత నల్లవారిపై దక్షిణాఫ్రికాలో, అమెరికాలో సుదీర్ఘకాలం కొనసాగినాయి. నేటికీ అమెరికాలో కూడా ఆ ఛాయలున్నాయి.

కులం అంటరానితనం విషయంలో మనదేశంలోనే ప్రాంతీయ, చారిత్రక ప్రత్యేకతలున్నాయి. కేరళలో కేవలం దళిత కులాలేకాక, 'ఈళవ' (ఎజవ అని స్పెల్లింగు; ఈడిగ/గౌడ/కల్లుగీత కులాలకు దగ్గిర) కులం వారు కూడా అంటరానివారిగానే ఉండేవారు (కొన్ని దశాబ్దాల క్రితం వరకూ). నారాయణగురు ఈ సమస్య లోంచే వచ్చారు. అంతేకాదు, కేరళలో

దళితేతరులకు ఆయా కులాలనుబట్టి అంటరానితనం మోతాదులను (ఇన్ని గజాలదూరంలో నడవాలి అని) నిర్ణయించారు. కర్ణాటక లింగాయ తులంతా బసవ అనుచరులే. ఒకటి అన్నట్టున్నా, అందులో మళ్లీ నిచ్చెనమెట్ల కులవిభజన ఉంది. (లింగాయతమతం హిందూమతంకాదు అని వాదిస్తూ సుప్రీంకోర్టుదాకా వెళ్లారు). వారిలో అంటరానివారూ ఉన్నారు. పాలక వర్గాలు తమకు అవసరమైనప్పుడు దళిత కులాల్లో కొన్నిటిని చేరదీసి, కలుపుకొని ఇతరులపై దాడులకు వాడుకున్నారు. మనచరిత్రలో వీరశైవులూ, వీరవైష్ణవుల పేరిట వీరంగం వేసిన హిందువుల్లో గణనీయంగా 'కింది', దళిత కులాలవారూ ఉన్నారు. – ఆయా ఫ్యూడల్ శిబిరాల్లో దళితులూ, ఇతరులూ కలిసి, 'చాపకూడు' తిని ఐక్యమై, రెండో శిబిరంవారిపై మారణకాండ సాగించారు. దళిత కులాల నుంచి పురాణ పురుషులూ, రుషులూ, భక్తిమార్గ గురువులూ, పరిపాలకులూ కూడా (మౌర్యులు) రూపొంది, ఆయాకాలాల పాలనా వ్యవస్థలకు దోహదంచేశారు. ఆధునిక భారత్‌లో అంటరానివారైన మహర్ కులస్తులు బ్రిటిషిండియా సైన్యంలో చేరి, ఇతర కులాలవారితో భుజంకలిపి బ్రిటిష్ పాలనను నిలబెట్టారు.

'దళితులుకాక, ఇతర కులాల వారందరికీ అగ్రవర్ణాల సరసన ఇళ్లున్నాయి' అని రాశారు. గ్రామాల్లో కులాలవారీగా వాడలుంటే పద్ధతిలోకూడా ప్రాంతీయమైన తేడాలున్నాయి. కులవ్యవస్థ వాడల, పేటల నిర్మాణంలో కూడా కన్పడుతుంది. ప్రాంతాన్నిబట్టి, దళితవాడలేకాదు, ఆయా కులాలవారీగా గొల్లవాడ, కుమ్మరివీధి, గౌండ్లవీధి, చాకలివాడ, ఉప్పరవాడ, వడ్డెరబస్తీ మొదలైనవి ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో దళితవాడలు ఊరికి దూరంగా ఉంటే, కొన్ని ప్రాంతాల్లో విడిగానే ఉన్నా, ఊరికి ఆనుకొనే ఉంటాయి. దళితుల్లో కూడా మాల, మాదిగవాడలు విడివిడిగా ఉండటమూ కొన్ని గ్రామాల్లో ఉంది. దక్కలి, రెల్లి వంటి ఉపకులాలవారు మిగతా దళితులకు కూడా అంటరానివారై, వారినుంచీ దూరంగా విడిగా ఉంటున్నారు.. ఎరుకల, యానాది, చెంచువాడలూ ఊరికి దూరంగా విడివిడిగా ఉన్నాయి. లంబాడీ తండాలు సరేసరి. (కాలక్రమంలో ఇళ్ల అమ్మకం, కొనుగోళ్ల వలన కొద్ది మార్పులు, కలగలుపు వస్తున్నాయి.) హైదరాబాద్‌లో ప్రధానంగా ముస్లింలతో కూడిన బస్తీలు, పేటలు విడిగా కన్పిస్తాయి (ఈ విభజన ఇటీవలి దశాబ్దాల్లో పెరిగింది. పేటలవారీగా కొంత, వీధుల వారీగా మరికొంత విభజన పెరుగుతున్నది.) విభజన మాల, మాదిగలకే పరిమితం కాలేదు అని గమనించాలి. విభజన, వివక్షల మోతాదుల్లో తేడా ఉంది.

దళితులు 'భూమికోసం ఎంత పోరాడినా రాదు. వారికి రానీయరు' అని రాశారు సుబ్బనాచారి. ఇది వాస్తవం కాదు, నిస్పృహ. నాడూ, ఇటీవలా తెలంగాణలో, బెంగాల్లో, కేరళలో, ఇతర చోట్లా పోరాటాల ద్వారా పేదరైతుల్లో భాగంగా దళితులు కూడా లక్షలాది ఎకరాల భూమి సాధించుకున్నారు, సాధించుకుంటున్నారు. దానితోపాటు ఆయా ప్రాంతాల్లో తలఎత్తుకుని ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. (సమస్యలు ఇంకా ఉన్నాయి, అది వేరే సంగతి). మరో విషయం : భూమిపై యాజమాన్యానికీ, కులానికీ గల సంబంధంలో కూడా ప్రాంతీయ వైవిధ్యం ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో 43 శాతం మంది దళితులు 'స్వతంత్రులైన రైతుల'నీ, బి.ఎస్.పి బలం అదేననీ దళిత విషయాల వ్యాఖ్యాత చంద్రభాన్ ప్రసాద్ రాసారు. పెట్టుబడిదారీ అభివృద్ధి హెచ్చుగా జరిగిన పంజాబ్‌లో అలాటివారి శాతం 5 మాత్రమే; కాగా దేశం మొత్తంలో చూస్తే 25.5 శాతం మంది దళితులు భూమికల్గి ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ దళితుల్లో కూడా కనీసం ఈ మోతాదులో భూమికల పేదరైతాంగం ఉండేవారు. ఇక్కడ కొందరు దళితులకు ఈనాం భూములుండటం ఒక లక్షణం. అయితే గిట్టుబాటుగా లేదని చెప్పి, వ్యవసాయ సంక్షోభం–'అభివృద్ధి'క్రమంలో అమ్ముకు పోతున్నారు. ఇది ఇతర కులాల పేదలకూ వర్తిస్తుంది. 'అభివృద్ధి' చెందిన కోస్తా జిల్లాల్లో సెంటు భూమికూడాలేని దళితుల సంఖ్య హెచ్చు. 50 నించి 80 శాతం దాకా ఉంటుంది. తెలంగాణలో వారి సంఖ్య అంత హెచ్చుగా ఉండేది కాదు. ఇతర కులాల్లో కూడా బొత్తిగా భూమిలేని వారు కోస్తాజిల్లాల్లో ఎక్కువ – పంజాబ్‌లో లాగా. ఇరిగేషన్, 'అభివృద్ధి' మహత్యం అది. లక్ష్మింపేటపై మొదటివ్యాఖ్యలో కూడా దీన్ని ఎత్తి చూపారు. ఇక్కడి గ్రామాల్లో – పూర్వమూ ఇప్పుడూకూడా – దళిత, దళితేతర రైతులు మామా అల్లుడూ, బావా తాతా అని పరస్పరం పిలుచుకుంటారు. కలిసి తింటారు, తిరుగుతారు. దీనివెనుక వర్గపరంగా సామీప్యమూ, వర్గపోరాటాల ప్రభావమూ రెండూ ఉన్నాయి. కారంచేడు, చుండూరు, లక్ష్మింపేట వంటివి వర్గపోరాట కేంద్రాల్లో – తెలంగాణ, కేరళ, బెంగాల్లో – ముఖ్యంగా పోరాట ప్రాంతాల్లో – లేవు. అలాగని అక్కడ కులం, అంటరానితనం అసలే లేవని కాదు. వాటి తీవ్రత, రూపం, సడలింపుల్లో స్థల కాలాదులబట్టి తేడాలున్నాయి. దేశం మొత్తంలో చూస్తే 65 శాతం మంది దళితకుటుంబాలు (దాదాపు) భూమిలేనివిగా ఉన్నాయనీ, దళితేతర కులాల్లో 33 శాతం అలా ఉన్నారనీ ప్రముఖ దళిత పరిశోధకుడూ, ఉన్నతాధికారీ అయిన సుఖ్‌దేవ్ తోరట్ పేర్కొన్నారు. ఈ లెక్కలని తిరగేసి, వాటి విపర్యయాలను చూస్తే వర్గం–కులం పరస్పర సంబంధాలూ, తేడాలూ పోలికలూ కూడా లోతుగా బోధపడుతాయి. ఆయా ప్రాంతాల్లో భూమివల్ల కలిగే హోదాని బట్టి కూడా దళితుల పరిస్థితిలో మార్పులున్నాయి. భూస్వాములుగా, ధనిక రైతులుగా, పెట్టుబడిదారులుగా, నాయకులుగా ఎదిగిన దళితులు కూడా ఉన్నారు. ఇప్పుడు మనరాష్ట్రంలో రాజకీయ నాయకులుగా ఉన్న దళితుల్లో చాలామందికి భూములున్నాయి. తర్వాతి దశలో ఆర్జనకాక, నాయకులుగా ఎదగకముందే రైతులుగా వారికి ఉన్న ఆస్తులు అవి. కాబట్టి వారివారి ఆస్తులనుబట్టి వారి రాజకీయ, సామాజిక హోదా కూడా మారింది, మారుతున్నది. సామాజిక ఆచరణని గమనిస్తే ఇది కనబడుతుంది. కేవలం కొన్ని సిద్ధాంతాల ఆధారంగా కాక, వాస్తవ సామాజిక చిత్రాన్ని, ఆచరణని గమనిస్తే ఇది కనబడుతుంది.

ఈనాటి కులసమస్యను– దాని మూలాన్ని దృష్టిలో పెట్టుకుని–– కేవలం హిందువులతో, బ్రాహ్మణిజంతో ముడిపెట్టి చూస్తే పాక్షిక సత్యాలే కన్పిస్తాయి. సరైన, సమగ్రమూ సంపూర్ణమూ అయిన, వాస్తవికమైన అంచనా, అవగాహన రావు. నిజానికి ఇస్లాం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధ మతాల్లోకి కూడా కులం, కుల వివక్ష పాకిపోయాయి. అలాగే బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం ప్రభావంలో ఉన్న వర్గాల్లో, ప్రాంతాల్లో, రాజకీయ శక్తుల్లో కూడా కులవివక్ష ప్రబలంగా ఉంది. ముఖ్యంగా తమిళనాడులో ఇది వెర్రితలలువేసి, దౌర్జన్యపూరితంగా కూడా ఉంది. కాస్త తక్కువగా కేరళ, కర్ణాటకల్లోనూ ఇది కనిపిస్తుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో కులవివక్ష గురించిన పరిశీలనలున్నాయి. అక్కడ హిందూమతం, బ్రాహ్మణిజం లేకపోయినా కులవివక్ష ఉంది. అలాగే పంజాబు శిక్కులలోనూ, టిబెట్, శ్రీలంక బుద్ధిస్టులలోనూ ఈ సమస్య ఎలా ఉన్నదో వివరించే అధ్యయనాలూ వచ్చాయి. స్వయంగా దళిత అధ్యయనాల సంస్థలు వీటిని వెలుగులోకి తెచ్చాయి, తెస్తున్నాయి. ప్రభుత్వాల విధానాలూ, ఎన్నికల (పార్టీల) రాజకీయాల మూలంగా కులసమస్య కొత్తరూపాల్లో వెర్రితలలు వేస్తున్నది. బ్రాహ్మణ–బనియా పార్టీగా ఒకప్పుడు భావించబడిన బిజెపి – దళితుల్లోకీ, ఇతర 'కింది' కులాల్లోకి, గిరిజనుల్లోకీ కూడా ఇలాంటి అవలక్షణాలను

ఎలాతీసుకుపోయిందో గమనిస్తే, సమస్య తీవ్రత అర్థమవుతుంది. కాబట్టి కులసమస్యను కేవలం హిందూమతంతో, బ్రాహ్మణిజంతో, అగ్రకులాలతో ముడిపెట్టి చూస్తే, సమస్య తీవ్రతను తక్కువ అంచనా వేస్తాము. ఈ పాక్షిక దృష్టి నేటి పరిస్థితుల్లో సమస్య పరిష్కారానికి చాలదు, ఉపయోగపడదు.

అదే సంచికలో ఆదివాసులపై లోకసంచారి రాసిన వ్యాసాన్ని ప్రస్తావిస్తూ, సుబ్బనాచారిగారే ఇలా అన్నారు: 'ఈ అంటు జాడ్యం ఏదో ఒకటి రెండు అగ్రకులాలకి పరిమితంగాలేదు. సమస్తకులాలకూ ఈ అంటురోగం బాగా తలకెక్కి, వంటబట్టిపోయింది. గనక అగ్రకులాలే చేస్తున్నాయనడానికి వీలులేదు. సమస్త జాతులకు, కులాలకు ఈ అంటు రోగం బాగా విస్తరించిపోయింది'. వారి వ్యాఖ్యనంలోని ఈ భాగం చాలా వాస్తవికంగా ఉంది. ఆదివాసులేకాక, ఎస్.సి.ల విషయంలో కూడా వారి ఈ అంచనా చక్కగా వర్తిస్తుంది. కేవలం గతంలోని కొన్ని సిద్ధాంతాల బట్టి కాక, నేటి సామాజిక ఆచరణను పరిశీలిస్తే, సుబ్బనాచారి గారి ఈ అభిప్రాయం సరైనదని ఎవరైనా అంగీకరించాల్సి వస్తుంది.

అయితే, 'సామ్రాజ్యవాదమంటే ప్రజలపైన యుద్ధం. సిద్ధాంత ప్రతిరూపం బ్రాహ్మణిజం' అని ఆయనే చేసిన ప్రతిపాదనలు అశాస్త్రీయం. వాస్తవాలతో పొసగవు. బ్రాహ్మణిజంతో ఏమాత్రం సంబంధం లేని దేశాలు సామ్రాజ్యవాదాన్ని నెరపుతున్నాయి. హిందూమతం, బ్రాహ్మణిజం లేని దేశాల్లో కూడా దళారులను తయారుచేసుకొని, సామ్రాజ్యవాదులు దోచుకుంటున్నారు. అలాగే సామ్రాజ్యవాదం మిలటరీయేతర అనేక ఇతర నయావలస రూపాల్లో కూడా స్వైరవిహారం చేస్తున్నది. సింపుల్‌గా చెప్పడం మంచిదేకానీ, అశాస్త్రీయ భావనల వ్యాప్తి తప్పు.

ఇలాంటి అభిప్రాయాలు సుబ్బనాచారిగారి వ్యాఖ్యల్లోనేకాక, అనేక ఇతరుల రచనలలో కూడా తరచుగా వ్యక్తమవుతున్నాయి. అలాటి వాటిని దృష్టిలో పెట్టుకుని ఈ అంశాలను కాస్త వివరంగా రాయాల్సివచ్చింది. వీటిగురించి అంతా ఇంకా లోతుగా, వివరంగా, వాస్తవాల ఆధారంగా, శాస్త్రీయ దృష్టితో పునఃపరిశీలన చేస్తే బాగుంటుందని మనవి. లక్ష్మింపేట సందర్భంగా ఈ ముఖ్య సమస్యపై చర్చకి వీలుకల్పించిన 'వీక్షణం'కి అభినందనలు.

– ఎం. కృష్ణ ఆదిత్య, హైదరాబాద్ వీ

(... 4వ పేజీ తరువాయి)

వీక్షణం సెప్టెంబర్ సచికలో వచ్చిన జి. సూరి గారి ఆహార(అ) భద్రత బిల్లు వ్యాసం చదివిన తర్వాత భయాశ్చర్యాలు కలిగినవి. వ్యాసం చాలా విపులంగా ఉంది. ఈ ప్రభుత్వ విధానాల వల్ల భవిష్యత్తులో తిండి కోసం మనం గింజలు ఏరుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమోనన్న భయం కలుగుతుంది. 'ఆయురన్నం ప్రయచ్ఛతి' అని సంస్కృతంలో సూక్తి. అంటే ఆయువుంటే అన్నం అదే దొరుకుతుంది అని అర్థం. కాని భవిష్యత్తులో అన్నం దొరకక ఆయువు ముగించాల్సిన భయం పొంచి ఉన్నదని ఈ వ్యాసం ద్వారా అర్థం అవుతుంది. బడా పెట్టుబడుదారులకూ, కుహనా రాజకీయవాదులకూ ఈ బిల్లు లాభం చేకూరుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. వీక్షణం పత్రిక రాగానే రోహిణీప్రసాద్ వ్యాసం మొట్టమొదటగా చదివి తర్వాతే మిగతా వ్యాసాలు చదివేవాడిని, ఆయన అకాల మరణం కలచివేసింది.

– టి.ఎస్. విజయదత్, హైదారాబాద్

వీక్షణం సెప్టెంబర్ 2012 సంచికలో వచ్చిన 'పేదరికం–పోషకాహారలేమి' వ్యాసంలో రచయిత సమస్య తీవ్రతను, పూర్వాపరాలను బాధ్యతగా వివరిస్తూ ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. మొద్దుబారిన ప్రభుత్వాలను, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాలక వర్గాలను సాధ్యమైనంతమేర అనేక కోణాల నుంచి ప్రశ్నిస్తూ తట్టిలేపే ప్రయత్నం చేశారు. ఈ వ్యాసం చదువుతున్న సమయంలోనే, పౌష్టికాహార లోపంతో మన రాష్ట్రంలో ఏటా 73,600 మంది పసిపిల్లలు మృత్యువాత పడుతున్నట్లు సాక్షాత్తూ ఆయా శాఖల ముఖ్యకార్యదర్శుల కమిటీ వెల్లడించిన వివరాలను ఓ దినపత్రికలో చదివాను. నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం నీడలో ప్రజాసంక్షేమం ప్రాథమిక స్థాయిలోనే దెబ్బతింటుందనే విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలియజేయడం ప్రభుత్వాలకు, పాలకవర్గాలకు సిగ్గుచేటు. పోషకాహార లేమిలో ప్రపంచంలోనే కడు పేద దేశాలలో ఒకటైన బంగ్లాదేశ్ మొదటి స్థానంలో ఉండగా, తదుపరి స్థానంలో భారతదేశం (ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన) నిలవడాన్ని మన పాలకులు నిరంతరం ప్రగల్భాలు పలికే దేశ ప్రగతి, అభివృద్ధి మాటలలో దాగున్న అసత్యాలకు నిదర్శనంగా భావించవచ్చు.

ప్రజలు అత్యంత నమ్మకంతో దాచుకున్న డబ్బుకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వ బ్యాంకులు నేడు ఏ పరిస్థితిలో ఉన్నాయనే విషయాన్ని రచయిత వి. హనుమంతరావు 'బ్యాంకుల మొండి బాకీలు లక్ష కోట్లు' వ్యాసం ద్వారా స్పష్టంగా వివరించారు. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న నిండు కుండలను దండుకునేందుకు పాలక, పెట్టుబడిదారీ వర్గాలు సంయుక్తంగా చేస్తున్న కుట్రల వికృత రూపాలు చివరకు ప్రజల కష్టార్జిత సొమ్ముకు భద్రతా నిలయాలైన బ్యాంకులను చేరాయి. ఇది కేవలం దురదృష్టకర పరిణామమే కాదు మరి ఆందోళనకర పరిణామం కూడా. ప్రైవేటు రంగంలోని ఫైనాన్స్ సంస్థలు ఇచ్చే కాస్త ఎక్కువ వడ్డీకి ఆశపడి తమ జీవితకాల కష్టార్జితాలను వాటిలో జమచేసి కడకు భంగపడి, మోసపోయి గాయపడిన తోటి ప్రజల చేదు అనుభవాలను తమకు పాఠాలుగా భావించి, వడ్డీకాసుల మాట అటుంచి కాని తమ కష్టార్జితానికి కనీస భద్రత చాలనుకొని తమకున్న ఏకైక ప్రత్యామ్నాయ రక్షణ మార్గంగా ప్రభుత్వరంగ బ్యాంకులను నమ్ముకుంటే అవి కూడా నేడు అనుక్షణం తమ ఖాతాదారులను అభద్రతకు, భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని వేలాది కోట్ల రూపాయలను ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకుని తిరిగి అదే పలుకుబడిని ఉపయోగించి తీసుకున్న రుణాలకు ఎగనామం పెట్టేవారి మధ్య పోటీతత్వం రోజురోజుకూ పెరుగుతూ పోతుంది. ఈ పరిణామానికి కట్టడి లేకుండా ఇలాగే కొనసాగితే నేటి 'లక్ష' కోట్ల మాట రేపు బహువచనం కావచ్చు. చివరకు బలిపశువులుగా మిగిలేది సామాన్య ప్రజలే. ప్రభుత్వాలు, రాజ్యాంగబద్ధ సంస్థలు ఇలాంటి అక్రమాలు, అవకతవకల పట్ల ప్రేక్షక లేదా ప్రోత్సాహక పాత్రను వీడి అప్రమత్తతతో వ్యవహరిస్తూ కనీసం నియామానుసార కాఠిన్యం ప్రదర్శించకుంటే ప్రజల ప్రణాళికాబద్ధ జీవితాలకు కూడా కనీస రక్షణ కరువవుతుంది.

– ఎస్. కిశోర్ కుమార్, హైదారాబాద్

ఎం. జె. సుబ్బరామిరెడ్డి గురించి పి. వరలక్ష్మి సెప్టెంబర్ వీక్షణం సంచికలో రాసిన సంస్మరణ వ్యాసం చాలా బాగుంది. కడప జిల్లాలో ఎం.జె. లాంటి వారు జీవితాంతం పోరాటాలు చేయడం చాలా గొప్ప విషయం. ఆయన దాదాపు నలభై సంవత్సరాల కాలంలో విద్యార్థుల సమస్యల నుండి పౌర హక్కుల సమస్యల వరకు నిరంతరం నిజాయితీగా, నిస్వార్థంగా పోరాడడం చాలా గొప్ప విషయం. జిల్లాలో ఎక్కడ సమస్య వస్తే అక్కడ వాలిపోయే ఎం.జె. చాలా గొప్ప వ్యక్తి. ఏ స్వార్థం లేకుండా, ఏ పదవులు ఆశించకుండా సమస్యల హోరంతో నిరంతరం అలుపెరగని నిజమైన పోరాటయోధుడు. నిలువెల్ల స్వార్థంతో విషం కక్కే లోకంలో ప్రాణాలకు, లెక్కచేయకుండా, ఆకలి చంపుకొని, డ్రెస్సు, అడ్రస్సు లేని ఈ మహా వ్యక్తి ఎందరో జీవితాల కళ్లల్లో నీటిని తన వద్దనున్న తుండు గుడ్డతో తుడిసి వేచిన వ్యక్తి. కొందరి దృష్టిలో పిచ్చివాడిగా, మరికొందరి దృష్టిలో మానవతావాదిగా, మంచి మనిషిగా జిల్లాలోని మారుమూల గ్రామంలో నుండి, జిల్లా కేంద్రం వరకు, కార్మికుల, కర్షకుల సమస్యలకు పౌరులు పిలువకుండానే ప్రజల పక్షాన వకాల్తా పుచ్చుకొన్న వ్యక్తి. రాయలసీమ సమస్యల పోరులో ఆయన ఉపన్యాసాలు ప్రజలు ఎంతో వినయంగా ఆలకించే వారు. ఆయన వ్యక్తిగా మాట్లాడే తీరు పెద్ద నాయకులకు ఈర్ష్య పుట్టించేది. ఆయన మరణం జిల్లా ప్రజలకు తీరని లోటు. ప్రజల కోసం పాటుపడే వ్యక్తి లోటును పేదల కన్నీళ్లతో తుడపగలమా! పేదలూ, సమస్యలూ ఉన్నన్నాళ్లూ ఎం.జె. ఉంటారు. వారి గుండెల్లో పదిలంగా నిలుపుకుంటారు.

– మరకా సూర్యనారాయణరెడ్డి, *పులివెందుల, కడప* వీ

కసబ్‌కు మరణ శిక్ష

2008 నవంబర్ 26న ముంబైపై దాడి చేసి 166 మందిని చంపిన కేసులో భారత సుప్రీం కోర్టు అజ్మల్ కసబ్‌కు ఉరిశిక్షను ఖరారు చేసింది. దీనిపై ప్రత్యేక కోర్టు, ముంబై హైకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా సమర్థించింది. మరణ శిక్ష రద్దుకోసం కసబ్ పెట్టుకున్న దరఖాస్తును కొట్టివేసింది. కసబ్ భారత్‌పై యుద్ధం ప్రకటించి తీవ్ర నేరం చేశాడని వెల్లడించింది. మారణకాండకు పాల్పడిన అతడిని దోషిగా నిర్ధారించి విధించిన ఉరి శిక్షను సమర్థించడం తప్ప మరో మార్గం లేదని జస్టిస్ అఫ్తాబ్ అలం, జస్టిస్ సి.కె. ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఆగస్ట్ 29న తీర్పు చెప్పింది.

నరోడా పాటియా కేసులో ఖరారైన శిక్షలు

2002 ఫిబ్రవరి 28న జరిగిన గుజరాత్‌లోని నరోడా పాటియాలో 97 మంది మైనారిటీలను చంపిన కేసులో ప్రత్యేక న్యాయస్థానం ఆగస్ట్ 31న 32 మందిని దోషులుగా తేల్చింది. అల్లర్లకు మాజీ మంత్రి మాయా కోడ్నానీ ప్రధాన సూత్రాధారిగా నిర్ధారిస్తూ ఆమెకు ఐపిసి 326 కింద మొదట పదేళ్ల శిక్షను అనుభవించిన తరువాత, మరో 18 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాలని ప్రత్యేక కోర్టు అడిషనల్ ప్రిన్సిపల్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ తీర్పు చెప్పారు. భజరంగ్‌దళ్ నేత బాబూ భజరంగీకి ఐపిసి సెక్షన్లు 120 (బి) (నేరపూరిత కుట్ర), 302 (హత్య), 307 (హత్యాయత్నం) కింద చనిపోయే వరకు జైల్లోనే ఉండాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మరో ఏడుగురికి 21 ఏళ్ల జైలు శిక్ష విధించారు. మిగిలిన 23 మందిలో 22 మందికి సాధారణ యావజ్జీవ కారాగార శిక్ష (14 ఏళ్లు) విధించారు. పరారీలో ఉన్న ఒకరి విషయంలో న్యాయమూర్తి తీర్పును వెల్లడించలేదు.

సింహళులపై దాడులు

తమిళనాడు పర్యటనకొచ్చిన శ్రీలంక సింహళులపై సెప్టెంబర్ 3,4 తేదీల్లో ఎల్.టి.టి.ఇ అనుకూల సంస్థలు నిరసనలు తెలియజేశాయి. తంజావూరు దగ్గరలోని వేలంకణి చర్చిని చూసి వెళ్తున్న సమయంలో దారి పొడవునా ఆందోళనకారులు వారి వాహనాలపై రాళ్లు, చెప్పులు విసిరారు. అట్లాగే శ్రీలంక సైన్యానికి భారత సైన్యం శిక్షణ ఇవ్వడాన్ని ఎ.ఐ.డి.ఎం.కె, డి.ఎం.కె సహా తమిళనాడులోని పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

బాణసంచా పేలి 56 మంది మృతి

తమిళనాడులోని శివకాశి దగ్గరలోని ఓంశక్తి ఫైర్ వర్క్స్ కార్మాగారంలో సెప్టెంబర్ 5న పేలుళ్లు జరిగాయి. ఈ ప్రమాదం వల్ల 56 మంది కూలీలు మరణించగా, 73 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ కార్మాగారంలో మొత్తం 300 మంది పనిచేస్తున్నారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. 9 ఎకరాల పరిధిలో ఉన్న ఓంశక్తి ఫైర్ వర్క్స్ కార్మాగారంలో 40 గదులున్నాయి. ఇందులోని ఒక గదిలో పేలుడు ప్రారంభమై 28 గదులకు వ్యాపించి అవి కూలిపోయాయి.

దళిత మహిళకు శిరోముండనం

ఒడిశా రాష్ట్ర సంబల్‌పూర్ జిల్లాలోని జయగుంట గ్రామానికి చెందిన మహిళను గ్రామస్తులు శిరోముండనం చేశారు. ఒక యువకుడి మృతికి కారణమంటూ సుబిద బుడ (45) కుటుంబాన్ని ఆ గ్రామం నుండి బహిష్కరించారు. సుబిద బంధువుల ఊరికి వెళ్లి తిరిగి ఇంట్లోని వస్తువులు తీసుకెళ్లడానికి ఆ గ్రామానికి రావడంతో సెప్టెంబర్ 8న స్థానికులు దాడిచేసి, చిత్రహింసలకు గురిచేసి శిరోముండనం చేసినట్లు స్థానిక పోలీసు అధికారి బుర్లా తెలిపారు. ఇంత వరకు ఎవరిపైనా ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయలేదని తెలిపారు.

పాల కురియన్ కన్నుమూత

భారత్‌ను పాడిలో అగ్రగామి దేశంగా నిలిపిన డాక్టర్ వర్గీస్ కురియన్(90) మరణించారు. అనారోగ్యంతో గుజరాత్‌లోని నాడియాద్ పట్టణంలోని ముల్జీబాయ్ పటేల్ యురాజికల్ హాస్పిటల్‌లో చేరిన ఆయన సెప్టెంబర్ 9న తుది శ్వాస విడిచారు. కురియన్ కేరళలోని కోజికోడ్‌లో 1921 నవంబర్ 26న పుట్టారు. అమూల్ డెయిరీని ఇంటింటి పేరుగా మార్చిన ఆయన పాల ఉత్పత్తిలో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలిపారు. పాడి రైతుల స్వావలంబనకు కృషిచేశారు. ఆయన కృషికి పద్మవిభూషణ్, మెగసెసే వంటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు వచ్చాయి.

భూములమ్ముకొని షేర్లు కొనండి

రైతులు భూములు అమ్ముకొని స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బు వస్తుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త సి.ఐ.ఐ అధ్యక్షుడు గోద్రేజ్ సలహా ఇచ్చారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇవ్వాల్సి వస్తే రైతులు వ్యతిరేకించకుండా ప్రైవేట్ సంస్థలకు గానీ, ప్రభుత్వానికి గానీ ఇచ్చేసి వచ్చిన డబ్బుతో షేర్లు కొనుక్కోవాలని గోద్రేజ్ తెహెల్కాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

జల సత్యాగ్రహం

మధ్యప్రదేశ్‌లో 'జల సత్యాగ్రహం' జరిగింది. ఓంకారేశ్వర్ డ్యాం విషయంలో ప్రభుత్వం దిగివచ్చినా మరో జలాశయం ఇందిరాసాగర్‌పై మాత్రం రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. హార్దాకు సమీపంలో నర్మదా నదిలో 'జల సత్యాగ్రహం' చేస్తున్న ఆందోళనకారులను సెప్టెంబర్ 12న పోలీసులు నీటిలో నుంచి బలవంతంగా తీసుకొచ్చి అరెస్ట్ చేశారు. మరో 50 మంది ప్రజలు నీటిలో ఆందోళనకు దిగారు. దీంతో ఆ జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు.

కస్తూరి కన్నుమూత

'ద హిందూ' పత్రిక మాజీ సంపాదకులు గోపాలన్ కస్తూరి (87) సెప్టెంబర్ 21న చెన్నైలో మరణించారు. కస్తూరి 17 డిసెంబర్ 1924, మద్రాస్‌లో కె. గోపాలన్, రంగనాయకి దంపతులకు పుట్టారు. కస్తూరి సెప్టెంబర్ 1965 నుండి జనవరి 1991 వరకు 'ద హిందూ' పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. 1990 వరకు ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పి.టి.ఐ) బోర్డు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటి (ఐఎన్ఎస్)కి కూడా నేతృత్వం వహించారు. 'ద హిందూ' పత్రికకు మిగతావారికంటే ఎక్కువ కాలం సంపాదకులుగా ఉన్నారు.

ఆర్.ఎస్.ఎస్ నేత సుదర్శన్ కన్నుమూత

ఆర్.ఎస్.ఎస్ నేత కుప్పహల్లి సీతారామయ్య సుదర్శన్(81) మరణించారు. ఆయన సెప్టెంబర్ 15న రాయ్‌పూర్‌లోని ఆర్.ఎస్.ఎస్ కార్యాలయంలో గుండెపోటుతో మరణించారు. సుదర్శన్ స్వగ్రామం కర్ణాటకలోని మాండ్య జిల్లా కుప్పహల్లి గ్రామం. ఆయన జూన్ 18, 1931లో రాయ్‌పూర్‌లో పుట్టారు. మొదట ఆయన ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్‌గా ఉన్నారు. 2000 నుండి 2009 వరకు ఆర్.ఎస్.ఎస్ ఐదో సంచాలక్‌గా కొనసాగారు.

భారత్ బంద్

డీజిల్ ధర పెంపు, గ్యాస్ సిలిండర్ల పరిమితి, చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలు సెప్టెంబర్ 20న బంద్‌కు పిలుపునిచ్చాయి. బి.జె.పి, వామపక్షాలు, సమాజ్‌వాద్ పార్టీ, తదితర పతిపక్ష పార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. దేశ రాజధాని సహా ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా, పంజాబ్, హర్యానా, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలో బంద్ ప్రభావం ఉంది. వీ

ఆత్మహత్యల పాలవుతున్న దేశం

దేశంలో ఆత్మహత్యల సంఖ్య రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న బలవంతపు అసహజ మరణాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఒ) మన ముందుంచింది. ఇవి కూడా కచ్చితమైనవి కావు. రికార్డులకు నోచుకోని, బలవంతపు మరణాల వల్ల సమాజం నుంచి, ప్రభుత్వం నుంచి వచ్చే సమస్యల వల్ల నమోదుకానివి ఎన్నో ఉంటాయి. ప్రభుత్వం నమోదు చేసిన ఈ అసహజ మరణాలపై అత్యవసర చర్యలు అవసరమని ప్రపంచ దేశాలకు సూచించింది. ఆత్మహత్యల నివారణ చాలా సులభమని, వ్యక్తుల ఆరోగ్య, సామాజిక సమస్యలను అధిగమించడానికి మానవ, ఆర్థిక వనరులను వినియోగించడం ద్వారా ప్రభుత్వాలు కృషిచేయాలని పేర్కొంది. ఈ నివేదికను తయారు చేసిన బృందానికి డాక్టర్ సక్సేనా నేతృత్వం వహించారు. ఆత్మహత్యలు కొన్ని దేశాల్లో 60 శాతం పెరిగాయని సక్సేనా ఆందోళన వ్యక్తంచేశారు. సాంకేతిక రంగంలో దూసుకుపోతోందంటున్న బెంగుళూరులో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. దేశంలో నమోదయిన ఆత్మహత్యల్లో 9.4 శాతం బెంగుళూరులోనే జరుగుతున్నాయని డబ్ల్యూ.హెచ్.ఒ సంస్థ వెల్లడించింది. గత పదేళ్లలో దేశంలో ఆత్మహత్యలు 23 శాతం పెరిగాయని 2001లో 1,08,593 ఆత్మహత్యలు నమోదుకాగా 2010 నాటికి అవి 1,34,599కి చేరిందని తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో నమోదయిన ఆత్మహత్యలు దేశ వ్యాప్తంగా జరిగిన మొత్తంలో 57.2 శాతంగా ఉన్నాయని వివరించింది. పోషకాహార లేమివల్ల జీవనప్రమాణాలు పడిపోయి రోగగ్రస్తులయి సరయిన వైద్యం అందక సామాన్య ప్రజలు ఆత్మహత్యల వైపు మళ్లుతున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యలు పరిశీలిస్తే రైతాంగంలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నాటికి మన దేశంలో రైతులు వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. సాగునీరు లేక బోర్లు, బావులు తవ్వి అప్పులపాలవుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఊబినుంచి బయటపడలేక ఆత్మస్థయిర్యం కోల్పోయి ఆత్మహత్యలవైపు మళ్లుతున్నారు. సమాజానికి జీవికనిస్తున్న రైతు తను అమితంగా ప్రేమించే మట్టి నుంచీ, ఏపుగా ఎదుగుతుంటే చూసి మురిసిపోయే పంటచేను నుంచీ, చివరికి సమాజం నుంచీ దూరమవుతున్నాడు. మొత్తంగా ఆత్మహత్యలకు కారణమవుతున్న విధానాలపై ఉద్యమిస్తూ, ఆత్మహత్యల వైపు సామాజం మళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ.

అణువిద్యుత్ వద్దంటూ ఆందోళనలు

కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం మొదటి యూనిట్‌లో యురేనియం నింపడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు, ఉద్యమకారులు తీవ్రంగా అడ్డుకుంటూనే ఉన్నారు. అణువిద్యుత్ కేంద్రంలోకి వెళ్లకుండా ఆందోళనకారులపై పోలీసులు లాఠి చార్జ్, భాష్పవాయు గోళాలు ప్రయోగించడంతో 20 మంది వరకు గాయపడ్డారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో జాలరి అంథోని మృతిచెందారు. అణుశక్తిపై పునరాలోచించాలని మేధాపాట్కర్ నేతృత్వంలోని ప్రజా ఉద్యమ జాతీయ కూటమి (ఎన్‌ఎపిఎం) ప్రధానికి, తమిళనాడు ముఖ్యమంత్రికి తెలియజేసింది. ఆందోళనలపై పోలీసుచర్యను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్‌లకు లేఖలు పంపారు. కూడంకుళం అణువిద్యుత్ కార్మాగారంలో నిల్వచేయాలనుకుంటున్న అణు ఇంధనంలో అణుధార్మిక పదార్థం ఉండదని భరోసా ఏమిటని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఈ కార్మాగారం భద్రతపై న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎస్. రాధాకృష్ణన్, జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పలు ప్రశ్నలను వేసింది. ప్రభుత్వాలు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న బహుళజాతీ సంస్థలకు అనుమతులిస్తూ, మరోవైపు పర్యావరణ వైవిధ్య సదస్సులకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు తీసుకొస్తున్న ప్రాజెక్టులన్నీ బడాపెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతీ సంస్థలకోసమేనని ప్రజలు గగ్గోలు పెడుతుంటే మన దేశ ప్రధాని కూడంకుళం పోరాటాల వెనుక విదేశీ హస్తం ఉందని ప్రజల్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. 1984లో భోపాల్‌లో జరిగిన దుర్ఘటన వల్ల ఇప్పటికీ అక్కడ వ్యర్థపదార్థాల సమస్య ఉంది. ఆ విషవాయువు వల్ల వేలాది మంది మరణించారు. ఇప్పటికీ వేలాది మంది అంగవైకల్యానికి గురై, రోగగ్రస్తులై నిత్యం హాస్పిటల్‌ల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడి చుట్టుపక్కల భూమి మొత్తం రసాయనాలతో నిండి వ్యవసాయానికి యోగ్యంగాలేదు. ప్రభుత్వాలు తెస్తున్న పర్యావరణ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు వివిధ రూపాల్లో తమ నిరసనను, ప్రతిఘటనను తెలియజేస్తున్నారు. సకల మానవాళికోసం పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఉద్యమిస్తున్న వారితో మిగతా సమాజమంతా చేతులు కలిపి సాగాలి. లేకుంటే అందరికి బతుకే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఎంతో దూరంలో లేదు.

కార్టూనిస్ట్‌పై రాజద్రోహం కేసు

దేశంలో జరుగుతున్న అవినీతిని బహిర్గత పరచడానికి పార్లమెంట్‌ని టాయిలెట్‌గా బొమ్మగీసి, దేశ సార్వభౌమత్వాన్ని వ్యక్తంచేసే నాలుగు సింహాలను తోడేళ్లుగా మహారాష్ట్రకు చెందిన అసీం త్రివేది తన కార్టూన్ల ద్వారా లోకానికి తెలియజేశారు. దీనికి మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనపై రాజద్రోహం కేసుపెట్టింది. అటు అమెరికా కుట్రలను బయటపెట్టి నందుకు జూలియన్ అస్సాంజ్‌ను బ్రిటన్ నుండి బయటకు వెళ్లగొట్టించింది. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కేఅయినా అవి పాలకులకు నచ్చకపోతే పౌరులు శిక్షకు గురికావాల్సిందేనని మన పాలకులు ప్రతి సందర్భంలో చెపుతున్నారు. పాలకులు చిన్న పాటి ప్రశ్నను గానీ, విమర్శను గానీ తట్టుకునే పరిస్థితిలో లేరు. మొన్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కార్టూన్ వేసినందుకు జగదేశ్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ను మావోయిస్టంటూ పోలీసులచేత అరెస్ట్ చేయించింది. పాలకులు తమ అధికారాన్ని పదిల పరుచుకోవడం కోసం ప్రజలపై నిత్యం తీవ్రమైన అణిచివేత కొనసాగిస్తూ, లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడుతున్న పాలకులకు ఏ శిక్ష విధించాలి. ఒకవైపు ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ మరొక వైపు ప్రభుత్వం తనను తాను అతి పెద్ద ప్రజాస్వామ్యదేశంగా ప్రకటించుకుంటోంది. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించకపోగా, తమ సమస్యలకోసం గొంతెత్తిన ప్రజలను అణిచివేతకు గురిచేస్తున్న దేశాన్ని ప్రజాస్వామ్యదేశమని ఎలా అనుకోగలం. ప్రాంతం ఏదైనా, దేశాలు ఏవైనా పాలకుల విధానాలు ఒక్కటే అనే విషయం మనకు మళ్లీ మళ్లీ రుజువవుతూనే ఉంది. దీనికి విరుగుడుగా పాలితులంతా పాలకుల కుట్రలను బట్టబయలు చేస్తూ, సకల సంపదలు సృష్టిస్తున్న సామాన్యుల పక్షం వహించాలి.

వార్త – వ్యాఖ్య : వై. రామచంద్రం

వీ

షికాగోలో ఉపాధ్యాయుల సమ్మె

చారిత్రాత్మకమైన షికాగో నగరంలో ఉపాధ్యాయులు పోరు బాట పట్టారు. విద్యకు నిధులు కేటాయించాలనీ, తమ ఉద్వాసనలకు స్వస్తి పలకాలనీ డిమాండ్ చేస్తూ టీచర్లు వీథుల్లోకి వచ్చి తమ నిరసనలు తెలుపుతున్నారు. ఈ సందర్భం ఆగస్ట్ 30న ఉపాధ్యాయులు సంబంధిత అధికారులకు పదిరోజుల సమ్మె జరుపుతామని చికాగో టీచర్స్ యూనియన్ (సిటియు) నోటీసు జారీ చేసింది. ఈ నిరసనకు విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి మద్దతు లభిస్తోంది. తరగతి గదుల్లో పిల్లలకు పాఠాలు బోధించాల్సిన టీచర్లు తమ డిమాండ్ల సాధన కోసం వీథుల్లోకి వచ్చి ఉద్యమిస్తున్న తీరు నగరంలో కార్మికోద్యమంగా రూపు సంతరించుకుంటోంది. సిటియులో దాదాపు ముప్పై రెండు వేల మంది సభ్యులున్నారు. షికాగో మేయర్ ఇమ్మాన్యుయల్ పాలక మండలికి – సిటియుకు మధ్యన ఏడాది కాలంగా ఈ పోరు జరుగుతోంది. ఈ పోరులో సమ్మె నోటీసు తొలి అడుగు మాత్రమేనని సిటియు అధ్యక్షుడు కరేన్ లూయిస్ హెచ్చరించారు.

జోర్డాన్ వెబ్‌సైట్లపై ఆంక్షలు

జోర్డాన్‌లో దాదాపు రెండు వందలకుపైగా ప్రముఖ వెబ్‌సైట్లపై ఆంక్షలు విధించారు. అమెరికాలో ఇటీవల తీసుకొచ్చిన ఎస్ఒపిఎ తరహాలో ఇంటర్నెట్ సమాచారాన్ని సెన్సార్‌షిప్ చేసేందుకు, అవసరమైతే తొలగించే ప్రతిపాదనలతో జోర్డాన్ ప్రభుత్వం ఓ బిల్లును తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ ప్రతిపాదిత బిల్లుకు ప్రముఖ జోర్డాన్ వెబ్‌సైట్లు తమ స్క్రీన్‌లకు నల్లరంగు వేసి నిరసన తెలియజేశాయి. ప్రఖ్యాత వెబ్‌సైట్లు, బ్లాగులు అన్ని నల్లబారిపోయాయి.

బహ్రెయిన్‌లో నిరసనలు

జైళ్లలో నిర్బంధించిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బహ్రెయిన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. లక్షలాది మంది ప్రజలు వీథుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శలను చేపట్టారు. ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. ప్రదర్శన కొనసాగిన మూడు కిలోమీటర్ల పొడవునా ఎటువంటి ఘర్షణలూ చోటు చేసుకోలేదు. ఇటీవలి కాలంలో అత్యంత ప్రశాంతంగా జరిగిన ఇంతటి భారీ నిరసన ప్రదర్శన ఇదేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'ప్రజాస్వామిక స్వేచ్ఛ' అన్న నినాదంతో కొనసాగిన ఈ ప్రదర్శనకు పెద్ద ప్రతిపక్ష గ్రూప్ అల్ వెఫాక్ సారథ్యం వహించింది. పార్లమెంట్‌కు పూర్తి అధికారాలు కల్పించే ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

సిరియాలో ఆగని హింసాకాండ

సిరియాలో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. రాజధాని డమాస్కస్‌లో సెప్టెంబర్ 7న జరిగిన బాంబు పేలుళ్లలో ఆరుగురు మరణించారు. దేశవ్యాప్తంగా జరిగిన హింసాకాండలో దాదాపు ఎనభై మంది వరకు మరణించారని సిరియా మానవ హక్కుల సంస్థ పేర్కొంది. ప్రభుత్వ సాయుధ బలగాలకూ, తిరుగుబాటుదారులకూ మధ్య జరిగిన తీవ్రస్థాయిలో పోరు జరుగుతోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 8న సిరియాపై ఆంక్షలను తీవ్రతరం చేయడానికి యూరోపియన్ యూనియన్ విదేశాంగ మంత్రులు అంగీకరించారు.

చైనాలో భూప్రకంపనలు

వాయువ్య చైనాలో సెప్టెంబర్ 7న పలుమార్లు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై వరుసగా 5.7, 5.6 పాయింట్లుగా నమోదైనాయి. ఈ ప్రకంపల ధాటికి దాదాపు ఎనభై మంది మృతి చెందారు. ఏడు వందల మందికిపైగా గాయపడ్డారు. దాదాపు 7.4 లక్షల మంది ప్రజలు భూకంపానికి గురయ్యారు. తరువాత పలు మార్లు భూమి కంపిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారని అధికారులు తెలిపారు.

జపాన్-చైనాల మధ్య ద్వీపాల పోరు

తూర్పు చైనా సముద్రంలో మూడు వివాదాస్పద దీవులను జపాన్ కొనుగోలు చేయడం పట్ల చైనా తీవ్ర అభ్యంతరాలు తెలుపుతోంది. శంకకు దీవుల్లోని ఐదింటిలో మూడింటిని కొనుగోలు చేయాలన్న నిర్ణయాన్ని సెప్టెంబర్ 10న జపాన్ ప్రకటించింది. దయావూ దీవులు, వాటికి అనుబంధంగా విస్తరించిన నాన్ జియాదావో, బీ జియాదావో దీవులను జాతీయీకరణ చేసినట్లు జపాన్ ప్రకటించింది. చైనా ప్రభుత్వం మాత్రం ఈ కొనుగోలు పూర్తిగా అక్రమమని, చెల్లదని పేర్కొంటోంది. ఈ ఏకపక్ష నిర్ణయాల వల్ల తీవ్రమైన పర్యవసానాలు తలెత్తగలవని చైనా హెచ్చరిస్తోంది. ఈ దీవులు చాలా కీలకమైన నౌకా మార్గంలో ఉన్నాయి. పైగా ఆ దీవుల చుట్టూ పెద్ద మొత్తంలో హైడ్రోకార్బన్ నిల్వలు కూడా ఉన్నాయి. దీంతో ఈ దీవులపై ఆధిపత్యానికి రెండు దేశాలూ పోటీ పడుతున్నాయి.

ఇరాక్‌లో బాంబు దాడులు

సెప్టెంబర్ 9న జరిగిన బాంబు దాడులతో ఇరాక్ దద్దరిల్లింది. దాదాపు ఇరవై ఏడు చోట్ల జరిగిన వేర్వేరు దాడుల్లో దాదాపు అరవై ఐదు మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. బాగ్దాద్ ఉత్తర సైనిక స్థావరంపై జరిపిన బాంబు దాడిలో, కాల్పుల్లో దాదాపు పదకొండు మంది సైనికులు మృతి చెందారు. ఆగ్నేయ అమరా పట్టణంలో జరిగిన రెండు కారు బాంబు దాడుల్లో పద్నాలుగు మంది చనిపోగా, అరవై మందికి పైగా గాయపడ్డారు. ఈశాన్య పట్టణం కిర్‌కుక్, దుజాయిల్ సైనికస్థావరం, నజిరియాలోని ఫ్రెంచ్ దౌత్య కార్యాలయంపై కూడా బాంబు దాడులు, కాల్పులు జరిగాయి.

పాకిస్తాన్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

పాకిస్తాన్ ఆర్థిక రాజధాని కరాచిలో ఒక దుస్తుల ఫ్యాక్టరీలో సెప్టెంబర్ 11న జరిగిన అగ్ని ప్రమాదంలో 290 మంది మరణించారు. దేశ చరిత్రలోనే అతి ఘోర అగ్నిప్రమాదం ఇది. ఈ ఫ్యాక్టరీకి బయటకు వెళ్లేందుకు సరైన డోర్లు, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తం చేసేందుకు అలారంలు, స్ప్రింకర్లు వంటి భద్రతా సదుపాయాలు లేకపోవడంతో మృతుల సంఖ్య భారీగా ఉంది. కింది అంతస్తులలో చిక్కుకున్న వారు పొగ వల్ల, ఊపిరి ఆడకపోవడం వల్లనే చాలా మంది చనిపోయారని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అదే రోజు లాహోర్‌లోని ఒక చెప్పుల ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇరవై ఐదు మంది మరణించారు. నగరంలోని నివాస ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. నాలుగు అంతస్తుల భవనంలో ప్రమాదం సంభవించినపుడు బయటికి రావడానికి సదుపాయాలు లేక పొగవల్ల ఊపిరి ఆడకపోవడంతో, మరికొందరు కాలిన గాయాలతో మరణించారు.

సినిమాపై ఆగ్రహం

కాలిఫోర్నియాకు చెందిన ఇజ్రాయిలీ దర్శకుడు సామ్ బెసిలె తీసిన 'ఇన్నోసెన్స్ ఆఫ్ ముస్లిం' అనే చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం ప్రజలలో విద్వేషాన్ని రేపింది. ఇస్లాంను కించపరిచే విధంగా చిత్రీకరించారంటూ సినిమాకి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వివిధ దేశాలలో అమెరికా దౌత్య కార్యాలయాలపై దాడులు జరిగాయి. సెప్టెంబర్ 11న లిబియాలోని బెంగాజీ నగరంలో ఉన్న అమెరికా దౌత్య కార్యాలయంపై జరిగిన రాకెట్ దాడిలో అమెరికా రాయబారి క్రిస్టాఫర్ స్టీవెన్స్ మరణించారు. పాకిస్తాన్‌లో జరిగిన ఈ నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారి ఇరవై మంది మృతికి కారణమైంది. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. పలు దేశాలు ఈ సినిమాను నిషేధించాయి. వీ

అలీనోద్యమ దేశాల శిఖరాగ్ర సదస్సు

పదహారవ అలీనోద్యమ (నాన్ అలైన్డ్ మూవ్‌మెంట్ - నామ్) శిఖరాగ్ర సదస్సు ఆగస్ట్ 26 నుంచి 31 వరకు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరిగింది. ఇరాన్ అధ్యక్షుడు మొమ్మద్ అహ్మది నెజాద్ దీనికి అధ్యక్షత వహించారు. నామ్‌లో 120 దేశాలు సభ్యత్వం ఉన్నాయి. ఇందులో కొన్ని దేశాలకు ఐక్య రాజ్య సమితిలో సభ్యత్వం లేదు. ఈ దేశాల జనాభా ప్రపంచ జనాభాలో 55 శాతం. అమెరికా, సోవియట్ రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ఏ వైపు ఉండకుండా తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేలా 1961లో యుగోస్లావియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో అలీనోద్యమానికి పునాదులు పడ్డాయి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకమారు సదస్సు సమావేశం అవుతుంది. ఈ కూటమికి కృషి చేసిన వారిలో అప్పటి ఇండోనేషియా అధ్యక్షుడు సుకర్నో, భారతదేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, యుగొస్లావియా అధ్యక్షుడు జోసిప్ బ్రాజ్ టిటో, ఈజిప్ట్ అధ్యక్షుడు గమల్ అబ్దుల్ నాజర్, ఘనా అధ్యక్షుడు ఖ్వామె క్రుమాలు ముఖ్యులు. సభ్య దేశాలు ఐక్యంగా ఉండి తమ దేశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంలో, ద్వైపాక్షి సంబంధాలను మెరుగు పరుచుకునేందుకు సహాయం అందించేలా ఒప్పందాలు చేసుకున్నయి. సదస్సుకు ఉమ్మడి కృషి ద్వారా ప్రపంచ శాంతి సిద్ధాంతాన్ని చేశారు. అణ్వాయుధాల స్వస్తి, మానవ హక్కుల పరిరక్షణ, ప్రాంతీయ సమస్యలను ఏజెండాగా నిర్ణయించారు. ఇరాన్, సిరియాలో జరుగుతున్న అంతర్గత యుద్ధానికి పరిష్కారం కనుగొనడానికి కృషి చేయాలని ప్రతిపాదించింది. ఈ సదస్సుకు ఐక్య రాజ్య సమితీ అధ్యక్షుడు బాన్ కీ మూన్ హాజరయ్యారు. సదస్సుకు మూన్ హాజరు కావడంపై అమెరికా, ఇజ్రాయిల్‌లు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. ఇరాన్ తన అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నేపథ్యం లో అక్కడ జరుగుతున్న ఈ సదస్సులో ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడు పాల్గొనడం తీవ్ర అభ్యంతరకరమని రెండు దేశాలూ దిగ్భ్రాంతిని తెలియజేశాయి. అమెరికా విదేశాంగ నీతి పట్ల తీవ్ర ఆక్షేపణలు తెలిపింది. ఇతర దేశాల పాలనలో జోక్యం, ఇరాక్‌పై యుద్ధం, ఇరాన్, ఉత్తర కొరియా అణు కార్యక్రమాలపై ఆంక్షలు ప్రకటించడం లాంటి చర్యలపై సదస్సు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తింది. ఇప్పుడున్న ఒక్కరి గుత్తాధిపత్యం స్థానే నూతన ప్రపంచక్రమం ఏర్పడాల్సిన అవసరముందని సదస్సు అభిప్రాయపడింది. మాజీ వలసవాద శక్తులకు ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్య వాదంపై పోరాటానికి ఏర్పడిందనీ, అమెరికా ఇప్పటికైనా తన ద్వంద్వ ప్రమాణాలకు స్వస్తి పలకాలని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దోపిడీ, ఆర్థిక సంక్షోభం, అంతర్గత కుమ్ములాటలు, దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం లాంటి సమస్యలతో దేశాలు అల్లాడుతున్నాయి. అలీనోద్యమ సభ్య దేశాలు ఐకమత్యంగా, కలిసికట్టుగా ఉండీ, ఒకరికి ఒకరు సహాయపడుతూ తమ దేశ ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో కృషి చేయాలి. ముఖ్యంగా సామ్రాజ్యవాద అమెరికా, దాని మిత్రదేశాలకు వ్యతిరేకంగా పోరాటంలో కలిసికట్టుగా నిలబడాలి. ఆకలి, విద్య, వైద్యం, పేదరికం నుండి ప్రజలను విముక్తం చేయాలి. ఇది అసాధ్యమైన పనేమీ కాదు. కాని దానికి పాలకులకు చిత్తశుద్ధి కావాలి. ప్రజలపై తమ బాధ్యత నెరగాలి. ఇప్పటికైనా అమెరికా వత్తాసు పలకడం ఆపి ప్రపంచ ప్రజల మేలుకు బాధ్యత తీసుకుంటే అలీనోద్యమ ఏర్పాటుకు ఒక సార్థకత ఉంటుంది.

దక్షిణ ఆఫ్రికాలో విస్తరిస్తున్న ఆందోళన

గని కార్మికులపై ప్రభుత్వం జరిపిన దారుణ దమనకాండకు వ్యతిరేకంగా దక్షిణ ఆఫ్రికాలో రోజురోజుకూ ఆందోళనలు తీవ్రతరం అవుతున్నాయి. దీనికి తోడు ఇప్పుడు రవాణా శాఖ కూడా సమ్మెకు పిలుపునిచ్చింది. సరైన జీతభత్యాలు చెల్లించకపోవడం, పని స్థలాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించకపోవడంతో దాదాపు ఇరవై ఎనిమిది వేల మంది రవాణా కార్మికులు ఆందోళనకు దిగారు. వారు తమ జీతాలలో 12 శాతం పెరుగుదలను కోరుతున్నారు. గని కార్మికుల ఆందోళనతో దేశం దాదాపు నాలుగున్నర బిలియన్ రాండ్లను (534 మిలియన్ డాలర్లు) నష్టం వచ్చిందని అధ్యక్షుడు జాకబ్ జుమా తెలిపారు. గత నెలలో మారికానాలోని ఆంగ్లో అమెరికన్ ప్లాటినం (అంప్లాట్స్) గనిలో మొదలైన ఆందోళన కొనసాగుతూనే ఉంది. ప్రపంచ ప్లాటినం ఉత్పత్తిలో అంప్లాట్స్ వాటా 38 శాతం. దక్షిణ ఆఫ్రికాలో ప్రైవేట్ ఉత్పత్తిలో అత్యధిక భాగం అంప్లాట్స్‌దే. మారికానా గనిలో జరిగిన పోలీసు కాల్పుల్లో 46 మంది చనిపోయారు. దీంతో గని కార్మికులు తీవ్ర ఆందోళన బాట చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా సంఘీభావం వెల్లువలా వచ్చింది.

గ్రీస్‌లో నిరసనలు

గ్రీస్ వేడెక్కుతోంది. రుణ సాయం అందాలంటే కొత్త పొదుపు చర్యల ప్యాకేజీ కింద వేతనాల్లో కోత విధించాలని గ్రీస్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదిత కోతలకు వ్యతిరేకంగా వేలాది మంది పోలీసులు సెప్టెంబర్ 6న నిరసన ప్రదర్శన చేపట్టారు. దాదాపు నాలుగు వేల మందికిపైగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వీరిలో అన్ని రకాల కేటగిరీ ఉద్యోగులూ ఉన్నారు. ఈ ప్రదర్శన శాంతియుతంగా జరిగింది. పోలీసులను నియంత్రించేందుకు ప్రభుత్వం సైన్యాన్ని ఉపయోగించింది. ఇదే క్రమంలో సెప్టెంబర్ 9న దాదాపు ముప్పై ఐదు వేల మంది వీధుల్లోకి వచ్చి కొత్త ప్యాకేజీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. గ్రీస్‌లో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగిపోతోంది. పన్నెండు లక్షల మందికి పైగా ఉద్యోగాలు లేవు. వీరిలో ఎక్కువ మంది యువకులే. 2013-14 సంవత్సరానికి గాను 14.4 బిలియన్ డాలర్ల కొత్త పొదుపు ప్యాకేజీని అమలుజేయ తలపెట్టడంలో తాజాగా నిరసనలు తలెత్తాయి. ఆర్థిక సాయం అందాలంటే ఈ ప్యాకేజీని అమలు చేయాల్సిందేనని అంతర్జాతీయ ద్రవ్య నిధి, యూరోజోన్‌లోని ఇతర దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. సెప్టెంబర్ 26న రాజధాని ఏథెన్స్ నగరంలో దాదాపు యాభై వేల మందికిపైగా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. చిన్న వ్యాపారస్తులు, టీచర్లు, ఉద్యోగులు, మెకానిక్‌లు అందరూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రభుత్వం యూరోజోన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ పరిస్థితి నుంచి ప్రజలను రక్షించని పక్షంలో తెహ్రీర్ స్క్వేర్ స్ఫూర్తితో ఉద్యమించి ప్రజలు తమ పాలనను తామే సాధించుకునే దగ్గరలోనే ఉంది. వీ

వార్త - వ్యాఖ్య : సి. రాజశేఖర్


అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 ఆగస్ట్ నుండి 31 ఆగస్ట్ 2012 వరకు 13 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య - 1320)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	4	–	18	22	12	14	9	2	2	1	2	2	1	14	21	–	–	–	2	3
హైదరాబాద్	–	–	–	12	13	–	–	–	2	9	4	9	–	–	29	20	–	–	–	10	–
ఖమ్మం	వివరాలు అందలేదు																				
మహబూబ్‌నగర్	–	10	–	16	14	14	9	5	–	–	12	15	26	9	35	18	–	–	–	–	–
మెదక్	–	4	–	3	9	5	7	4	–	1	2	5	–	12	35	25	–	–	–	–	–
నిజామాబాద్	వివరాలు అందలేదు																				
రంగారెడ్డి	–	3	–	17	26	18	11	5	5	11	5	8	2	2	44	13	–	–	–	–	–
వరంగల్	–	7	1	9	8	12	9	16	2	3	–	–	–	8	25	9	–	–	–	–	3
అనంతపూర్	–	7	–	15	10	4	5	5	–	5	2	9	6	9	39	2	–	–	–	–	–
నెల్లూరు	–	–	–	1	2	–	–	–	–	–	–	–	–	2	19	9	–	–	–	–	–
గుంటూరు	1	–	–	3	2	3	5	3	–	–	3	3	–	–	21	3	–	–	–	1	3
కడప	2	–	–	3	1	–	2	3	–	–	2	3	1	4	25	15	1	–	–	–	1
క్రిష్ణా	–	–	–	3	8	3	6	5	1	4	5	4	1	3	28	10	–	–	–	1	–
విశాఖపట్నం	–	–	–	4	12	4	4	–	2	6	–	1	3	4	26	30	–	–	–	6	–
విజయనగరం	వివరాలు అందలేదు																				
తూర్పు గోదావరి	1	–	1	2	2	–	–	2	3	2	2	1	2	–	18	21	–	–	–	–	–
మొత్తం	**4**	**35**	**2**	**106**	**129**	**75**	**72**	**57**	**17**	**43**	**38**	**60**	**43**	**54**	**358**	**196**	**1**	**–**	**–**	**20**	**10**




వెలువడింది

జనహృదయం జనార్దన్

విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రారంభకుడు
గిరాయిపల్లి అమరవీరుడు సూరపనేని జనార్దన్ రావు
జీవితం – స్ఫూర్తి

వెల : రు. 60

ప్రతులకు:
ఎస్.పి. మోహన్ రావు
ప్లాట్ నెం. 151, సీతాపురం కాలనీ, పోరంకి,
కృష్ణా జిల్లా – 521 137; ఫోన్: 9908637500



విద్యార్థులు, మేధావులు, అధ్యాపకులు, పరిశోధకులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు, ఆసక్తితో చదువుకునే వారందరి కోసం మూడో ముద్రణగా...

ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 1956 – 2006

పేజీలు 568
రు.300 మాత్రమే

ఇప్పుడు అందుబాటులో ఉంది.
మరి మీ వద్ద కాపీ ఉందా!

సోల్ డిస్ట్రిబ్యూటర్ : **బుక్ సెలక్షన్ సెంటర్**


షాలిమార్ థియేటర్ పక్కన, కింగ్ కోఠి, హైదరాబాద్. ఫోన్ : 040 23446850

మలుపు బుక్స్
2-1-1/5, నల్లకుంట,
హైదరాబాద్ – 500 044.
ఫోన్ : 9866559868

A/c. 060411100000803
Andhra Bank, Vidyanagar Branch,
IFSC Code No. ANDB 000 0604

మానవ మృగాలు చెలరేగిన నేల – **ఖైర్లాంజి** – ఒక చేదు పాట

ఈ పుస్తకం ఖైర్లాంజీ సంఘటనను, దాని మూలాలను గురించి చెప్పడానికి ప్రయత్నించింది. దళితులు రాజ్యనిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా తమ వ్యతిరేకతను ఎట్లా తెలియజేశారో, సాధారణ ప్రజలు రాజ్యవ్యతిరేక పోరాటంలో ఎట్లా భాగమయ్యారో చెపుతుందీ పుస్తకం. కార్పొరేట్ శక్తులతో మిలాఖతు అయిన రాజ్యం ఈ ఆందోళన మీద నక్సలైట్ ముద్ర వేసి అణిచివేయ చూసినపుడు అత్యంత సామాన్యులైన ప్రజలు ఎట్లా ఎదురొడ్డి నిలిచారో చెబుతుంది. అంతే కాదు దళితులపై దాడుల విషయం వచ్చేసరికి ప్రసార మాధ్యమాలు ఎట్లా ఉద్దేశ్యపూర్వకంగా ప్రవర్తిస్తాయో విశ్లేషిస్తుందీ పుస్తకం.



Advt.

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 135 -October 2012 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/09/2012 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణం కృషిలో భాగం పంచుకోండి!

దశాబ్ది ప్రత్యేక సంచికను బలోపేతం చేయండి!!

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక డిసెంబర్ 2012 సంచికతో విజయవంతంగా పది సంవత్సరాలు పూర్తి చేసుకుని, జనవరి 2013 సంచికతో రెండో దశాబ్దిలోకి అడుగుపెడుతున్నది. ఈ సందర్భాన్ని చిరస్మరణీయం చేసేందుకు జనవరి 2013 సంచికను విశిష్ట ప్రత్యేక సంచికగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రత్యేక సంచిక తయారీ ప్రయత్నాలలో భాగంగా జూలైలో జరిగిన వీక్షణం రచయితల, అభిమానుల, పాఠకుల సమావేశం విలువైన సూచనలు, సలహాలు అందించింది. ఈ సంచికను కలకాలం దాచి ఉంచుకోదగిన అరుదైన ప్రత్యేక సంచికగా రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంచికలో ఇవాళ భారత సమాజం ముందూ, తెలుగు సమాజం ముందూ ఉన్న ప్రధానమైన సమస్యలూ అంశాలూ వివరంగా చర్చకు రానున్నాయి. పన్నెండు అంశాలపై ప్రముఖ విశ్లేషకులు రాస్తున్న సవివరమైన వ్యాసాలతో ఈ సంచిక వెలువడనుంది. అంటే ఈ సంచిక సాధారణ నెలవారీ పత్రికగా కన్న మిన్నగా ఒక సమగ్రమైన పుస్తకంగా రానుంది.

వీక్షణం ఆర్థిక స్థితి ఈ బృహత్ప్రయత్నానికి సరిపోదని మీకు తెలుసు. వీక్షణం ముందుకు నడవడమైనా, ఈ ప్రత్యేక విశిష్ట సంచిక వెలువడడమైనా వీక్షణం అభిమానులు, పాఠకులు, దాతలు, రచయితలు తలా ఒక చెయ్యి వేస్తేనే సాధ్యమవుతుంది.

- **ఎక్కువ మందితో వీక్షణం చదివించండి!**
- **ప్రత్యేక సంచిక కోసం విరాళాలు ఇవ్వండి!**
- **ప్రకటనలు ఇవ్వండి!**
- **చందాలు చేర్పించండి!**
- **విరాళాలు సేకరించి పంపండి!**
- **ప్రకటనలు సేకరించండి!**

వీక్షణం మీ పత్రిక. వీక్షణం ప్రజల పత్రిక.

వీక్షణం తెలుగు సమాజం తనతో తాను సాగిస్తున్న సంభాషణ.

వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న అన్వేషణ.

వీక్షణంను నిలబెట్టండి. చిరకాలం కొనసాగడానికి హామీపడండి.

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao